
విషయానుక్రమణిక

చిత్రపటముల వివరణము

త్రివర్ణ చిత్రములు:—శ్రీగాయత్రీ, నూర్జిహాను గానామృతము-జహంగీరు పరవశత.

సాధారణ చిత్రములు:—స్టోఫర్డు దొరగారి సతీమణి, శ్రీ పాండురంగరావుగారి సతీమణి, శ్రీ న్యాయమూర్తి సదాశివయ్యరుగారి సతీమణిగారులు, శ్రీమతి కోకా కృష్ణవేణమ్మ గారు, అఖిలభారత ప్రాచ్యవిద్వత్పరిషత్తు, వారిచే సమ్మానింపఁబడిన పండితబృందము; ఆంధ్ర చిత్రకారులు శ్రీ దామెర్ల రామారావుగారు, శ్రీ చామకూర భాష్యకార్లురావుగారు, శ్రీ వరదా వెంకట రత్నంగారు - రాజమహేంద్రవరము; ౩౯ వ అఖిల భారత జాతీయమహాసభ స్వచ్ఛంద సేవాయువతీబృందము.

ముఖపటము—భీ. రామసోమయాజులుగారు. గతసంచిక ముఖపటము—దామెర్ల రామారావుగారు.



చెన్నపట్టణము, ఫిబ్రవరి ౧౯౨౫

సంపుటము ౨.   రక్తాక్షి సంవత్సరము మాఘమాసము   సంఖ్య ౨.

పురాణస్మృతితరంగిణి

అగ్నిపరీక్ష

శ్రీవేంకట పార్వతీశ్వర కవులు

౧

శ్రీకరాలోకు లుత్తమ శ్లోకు లగుచు, సార్థకాగ్నిపరీక్షలో జయము గన్న
కీర్తిమూర్తుల నక్షరాకృతిగఁ జేయు, ధీరకవిలేఖినికి నమస్కారశతము.

సీ. సములలో నుత్తమత్వము సుస్థిరంబుగాఁ, గాంచి లోకముమెచ్చఁ గన్నవారు
ధర్మపద్ధతి నసిధారావ్రతంబుగాఁ, గాంచి యచ్చపుఁ ద్రోవఁ గన్నవారు
ఒడలు జీవముఁ బరార్థోపయుక్తంబుగాఁ, గాంచి పున్నెపుఁబంటఁ గన్నవారు
సంపద్విపత్తులసత్యమే యూఁతగాఁ, గాంచి శాంతిపదంబుఁ గన్నవారు
చన్నవారయ్యు జగతిలో నున్నవారు, కాలకాలాంతరముల మే ల్గన్నవారు
మానఘనులైనవా రెవ్వ డే నొకప్వ, దుజ్జ్వలాగ్నిపరీక్షలో నున్నవారె.

నరుగువాఁడినబొగ్గు వజ్రమే యగుఁగాక, యగ్నిపరీక్షయం దవతరించి
పట్టువాఁడినపోగ వసనమే యగుఁగాక, యగ్నిపరీక్షయం దారి తేఱి
గరుసువాఁడినమట్టి కనకమే యగుఁగాక, యగ్నిపరీక్షయం దడుగు పెట్టి
అసలువాఁడినరసం బమృతమే యగుఁగాక, యగ్నిపరీక్షయం దాఁగి నిలిచి
గౌరవమెయున్న నెంతయో ఘనతయున్నఁ, గలిమియేయున్న నెంతయో బలిమియున్నఁ
సార్థకాగ్నిపరీక్షలో జయము గనక, మర్త్యుఁ డేనాఁటికైన సమర్థుఁ డగునె?

మ. సిరితోఁ బుట్టిన నేమి, మోహనకళాశ్రీకుండు గానేమి; సుం
దరరేఖాంచితుఁ డైన నేమి; విబుధాధారుండు గానేమి, బం
ధురవృత్తంబును గన్నరాజకులచంద్రుం డైన నేమియొ, విన
శ్వరకీర్తిం గను టెట్లు పావకపరీక్షాసిద్ధి గాకున్నచోన్.

సీ. కనకాచలం బైనఁ గరఁగి నీరగుఁ గాని, తలఁగునే నిశ్చల ధైర్యలక్ష్మి
వారాకరం బైన వట్టి బీడగుఁ గాని, ప్రిదులునే విపులగాంభీర్యమహిమ
గ్రహరాజమణి యైన గతి తప్పి చనుఁ గాని, సడలునే నిర్మల సత్యదీక్ష
తేజోమండలం బైన పసి చెడి పడుఁ గాని, జాఱునే సత్క్రియా సహనశక్తి
పుణ్యపాపసుఖాసుఖ భోగరోగ, మిత్రశత్రుశుభాశుభ మిళితమైన
జగతి నగ్నిపరీక్షలోఁ దగులువేళ, మతము విడఁబోరు పడఁబోరు మానఘనులు.

సీ. చల్లగా వినవచ్చు సత్యసంగీతముల్, కల్యాణ విజయ శంఖములలోనఁ
బ్రియముగాఁ గనవచ్చుఁ బ్రేమరత్నంబులు, ఘనమంగళారాత్రికములలోన
దనివిగాఁ గొనవచ్చు దానకంకణములు, ప్రవిమలోదాత్తపాత్రములలోన
హాయిగాఁ దినవచ్చు నమృతఫలంబులు, పావనభాగ్యకల్పములలోన
అగ్నిసాక్షికముగ నాత్మసర్వస్వంబు, విశ్వహితము గోరి వ్రేల్చునట్టి
యజ్ఞదీక్షఁ గొన్న యఖిలపావనమూర్తు, లున్నచోట, జయము గన్నచోట.

చ. కనకధరాధరేంద్ర మొక గవ్వయుఁ గాదు; సురేంద్రలోకనం
దనవనవైభవం బొకతృణంబును గాదు; ప్రకృష్టభోగజీ
వన మొకలెక్క గాదు; భవపావనపావకసత్పరీక్షలో
ననితరలోకలభ్య విజయాభ్యుదయంబులు గోరువారికిన్.

సీ. ఘోరదుస్సహఘనాసారమైనను సరే, సిద్ధచారణపుష్పసేచనంబె
దారుణజ్వాలాసమీర మైనను సరే, సౌరభాచలమంద మారుతంబె

గ్రీష్మప్రచండతాపోష్ణమైనను సరే, సితచంద్రచంద్రికాశీతలంబె
భీషణాశనివినిర్ఘోష మైనను సరే, ఖేచరీమధురసంకీర్తనంబె
వాంఛనీయస్వధర్మని ర్వాహమునకుఁ, బావనాగ్నిపరీక్షలోఁ బాలుగొన్న
యచలదీక్షాపరుల కద్వయాత్మకులకు, భీకర శ్రీకరంబు లేకాకరములె.

సీ. అకలంకచరితుల నాపన్నులుగఁ జేయఁ,బూని విశ్వామిత్రు లైన నేమి
పావనవ్రతుల దుష్పథదూషితులఁ జేయ,నెంచి రాక్షసవృత్తిఁ గాంచ నేమి
సద్ధర్మనిరతులఁ జలచిత్తులుగఁ జేయఁ, దలఁచి దయ్యపుఱూపుఁదాల్ప నేమి
పరిశుద్ధహృదయులఁ బరిశోధనముఁ జేయ, యత్నించి యుద్దండు లైన నేమి
తథ్యమిథ్యావివాద మధ్యస్థపావ, నాద్భుతాగ్నిపరీక్షలో నైనఘనుల
సత్యనిర్మలచరితంబు శాశ్వతముగ, నవని వెలయించువారు బంధువులె కారె.

చ. కలుషము లొందలేవు, మమకారము లందఁగలేవు, దుఃఖసం
కలితకరాళభౌతికవికారము లూఁపఁగలేవు, నిత్యచం
చలవిషయప్రలోభగుణజాలము లాఁపఁగలేవు, వీరులై
యలఘుపదంబుఁ జూఱఁగొన నగ్నిపరీక్షలఁ జేయుధీరులన్.

సీ. ఆనందనందనోద్యానసంబునందైన, సంతానపత్రముల్ సంస్కరించి
మానసకాసారమధ్యంబునం దైన, స్వర్ణాబ్జసూత్రముల్ సంతరించి
సత్కళాసంపూర్ణశశిబింబమందైన, సిద్ధామృతరసంబు సేకరించి
చారురోహితశక్రచాపంబునందైన, సదమలవర్ణముల్ సంగ్రహించి
సార్థకాగ్నిపరీక్షలో జయము గన్న, విశ్వనుతకీర్తులకుఁ గీర్తి విజయపత్ర
సత్కృతులఁ గూర్చి వెలయించు శాశ్వతముగ, సత్కవిబ్రహ్మమంగళాశాసనములు.

హరిశ్చంద్ర

కాశీ సోమయాజుల సుందరరామమూర్తి గారు, ఎం. ఏ.

ఆశయము

శ్రీయుత శ్రీ విక్రమదేవవర్మ మహాశయులు గారు, విశాఖపట్టణము.

శ్రీ విజయనగర మహారాజుగారి కలాశాలోపాధ్యాయులు నాంగ్లపద్యకావ్యరచనానిపుణులునగు శ్రీయుత పండిత కాశీ సోమయాజుల రామమూర్తి, ఎమ్. ఏ. గారు సావిత్రీచరిత్రమునందలి తుదిభాగమును, హరిశ్చంద్ర చరిత్రమునందలి తుదిభాగమును గ్రామ్యాంధ్రభాషయందు రెండు నాటకములుగ రచించి నాకు వినిపింపఁగ విని కడు మోదమొందితిని. తదభినయమును వీక్షింపఁ గుతూహలము గలవాఁడను.

శ్రావ్యప్రబంధము కేవల గ్రాంథిక భాషతోడను దృశ్యప్రబంధము మాత్రము పాత్రోచిత గ్రామ్యభాషతోడను వెలయవలెనను నాశయముగల నాకు నామూలాగ్రమును గ్రామ్యభాషాభూయిష్ఠమగు నుపరికథితదృశ్య ప్రబంధద్వయము గడుమోదమొదవించుటకుఁ గారణములు తత్సందర్భశుద్ధియు, నాటకోచిత వచనరచనయుఁ బాత్రపోషణమును, రసపూర్ణమునై యున్నవి. ఉపరిలిఖితకారణచతుష్టయమును గ్రహించి నామనము తద్భాషా గ్రామ్యతను గణింపలేదు. విచిత్ర చరిత్ర శ్రోతలు రచనాలోపములను సుస్వాదుఫలరసాస్వాదకులు వలుసులను లెక్కింపరుగదా! ఏతత్కవిగారు గ్రాంథిక భాష నెఱుంగనివారు గారు. అట్లయ్యు నాధునికజనసామాన్యరంజనముకొఱకు నట్టి భాషను బాటించిరి. కవులు స్వీయసమయజనరుచి నాదరించుట క్రొత్తది గాదు. ఉక్త నాటకద్వయము సాధారణ జనులు వాడుకొను చిన్నచిన్న మాటలతోడనే శ్రోతల చిత్తములఁ గరంగించుచు నిజకరుణారస ప్రధానతను స్థిరపఱచుటయే కాక, తద్రచయితయొక్క నేర్పునెంతయుం జాటుచున్నది.

ఆనాటకద్వయము ముద్రితమయి ప్రకటితమగునేని, యనేకజనులు సంతోషించుటకు వీలగును.

గ్రంథకర్తవిజ్ఞప్తి

సంభాషణ, పద్యరూపకముగాను, సంగీత రూపకముగాను, లేకుండా, పాత్రోచితవ్యావహారికభాషను ఉంటే, తెలుగునాటకాలు రక్తికట్టవా? అది శోధించడానికే నేనీనాటకాలు వ్రాసినాను. అంతేగాని కావ్యభాషయందు అనాదరణచేత కాదు. రాజసభల

లోనూ, శాస్త్రచర్చలలోనూ పండితశ్రేష్ఠులు కూడా ఉపయోగించేభాష రంగస్థలములో కూడదట. అట్టి సభలకంటే, రంగస్థలానికి వచ్చినకొమ్ము లేమిటి? ఈ పాతికముపైఁ యేళ్లబట్టి, ఆంధ్రనాటకరచయితలు పెట్టుకొన్న నియమములు రసపోషణకట. అయితే భావపూరితమై, పండితపామరవేద్యమైనవ్యావహారికభాషలో అన్నిరసములూ పుష్కలముగా వస్తే? శ్రోతలకు కన్నీళ్లువచ్చేటట్టు చేయగలుగుతే? నాకు, కావ్యభాషకంటె, రసవంతమైన వ్యావహారికభాష వ్రాయడమే కష్టమని తోచినది. ఆంధ్ర, గీర్వాణ, ఉత్కళ సారస్వతములలో ఆరితేరిన పండితవర్యులు, రసగ్రహణధురీణులు, శ్రీయుత శ్రీవిక్రమదేవవర్మ మహాశయులు, ప్రోత్సహించినందున, నేను ఈనాటకాలు వెల్లడిచేయడానికి సాహసించినాను. హరిశ్చంద్ర, సావిత్రి సుప్రసిద్ధమైన చరిత్రలు గనుక, రసపట్టైన చివర భాగములనే వ్రాసినాను.

విజయనగరము,
21—11—1924. } కా. సుందరరామమూర్తి.

హరిశ్చంద్ర

మొదటిరంగము

కాలకౌశికునియిల్లు; ప్రవేశము తిరగలివద్ద చంద్రమతి.

చంద్ర:—మధ్యాహ్నమనగా వెళ్లినాడు లోహితాస్యుడు. ఇంకారాలేదు! ఎనిమిది గంటలవేళకాదూ ఇప్పుడు? నిన్నా, మొన్నా, దీపాలవేళకే వచ్చినాడే. నేడేమి ఈ యాలస్యం? ఏమి జరిగిందో గదా, ఈశ్వరా? వెళ్లింది అడివాయెను. ఏమైనా అవుతుంది. ఏకబురు వింటానో గదా? నాపసికూనవంతు నన్నేల పంపకూడదు, యజమాని? ఏపులో నన్ను వేసుకపోతే, ఈ కష్టాలే పాయె. దేనికీ, జననీ, అన్నపూర్ణా, నీవేఉన్నావు. (పిండి విసురుచు) అయ్యో! వేళ్లు మండిపోతున్నాయి! నడ్డి పడిపోతూంది! మెడలు నిలవకుండా ఉన్నాయి! కాళ్లు తిమ్మిరెక్కిపోతున్నాయి! అంట్లు తోమితోమి చేతులు పొక్కలెక్కినాయి! ఈ పిండి ఎలాగు విసరను? గంపెడు గోధుమలెక్కడ? నేను విసరడమెక్కడ? బాగా ఎండనైనా ఎండినాయా? తెల్లవారేసరికి ఇయ్యవలెనట! ఎలాగు తెములుతుంది, ఈశ్వరా? తిరగలి ఇంతబరువేమిటి? ఒక్కచుట్టు తిప్పేసరికి నరాలు తోడుకపోతాయట! విసరకుంటే, చెవులువేడిగాల్పు లొచ్చేటట్టు తిట్లాయె! విసురుదామంటే, చేతులు రాకపోయె! ఇది చాలనట్టు, చలిఒకటి! వంటినిండా బట్టలేదు! తలుపులు వేసుకొందామంటె గదికాదు! ఈపంచను ఎంతరాత్రివరకూ వజవజలాడుతూ విసరవలెనో గదా, దైవమా? అన్ని బాధలకంటే ఎక్కువ, లోహితాస్యుడు ఇంకారాకపోవడం! నేనేమైతేనేమి! పిల్లవాడు, కొనసాగవలసినకొమ్మ,

వంశవర్ధనుడు, చక్కనిచుక్క, గుణాల పోగు, ఏమవునోగదా? ఏమైనాడోగదా? —ఆఁ, ఏమిటాచప్పుడు? అడుగుల చప్పుడులాగున్నది! అవచ్చేది బాబయ్యేమిటిచెప్మా? బాబా, లోహితాస్యా!— సరి, నాకా అంతటిఅదృష్టం? ఏమి వినవలసున్నదో? కాని, కూడా అందరు పెద్దకుర్రవాళ్లున్నారే? చాలా మంచివాళ్లటే? నాబిడ్డణ్ణిచూస్తే చాలా ప్రేమటే? ప్రమాదం రానిస్తారా?— అయ్యో, ఏమిటీవెర్రి? వాళ్లేంచేయగలరు, పెద్దపులో, పామో, వస్తే?— అదుగో, మళ్లీ అడుగులచప్పుడవుతూందే! నాన్నా, లోహితాస్యా!

లోహితాస్యుడు ప్రవేశించును.

లోహి:—చిత్తం, అమ్మాజీ.

చంద్ర!—(దిగ్గునలేచి, ఎదురుగుండావెళ్లి, ఎత్తుకొనివచ్చి, గుండెలకు అదుముకొని, తిరగలివద్ద పిల్లవానిని కాలుమీదకూర్చుండబెట్టుకొనును). నాతండ్రీ, నిజంగావచ్చావోయ్? నానాన్న రావోయ్! నాబాబు రావోయ్! నాచిట్టి, రావోయ్! ఏమి, నాన్నా ఇంతాలస్యం చేశావ్? నీకోసం తపించిపోయినానోయ్, బాబా!

లోహి:—ఎందుకమ్మాజీ, తపించిపోవడం!

చంద్ర:—ఇంతాలస్య మైనదనీ, ఏమైనదో అని తల్లడిల్లిపోయినానోయ్, తండ్రీ!

లోహి:—ఎనిమిదిగంటలైనదో, లేదో, ఇదే ఆలస్యమా, అమ్మాజీ!

చంద్ర:—ఈ రెన్నాళ్లూ వేగముగా వచ్చినావే? నేడేమి ఇంతాలస్యం, నాయనా?

లోహి:—ఈదినం శుక్రవారమని మాతాన్నపూర్ణకు కుంకుమపూజ చేసుకొన్నాను! ఇంతవేళైంది, రావడానికి.

చంద్ర:—కుంకుమెక్కడిదీ? ఎవరిచ్చినారు?

లోహి:—నాజట్టుదారుడు, పార్వతీశం.

చంద్ర:—ఎంతపుణ్యం చేసుకొన్నావోయ్, తండ్రీ, లోకమాతపూజచేయడానికి!

లోహి:—ఆ పూజారి ఎంతమంచివాడోగాని, అమ్మాజీ, నన్నే స్వయంగా పూజచేయనిచ్చినాడు. అతడు నామములు చెప్పడమూ, నేను పూజచేయడమూ, సహస్రనామాలు అయేవరకూ! "వాళ్లకి ఎవరికీ శలవివ్వక, పూజచేయడానికి నాకెందుకిచ్చినావూ?" అన్నాను.

చంద్ర:—అంటే ఏమన్నాడు?

లోహి:—"నీవు హరిశ్చంద్రచక్రవర్తియొక్క కుమారుడవు కావా?" అన్నాడు. "నీకెలాగు తెలుసును?" అన్నాను. "కాకుంటే ఈముఖ మెవరికుంటుం"దన్నాడు.

చంద్ర:—అన్నాడోయ్, తండ్రీ? (వాని ముఖము ముద్దు పెట్టుకొనును.)

లోహి:—ఇంకా విందురో, ఏమన్నాడో. "మీ గోత్రనామాలతో ప్రతిదినమూ మేము మాతాన్నపూర్ణపూజ చేస్తూంటామ"న్నాడు. అలాగెందుకు చేస్తారమ్మాజీ? బాబయ్య చక్రవర్తనా?

చంద్ర:—అవును, బాబా! నేను కాశీలో ఉన్నానన్నమాటేగాని, ఒక గంగలో స్నానమా? మాతాన్నపూర్ణదర్శనమా? విశ్వేశ్వరుని దర్శనమా? యజమాని గుమ్మం దిగనివ్వడుగదా!

లోహి:—అమ్మాజీ, గంగ ఎక్కడో ఉన్నదా? మాతాన్నపూర్ణ ఎక్కడో ఉన్నదా? తమరే వారు. వారి దర్శనం చేయలేదని విచార మెందు కమ్మాజీ, తమకూ?

చంద్ర:—నీ కెవరు చెప్పినారోయ్, బాబా, ఈ మాటలు?

లోహి:—కామేశ్వరం అన్నాడూ, "లోహితాస్యా, మీ తల్లేమిటి? అన్నపూర్ణేమిటి? ఒక్కమారు వారి దర్శనంచేస్తే, చాలదోయ్ జన్మకూ?" అన్నాడు.

చంద్ర:—నా చిట్టివాడి కెంతభక్తోయ్, నేనంటే! కాని, తండ్రీ, వెన్నుకి కడుపు అంటుక పోయిందోయ్, ఎంత ఆకలితో ఉన్నావోగాని! ప్రొద్దున్ననగా తాగిన గంజి, ఎలాగు భరించినావోయ్, నాయనా అంత ఆకలి?

లోహి:—చాలా ఆకలిగానే ఉన్నది, అమ్మాజీ! ఈ మూనాళ్లూ ఆకలి చాలా బాగా వేస్తూంది. కష్టపడి పనిచేస్తే కణకణ లాడుతూ ఆకలేస్తుంది. తినడానికి ఉండాలిగాని, నాగభూషణం అన్నాడూ, "ఎప్పుడు చూచినా, నవుఖర్ల చేతుల్లోనే కాదూ, గొప్పవాళ్ల పిల్లలూ? ఒక్కమారు కాలు కింద పెట్టనివ్వరు గదా? ఎప్పుడూ ఏదో ఒకటి తింటునే ఉంటారు. వారికి ఆకలి వేయుమంటే, ఏంవేస్తుంది?" అన్నాడు.

చంద్ర:—ఎన్ని నేర్చుకొన్నావోయ్, తండ్రీ, ఈ మూనాళ్లలోనూ!

లోహి:— ఇంకా ఎన్ని నేర్చుకొంటానో? కష్టాలవంటి గురువు లేడన్నాడు కృష్ణమ్మ.

చంద్ర:—నిజమే, తండ్రీ-కాని మాటలకేమి? ముందు గంజితాగు.

లోహి:— (త్రాగి) ఆకలి ఏమీ తీరలేదమ్మాజీ. మరి లేదూ?

చంద్ర:—నాగంజికూడా ఇచ్చివేసినానోయ్, నాయనా, మరెక్కడిదీ?

లోహి:—ఏమమ్మాజీ, మీ గంజికూడా ఇచ్చివేసినారా?

చంద్ర:—అవును, తండ్రీ, ఆకలితో వస్తావనీ.

లోహి:—ఆమాట ముందేల చెప్పలేదూ?

చంద్ర:—చెప్పి ఉంటే?

లోహి:—తాగడం మానివేతునూ. నా గంజి కూడా తమకే ఇచ్చివేతునూ.

చంద్ర:—నా చిట్టివాడా, నీ మాటలు వింటూంటే, బాధలన్నీ మరిచిపోతానోయ్! నీ ఆకలి ఎలాగు చూడగలను, బాబా?

లోహి:—తమ ఆకలి నేను మాత్రమూ చూడగలను?

చంద్ర:—అందరికీ అన్నంపెడుతూ, నా పసిబిడ్డకు మూకుడు గంజి లేకపోయెనా, తల్లి,

అన్నపూర్ణా? లేకపోవడమేమి? మేమేమి చేసుకొన్నామో ? అనుభవించక తీరుతుందా ?

లోహి:—ఏడవకం డమ్మాజీ, ఏడవకండి. (తనచొక్కా తీసి వేస్తున్నాడు)

చంద్ర:—చొక్కా ఎల తీసివేస్తావు, బాబా, చలి పక్కలువంచుకపోతూంటే ?

లోహి:—ఎందుకా ? ఇందుకూ. (దానితో తల్లి కన్నీళ్లు తుడుచును) మరేమున్నది తుడవడానికి ?

చంద్ర:—నా కన్నీళ్లు నీనుంచేనోయ్; నీబాధ చూడలేకేనూ-

లోహి:—అందుకే నాబాధ ఎప్పుడూచెప్పను.

చంద్ర:—కాని, బాబా, నీవు గోచితో వెళ్లినావే, నీ కాచొక్కా, అలాగూ ఎక్కడివి ?

లోహి:—నారాయ ణిచ్చాడు ఈ రెండున్నూ. ఎంతమంచివా డంటా రమ్మాజీ, అతడు!

చంద్ర—అయ్యో! పట్టుబట్టతప్ప మరేమి కట్టి ఎరుగని ఈ యువరాజు, ఈ ఆగర్భ శ్రీమంతుడు, ఎవరో అట ఒక చింకి చొక్కా, చింకిలాగూ ఇచ్చినారని పొంగి పోతున్నాడు! హా, విశ్వేశ్వరా!

లోహి:—అమ్మాజీ, మనవిచేస్తాను, చిత్తగించండి. అదొక వేషం, ఇదొక వేషం. గోచీతో, ఈ చలిలో, అడివికివెళ్ళేవానికి, ఈ చొక్కా, ఈలాగూ గొప్పవికావూ? పట్టుమాత్రం ఇంతకంటె చలి బాగా ఆగుతుందా? ఎప్పటివో వెనుకటి పట్టుబట్టల మాటెందుకు? ఇప్పటి ఈ గోచీపాత రాయనికి ఇది ఎంతోలాభం అనుకోవలెను. తమకుకూడా కప్పుకోవడానికి ఎవరినైనా అడిగి తేవలెను.

చంద్ర:—హా, జ్ఞానికి కష్టము లంటవుగదా? వయస్సుతో ఏంపని?— బాబా, ఎంత దూరము అడివి?

లోహి:—రానూ పోనూ, ఒక ఆమడ ఉంటుందట.

చంద్ర:—నడవ గలిగినావా ?

లోహి:—తమరు అంట్లుతోమగలిగే తోముతున్నారా? ఎక్కడి కమ్మాజీ? బాధపడ్డాను నడవలేక. అదిచూచి జాలిపడి విశ్వపతిశాస్త్రి నన్ను చంకపెట్టుకోబోయి నాడు. నేనే వద్దన్నాను.

చంద్ర:—ఎందు కన్నావు, కన్నా?

లోహి:—ఎందు కెత్తుకోవలెను? ఒకరికి శ్రమెందుకియ్యవలెను?

చంద్ర:—నిజమే, కాని అతడే ఎత్తుకొంటానన్నాడే, నీవడగకుండా ?

లోహి:—అయితే మాత్రం, శ్రమ ఏమవుతుంది? అతడూ నావంటివాడే-

చంద్ర:—ఎలాగవుతా డోయ్, బాబా? వాళ్ల కలవాటూ, దూరంనడవడం. నీకేం అలవాటున్నది?

లోహి:—నాకూ అవుతుంది, నడుస్తూంటే. నడవకుంటే, ఎప్పటికీ కాదు. అమ్మాజీ, నాకింకా ఎన్నాళ్లున్నదో ఈ దాస్యము? అలవాటు చేసుకోవద్దూ నడవడం?

చంద్ర:—(తనలో) ఆహా, ఏమి ఈపసికూన జ్ఞానం! వీని ఓర్పు!

లోహి:—కాని, అమ్మాజీ, దూరమైతే అయిందిగాని, ఆ అడివిలో ఉన్నంతసేపూ, శ్రమంతా మరిచిపోవడమేగదా? ఆ పరిమళమూ, ఆ ఆకులూ, ఆ పువ్వులూ, ఆ కాయలూ, పాలవెల్లికి కట్టినట్టు, చెట్లనిఆ కమలాఫలాలు-

చంద్ర:—ఆ పళ్లేమైనా తిన్నావా ఆకలికి?

లోహి:—ఏలాగు తినేది, అమ్మాజీ, మనవి కానప్పుడు? సమిదెలూ, ఆకులూ తెస్తున్నామంటే, దానివల్ల ఎవరికీ నష్టంలేదు. పళ్లు అలాంటివా? ఎవరికి నష్టంవస్తుందో మేము తింటే?

చంద్ర:-(వానిని గుండెలకదుముకొని, ముఖానికి ముఖముచేర్చి) అవును, తండ్రీ ఆనీతి ఎప్పుడూ మరిచిపోకు. కాని, ఏదీ చూతాం, బాబా, పాదాలు పొక్కులెక్కినాయేమో, అయ్యో, తండ్రీ, ఎంతబాధ పడుతున్నావోయ్, నాకడుపున పుట్టి! (పాదాలు చూచును)

లోహి:—ఆఁ! ఆఁ! ఆపాదం ముట్టుకోకండి అమ్మాజీ! ఆఁ! ఆఁ! వద్దు వద్దు!

చంద్ర:—ఏం తండ్రీ, పాదం ఇలావాచిందీ? అయ్యో, కొడకా!

లోహి:—ముల్లుగుచ్చుకొంది, పాదంలో-

చంద్ర:—ఇదుగో పైకి కనిపిస్తూందే!

లోహి:—చాలా లోతుగా దిగిపోయింది. పెద్దముల్లు_

చంద్ర:—ఏమీ, దానితోనే ఇంతదూరం నడిచినావా, తండ్రీ?

లోహి:—అవునమ్మాజీ, ఏం చేసేది? అడివిలో కర్రవాళ్లు తీయబోతే, వచ్చింది కాదు, రక్తమే వచ్చింది.

చంద్ర:—అయ్యో, కొడకా! నేనేంచేతునూ? ఎలాగు తీయడం?

లోహి:—ఏమి చేయనక్కరలేదమ్మాజీ. చీము పోస్తే, చులాగ్గా అదే వస్తుంది.

చంద్ర:—నాన్నా, ఈ ముల్లు, నీపాదంలోకంటె లోతుగా నాహృదయంలో నాటినట్టున్నదోయ్!

లోహి:—ఏడవకండమ్మాజీ, ఏడవకండి. నాకీనొప్పికంటె ఎక్కువబాధ తమయేడ్పు చూడడం. తమరు నాబాధ చూడలేరనే, తమతో చెప్పలేదు.

చంద్ర:—ఏమి ఈపసికూన ప్రేమ! వీని మాటలు విన్నకొలదీ, నా విచారమునకు వన్నె వస్తున్నదే! ఇంతప్రేమను బయలుపెట్టే విచారము నిజముగా కోరదగినదే! ప్రేమ ఈశ్వరుని స్వరూపము. అట్టి ప్రేమను విస్తారముగా బయలుపెట్టే విచారము ఏమైఉండవలెను? చేదు వేపచిగుళ్లు ఆరోగ్యమును ఎక్కువ చేసినట్టు, కష్టాలు ప్రేమను వృద్ధిచేయునే! పంకములోనుంచి పద్మం పుట్టినట్టు, కష్టంలోనుంచి ప్రేమ పుట్టడమా? దైవభక్తి ఎక్కువ చేయడమా? ఏమి, కష్టాల మహిమ! "ఈకష్టందాటించు, దైవమా!"

అన్నట్టు, "ఈసుఖం నిలబెట్టు ఈశ్వరా" అని అనేవాళ్లున్నారా? వశిష్ఠ భగవాన్లువారు కనిపించినా, నాథర్తను కలుసుకొన్నా—మళ్ళీ కలుసుకొంటామా? ఎలాగున్నారో గదా? ఆచండాలసేవలో ఏమిబాధలు పడుతున్నారో గదా, ఈశ్వరా?

లోహి:—జ్ఞానికి కష్టా లంటవని తమరే అన్నారే?

చంద్ర:—అవును, బాబా-కాని, ముల్లుంచి వేయకూడదు-

లోహి:—తమచిత్తం, అమ్మాజీ! (తల్లి ముల్లు పెరికి వేయును) హా, శంకరా! హా, రక్షకా, విశ్వనాథా!

చంద్ర:—తండ్రీ, ఎన్నికష్టాలువచ్చినా, భగవంతుని మరిచిపోకు. వాడే దిక్కు. కాని, ఎంతరక్తం వచ్చినదోయ్, నాయనా, ముల్లుతో!

లోహి:—అమ్మాజీ, తమకు తెలియనిది నేనేమి మనవిచేయగలను? రాచబిడ్డకు భయమేమిటి రక్తమంటే? యుద్ధములో రక్తము జుర్రేవానికి, రక్తమంటే భయమా? వానికి నొప్పిఅనగా ఏమి?—ఆఁ! ఆఁ! గాయం తుడవకండి, అమ్మాజీ!

చంద్ర:—తుడవడానికి గుడ్డైనా లేక—

లోహి:—కొంగుతో తుడవకండి, పాడైపోతుంది—

కాలకౌశికుడు:—(లోపలనుంచి) ఎవడ్రా, గాడిదలాగు, ఆకేకలు? ఆఁచీంబోతులాగు తిని ఆటంద్ర బెట్టడమేమిరా, నాగమ్మా! పట్టక పట్టక కునుకుపట్టితే, ఆకేకలేమిరా! తులువా? తిండి వంటపడుతూందిరా; ఆఁ!

లోహి:—పొరపాటు, స్వామీ, పొరపాటు, తమనిద్ర భంగంచేయడం. క్షమించండి, మరి కేకలు వేయను.

చంద్ర:—అయ్యో, బాధతీరా ఏడ్వడానికైనా నోచుకోమైతిమా, విశ్వేశ్వరా?

రెండవరంగము

కాలకౌశికునియిల్లు; ప్రవేశము, సోఫామీదకలపాకంకి, ఎదురుగా చేతులుజోడించుకొని చంద్రమతి.

కల:—ఏమీ, చంద్రమతీ, నీకొడుకు పాము కరిచిపోయినాడనా అన్నావు?

చంద్ర:—అవునమ్మా.

కల:—అందరిలోనూ నీకొడుకే కానొచ్చినాడా పాముకి? నిన్న వెళ్లి కాలులో పెద్ద ముల్లువిరుచుకో వచ్చాడు, నేడుచచ్చాడు.

చంద్ర:—ముల్లుగుచ్చుకొందని ఇంట్లో కూర్చున్నాడా? కాలు మెడ్డుకొంటూ పాపం మళ్లీ అడివికి వెళ్లుమనగానే వెళ్లినాడు, పసికూన—

కల:—ఎవడికోసమని వెళతాడు? పసికూనలు! నిలువెడు పిల్లవాడు పసికూన!

చంద్ర:—గాయంలోకి ఇసక వెళ్లకుండా కట్టడానికి చిన్నగుడ్డ అడిగితే, వినలేని తిట్లు తిట్టినారు. నాచీరలో చింపి కట్టి పంపినాను.

కల:—ఎవరికా ఉద్ధరింపు?

చంద్ర:—పిల్లవానినంతు నేను వెళతానంటే కేకలువేసి బుగ్గపోట్లు పొడిచినారు.

కల:—ఇంట్లో పనులన్నీ నీయబ్బ ఎవరుచేస్తా రనుకొన్నావు? నీకొడుకు చావుకాదు గాని, నా బండెడుసొమ్మూ గంగలో కలిసింది—

చంద్ర:— ఆయనా అలాగే అన్నారు—

కల:—ఎవరైనా అంటారు, అనరూ? సొమ్మా మన్నా? అయితే ఏమంటావు? నీకొడుకును వెతికి తెప్పించుమంటావేమిటి?

చంద్ర:—నేనేవెళ్లి వెతుక్కొంటాను, శలవు దయచేయండి.

కల:—వాణ్ణి వెతకడానికి ఈ రాత్రివేళవెళ్లి నీవుకూడా చస్తే? ఆదండుగకూడానా? చాలుచాలు! సిగ్గులేక ఏమని అడిగావు?

చంద్ర:—అమ్మా, సంస్కారముచేసి వెంటనే వస్తాను. అయన్ను అడుగుతే, తమర్ని అడుగుమన్నారు. శలవియ్యండి. మీకు చాలా పుణ్యం వుంటుంది.

కల:—సరే. కాళ్లుపట్టి వెళ్లు.

చంద్ర:—చిత్తం. (కాళ్లుపట్టును)

కల:—నీకొడుకు చచ్చాడని, మామూలు మరిచిపోయినావూ? పాడుతూపట్టు.

(చంద్రమతి ఇలాగు పాడుతూ కాళ్లు పట్టును:)

(నటుడని కిష్టమువచ్చినపాట, శివస్తోత్రముగాని, జీవిస్తోత్రముగాని, పాడవచ్చును. కరుణారసమైన రాగముపాడని శ్రేష్ఠము.)

కల:—మరివెళ్లు. అక్కడపనికాగానే వెంటనే రావలెను సుమా!

చంద్ర:—చిత్తం. (తెర)

మూడవ రంగము

స్మశానము; ప్రవేశము హరిశ్చంద్రుడు, లోహితాస్యుని శవముతో చంద్రమతి.

హరి:—అక్కడెవరో శవము దహనము చేయడానికి మంటచేస్తున్నట్టున్నది. ఎవరక్కడ?

చంద్ర:—ఎవరా అడిగేది?

హరి:—నేను, కాటికాపుని.

చంద్ర:—నాపిల్లవాడు అడివిలో సర్పదష్టుడైపోయినాడు. సంస్కారము చేయడానికి వచ్చినాను.

హరి:—ఇంతరాత్రివేళనేమి? ఇప్పుడు కాపెవరూ ఉండరనుకొని దొంగతనముగా దహనముచేతామని వచ్చినావేమి?

చంద్ర:—దొంగతనముగా చేయవలసిన అవసరమేమి? అడవిలో ఎక్కడోపడియున్న పిల్లవాన్ని వెతికి వెతికి, చితుకులుఏరి ఇక్కడికివచ్చేసరికి ఇంత వేళయినది.

హరి:—సుంకము తెచ్చినావా?

చంద్ర:—సుంకమియ్యవలెనా?

హరి:—అవును. ఇయ్యకుండా సంస్కారము చేయకూడదే ఈస్మశానములో.

చంద్ర:—ఏమీ లేనిదానను క్షమించి-

హరి:—ఎవరినైనా అడిగి తీసుకొనిరా. లేకుంటే ఇక్కడ సంస్కారము చేయ

నివ్వను. ఆ మండుతూన్న కఱ్ఱలు వెంటనే తీసివేయి.

చంద్ర:—బ్రతికి చెడ్డదానను, దయఉంచి, సంస్కారము చేయనీ.

హరి:—మండుతున్న కఱ్ఱలు ఇంకా తీసివేయకుండా మాట్లాడుతున్నావా?

(అక్కడికి వెళ్లి శవమును తిరగద్రోసి కఱ్ఱలు తీసివేయును.)

చంద్ర:—నీకేమి జాలిలేదా? శవమును కిందికి తిరగద్రోస్తావా? (శవమును కాలుమీద పెట్టుకొని) నాయనా, ప్రాణము పోయినా, నీవొళ్లు ఎంత మృదువుగా ఉన్నదోయ్! ఇన్నికష్టములొచ్చినా, నాగుండె గట్టిపడనట్లు, నీశరీరము గట్టిపడలేదు తండ్రీ! ఈఉదయం నీవులేవడం ఆలస్యం అయినదని యజమాని నిన్ను నామీద త్రోసివేస్తే, కంటతడిపెట్టినావుకావు. నీతల తగిలి నాచెయ్యి ఎంతో నొప్పెట్టినది. నీతల ఎంతనొచ్చియుండునో, నాయనా? మరి కేకలు వేయనని, నిన్నరాత్రి అన్నావనా, ఏడవలేదు, బాబా? ఇప్పుడు నిన్ను ఈకాటికాపు త్రోసివేస్తే, నీకు నొప్పితెలియకపోయినా, నాకెంతనొప్పిగా ఉన్నదోయ్, తండ్రీ! (గుండెలకు శవమును అదుముకొనును)

హరి:—(తనలో) ఈస్త్రీ ఎవరై ఉండునో? అడవిలో వెతకడము, ఇంత రాత్రివేళ స్మశానమునకు రావడము, ఏమి సాహసము! ఆ మాసినగుడ్డ, ఆ చింకిరితల, ఆ ఖేదము, ఆ ముఖానికి ఆ మంటల వెలుగున ఎంత భయంకరమైన అంద మిస్తున్నవో! ఆమె వైఖరిచూచినా, ఆమె మాటలు విన్నా, అగ్రజాతి స్త్రీఅయి ఉండవలెను.—నీవెవరవు?

చంద్ర:—ఒకరింట పనిచేస్తున్న దాసిదానను.

హరి:—(తనలో) అంతచక్కనిది దాసిసదా! ధూళికప్పిన ముఖమును కన్నీళ్లు కడిగి, ఆ కాలువలలో ఆమె స్వచ్ఛమైన స్ఫూర్తిని ఎలాగు కనపరుస్తున్నవో, బంగారు చెక్కలో ఉలితో నాటువేస్తే కనబడేటట్టు! నీ పిల్లవాడు 7-8 సంవత్సరములకంటె ఎక్కువున్నట్టు తోచదు. అంత చిన్నవయస్సులో అడివికి ఏమని పంపినావు?

చంద్ర:—పెద్దపిల్లవాళ్లతో వెళ్లినాడు. మూడుదినములు వెళ్లి, ఈదినమే పాము కరిచి పోయినాడు. ఈ సాయంత్రము దీపాలవేళ పిల్లవాళ్లు వచ్చి నాతో చెప్పినారు. ఎంతో బ్రతిమాలుకొంటే, సంస్కారము చేసి వేగముగా రమ్మని యజమానులు శలవిచ్చినారు.

హరి:—(తనలో) దాసితనమూ, తల్లి కొడుకూ, ఆముఖములూ, ఆవయస్సూ, ఆమాటలపొందికా, ఆమె—

చంద్ర:—నేను తిరిగీ ఇంటికి వేగముగా వెళ్లవలెను. సంస్కారము చేయడానికి వెంటనే శలవియ్యి, నీకు చాలా పుణ్యం ఉంటుంది.

హరి:—నీపెనిమిటి లేడా?

చంద్ర:—(తనలో) ఏమయినారో తెలియదాయె. ఏమిచెప్పేది? నావద్దలేరు.

హరి:—సరే, నీవు వెంటనే వెళ్లి నీయజమాన్ని అడిగి సుంకం తీసుకొనిరా.

చంద్ర:—పిల్లవాడు అడివిలో ఎక్కడో చని పోయినాడని నేనంటే, "వాడుపోతే, నీకేం పోయింది? వాని సంరక్షణే పాయె, బ్రతి కావు. కాని వాడు చావడంవల్ల నాకెంత డబ్బు గంగలో కలిసిందో చూడు! మీాయిద్దరిని బండెడు సొమ్మిచ్చి కొనుక్కొన్నాను. దానికేం అంటావు?" అన్నాడు యజమాని. అతడిస్తాడని ఏలాగనుకొనేది?

హరి:—నేనేమిచేయగలను? సుంకం ఇవ్వకుంటే దహనము చేయనివ్వను.

చంద్ర:—అయ్యో, ఎంతవానికుమారునికి ఎంత వచ్చినది! ఎంతగతిలేనివాని శవమై నాదహనము కాకుండా ఉండిపోయిందా? తండ్రీ, నీగతి ఈలాగుపట్టినదా? నిన్న రాత్రి, ముల్లుతో రక్తంవస్తే, "యుద్ధంలో రక్తం జుర్రేవానికి రక్తమంటే భయమేమి?"టన్నావు, కొడకా! ఇప్పుడు నన్నేమని ఓదారుస్తావు. నాయనా! నీవు పోయినావని ఏడ్చేదా? నీ శవం దహనంచేయలేనంత లేనిదాన నని ఏడ్చేదా? సరి, ఏడుస్తూంటే, ఏమున్నది? పోయి సుంకంకొరకు ప్రయత్నించవలెను. కాని, ఈ శవాన్ని ఏమిచేసేది? శ్రమైతే అయింది, తీసుకొనివెళ్లి ప్రయత్నం చేతామంటే, ఏవరూ చేరనీయరేమా? ఉంచి వెళదామంటే, మళ్లీ వచ్చేసరికి, ఏమవుతుందో? కాటికాపు చూస్తాడా? శవాన్ని తిరగదోసినవాడు, వానికేంపట్టింది? కానీ, ప్రభో, విశ్వేశ్వరా, నీవు స్మశానవాసివి. నేను వచ్చేవరకు, నాపిల్లవాని శవమును చూస్తూండవా? నేనే పతివ్రతనైనయెడల శవము, నేనుంచినట్టె ఉండుగాక! తండ్రీ! నీదేహము, దహనము లేకుండానే, ఎంత మన్నయినదో! దహింపబడేది గనుక దేహమన్నారు. నీపట్ల ఆయర్థము వ్యర్థమయినదా, నాయనా! (మన్నుదులిపి క్షితి పైనిపెట్టును)

హరి:—మన్ను కావలసి ఉన్నశవానికి మన్ను దులుపుతూంది! మాతృప్రేమకు మేర ఉన్నదా? ఆమాటలు వింటూంటే, నా కడుపులో మంట పుట్టుచున్నదేమి? "ఎంతవాని కుమారున కెంతవచ్చినది!" అన్నది; నాయంతవాని కుమారునకు దాస్యము వచ్చినది! ఇదికూడా ఏల రాకూడదు? "యుద్ధములో రక్తంజుర్రే వాడ"ట! క్షత్రియబిడ్డ కావలెను, ఆమాటలు అనడానికి. "మిమ్మల్ని బండెడు సొమ్మిచ్చి కొనుక్కొన్నాను"— నాలోహితాస్యుడై ఉండవలెను. నాచేతులారా నేనే అమ్ముకొన్నాను. ఆమెను భర్త దగ్గిర లేడట. నేను చంద్రమతిదగ్గిర లేనే? "నేనే పతివ్రతనైతే"—కారుచిచ్చు భయపడి తోవ ఇచ్చివేసినది చంద్రమతి పాతివ్రత్యముచూచి. ఇప్పుడు శవముజోలికి జంతువులు రాకుండా శాసించలేదా ఆ బలము? అయినా, అడిగి చూడవలెను.

—నీవు చంద్రమతివి కావూ? నిన్ను కొన్నవాడు కాలకౌశికుడు కాడూ?

చంద్ర:—(తనలో) ఈమనిషి నాభర్తవలె ఆజానుబాహు, నీచవృత్తిలో అటువంటివాడు ఉండునా? ఆయన్ని వీరబాహుడు కొన్నాడు. కాటికాపుగా నియమించి ఉండును. అయినా జాగ్రత్తగా మాట్లాడవలెను:—నన్ను పోల్చుకొన్న బుద్ధిశాలికి నానాథునిజాడ తెలుసునా!

హరి:—నేనే నీ భర్తను, హరిశ్చంద్రుడను!

చంద్ర:—ఆఁ! ఆఁ! (వానిమీద పడును. వారిద్దరు ఆలింగనము చేసుకొందురు)

హరి:—మనము ముగ్గురమూ, ఇలాగున, ఇక్కడ, ఇప్పుడు కలుసుకొన్నామా? స్థితి, స్థలము, కాలము—ఆహా! (శవము వద్దకువెళ్లి) లోహితాస్యా, కాలులో ముల్లు గుచ్చుకొన్న గాయముండగానే, మళ్ళీ అడవికి వచ్చినావోయ్? యుద్ధములో రక్తం జర్రడమూ, వత్సా! నీ కెవరు చెప్పినారోయ్? నీరక్తమే చెప్పినదా? ఎవరితో యుద్ధముచేసినావు, బాబా! (శవమునుకాలుమీద కూర్చుండబెట్టుకొనును) నీబాధ చూడలేక మీ అమ్మ దుఃఖిస్తుందని, నీ దుఃఖముతో యుద్ధముచేసి అణచివేసినావా, తండ్రీ? యుద్ధములో శత్రువును గెలవడంకంటె కష్టమయినపని చేసినావా? కాశికి వచ్చేతోవలో, ఎత్తుకొంటానంటే, నీశ్రమను దాచుకొని, వద్దన్న వీరుడవు, మీ అమ్మయెడల—

చంద్ర:—తానన్ని కష్టాలుపడుతూ, నన్ను ఓదార్చేవాడు, నాచిట్టివాడు.

హరి:—ఏలాగు శుష్కించి పోయినావోయ్, తండ్రీ!

చంద్ర:—మనము వేరైన ఈ పదిరోజులలో తమరు పోలిక తగలకుండా శుష్కించి పోయినారు, నాథా!

హరి:—ఇన్నాళ్లూ నాకు నిద్రాహారములు రెండూలేవు. బ్రహ్మయజ్ఞము, పితృతర్పణములేకుండా భోజనము చేయనుగదా? అవి, ఈస్మశానములో, చండాల సేవలో ఏలాగుచేయను?

చంద్ర:—మహాదేవ!

హరి:—కాని, బాబయ్యముఖాన్ని ఆనవ్వేమిటి? విశ్వేశ్వరుని ధ్యానిస్తూ ప్రాణం విడిచిపెట్టినావా, నాన్నా? లేకుంటే, ప్రాణంపోయినా, ముఖాన్ని ఆనవ్వేమిటి?

చంద్ర:—బాగా పోల్చినారు, నాథా! ఆకుర్రవాళ్లన్నారు, "అమ్మాజీ, బాబయ్యా, విశ్వేశ్వరా!" అంటూ ప్రాణం విడిచిపెట్టినాడట. "మీరు చాలామంచివాళ్లు, మా అమ్మాజీని ఏలాగు ఓదార్తారో?" అన్నాడట, నాతండ్రి! నాయనా, నీవు పెట్టినచిచ్చు, ఎవరు ఆర్పగలరోయ్?

హరి:—బాబా, నీకు నవ్వూ, మాకు ఏడ్పూనా? నీకష్టాలు గట్టెక్కినాయి, నీకు నవ్వకాకేమి? బాధములేని మా విచారముచూచి నవ్వవలసినదే.

ద్ర:—బాబా, ఇక్కడ గంజివిడిచిపెట్టి, స్వర్గములో నీవు అమృతం సేవిస్తూ అమృతాన్ని మించిన నిన్ను విడిచిపెట్టి, మమ్మల్ని మాకన్నీళ్లే తాగుమన్నావా? బాబా, నిన్ను కృష్ణమ్మ భోజనానికి పిలుస్తే, "మా అమ్మాజీ చాలీ చాలని గంజి తాగుతూ ఎలాగో ప్రాణాలు నిలబెట్టుకొంటూంటే, మీయింట పిండివంటలు నానోటికి ఏలాగు పోతాయి?" అన్నావే. ఇప్పుడు నన్ను విడిచిపెట్టి స్వర్గ సౌఖ్యం ఎలాగు అనుభవిస్తున్నావు, తండ్రీ! అమ్మకు నీవద్ద చోటిప్పించవూ?

హరి:—ఏమీ; గంజూ తాగేవాడు, బాబయ్య?

ంద్ర:—అదైనా, కడుపునిండా ఎక్కడ? "బాబాజీని ఎప్పుడు చూస్తాము? ఎప్పుడెప్పుడ" నేవాడవు, చూడకుండా వెళ్లిపోయినావా. కొడకా! ఒక్కమారు నిన్ను కాలుమీద కూర్చోపెట్టుకొని ముద్దులాడుతే, అడివికివెళ్లి వచ్చిన కష్టమంతా నా చేతుల్లో పోయిందన్నావు. నేను నాకష్టాలన్నీ మరిచి పోయేదానను. తండ్రీ! కష్టాలవంటిగురువు లేడన్నావు కాని, నీవుపెట్టినకష్టం, ఏమినేర్పుతుంది, బాబా?

యజమానిసేవలో ప్రాణమైనా పెట్టవలెననా? నీవు అలాగే చేసినావు. నీవు ప్రాణముమాత్రమే విడిచిపెట్టినావు. ఆయజమానిసేవలో, నా ప్రాణముకంటె ఎక్కువ వస్తువును, నిన్ను, విడిచిపెట్టినాను. నేను ఎక్కువకాదు, బాబా? నాథా, "నన్ను తిరిగీ వేగమే రావలెనని యజమానిఆజ్ఞ. యజమాని ఆజ్ఞను అతిక్రమించకూడదని బాబు శరీరము జ్ఞాపకంచేస్తున్నది, తమ పౌరుష్యం జ్ఞాపకంచేస్తున్నది. నేనువెళ్లుటకొరకు ప్రయత్నించవద్దా?

హరి:—తప్పకుండా చేయవలసినదే.

చంద్ర—పోయివస్తానని అనడానికి అధికారములేదు. వస్తే, ఏలాగు వస్తానో?

హరి:—వెళతానంటే, మంచిది అనడానికి నోరురాదు! ఈకికారణ్యం దాటించడానికి అధికారములేదు! బాబయ్యలేని ప్రపంచములో ఇక మనకేమున్నది, సత్యసేవానందముతప్ప? మనకు సత్యమే స్వర్గము. మనకు ఇంతకంటే మరేమిచేటు రాగలదు? మరి నీవువెళ్లు, (చంద్రమతి నిష్క్రమించును) ఏలాగు తిరిగిచూస్తూ వెళుతున్నదో! (తెర)



విరహము

నాదెళ్ళ వెంకట్రావుగారు. బి. ఎ.

నడిరేయిని కలలోన నాకునీవు
కానుపింపగ మేల్కాంటిఁ గలఁతఁ జెంది
మాయమైపోతి వింతలోనే యెచటికో ?
పక్కపై నొక్కనిని నన్నుఁ బాఱవైచి.

గీ. దూరమున హోరుమను నకూపారరవము
చేరువను గానవచ్చు నాచెట్టుమీఁద
ఘూకములభీకరంబగు కూతదప్ప
లోకమున నెట్టిధ్వని విన రాకయుండె.

గీ. విజనసంచారమైన యీవీథులందు
వ్యర్థముగ నేరికొఱకో ? యీయర్ధరాత్రి
విమలశీతలచంద్రికా సముదయంబుఁ
గాయుచున్నాఁడు యామినీ కాముకుండు.

గీ. ఇట్టిచల్లనిరాత్రి నీయింటియందు
నిర్విచారంబుగా నీవు నిద్రపోవ
నొక్కఁడను బిక్కుబిక్కునఁ బక్కపైన
నిన్నుఁదలపోసికొనుచుఁగూర్చున్నవాఁడ.

గీ. తెక్కలేయున్న నాకిడ్డె తీవ్రమనుచు
నంతరిత్తాన కెగిరి నీ చెంత వ్రాలి
నిదురలో వింతచెలువంబు నెగడునీదు
సుందరాస్యంబు ముద్దాడియుండునుగద.

గీ. నిన్ను నెడబాసి విరహార్తి ఖిన్నుఁడైన,
నాయెడ న్జాలిఁజెంది స్వప్నాననైన
దర్శనంబిచ్చునంతటి దయయుఁ గలిగెఁ
జాలు; పదివేలుసుమ్ము నాపాలి కిదియు.

ఊఁచబియ్యము

దీపాల పిచ్చయ్య శాస్త్రి గారు

ముంగురుల్ చెదరి గుంపులుగట్టి నెమ్మోము, దమ్మి ముమ్మరముగఁ గ్రమ్మ కొనఁగ
ముద్దులమురిపెంపు మొగిమున మొలకెత్తి, కొమరుఁ జెక్కులఁ జిఱుచెమట జాఱ
తుఱిమిన తంగేడువిరులతోఁ గూడ, నం దంపుధమ్మిల్లబంధము నటింప
శ్రీకారములతోడఁ జెలిమిఁజేసెడు కర్ణ, ముల నొప్పు పల్లేరు పూలు గదలఁ
గీ. దానుబాడెడు మోటు పదంబునకును, కంకణంబులు చెలఁగి పొంకముగఁ దాళ
మానములు గొల్పఁ గూర్చుండి మంచెమీఁద, నబల యోర్తుక ఊఁచబియ్యంబు గొట్టె.

ముక్కు తిమ్మనార్యుఁడు

మండలీకుల వేంకట శాస్త్రి గారు, బి. ఏ., యల్. టి.

ఆంధ్రభోజుఁడని విఖ్యాతిఁబడసిన శ్రీకృష్ణదేవరాయల కాలమున సామ్రాజ్యలక్ష్మి ననుసరించి కవితాలక్ష్మియు, వాసియు వన్నెయుఁ గాంచి మించినది. అష్టదిగ్గజములను ప్రశస్తివడసిన కవినాథులెనమండ్రీ విశ్వత్రిభుని యాశ్రయము నవలంబించి యుండిరి. ఆకాలమునఁ గవితాప్రపంచమునఁ బ్రబంధరచనయే మిన్నయై యుండుటచేతను, శ్రీకృష్ణదేవరాయలు పండితుఁడగుటచేతను, వాని యభిరుచి ననుసరించి, కవులందఱును ప్రబంధరత్నములతో నాతనిఁ బూజించి ప్రశస్తి వడసిరి. అట్లొనరించిన వారిలోఁ బారిజాతాపహరణ కర్తయగు ముక్కుతిమ్మనార్యుఁడు కడుఁ బ్రసిద్ధుఁడు. మృదుమధుర రసభరితమగు శైలిఁగలవాఁ డగుటచే "ముక్కుతిమ్మనార్యు ముద్దుపల్కు" అని సార్థకబిరుదము నొందెను. "నానా సూనవితాన వాసనల నానందించు" అనుచక్కని, ముద్దులుమూటగట్టు పద్యమును రచించుటచే నితని ముక్కుతిమ్మనార్యుఁడని లోకము వాడుచుండుట యెల్లరకుఁ దెలిసిన విషయము.

ప్రబంధకవులలో నితఁడు సుప్రసిద్ధుఁడు. ప్రబంధములసరణి ననుసరించియు, వానిలోఁ దలతిక్కగానుండి, పాఠకుల హృదయములకు విసుగుగలిగించు కొన్ని లక్షణముల నితఁడు తొలఁగించి, తన రచించిన "పారిజాతాపహరణము"ను నిర్దుష్టము గావించుకొనెను. అందుచే నితని కవిత్వ మన్నిఘట్టములందును మిగుల రసభరితముగ నుండును. సాధారణముగఁ బ్రబంధములలోఁ గథాసరణి వ్యగ్యము. కథావేగము మొదలే లేదని కూడఁ గొందఱు విమర్శకులు సహేతుకముగ యోచింతురు. ప్రబంధములకు నిర్ణీతములగు వర్ణనలను జేయుటకుఁ గథాసందర్భ ముపయోగింపఁబడునుగాని కథ ప్రధానము గాదని తేలుచున్నది. ఈగ్రంథ మీవిషయమునను నదితరవిషయములందును భిన్నముగ నున్నది. దీనియందుఁ గథయును గథావేగమును బ్రధానములు. ప్రారంభమునుండి, ముగియువఱకును కథాధోరణి యొక్కవిధముగనే చెప్పఁబడినది గాని, సందర్భశూన్యములగు వర్ణనలు కథావేగమునకు భంగముఁ గలిగించలేదు. అందుచేఁ బాఠకుల కిందలియాసక్తి యధికమగుచున్నది. మఱియొక విషయము గలదు. సామాన్య... ముగఁ బ్రబంధములయందలిపాత్రము... నొకేవిధముగ నుండును. ... టికి స్వాభావికములగు ... బడక మనుష్యస్వ...

తిరుగనుండి, యంత వైచిత్ర్యరహితమా యని యనిపించుచుండును. కారణమేమన, వానిని రచించిన కవులు సాధారణముగఁ బండితులు; కావున గ్రంథస్థములగు విషయములనే గ్రహించి యుందురుగాని, సృష్టినుండి విషయములను దామే తొలిసారి గ్రహించినవారు కారు. అందువలన, నాయక, శృంగారాద్యవసరములయందు, పాత్రము లన్నియు నొకేవిధముగ, సంభాషించుచు, బ్రవర్తించుచు నుండును. ఈగ్రంథమున గల ప్రధాన పాత్రము లట్లుండలేదు. శ్రీకృష్ణుఁడు, రుక్మిణి, సత్యభామ, నారదుఁడు ఇత్యాదులు స్వతంత్రములగు పాత్రములు. అనగాఁ దమంతటతాము నిలచునవి. ఆయాయవసరములందు వారి ప్రవర్తనము సముచితమని యంగీకరింపవలసి నట్లుండును. ఇరువురుగాని, యధికముగ గాని కళత్రములుగల యాతఁ డేయవసరములయం దెట్లుసంచరించునో శ్రీకృష్ణుఁ డట్లే ప్రవర్తించియుండెను. నారదుఁ డొసఁగిన పారిజాతము నూహించి శ్రీకృష్ణుఁడు:

మ. "ఇది భోజాత్మజ కిచ్చినన్ గినుకతో నేమంచు
నూహించునో, మఱి సాత్రాజితి? దానికే నిపుడు
శ్రేమంబంపినన్ దీని నెల్లిదమున్ జేసిన జాడ దోఁచు
నో కో? యాలె; మ్ముందు నేమన్కి చెల్లదువో యేరికిఁ
బంపఁగా; ననుచు లీలన్ రుక్మిణీకాంతకున్.

ఇచ్చుట సమంజసమని యోచించెను.

... స్వాభావికముగ నున్నది? అట్టి ...ధర్మ మనుభవైకవేద్యమని నామ ... సమయోచిత ప్రవ ...ములును వేఱొకచోఁ

తిక్కనసోమయాజి నాఁట నుండియు స్వప్నవృత్తాంతమును దెలుపుచుండుట వాడుకలోఁ జేరినది. కవిబ్రహ్మయగు తిక్కన కాలమున నీవృత్తాంతము రసవంతముగ నుండినను దాని ననుకరించుటయే ప్రధానముగఁ దలఁచినయితరుల వృత్తాంతములు రసభరితములుగ నుండలేదు సరికదా; పాఠకులకు విసుగు గలిగించున ట్లుండును. తమ గ్రంథములకొక గౌరవాతిశయము గలిగించుకొనుట కిది యొక పన్నగడ యని విమర్శకులు కొందఱూహింపఁ దగియున్నది. అట్టి స్వప్నవృత్తాంత మిందుఁ జొన్పఁబడి యుండలేదు. మఱియుఁ జర్వితచర్వణముగ నాచరింపఁబడుసుకవిస్తుతియును గుకవినిందయు నీతని కృతియందు గానరావు. కవితఁ జెప్పఁ దొడఁగిన ప్రతివారును గుకవినింద సేయుచ వచ్చినచో, నిందకుఁ బాత్రులగు నీకుకవు లెవ్వరని సందేహించఁదగి యున్నది. తిమ్మనార్యుఁ డిదియెల్ల నప్రస్తుతప్రసంగ మనియు, తన గ్రంథమున బాఠకులకుఁ గలుగఁగల యాదరమునకు భంగము గలిగించుననియు నూహించి వీనిని లోపింపఁజేసి స్తుతిపాత్రుఁ డయ్యెను.

ప్రబంధములనుగాని, యితర పద్యకావ్యములఁగాని రచించినకవి నాథులందఱును దప్పక కవివంశానుక్రమణికను దెలుపుచుఁ బెక్కు పద్యముల వ్రాయువాడుక గలదు. కవీశ్వరు లిందు స్వగుణాతిశయమును, బాండిత్యోత్కర్షయును గూడ వర్ణించుకొనుట సహజము. తిమ్మనార్యుఁ డిది యనుచితమని తలఁచెఁ గావలయు. ఏలనన, కుకవులను పేరిట నితరుల

నిందించుచు, స్వగుణంబులి నుగ్గడించుట సత్పురుషలక్షణమని యూహించుటకు వీలుకాదు. శ్రీకృష్ణదేవరాయలను గృతిపతిగాఁ దానే నిర్ణయించి కృతియొసఁగినట్లు తోఁచునుగాని, మనుచరిత్రాదులవలెఁ బ్రభువు తన్నుఁగోరుటయే యీకావ్యరచనకుఁ గారణమైనట్టులు గానరాదు. లేనిచోఁ గర్పూరతాంబూలాద్యుపచారములతోఁగవిని బూజించి ప్రార్థించుట యిందునఁ గానఁబడియుండెడిని. కృతిపతియే తన పేరఁ గృతి రచింపుమని కవిని బ్రార్థించుటకన్న, కృతిరచించి యుత్తమనాయకుని వరించి యర్పించుట యధికరసవంతముగఁ దోఁచుచున్నది. మఱియుఁ గృతిపతి వంశానుక్రమణికయును, కృతినాయకుని వర్ణనమును దిమ్మనార్యుఁడు కడుసంగ్రహముగను, మిగుల హృద్యముగను జేసియుండెను. కృతిపతి వంశమునఁ బ్రసిద్ధులగు నీశ్వరనృపతిని, నరసభూవిభుని, వీరు చూపిన బలపరాక్రమములను, కవిగడు సమంజసముగ వర్ణించియున్నాఁడు. నిర్నిమిత్తములగు విషయముల యందనావశ్యకములగు నతిశయోక్తులతో వర్ణించినచోఁ గవీశ్వరుని పాండిత్యబలమును గూర్చి సంతసించినను, భావనాబలము లేమిచే హృదయాకర్షకముగ నుండ లేదని విమర్శకు లూహించ వలసియున్నది. వాని నితఁడు పూనకుండుటఁ జేసి యీ భాగమును గూడ హృద్యముగఁ జేసెను. ఈశ్వరనృపతిని వర్ణించుచు మహేశ్వరుని యందుఁగల లోపము లితనియందుఁ గానఁబడక పోవుటయేకాక యితఁడు బలదర్పము లధికముగఁ గలవాఁడని వర్ణించిన పద్యముఁ జూడుఁడు :

ఉ. తామసవృత్తి లేదు; సతతంబును నుగ్రుఁడు గాఁడు;
గౌరవం, బేమియు వెఱ్ఱిగాదు; తనకెందునుఁ బై
మఱిరాజు లేఁడు; సం, గ్రామములోన నొక్కనకు
గాసికి వాసిఁదొలంగఁ డీశ్వర, త్ర్యక్ష హిమాంశుమౌళితో
హరుని పాటియె యీశ్వరుఁ డెన్నిభంగులన్."

ఈశ్వరవిభుని తనయుండగు నరసవిభుని వర్ణించు ఘట్టము మఱియుఁ జక్కఁగ నున్నది. కృష్ణదేవరాయలు రాజ్యాధిపత్యము వహించెనని వ్రాయుచుఁ దొల్లి యదువంశమున నవతరించిన శ్రీకృష్ణుఁడు తనచరితమునఁ గల లోపముల నవరించుకొని లోకమున విఖ్యాతినొంద నిట్టువచ్చెననుచు వర్ణించెను. మఱియొకచో నీ రెండు అవతారము లన్నిలక్షణములతోడను సమానములని తెల్పెను. చూడుఁడు :

సీ. యాదవప్రభువున సింహాసనస్థుఁడుగామి సింహాసనస్థుఁ
డై చెన్ను మెఱయ, గొల్లయిల్లాండ్రతో గోడిగిం
చుటఁ జేసి పరకామినీ సహోదరుఁడనఁ జూప, మఱి బరా
సుతునకై మధుర డించుటఁ జేసి పరపక్షదుర్గముల్
బొమ్మఁగొనఁగ, పారిజాతము సాహసశ్రీ పట్టి తెచ్చుట
నౌదార్యమున దానికడుపువలుప,
గీ. గోరితోలు మేసఁ దనకైన కొదువలెల్ల, మాన్పుకొన
వచ్చి, భువనైకమాన్యలీల, నవతరించిన కృష్ణుఁడో యనఁగ
మించె, నరసవిభు కృష్ణరాయభూనాయకుండు."
సీ. చక్రవర్తి మహోపశోస్తి వాఁడును నేఁడు చెలఁగి ధర్మ
క్రమస్థితిఘటించె, భూభృదుద్ధర విస్ఫూర్తి వాఁడును
నేఁడు గోరక్షఖ్యాతి సుదురుపఱచె, సాధు బృందా
వనసరణి నాఁడును నేఁడు వంశానురంగము వనలఁ
దిరమ్యా, సత్యభామాభోగసక్తి వాఁడును నేఁ నా
కల్పమవని నింపార నిలిపె,
గీ. నాఁడు నేఁడును గూడి నాన్వయము నంచు, జనవిమందెను
నను దేవమనుజ విభుని, కృష్ణ మను పేర నరసేంద్రు
కృష్ణదేవరాయఁడను పేర నాదినారాయణుండు."

కృతిపతిని వర్ణించు నవసరమునఁ గూడ నించుకేని రసభంగము గాకుండ నెట్లు

వ్రాసెనో కనుఁగొనుఁడు: కొన్ని గ్రంథములందలి వర్ణన లెప్పుడు ముగియునా యని విసుగు గలిగించును. కల్పనా విశేషములతోడ నితఁడు కొన్ని వర్ణనలు సలిపెను. మఱియుఁ గృష్ణరాయని బాహుబలమును, పరాక్రమము నీ క్రింది పద్యమున వర్ణించిన విధముఁ జూడుఁడు. విజయ పరంపరను దెలుపుపట్టిక నొకదానిఁ గూర్చి, ఛందోబద్ధము గావించుట సామాన్యకవుల పద్ధతి. మఱి యితఁడన్ననో, ప్రతిపద్యమును భావగర్భితముగను, రసభరితముగను ఉండు నట్లు రచించెను.

సీ. "ఉదయాద్రి వేగ నత్యుద్ధతి సాధించె వినుకొండ మాట
మాత్రన హరించె, గూటముల్ పెనరంగఁ గొండవీ
డగలించె బెల్లముకొండ యుబ్బెల్లఁ దీఱిచె, దేవరకొండ
యుద్వృత్తి భంగము చేసె జల్లిపల్లె సమగ్రకీర్తిఁ గూల్చె,
గినుక విహాళి ననంతగిరి క్రిందుపడఁ జేసె గంబంబుమెట్టు
గ్రక్కున గదల్చె"

పై పద్యము క్రిఁ గీతలిడిన భాగములయందలి చమత్కారములు గ్రహింపఁదగియున్నవి. ఆవీరునిచేత మెఱసిన కౌక్షేయకమును వర్ణించినవిధము స్తుత్యతితము. ఇతని శైలియు, కథాధోరణియు పాత్రోచితముగ జరుగు సంభాషణములు, మొదలగునవి, యింకొక తఱి నరయుదము. ఈవర్ణనలన్నియు నిరువది పద్యములకు లోఁబడియుండునట్లు చేసి కథలోనికి దిగెను. ఈభాగమును జదివిన పాఠకులకు గ్రంథ మంతయు నెట్లు వ్రాయఁబడినదని తెలిసికొనునాస, సహజముగఁ గలుగును. తన ప్రబంధ ధోరణి కన్నివిధముల నియ్యది మచ్చుగా నొనర్చెనని యూహింపఁదగి యున్నది. సర్వజన సామాన్యముగ సుబోధకమగు శైలిగూడఁ దన కమరియుండుట స్తుతిపాత్రమై యున్నది. క్లిష్టపద భూయిష్ఠముగను, అనావశ్యకములగు కల్పనావిశేషములతోడను, గ్రంథమును పాఠకుల హృదయమునకు దూరీకృత మొనరించి యుండినచోఁ దిమ్మనార్యునిఁ గూర్చి వ్రాయుట యస్మదాదులకు దుర్లభంబు. ఇది వఱకీభాగమును సవిమర్శకదృష్టితోఁ బరిశీలించిన వారికీనానుడులు సత్యములని తోఁచును. అతిశయోక్తిగలదని యూహించువారొకసారి పైవిధముగ యోచించి, విమర్శించి, నాయభిప్రాయము ననువదింతురుగాక!

రతివిలాపము

త్రిపురాన వేంకట సూర్య ప్రసాదరాయ కవిగారు

ప్రస్వాయం పాలితుం భానో
ర్నిమే ర్లోకా౯ కవే ర్వచః;
అవతారో యయోః పృథ్వ్యాం
దంపతీ తౌ నమా మ్యహామ్.

† ఉ. నెట్టన కంటిమంట మరు
నీఱుగఁ జేయు మహాతపస్వి దా,
నెట్టె యవస్థపాల్పడియె
నిమ్మెడ నౌర యటంచు నవ్వుచు,
న్నట్టులు సొంపునింపు గిరి
శాంగవిభూతిసితాననంబులౌ,
గట్టుల తేనిపట్టి చను
గట్టుల కేను నమస్కరించెద౯.

ద్విపద

నిటలాక్షు నేత్రాగ్ని నిజనాథుపైకిఁ
దటుకున నేతేరఁ దా మూర్ఛనొంది
వివశయై పడియున్న విరివిల్తు వెలఁది
యవిషహ్య వేదనం బైన వైధవ్య
మావహిల్లఁగఁ జేయు నదియైన ప్రబల
దైవమ్ము చెద్దుని దగమూర్ఛ దేఱె.
ఘనమూర్ఛ దేఱి యక్కలకంఠకంఠి
గనుల నల్లనవిచ్చి కలయంగఁ జూచెఁ
దనివోనికనులకుఁ దన ప్రియుం డింకఁ
గనరానిదశ నున్కిఁ గానలేదయ్యొ.

"జీవితేశ్వర! నీవు జీవించియుంటె;
నావలపులపంట! నాథ! యెందుంటి?"
వనిపల్కి దిగ్గన నటనుండి లేచి
వనజాక్షి నిజపురోభాగమ్మునందు
గిరిశకోపానల కీలలం గాలి
పురుషాకృతిని నున్న బూడిదం గనియె.

మరలఁ జేష్టలు దక్కి మరురాణి యపుడు
ధరణిపైఁ బొరలుచుఁ దన చన్నుదోయి
గడుభాసరద్యుతి గాఁగఁ బెన్నఱులు
విడివడి జీరాడ విపినభూస్థలిని
దనతోడ సరిగ వంతను ముంచునట్లు
వెనుఁబాటువై నిట్లు విలపింపఁ దొడఁగె.

అయ్యయో! నాథ! యిట్లైతివే నీవు
దయ్యమ్ము నినుఁ బాపఁదలఁచెనే నేఁడు
నెయ్యమ్ము కృపయును నీ కెందుఁబోయె
నియ్యరణ్యమున నన్నిటు డించిచనితె.

పన్నగాభరణుతోఁ బంతమ్ము మున్నె
నిన్ను నీకోలఁది గణింపవైతనుచు
నన్నన్న నీప్రాన్కి కడలి నీతోడ
నన్నంతమాటయు నయ్యోనే తుదకు.

పెలతాపసులఁ గిట్టి బెదరించినట్లు
వెఱ పొకింతయు లేక విశ్వసంహారుని

"† తపస్వీ కాంగతోఽవస్థా, మితిస్మేరాననావివ, గిరిజాయాః స్తనౌ వందే భవభూతి సితాననౌ" భవభూతి.

కఱకంఠునిం గాలకాలుని రుద్రు
నుఱక పైకొని తాఁకు టూరకేచనునె.

గిరిరాజతనయను గిరిశుతోఁ గూర్చి
వరదుని మెప్పించి వరములు వడసి
యరుసమ్ము నింతువం చాసించియుండఁ
బరము కోపాగ్నిచే భస్మంబ వైతె.

బరవుగల్గెడువారి కుపమానమగుచు
వఱలు నీయెడ లీ యవస్థ పాల్పడఁగ
నెడఁద వ్రయ్యలుగా దదేమొకో నాకుఁ
గడుఁ గఠినాత్మలు గారె చేడియలు.

నినుఁ జూడకున్నట్టి నిముసమ్ము నాకుఁ
గనుపట్టు నొక దివ్యకల్పమ్ముగాఁగ
నిరవధిమైన యీ నీవియోగార్తి
స్మర! యింక నే నెట్లు సైరించుదాన.

కట్టవాసినజలౌఘము దమ్మికీవ
నట్టు తా విడనాడి యరుగుచందమున
నిముసమ్ములో మన నెయ్యమ్ము దొఱఁగి
రమణ! నీ శోడిదే బ్రతుకుగా మనెడు
నబలను నన్ను నిట్లాఱడివుచ్చి
ప్రబలార్తి నిడి యెందఁ బాఱిపోయితివి.

ఎంతైన ననుఁగూడి యేఁగుదీ వెపుడు
నిందు నగ దిగనాడి యెట్లేఁగినావు
మందభాగ్యను నన్ను మఱచినావేమొ
యిందిరాపుత్ర! యిం కే నెందుఁ జొత్తు.

నేను నీకును నాకు నీవు నెన్నఁడును
నోనాథ! యప్రియ మ్మొనరింపలేదు
కృపవుట్టనేడ్చు నీ ప్రియ కకారణమ
యిపుడు నీ దరిసెనం బీ వదేమిటికి.

కవవాసి నోగులు జక్కవపెంటివోలె
నవిరళశోకార్తి నడలు న న్గనవొ
యెవ రింక దిక్కు నన్నిటులొంటి ఘోర
దవము పాల్సేయ నా తప్పేమి చెపుమ.

చెలువుఁడ! వే ఱొక్కచెలిపేర నన్నుఁ
బిలుచుచో నీమీఁదఁ బెనురోసమూని
మొలనూలిత్రాళ్లతో మొగమోటమూలి
కలయ నిగ్గటిన కత లెంచినావొ
యలరులేయ కరువు లక్షులంగలఁపఁ
గలువప్రాపుల వ్రేయు గతు లెంచినావొ

తప్పుగల్గిన నన్ను దండించుటకును
నొప్పులకుప్ప! వేఱొకదారి లేదె
యిప్పాట నిహలోక మెడలి నన్నిట్లు
ముప్పు మున్నీటిలో ముంచి పోవుదువె.

“ఎదనుండఁపీ” నంచు నీ వన్నమాట
మదన! యిచ్చకముగా మది నెంతొఁ జూవె
యెద నుంటి నేఁడి నీ విటుఁ బాదిగాఁగ
బ్రదికి యే నెట్లుండఁ బ్రాణేశ! చెపుమ.

శరనైపుణిని శైలజాశివాంగముల
నరుదార నొకటిగా నదికింతు నంటి
మదన! యెక్కటియైన మనయంగకముల
యదుకూడ్చి యకట! వేఱైతివే నాకు.

పరమేశ్వరుఁడు కృపాపాథోధియంద్రు
హరిహరీ! యెట్లు కోపాగ్ని నీ గాల్చెఁ
బరమపాపిని నాయభాగ్యమ్ము హరునిఁ
గరుణకుం దప్పించెఁ గాఁబోలు నాథ!.

జగదేకరక్షా విచక్షణస్వాంతుఁ
డగుశౌరి తనమిత్త్రుఁ డైయుండ శూలి

దెగి తత్ప్రతుని నిన్నుఁ దెగఁజూచె మిత్త్ర
మొగి మెట్లుసూతు నన్నోగమోట లేదొ.

కడఁకఁ గ్రొవ్విరిఁగాల్పఁ గాలాగ్నియేల
కడవేళ లోకముల్ గాల్పఁ బాల్పడిన
కడిఁది చిచ్చుఱకంటి గాటంపుమంట
మృడుఁడేలపఱపె నీమెత్తనౌమేన.

ఆఁడుదానను గోల నబల నేనల్గి
వాఁడిచూపులఁ జూడ వణఁకిపోవుదువు
శ్రీకంఠునుగ్రాక్షి శిఖిశిఖాపటలి
పైకొన్న నీవెంత భయమొందినావొ.

[illegible]వునల్లఁగ నిన్నుఁ గన్నతల్లి కిని
[illegible]గాలి కడుపులోఁ జిచ్చు వెట్టితివె
కడుభాగ్యశాలిని గలుములపొలఁతి
గడఁక నెట్లోర్చు నీగర్భశోకమ్ము.

మది నన్నుఁ బ్రాణమ్ము మాఱుగా నెంచు
నది వధూవత్సల యత్త శ్రీదేవి
దలసెడ్డ నాదు దుర్దశను భావించి
వలనేది తానెంత వంతపాల్పడునొ.

అత్యంతభక్తి నే నడుగుల కెఱఁగ
"నిత్యసౌభాగ్యవై నెగడుమాయమ్మ!"
యని నన్నుదీవించు నాదేవిమాట
యనృతమై పోయెనే యక్కటా! నేఁడు.

ఎడప కిప్పుడ దివికేఁగెదు నీదు
నడుగులవెంబడి నరుదెంతు నేను
నాకయిచింతింప నామనోనాథ!
లోకమ్ము కొఱకునై లోనఁ జింతింతు
నైహికజనము దైవాహతంబయ్యె
దేహిసౌఖ్యము నీయధీనమ్మ కాదె.

రేయినిప్పుగ్రమ్ము పురీమార్గమందు [ల
భయదనానులములచే భయమొందుప్రియ
సరగఁ గాముకనివాసములు సేర్పంగ
స్మర! నీవుదక్కంగ శక్తుఁడింకెవఁడు.

పొలయల్కఁ బెడమొగమ్ములు గాఁగ శయ్య
మలఁగి నాథులతోడ మాటాడకున్న
నలరుములుకులఁ జుఱుక్కన నాటి చెలులఁ
గలకఁ దేర్చెడువాఁడు గలఁడె వేఱొకఁడు.

తగు లెఱుంగక వినూతనసంగమముల
మొగిని లజ్జాభయమ్ముల పెర్మిఁగొంకు
ముగుదకన్నెలకు నేర్పులు నేర్పితేర్చి
మగలఁగూర్చెడువాఁడు మఱియెవ్వఁడింక.

కడునెఱ్ఱవాఱెడు కనులు ఘూర్ణిల్ల
నడుగులు సారెకుం దొట్రువడంగ
బ్రమఁగొల్పునదియ యా వారుణీమదము
ప్రమదల కిఁకవిడంబనయు నీవేమి.

సరసుండవైన నీ చావుచే జగము
సరసత్వమును బాసి చప్పనైపోయె
విరసమై సృష్టిప్రవృత్తి గీడ్పడియె
స్మర! నీవులేకున్న సర్గమే లేదు.

అనుఁగుఁజుట్టమవు నీ వతనుండ వగుట
విని నిజోదయ మింక వృథయంచు నెంచి
బహుళమ్ము చనినను బహుళదుఃఖమునఁ
దుహినమయూఖుండు దొఱఁగుఁగార్శ్యమ్ము
ఎఱుపుపచ్చనిచాయ నెసలారుతోడిమ
వఱలఁ గోకిలకల ధ్వనులచేఁ దెలియు
నెలమావిపూవు నే డెవ్వాని కింక
నలుఁగౌనొ చెప్పుమా యలరువిల్కాఁడ!.

వెలిదమ్మిక్రొవ్విరి వెలవెలంబాఱె
లలితహా నీలోత్పలము బొగ్గువడియె
ఫలశూన్యములయి నీ బాయుటంబూవు
ములుకులన్నియు నేడు మొఱవోయె నకట!.

పలుమాఱుగోనయంపుం బనుల నీపనుపు
నలిపినయీ తేటి చాలు శోకార్తి
విలపించు ననుంగూడి విపులదైన్యంపు
టలి పెనంగంగనేడ్చుచున్నట్టులుండె.

వలరాజ! నీవేమి వగపునంబోలె
బలుంగులరొదలవా పోవుచుంగానం.
బువుందేనెకన్నీరు బొటబొటంగాఱ
నవనీజములు నేడ్పు నట్లుండె నకట!.

కనుంబండువైన నీ కాయమ్ము మగుడం
గొనిలేచి తియ్యంబల్కుల సాజమైన
గరునమ్ముగల ప్రోడగండుంగోయిలను
సురతదౌత్యమునందుం జొనుపవే నాథ!.

పొలుపునింపెడు నీదుముద్దునెమ్మోము
గలుములీనెడు నీదుకడగంటిచూపు
గొనమోవి నొలయు నీ కులుకు లే నగవు
గనులం గట్టినయట్లు గనుపట్టు నాకు.

తలపోంక ప్రొక్కి యెంతయు వేడి కంప
మెలరార నిడిన నీ యుఱిగవుంగిళుల
నెలమిం బైకొన్న నీ యేకాంతరతులం
దలపోయ శాంతిం జెందంగ నాకు వశమె.

పెదవిం బల్మోన నొక్కి బెదరించినంతం
బదసరోజము లంటి బతిమాలుకొనుచుం
బాదివి చెక్కుల బల్మి ముద్దాడు నిన్న
మదన! నా కడుపు చుమ్మలువాఱు నకట!

సురతపండిత! నీవ సొరిదమై నిడిన
సురుచిరవాసంతసుమభూష లివిగో
కనుపట్టుచున్నవి గాని యానీదు
కనువిందయినమేను గానరా దకట!.

నెమ్మిం జన్గవం దీర్చు నీ పత్త్రరచన
నెమ్మేన నీవలందిన చందనమ్ము
దడియాఱ వింక సుందరమైన నీదు
నొడలాఱిపోయె నయ్యో! మనోరమణ!

ప్రియ! నాదువామాంఘ్రిం బ్రీతి నీయిడిన
కయి నేంత పరిపూర్తి గాకుండనిన్ను
దారుణాత్ములు సురల్ దలంచి రాకొ…
బూరింపంగా వేగముగ రాంగదయ…

నలనేర్పడంగం గూలివానిచేం బాము
బలిమిం గొట్టించు నేర్పరి యయ్యె వజ్రి
మెఱమెచ్చులకు నుబ్బిమీఱి యాతంత్ర
మెఱుంగలేనై తమాయికుండ వీ వకట!

నినుం గన్నకన్నుల నిర్జరాంగనలు
దనుం జూడకున్న సుత్రాముండు గనలి
నిను నిట్టి మిష పెట్టి నిటలలోచనుని
కనుమంట గొల్పించి కసిదీర్చుకొనియె.

దివియందు జాణలౌ దేవకామినులు
దివిరి నీ కోంగొని తెఱియకమున్న
కలభమార్గమున నేం జనుదెంచి మోద
మొలయంగ మగుడ నీవొడిం జేరంకొందు.

అతివేగముగ నిన్ను ననుగమించుటకు
యతనమ్ము పై నుంటి నట్లైనంగాని
రతి కాముంబాసి యర్ధక్షణమైన
బ్రతికెనన్ దూఱు తప్పదు నాకు రమణ!

మఱియు నీకిట నంత్యమండనంబైన
నుడు కాఱు నేనెట్టు లొనరింపనేర్తు
నొడలితో నుసుఱుతో నొకటనే నీవు
గడు నతర్కితమైనగతిఁ బొందినావు.

ఒడిలోన విల్లుంచి యొగిఁ బూవుటమ్ము
దొడికి తానంక లొత్తుచు నీవు మధునిఁ
గడగంటిచూపులం గని లేఁతనగవు
వెడల ముచ్చటలాడువిధము నేఁ దలఁతు.

ఎటనున్నవాఁడో నీ కెపుడుఁ బూవిండ్లు
ఘటియించు నెచ్చెలికాఁడు మాధవుఁడు
అతితీవ్రకోపుఁడౌ హరునిచే మిత్రు
గతిని దానును బూది గాఁడుగా నేఁడు.

అని రతివిలపించు నాపల్కు లెడఁద
మొనసి పెన్విసపుటమ్ములు వోలె నాట
విపులశోకార్త నవ్వేలఁది నూరార్ప
నపుడ మాధవుఁడు ప్రత్యక్షమై తోఁచె.

ఘను మధుంగాంచి యక్కాంత బిట్టేడ్చెఁ
జను లుబ్బడఁగ నురస్స్థలి బాఁదుకొనియె
నిలను జుట్టముల కట్టెదుర శోకమ్ము
దలుపుదీసినయట్లు దాఁ బొంగిపొరలు.

వనటమై మధు నిట్లునలుకు నక్కలికి
గనుమన్న! నీచెలికాని దుర్దశను
బొడివి కపోతకర్బురభస్మరాశి
నిదె గాలు లిట్టట్టు నెగఁ జిమ్ముచుండె.

స్మర! వేగ నీదు దర్శన మీవె రావె
కర్మ మీ మధుఁడు నిన్నుఁగన వేడ్కపడెడుఁ
బొలఁతులందుఁ జలించుఁ బురుషులప్రేమ
చలియింపదు గదయ్య! సన్మిత్రులందు.

అలఁతిసోఁడుల దారమల్లెయుంబూవు
లలుఁగులునైన నీదగువింటి పనుపు
రహిఁ సర్వజగమందు రమణ! చెల్లించె
సహచరుండగు నీవసంతుండ కాఁడె.

అనిలవేగాహతంబగు దివ్వెవోలెఁ
జనినాఁడు నేఁడు నీసఖుఁ డింక రాఁడు
పగఁ దదీయంబైన సత్తిచందమునఁ
భాగమారియున్ననన్ బొడగాంచుమనఘ!

విరివిల్తుఁ జంపి నక్క విషనాడుదైవ
మరచాపు ఘటియించె నకట! నా కిపుడు
అరయంగ ననపాయి నాశ్రయద్రుమముఁ
గరి గూల్చెనేని తీఁగయుఁ గూలుఁగాదె.

కాన నీవిటమీఁదఁ గరుణించి నాకుఁ
బూని బాంధవకృత్యమును జేయవలయు
ననలమ్ము నాకిడి యటవిరహార్త
నను నాదు నాథు చెంతకుఁ జేర్చు మనఘ!

నెల వోయెనేని వెన్నెలగూడఁ బోవు
మెలపు క్రొమ్మొగులువో మెఱపునుం బోవు
పొలఁతులు పతి త్రోవఁ బోవువా రనుచు
నిల నచేతనములు నెఱిఁగెడుంగాదె.

పొలుపారుప్రియుమేని బూది నే యిచట
నెలమిఁ జన్దోయిఁ గెం పెసలార నలఁది
పనివడి చివురుల పాన్పునంబోలె
ననలమ్మునందు నాయంగమ్ముఁ జేర్తు.

పలుమాఱు సౌమ్య! పూర్వము నీవు మాకు
నలరుఁబాన్పులకూర్పునందుఁ దోడ్పడితి
విపుడు కేల్మోడ్చి నిన్నిదె వేడుకొందుఁ
గృపమీఱ సాద గూర్పవే వేగ నాకు.

వలనొప్ప నాకిడు వహ్నిఁ దోడ్తోన
మలయానిలములచే మండింపుచున్న !
నను బాసి నిముసమైనను నీయనుంగు
మన లేమి యెఱుఁగవా మాధవా! నీవు.

ఇటు చేసి యవల మాయిరువుర కొకట
యిటఁ బావుఁ దేసెదో యిలి యాఁగదయ్య!
సరగ నీసఖుఁడు పంచకయ నాతోడఁ
బరలోకమున దానిఁ బానంబు సేయు.

మరునికై మఱియు నో మాధవా! నీవు
పరలోకవిథిఁ జలత్పల్లవంబులగు
నెలమావిపూగుత్తు లిమ్ము నీచెలికి
నెలమావిపూలపై నెంత యో ప్రీతి;

అని మైవిడువనున్న యారతిదేవి
ననుకంప నూరార్చె నాకాశవాణి
మడువింకఁ గొందలం పడుగండుమీనుఁ
గడుఁగృపం దేర్చు తొలకరివానవోలె.

రతిదేవి! నీమనోరమణుఁ డింతటన
బ్రతికి నీతోఁగూడి ప్రమదమ్ము నించు
మృడునికన్మంటలో మిడుతయై యతఁడు
పడుటకుం గతమేమొ వచియింతు వినుము.


పరమేష్ఠి దనకూఁతుపై మరుల్కొనఁగ
మరుఁడు ప్రేరేచె బ్రహ్మయు నవ్వికృతిని
దలఁగి ప్రేరకునిఁ గందర్పు శపించె
నలరాయఁ డాశాపఫల మిందుఁ బొందె.

ధర్మప్రజాపతి దను వేఁడుకొనఁగ
నిర్మలబుద్ధి వాణీవిభుం డపుడు
"తపమును మెచ్చి భూధరరాజకన్య
నెపుడు పెండ్లాడి మహేశ్వరుం డలరు
నపుడ వెండి యనంగు సాంగునిం జేయుఁ
గృప" నంచు శాపాంత మిట్లు వ్రాకుచ్చె
నశనిపాతమునకు నమృతవృష్టికిని
వశులు మేఘములును నలఁతులౌఁగాదె.

కాన నీప్రియునితోఁ గలయంగలట్టి
యానీదు నెమ్మేని నిఁకఁ గావుమమ్మ!
తరణిదీప్తుల నింకు తటిని దొలకరిని
మరల వెల్లువఁగూడి మలసెడుంగాదె.

అనిపల్కి యుడిపె న య్యాకాశవాణి
మనసిజాతునినాతి మరణనిశ్చయము
మధుఁడు నంబరవాణి మాటలకు నమ్మి
మధురవాక్ఫణితి నమ్మగువ నూరార్చె.

చెలువేది వగమేను సిక్క నమ్మరుని
లలన శాపాంతకాలము వేచియుండెఁ
గరసంతతులఁ బాసి కనుమూసి పగలు
మురువేదు శశిలేఖ మునిమాపుఁబోలె.



ఛందశ్శాస్త్రవిమర్శనము

వాసా సూర్యనారాయణశాస్త్రిగారు

పారనంది రామశాస్త్రిగారు "భారతి" శ్రావణ మాససంచికలో "ఛందశ్శాస్త్రము" అనే శీర్షికతో నొక వ్యాసమును ప్రకటించిరి. దాని నామూలాగ్రముగా చదివినవారికి దానిలో ఛందోవిషయము ప్రతిపాద్యము కాదనిన్నీ, ఉపక్రమోపసంహారములు అత్యంతాననురూపములనిన్నీ ఈవ్యాసమునకు "ఛందశ్శాస్త్ర"మని పేరిడుట నేతిబీరవలె నిరర్థకమనిన్నీ, స్ఫురింపక మానదు. అయినను శాస్త్రిగారి ప్రవృత్తికి ప్రయోజనము లేకపోలేదు. అది దూరస్థులగు చదువరులకుమాత్రము గోచరింపదు. కాన మున్ముందు దానిని నేను వివరించెదను. ఈ గంజాంమండలమందు కళింగ వైశ్యశాఖ యొకటి గలదు. వారికోర్కె ననుసరించి వారి కర్మల యుపయోగమునకై "పౌరాణికప్రయోగ పద్ధతి" యను నొక గ్రంథమును నేను సంతరించితిని. అందలి యుపనయన ప్రకరణములో "సర్వచైతన్య" అనే దేవీభాగవతనాందీశ్లోకమును పౌరాణిక గాయత్రిగా నుద్ధరించితిని. నా గ్రంథము శ్రీమహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రిగారు మున్నగు మహాపండితులచే నామోదింపబడినది. నాపద్ధతి ననుసరించి కొందరు వైశ్యులు ఉపనయనాది సంస్కారములను పొందుచున్నారు. ఈయుద్యమము రామశాస్త్రిగారికి కిట్టదు. ప్రత్యక్షముగా దీనిని ఖండించుటకు ధైర్యసాహసములు లేక మారుపేరుతో వ్యాసములను ప్రకటించి నాయుద్యమధ్వంసమును చేయుటకు వీరు యత్నించుచున్నారు. ఇది దీనిలోగల దేవరహస్యము. నేను ఈవ్యాసమును విమర్శింపబూనుట పాండిత్యాభిమానముచేగాని, పత్రికలలో ముద్రితమయిన నామాక్షరముల జూచి సంతసించుటకుగాని యెంతమాత్రము గాదు. కేవలము నాయుద్యమసంరక్షణకే ప్రవర్తించుచున్నాను.

మున్ముందు శాస్త్రిగారి వ్యాసమును తిలకించి నావిమర్శనమును పరిశీలించుటకు చదువరులను వేడుచున్నాను.

"వైదిక ఛందస్సులు గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, మొదలయినవి వేదములలోనే చెప్పఁబడియున్నవి" అని శాస్త్రిగారు వ్రాసిరి.

గాయత్ర్యాది ఛందస్సులు కేవల వేదములలో లక్షణస్వరూపాదికథనపూర్వకముగా చెప్పబడినవనియా, లేక, వాడబడినవనియా, వీరి యాశయము? ప్రథమ పక్షమున పింగళాదికృత ఛందశ్శాస్త్రములలో కూడా లక్షణాదులు చెప్పబడినవి. కావున "వేదములలోనే" అనే యవధారణ సంగతమెట్లగును? ద్వితీయపక్షములో వేదభిన్న తాంత్రికాది మంత్రములలో గూడా ఈ గాయత్ర్యాదివైదికఛందస్సులు వాడబడ్డవి. కావున అవధారణ సంగతమెట్లు? వేదపదము తాంత్రికాద్యుపలక్షక మందురేని వారి యభీష్టము సిద్ధింపదు. సర్వథా "వేదములోనే" యనుట కేవల మసంగతమేయగును.

"అవి యెన్నియో? యెవ్వియో? యేయే మంత్ర మేయేఛందస్సునకుఁ జెందినదియో? తెలుపునట్టి శాస్త్రముయొక్క ప్రచారము లేకపోవుటచేత నది తెలియఁబడదు" అని వ్రాసిరి.

ఛందస్సును తెలుపు అనుక్రమణిక, ప్రాతిశాఖ్యలు, సమగ్రముగా ప్రచారములోనున్నది. పింగళఛందస్సు 1 వ సూత్రము మొదలు "అత్ర లౌకికం" అనేవరకున్నూ వైదికఛందోలక్షణములు సమగ్రముగా నిరూపించబడ్డవి. ఆశాస్త్రజ్ఞులు ప్రతిమంత్రమునకున్నూ నిర్వివాదముగా అనాయాసముగా ఛందస్సులను చెప్పితీరగలరు. నేడు విద్వాన్ శిరోమణి కక్ష్యలలో ఛందశ్శాస్త్రము పాఠ్యగ్రంథముగానున్నది. కూపకూర్మములవలె నొక చోట నిలిచియుండి లోకశాస్త్రములయొక్క స్వరూపాదులను గుర్తింపఁజాలక మన యజ్ఞతను పండిత

లోకమున కంతకు నాశోపింప సమకట్టుట మహాఘోరము.

"ఆమహర్షులు ననుసరించినది లౌకిక ఛందస్సులే. వైదిక ఛందస్సులతో నామసామ్యముమాత్ర మున్నను లక్షణము వేరుగానున్నది." అని వ్రాసిరి.

వ్యాసాదులు లౌకికమునే వాడిరనుటకు విని గమకమును చూపరైరి. ఇది కేవలము సత్యదూరమయినది. అనుష్టుభాది ఛందస్సులు వేదములో లేదనే భ్రమచే వీరిట్లు వ్రాసియుందురు.

పింగళ. సూ. 23 "అనుష్టుప్ గాయత్రైః."

వ్యాఖ్య. చతుష్పా దిత్యనువర్తతే. గాయత్రైః= అష్టాక్షరైః పాదైః. చతుష్పాత్ ఛందః అనుష్టుప్‌సంజ్ఞం భవతి. యథాయజుర్వేదే: సహస్రశీర్షాపురుషః సహస్రాక్షస్సహస్రపాత్, సభూమిం విశ్వతోవృత్వా, అత్యతిష్ఠద్దశాంగులమ్, ఇతి. పాదమునకు 8 అక్షరములు. అట్టివి నాలుగుపాదములుగల ఛందస్సు అనుష్టుప్ ఛందస్సనియు అది వేదములో కలదనియు దీనిచే స్పష్టముగా విశదమగును. కఠ, ఈశావాస్య, శ్వేతాశ్వతర, ముండక మహానారాయణాదులు కొన్నియుపనిషత్తులు ఛందోబద్ధము లయియున్నవి. లౌకికములోగూడ నీయనుష్టుప్ ఛందస్సు ఇట్లే వాడబడియుండగా "నామసామ్యమే" యని వీరు చెప్పుట అనభిజ్ఞతామూలకమే యని చెప్పక తప్పదు. మహర్షులు వైదిక ఛందస్సులనే ప్రాయికముగా వాడిరనుటకు ప్రబలనిదర్శనములు కానవచ్చుచున్నవి. మార్కండేయపురాణాంతర్గత సప్తశత్యాది మంత్రగ్రామమునకు వైదికగాయత్ర్యాది ఛందోవిభాగము స్పష్టముగా నిరూపితమైనది. ఇట్లే భగవద్గీతాదులకు అనుష్టుప్ ఛందస్సువాడబడినది. ఈ విషయము నింకనెన్నో యుదాహరణములను చూపవచ్చును.

"వైదిక గాయత్రీ ఛందస్సు పాదమునకు ఎనిమిదక్షరములు గలిగియున్నది" అని వ్రాసిరి.

ఇచ్చట గాయత్రీ ఛందఃపాదమునకు అష్టాక్షరవత్త్వమును లక్షణముగా జెప్పిరి. దైవీ, ఆర్షీ యాజుషీ బ్రాహ్మీ, ఇత్యాది బహువిధగాయత్రీఛందస్సులు వేదమందే కనబడుచుండ వాటిని విడవిడచి యొక గాయత్రీ ప్రభేదమునకు లక్షణమును నిరూపించినమాత్రాన సామాన్యోపక్రమము సార్థకమగునా? ఎట్లయినను తాము చెప్పిన లక్షణమును వ్యాప్తిరూపదోషమే దిగమ్రింగును. వాటికి సహించినను ఈయష్టాక్షరవత్త్వలక్షణము దుష్టమనుట నిర్వివాదము. ఆర్ష్యాది ఛందస్సులలో పాదమునకు ఆరక్షరము లుండుటచే నీలక్షణమవ్యాప్తిదోషగ్రస్తము. అనుష్టుప్ ఛందస్సులో పాదమున కెనిమిది యక్షరము లుండుటచే అతివ్యాప్తి దోషగ్రస్తము. అవ్యాప్తి నెట్లో వారించినను అతివ్యాప్తి దుర్నివారమేయగును. తద్వారణకై పాదత్రయవత్త్వమును లక్షణఘటకముగా నంగీకరింతురేని త్రిపాత్ ఛందస్సు అనేచోట "త్రిపాన్మంత్రమునకయిన ఛందస్సు" అనే యర్థమునకై పడినప్రయాసము నిష్ఫలమేయగును. చివరకు ప్రభాతకుట్టికుటీన్యాయానుసారము తాము త్రోసివేసిన యర్థమే తమకు శరణ్యమగును. "అష్టాక్షరా గాయత్రీ" అని వేదములోనుండుటచే తమ లక్షణము నిర్దుష్టమని యందురేని యచ్చట గాయత్రీపదము పాదపరమా- లేక, ఛందః పరమా? ఛందః పరమంటే వారికి నభీష్టసిద్ధి కాదు. పాదపరమంటే లక్షణైకదేశమే యగునుగాని సంపూర్ణ లక్షణముగాదు. యాజుష సంధ్యావందనములో "చతుర్వింశత్యక్షరా త్రిపదా షట్కుక్షిః" అని స్పష్టముగా నున్నది. "త్రిపదా గాయత్రీ" అనికూడ శ్రుతిగలదు. కాబట్టి మీరుచెప్పిన లక్షణము దుష్టమే యగును.

"దీని ఛందస్సు "గాయత్రి" అనియే చెప్పబడినది. దీనిని పూర్వులు "త్రిపాచ్ఛంద"స్సని యన్నారు. దాని యభిప్రాయము త్రిపాన్మంత్రమునకైన ఛందస్సని కానోపును. పిమ్మట వారు "మూడుపాదములుగల ఛంద"స్సని దీనినే త్రిపాదిగా దలంచుచున్నారు. ఛందస్సునకు పాదనియమముగలదా? అది పద్యరూపముగానే యుండవలయునా?" అనిరి.

శాస్త్రిగారు ఛందస్సునకు పాదనియమము లేదని చెప్పి "త్రిపాచ్ఛందస్సనగా త్రిపాన్మంత్రమునకైన ఛంద"స్సని షష్ఠీతత్పురుష పరముగా చెప్పుచున్నారు. ఇచ్చట పాదనియమశబ్దము తత్సంఖ్యానియమపరమా? లేక తత్సద్భావ నియమపరమా? ఈరెండుపక్షములను శాస్త్రిగారు లంగీకరింపరు. (చూ. పింగళసూత్రములు 3 అధ్యాయము.) "ఆద్యం చతుష్పాదృతుభిః" "క్వచిత్త్రిపాదృషిభిః" "షట్కసప్తకయోర్మధ్యే ఽష్టావతి పాద

నివృత్" "ద్వ్యానవకౌ షట్కౢశ్చ పానాగీ" "విపరీతా వారాహీ" "షట్కసప్తకాష్టకై ర్వర్ధమానా" విపరీతా ప్రతిష్ఠా" "తృతీయం ద్విపాజ్జాగత గాయత్రాభ్యాం." ఈ సూత్రములలో ఆద్యంతసూత్రములచే చతుష్పాత్త్వ ద్విపాత్త్వములున్నూ, మధ్యసూత్రములచే త్రిపాత్త్వమున్నూ, గాయత్రీఛందఃప్రభేదములకు నియమితమైయుండ పాదసంఖ్యానియమము లేదని చెప్పుటకు నోరెట్లాడును? పాదసద్భావనియమము లేక పాదసంఖ్యానియమ మెట్లు ఘొసగును? "పాదః" అ. 3 సూ. "పాదశ్చతుర్భాగః" అ. 4. సూ 10 అని పాదసద్భావమును నియమించు సూత్రములకు జలాంజలి నివ్వ రివ్వగలరు? కాన త్రిపాచ్ఛందః, అనేచోట కర్మధారయసమాసము గాని తత్పురుషసమాసము కాదు. "తత్సవితు ర్వరేణ్యం" "కాత్యాయనాయవిద్మహే" ఇత్యాదులు త్రిపాచ్ఛందస్సులు. చూ. పింగల. 3 అధ్యా. 7 సూ. "ఏకద్విత్రిచతుష్పాదుక్తపాదం." వ్యాఖ్య. ఏభి శ్చతుర్భి ర్లక్షణై రుక్తః పాదః యస్య తదుక్తపాదం. యస్యఛందసోయాదృశః పాదః పరిభాషితః తచ్ఛందస్తేనైవ పాదేన క్వచిదేకపాత్, క్వచిద్ద్విపాత్, క్వచిత్త్రిపాత్, క్వచిచ్చతుష్పాత్ భవతి. గాయత్రీదత్రిపాదేవ. చతుర్భిరష్టాక్షరైః పాదై రనుష్టుభేవ భవతి".

ఈ సూత్రవ్యాఖ్యలవల్ల మూడుపాదములుగల ఛందస్సు గాయత్రి యని కర్మధారయసమాసార్థమే స్పష్టమగును. కాని తత్పురుష సమాసార్థముకాదు.

కొన్ని లౌకికవైదికఛందస్సులకు నామసామ్యమున్నను లక్షణము వేరుగనున్నదని చెప్పి దానికి నుదాహరణముగా వైదికగాయత్రీఛందః పాదమునకు ౮ అక్షరములనిన్నీ, లౌకిక గాయత్రీఛందః పాదమునకు ౬ అక్షరములనిన్నీ చూపినారు. నేను లక్షణసామ్యమును కూడా చూపినచో శాస్త్రిగారు తమ సిద్ధాంతమునకు స్వస్తి చెప్పవలసియుండునుగదా!

చూ. పింగల. సూ. "ఆద్యం చతుష్పాద్వృతుభిః" "అత్ర లౌకికం" "ఆత్రిష్టుభాచ్చ యదార్షం." వ్యా॥ అయమర్థః. గాయత్ర్యాది త్రిష్టుప్ పర్యంతంయదార్షం ఛందోజాతం వైదికే ఖ్యాతం. లౌకికే ఽపి తత్తథైవ ప్రష్టవ్యం"— ఈ సూత్రములుకొన్ని వైదికలౌకికఛందస్సులయందు లక్షణసామ్యమును గూడా నిరూపించుచున్నవి. ఈ పింగలఛందస్సునయినను గమనింపక ఛందోవ్యాసమును వ్రాసి యపసిద్ధాంతములను జేసి చదువరులకు భ్రమను గలిగించుట కేవలాజ్ఞానమో, లేక, మోహమో నేను నిరూపింపజాలను.

త్రిపాన్మంత్రమునకయిన ఛందస్సని శాస్త్రిగారు క్రొత్తవ్యాఖ్యానము నొకదానిని బయలుదీసి పరమతములో "ఛందస్సుకు పాదనియమముగలదా?...పింగలాది ఛందస్సులు సూత్రరూపమున లేవా?" అనునవి మొదలుగా ప్రశ్నవర్షమును కురిపించిరి. వారిశైలి ననుసరించి వారి మతములో నేనిట్లు ప్రశ్నించుచున్నాను. మంత్రములకు పాదనియమముగలదా? అవి పద్యరూపముగానే యుండవలయునా?

"హుం," ఫట్, "స్వాహా," ఇత్యాదియాజుష మంత్రములకు పాదనియమముగలదా? పంచాక్షరీ షడక్షరీద్వాదశాక్షర్యాదిమంత్రములు పాదబద్ధములా? "శేషే యజుశ్శబ్దః" అనేజైమినిసూత్రము యాజుష మంత్రములన్నియు పాదబద్ధములు కావని చెప్పలేదా? "సోఽచింతయ త్తదా తత్ర మమ త్వా కృష్టచేతసః" ఇత్యాది సప్తశతీ మంత్రములు ద్విపాదులును, త్రిపాదులున్నూ అయియుండలేదా? వీటిని ఏకపాది, ద్విపాది, త్రిపాదిమంత్రము లనవలయునా? ఈ మంత్రములే వాక్యరూపమున నుండరాదా? ఉన్నప్పుడు వాటికి పాదనిర్ణయమెట్లు? ఈప్రశ్నలకు వారి మంత్రపక్షములో వారెట్లు సమాధానమిత్తురో ఛందఃపక్షములో నేనట్లేసమాధానము నిత్తును. పరమతములో తాము చూపిన జొన్నగంటి ప్రశ్నపరంపర స్వమతమును గూడ నాక్రమించుచున్నదని వీరెఱుంగరు కాబోలు! — ఈ వ్యాసములో ప్రతిపాద్యవిషయము గాయత్ర్యాది ఛందస్సు గాని తత్ప్రతిపాదకశాస్త్రముగాదు. అట్టిశాస్త్రము ఏరూపముననున్నను ఎవ్వరికిని తగవులేదు. అట్టివిషయను అధిక్షేపించుట యనవసరము.

శ్రు. "త్రిపదా గాయత్రీ." "త్రిపదా షట్కుక్షిః" అని త్రిపాదవత్త్వమును గాయత్రీలక్షణఘటకముగా చెప్పుచున్నది. కావున శాస్త్రిగారు "త్రిపాచ్ఛందస్సు" అనేచోట బహుప్రయాసముతో సాధించిన తత్పురుషార్థము సర్వప్రమాణబహిష్కృతము.

"విష్ణుభాగవతము, దేవీభాగవత"మని రెండుగలవు. ఈ రెంటిని జూచి విచక్షణులు నిష్పక్షపాతబుద్ధితో నిరూపింపవలసి యున్నది..."

"వ్యాసప్రోక్తమ్మే మహాపురాణము. మహాపురాణమునకే గౌరవాతిశయమని తలంచిన యుపోద్ఘాతకారులు వ్యాఖ్యాతలును తామవలంబించిన దానికే గౌరవాతిశయముకొఱ కట్లు వ్రాయుట యాచారమే" అని వ్రాసిరి.

ఈ యుపక్రమమును బట్టి యేది మహాపురాణమో ? యేయుపోద్ఘాత కర్తపొరబడెనో నిరూపించెదరను కొంటిమి గాని యట్లుచేయ లేదు. విష్ణుభాగవతము నుండి మచ్చుకైనను ఒకపదమును స్పృశింపలేదు. పూర్వోపక్రమమునకు ఉపసంహారము విచక్షణులనెత్తి పైనుంచబడినది. వీరిపంక్తులలో సత్య మెట్లున్నదో చూడండి. దేవీభాగవతోపోద్ఘాతకారుడు దేవీభాగవతమే మహాపురాణము, విష్ణుభాగవత మట్టిదికాదని నుడివినట్లు వ్రాసియున్నారు. దీనిని బట్టి వీ రుపోద్ఘాతమునయినను సమగ్రముగా చదువలేదని ఖండితముగా చెప్పవచ్చును.

చూ. "వస్తుతస్తు ద్వయోరపి భాగవతయో రస్మన్మతే ప్రమాణత్వాత్ విష్ణుభాగవతపక్షపాతినాం వచనానా మసాఙ్గత్యం విరోధాభావేన తల్లాపనే ప్రయోజనాభావేవ, తథాచ నారదీయాదిపురాణమతేన శ్రీవిష్ణుభాగవతం మహాపురాణం. దేవీభాగవతంతు తన్మతే ఉపపురాణం. శైవమాత్స్యపురాణాది మతేతు దేవీభాగవతం మహాపురాణం. విష్ణుభాగవత మర్థా దుపపురాణమితిసిద్ధం." అని యుపోద్ఘాతసమాప్తిలో వారి సిద్ధాంతము నిరూపింపబడినది. నారదీయాది పురాణమతములో విష్ణుభాగవతము మహాపురాణము, దేవీభాగవతము ఉపపురాణము. శైవమాత్స్యపురాణాది మతములలో దేవీభాగవతము మహాపురాణము. విష్ణుభాగవతము ఉపపురాణము. నా మతములో రెండుపురాణములున్నూ ప్రమాణములేయని, దేవీభాగవతోపోద్ఘాత కర్త ఉపసంహారములో వ్రాసియుండ వారిప్రమాణబుద్ధిని, నిష్పక్షపాతత్వమును, ఔదార్యమును, అపహ్నవించి దోషారోపణముచేయుట మోసము, మహాదోషము, విశృంఖలత్వమేయగును. కొందరిచే నుపపురాణములుగా పరిగణింపబడిన నారదశైవ వాయవ్యాదిత్య పురాణములు వ్యాసప్రోక్తములైయున్నవి. మిగిలిన యుపపురాణములన్నియు మహర్షికృతములేకాని సామాన్య పండితకృతములు కావు. మహాపురాణోపపురాణములన్నియును మహర్షిప్రోక్తములగుటచే వాటికి ప్రమాణతారతమ్యమును తన్మూలకగౌరవ తారతమ్యమును నే పండితుడున్నూ చెప్ప నుద్యోగింపడు. మొదట నుద్భవించినవి మహాపురాణములు. వానినుండి ప్రవర్తించినవి యుపపురాణములని గాని ప్రామాణ్యాదితారతమ్యములచే గాదు.

మత్స్యపురాణములో శ్లో. "అష్టాదశభ్యస్తు పృథక్పురాణం యత్ప్రదృశ్యతే, విజానీధ్వం ద్విజశ్రేష్ఠా స్తథా తేభ్యో వినిర్గతం." ఈ వచనము పై యర్థము నే నిరూపించినది. శాస్త్రీగారి కరుణాకటాక్షము ప్రసరింపనంతమాత్రమున దేవీభాగవతము వ్యాసప్రోక్తపురాణత్వమును ప్రామాణ్యగౌరవాతిశయములను గోల్పోదు. ప్రతిపక్షులున్నూ దేవీభాగవతమునకు మహాపురాణత్వమునే అపలపింప జూచిరిగాని వ్యాసప్రోక్త పురాణత్వాదులను అపలపింపలేకపోయిరి. శాస్త్రీగారు ఆ కార్యమును నిర్వహించెదరు కాబోలు! మరియు.—

"వారుచూపిన ప్రమాణము లెవ్వియనగా దేవీభాగవతోపోద్ఘాతమందు; "మాత్స్యే: "యత్రాధికృత్య గాయత్రీం వర్ణ్యతే ధర్మ విస్తరః; వృత్రాసురవధోపేతం తద్భాగవత మిష్యతే." వే.జే. 'త్రిపదాగాయత్రీ'తి గాయత్రీలక్షణం శ్రూయతే, తేన త్రిపాచ్ఛందశ్చ దేవీభాగవతే ప్రథమశ్లోకే." సర్వచైతన్య రూపాంతా మాద్యాం విద్యాంచ ధీమహి బుద్ధిం యా నః ప్రచోదయాత్." ఇతి. నవిష్ణుభాగవతే తచ్ఛందో౽స్తి. "గాయత్ర్యాచ సమారంభ స్తద్వై భాగవతం విదు"రితి. "మంత్రాః పుందేవతాః ప్రోక్తాః విద్యాః స్త్రీదేవతాస్స్మృతా." యద్యప్యాధునిక పుస్తకేషు క్వచిచ్చతుశ్చరణ శ్లోకో౽పిదృశ్యతే. తథాపిన ప్రశస్త్య స్తవతీటీకాకారాదిభిః త్రిపాచ్ఛ్లోకస్యైవ వ్యాఖ్యాతత్వాత్ స ఏవ సాంప్రదాయికః పాఠ ఇతిబోధ్యం" అని వ్రాసియున్నారు. వీరిట్లు వ్రాసినను దేవీభాగవతగ్రంథకర్త యభిప్రాయము "సర్వచైతన్య" అను శ్లోకము గాయత్రీమంత్రపరమనియా? దేవతాపరమనియా? అనునది మనకు విచారణీయము. ఆ శ్లోకములో "ధీమహి"

"నః" "ప్రచోదయాత్" అనే మూడుపదములు మాత్రము వేదగాయత్రీమంత్రస్థములుగా గాన్పించుచున్నవి. తక్కిన నెవ్వియును లేవు. లేకున్న నామమాత్రముచేరనే యాశ్లోకము గాయత్రీమంత్రముగా గ్రంథకర్త యభిప్రాయమయినచో దేవీ. భా. స్కం. ౧౨. అ. ౧ శ్లో. యేగాయత్రీగతావర్ణాః......తత్పదంపాతుమూర్ధానం...తకారవ్యంజనంచైవ సర్వాంగం మే సదావతు." ఇట్లుచెప్పుచున్న గ్రంథకర్త "సర్వచైతన్య" అను శ్లోకమును గాయత్రీమంత్రముగా నెట్లుచెప్పును?.

గాయత్రీమంత్రము సకారముతో నారబ్ధమని గ్రంథకర్త యభిప్రాయపడునా? ఉపోద్ఘాతకారులు తాము పొందిన విభ్రాంతి పాఠకులకును గలుగునట్లు వ్రాసియుందురు. వారివిభ్రాంతికి కారణము . "యత్రాధికృత్య గాయత్రీం" అనుదానిలో "అధికృత్య గాయత్రీం" అనుదానికి గాయత్రినధికరించుట యారంభమనుగాని "గాయత్ర్యాద సమారంభః" అను దానికి "గాయత్రీ మంత్రముతో నారంభమని యర్థముచేసి కొనుటయే యయియుండును. ఒకభ్రాంతి మరియొక భ్రాంతిని పుట్టించును." అని విపులంగా వ్రాసినారు.

ఈ శాస్త్రిగారు దేవీభాగవతోపోద్ఘాతకర్తయొక్క వాక్యముల నుదాహరించుటలో గొప్పవ్యత్యాసమునుజేసి పూర్వాపరగ్రంథసందర్భములను పోనాడి పాఠకమహాశయులకు ఉపోద్ఘాతకర్త వచనములయందు రోతపుట్టించుటకున్నా, స్వపక్షాభిముఖ్యమును కలిగించుకొనుటకున్నా,ఒకగొప్ప మహేంద్రజాలమును జేసిరి. ముందు పాఠకప్రత్యయమునకుగాను ఉపోద్ఘాతగత వాక్యక్రమమును ఉదాహరించుచున్నాను. "శ్లో. యత్రాధికృత్య...ఇష్యతఇతి" మాత్స్యవచనమపి దేవీభాగవతస్యైవ మహాపురాణత్వం బోధయతి. వేదే త్రిపదా గాయత్రీతి గాయత్రీలక్షణం శ్రూయతే. తేనచత్రిపాచ్ఛందోఽధికృత్యయత్ర ధర్మవిస్తరోవర్ణ్యతే తద్భాగవత మితిపదర్థః. త్రిపాచ్ఛందశ్చ దేవీభాగవతే ప్రథమ శ్లోకే. సర్వచైతన్య...ప్రచోదయాదితి శ్రూయతే. నవిష్ణుభాగవతేతచ్ఛందోఽస్తి. ముఖ్యార్థసంభవే...... ఉదాసీనే మాత్స్యవాక్యేతు ముఖ్యవిషయసంభవే సామంచితా యద్యప్యాధునికపుస్తకేషు.... సవీవసాంప్రదాయికైః పాఠఇతిబోధ్యం. యత్తుగాయత్ర్యర్థశ్చ.... స్తావక మేవేతి. కించ. శ్లో. హయగ్రీవబ్రహ్మవిద్యా... గాయత్ర్యాద సమారంభ స్తద్వై భాగవతం విదురితి" పురాణాంతర వాక్యమపి......ఉభయభాగవత సాధారణ మితిచేన్న. నారదీయే; శారదాతిలకాది గ్రంథేషుచ: మంత్రాః పుందేవతాః ప్రోక్తా విద్యాః స్త్రీదేవతాః స్మృతాః? ఇతి" ఇట్లు ఉపోద్ఘాతగ్రంథక్రమమునుబట్టి "గాయత్ర్యాదసమారంభః" అనే దానికి పూర్వమందున "యద్యప్యాధునిక"...ఇత్యాది గ్రంథముండవలయును. "మంత్రాః పుందేవతాః" అనే వచనము నుదాహరించి దానిని విచారింపకుండ విడచుటకు కారణమేమో తెలియరాదు. "వేదే త్రిపదా గాయత్రీతి గాయత్రీశ్రూయతే" దీని తరువాయియున్న "తేనచ త్రిపాచ్ఛందోఽధికృత్య యత్ర ధర్మవిస్తరోవర్ణ్యతే తద్భాగవత మితి పదర్థః" అనేవాక్యము నేల జారవిడిచిరో తెలియదు. ఈ శాస్త్రిగారు ఉపోద్ఘాతకర్త యొక్క యభిప్రాయమును పరిగ్రహింపక యకాండతాండవము నాచరించియున్నారు. "గాయత్ర్యాదసమారంభః" "యత్రాధికృత్య గాయత్రీం" అనేరెండుస్థలములయందున్నూ ఉపోద్ఘాతకర్త గాయత్రీ పదమును ఛందఃపరముగా ఘంటాఘోషముతో చెప్పియున్నాడు. మంత్రపరమని చెప్పియుండలేదు. అట్టి స్థితిలో "దేవతాపరమా? మంత్రపరమా" యని మీరు వికల్పించుటకు అవకాశమేకానరాదు మంత్రపరత్వమే. అభిప్రేతమయినచో "త్రిపాచ్ఛందోఽధికృత్య" అనుచోట "త్రిపాన్మంత్ర మధికృత్య" అనిన్నీ "త్రిపాచ్ఛందశ్చ దేవీభాగవతే" అనుచోట "త్రిపాన్మంత్రశ్చ" అనిన్నీ, "తచ్ఛందోఽస్తి అనుచోట "తన్మంత్రశ్చ" అనిన్నీ, వ్రాసియుండును.

(సశేషము)

ప్రణయ జానకి

అధికార్ల సూర్యనారాయణ రావు గారు, బి. ఏ., బి. యల్.,

సుందరాంగుల నెందర చూచియున్న
జానకీ! ఆత్మనిల్చు నీ ధ్యానసంబె!
చోద్యముగ మింట నలరారు చుక్కలున్న
చందమామయె మదికెక్కు చందమునను. ౧

చిత్తసీమ జీకటిరీతి చింతగప్ప
వలపువెన్నెల బచరించి తొలగజేతు,
వాకసంబును దలపులు తాకుచుండ
హృదయ ముప్పొంగు జలనిధి యేచులీల! ౨

చెలియ! నీయాత్మ నలరారు వలపుకలిమి
లలితహా పూలవాసనవలె చెలంగు,
సంతసమొసంగు చంద్రునికాంతివోలె
చల్లనై హాయికలిగించు నుల్లమునకు. 3

పక్షిపలుకులు తెలుపు నీ పలుకుతీపి
జిగివసంతంబు తెల్పు నీ సొగసుతెరగు
వెన్నెలలు తెల్పు నీయెదనున్న కరుణ
పరిమళము తెల్పు సఖియ! నీవలపుపొలుపు. ౪

కడు మనోహరమగునట్టి కథలయందు
తనువు మరువంగజేయు నందములయందు
విమలమాధురీకలితగానములయందు
మానినీ! తోచుచుందువు మానసమున. ౫

అలఘుసుఖమిడు నీపైని కలుగుతలపు
నిర్మలంబగు నీయందు నిలుచువలపు
చెలియ! నినుగూర్చి కలిగెడు తెలివికలలు
నతిపవిత్రము లతిమనోహరములోను. ౬

తరుణి! నాచిత్తమనియెడు దర్పణమున
బింబితంబగునీముఖబింబ మెపుడు
తలపు లేవేళ మెన్ను నీ వలపుకలిమి
చేడెరో! నీదు ప్రేమయే జీవనంబు! ౭

మది నిను న్నిల్ప శోకంబు మాయమగును
స్వాంతమున నిండు నొక వింతసంతసంబు
పొడము నుత్సాహ, మవ్వేళ పూని సేతు
గొప్పకార్యంబులను సానుకూలముగను! ౮

నేరపరీక్షమ్ము

ద్రవిడ వాఙ్మయము - ఆంధ్రులు

ఆ. రంగస్వామి సరస్వతి గారు, బి. ఏ.

(రెండవసంపుటము-౧ వ సంచిక తరువాయి)

ఈ విజయనగరము: ఈ విజయనగరయుగము నందు ద్రవిడభాషలలో నెకొన్ని గ్రంథములయందలి ఆంధ్రులవిషయ మిచ్చట మాపఁబడును. విజయనగర చరిత్రారంభమున దక్షిణదేశముపై దండెత్తి యప్పుడు మధురయొద్ద నొక చిన్న రాజ్యముగా నేర్పడియుండిన మహమ్మదీయ రాజ్యమును రూపుమాపి శ్రీరంగము మొదలగు ప్రాచీన దేవాలయముల పునఃప్రతిష్ఠ విజయనగర చక్రవర్తులు చేసిన దండయాత్రను తెలిపినవిషయ మేకదా. అట్లు చేసిన విజయనగర దండనాథులలో ముఖ్యుండు సాళువమంగరాజు. ఈ సాళ్వమంగునిగూర్చి యతనివంశమున బుట్టినరాజుల కంకితమీయంబడిన రాజనాథడిండిమకవి సాళువాభ్యుదయము పిల్లలమఱ్ఱిపినవీరభద్రకవి జైమినిభారతము మొదలగు గ్రంథములయందు విస్తారమైన వర్ణన కలదు. ఈ సాళువ మంగరాజుయొక్క మనుమలలో నొకఁడు సాళువ గోప దండనాథుఁడు. ఈ సాళువగోపరాజున కిరువురు కొడుకులు. సాళువతిరుమలరాజు సాళువతిప్పరాజు. వీరికే శాసనములందు గోప తిప్పరాజు గోపయ తిరుమలరాజు నని పేర్లుండెను. వీరిరువురును కవిత్వము చెప్పుటచేతను కవుల నాదరించుటచేతను ప్రసిద్ధులు. సాళువగోప తిప్పరాజు సంస్కృతమున వామనుని కావ్యాలంకార సూత్రములకు కామధేను వను వ్యాఖ్యను, సంగీతశాస్త్రమున తాళదీపిక యను గ్రంథమును, నాట్యశాస్త్రమున మరొక గ్రంథమును రచించెను. ఈ గ్రంథములనుగూర్చి యతఁడే కావ్యాలంకారకామధేనువున నిట్లు చెప్పుచున్నాడు.

ప్రబన్ధం తాళానాం ఘనమతిమిమీతే శ నటో యః
శివాజ్ఞప్తాకారా నటనకరణానా మభిధాః;
సవృత్తే కావ్యవ్యాఖ్యానం సరీశరచనం వామనకృతేః
విధత్తే గోపేంద్రత్రిపురహర భూపాలతిలకః

ఇతనితమ్ముఁడు గోపతిమ్మరాజు ద్రవిడదేశమందు విజయనగరచక్రవర్తికి ప్రతినిధిగా నుండెను. అంతటి కవుల ననేకుల నాదరించి వారిచే స్తోత్రము చేయఁబడెను. కాలమేఘప్పులవర్, అనుకవికిని యీతిరుమలరాయలకును జరిగిన కథలు కొన్ని కలవు. తిరుమలరాయల సభకుఁ జేరకపూర్వము కవి యీ క్రింది అరవపద్యమును వ్రాసి పంపెనట.

తూదైన్దునాష్కై యిలాతు నాష్కైయి నిల్
పలకెన్దమాలై కొలవుమ్
మూష్కులావద్దాది యేష్కు నాష్కైగియి నిల్
ట్టోగై పెఱవ సత్తోదవుమ్
పాతలు కెమ్మడల్ కోవై పత్తు నాష్కైగయి నిల్
పరకొక్కుడిక్కుట్టి సేన్
శిక్షయన్తిర మార్చినా నిక్కలిశై
తెరిన్ద తిరుమలై రాయన్మున్

శీఘ్రమే వాతు కవిపాడు దక్కు దిర్వరు
తిరట్టుక్కు విప్పులవరై.
కాడుమ్ కిడిత్తు క్కువిత్తు కదుప్పిల్
కాత్తిట్టిడిత్తు ముడుగిల్

కలనై వైత్తే ముగక్కాచివాళ్ మిట్టేయు
కవికాళమేగనానే

ఈపద్యములో కాలమేఘకవి తనకవిత్వశక్తి నధికముగా వర్ణించుచు, తూదు, పలశోదమాలై, అంతాది, తోగై, మడల్, కోవై, మున్నగు ద్రవిడప్రబంధముల వరుసగా, మైదు, ఆరు, ఏడు, పదిగడియలలో చెప్ప గలిగినట్లు చెప్పుకొని ఇయల్, ఇశై, అనఁబడు రెండు విధముల కావ్యముల నెఱిఁగిన తిరుమలరాయలిదొడ్డకు వచ్చినట్లును తనతో వాదము చేసి యెదుర్కొను దొంగ కవుల ననేకవిధములుగా నవమానించుననియు చెప్పుకొనెను. పైగ్రంథమున కవిచేసికొన్న యాత్మశ్లాఘయందు నమ్మకముపుట్టక ననేకవిధముల నతని గతినపరీక్షలకు లోఁబఱచెననియు, వాశోధనలలో వారిలేరిన కవికి చాలసంతోషించి యనేక బిరుదులును, వరుసలను మున్నగు గౌరవచిహ్నములతో చాల ద్రవ్యమిచ్చి యతనికి జేరఁబుల్యని చేసెనట. ఇట్లు తనదారిద్ర్యమును బోఁగొట్టిన తిరుమలరాయలపైఁగవి యీక్రిందిపద్యములఁ జదివెనట.

"ఇన్దిరన్ కలై కూరిరు మృగశ్రీరుప్పాన్
అగ్నియి యుదరమ్ విగట్టగలాన్
ఎమనెన్నైక్కారుదానల నెనక్కారుతి
నిరుతినన్దెన్నౌరు స్సమాన్
అన్దమామ్ వరుణ నిరుక్ కేట్టగలాన్
ఆకత్తులు మక్కాశుమ్ యానుమ్
అనిలముదాగు మముదిన్నైక్కోళ్ళోవ్
ఆరనై యుంలగిని లాప్పార్
శత్రుమిన్ద నకిశైయే పెట్ట
తన్దిర రాశనై వాన్గిత్
రత్తైనెయుమె న్నెనిలై శెయ్య కల్యాణీప్
చాళువ తిరుమలై రాయన్
మన్నరబుయవాన్ గోప్పయనుదవు
మధిపతి విరరారామన్
వాక్కినా ఉక్కాశేర వాక్కినా నవనే
మాశిలీ శాన నానానే".

ఈకాలమందే యుండినటువంటి వణ్ముఖుని (స్కాన్దని) పైతిరుప్పుగష్ అను గొప్పగ్రంథమును వ్రాసిన 'అరుణగిరినాథుఁ'డను కవి తనగ్రంథములో నప్పటి చక్రవర్తి యైన ప్రౌఢదేవరాయని నుదాహరించి యున్నాఁడు. ఆతఁడుదహరించిన పద్యమిది:.

"ఉదయ దానమాన్పన ప్రభుడదేవమారాజ
నుళముమాడ వాష్టి దేవశ్వరమాతే"

'అపుడుపుష్పించినమాలధరించినవాఁడును ప్రౌఢదేవమహారాజు హృదయమందుండునట్టియు దేవదేవుఁడు'

ఇతఁడు విజయనగరచక్రవర్తులందఱిలో నధికప్రఖ్యాతిగన్నది కృష్ణరాయలుగదా. ఇతని ప్రజాపరిపాలనము, రాజనీతి, కవిజనపస్థానము, కవిత్వము, మొదలగు ననేకవిషయములఁగూర్చి క్రొత్తగాఁ జెప్పవలసిన విషయము లధికముగా లేవు. అయిన నిచ్చట క్రొత్తగాఁ జెప్పవలసినది కొంతగలదు. ఇతఁడు సంస్కృతమునందును ఆంధ్రమునందు నెట్లు ప్రఖ్యాతిగా కవులవాదరించి గ్రంథములఁగొనెనో అట్లే కన్నడమందును, ద్రవిడమందును ప్రసిద్ధుఁడు. కన్నడమందు వ్యాసభారతము నాతని యాస్థానమందలి యొకకవి కన్నడించి యాగ్రంథమునకు 'కృష్ణరాయభారతము'ని పేరిడెను.

చిన్నన్న ద్విపద కెఱుఁగును
పన్నగ పెదతిరుమలన్న పదముల కెఱుఁగున్
మిన్నంది మెఱయు నరసిం
గన్న కవిత్వంబు పద్యగద్యశ్రేణిన్.

అను తాళ్లపాక కవులపై చాటుపద్యములోని పెదతిరుమలన్న యీకాలమందే తిరుపతి వేంకటేశ్వరులపై ననేకవేల గ్రంథపరిమితిగల పాటల నొనర్చెను. ఈవంశము వారి కందువలన సంకీర్తనాచార్యులని పేరువచ్చెను. తిరుపతిలో నేటికిని వెంకటేశ్వరుల పాన్పుసేవసమయమున తాళ్లపాకవంశమునఁబుట్టినవారే పాడుచున్నారు. ఈ పాటలన్నియు తాటాకులపైఁగాక శాశ్వతముగా నుండుటకు రాగిరేకులపైఁజెక్కఁబడి తిరుపతిదేవాలయములో నుంచఁబడియున్నవి. ఈ తాళ్లపాకవారివలెనే కన్నడమందును భక్తిపరవశులై భగవంతునిపైఁ బదములఁ బాడిన కవిశ్రేష్ఠులుఁ గొందఱుండిరి. వారిలో ముఖ్యుఁడు పురందరవిఠ్ఠలుఁ డను నామాంతరముగల పురందరదాసు. ఈ పురందరదాసు బ్రాహ్మణుఁడు. మొట్టమొదట నధి

ఐశ్వర్యమందుండి భగవత్సంకల్పముచే నైహికసుఖముల నశ్వరత్వ మెఱింగి, ధనసంపదను విడనాడి అప్పుడు ప్రసిద్ధుఁడైయుండిన వ్యాసతీర్థులను నాచార్యునిగాఁ జేరెను. అటుపిదప భగవంతునిపై ననవరతము సంకీర్తనమందే కాలము గడిపెను. పురందరదాసు వ్రాసిన కీర్తనలు కొన్నివేలు గలవు. తాళ్లపాకవారి పదములవలెఁ గాక యివి నేటికిని వాడుకలోనున్నవి.

ఈకాలమునందును కృష్ణరాయలగూర్చి క్రొత్తగా తెలుగఁదగినది చాలవిషయమున్నది. కుమారసరస్వతి యని యొక ద్రవిడకవి రాయలయాస్థానమున నుండెనట. రాయలు కళింగదేశమును జయించి యాదేశపు రాజైన గజపతిసుతఁ బెండ్లాడినప్పు డీకవి యీక్రింది యాశీవపద్యమును జెప్పెనట.

> కళిఙ్గ విష్ణను మదిశై చ్చుఙ్గదొట్టు
> మెయ్స్థ కటక స్నిష్ణునట్టాల్ మకిస్దవలర్
> పొన్నిట్టమాన కృష్ణభూపాలా వృన్దనక్కు
> ప్పిన్నిట్ట మాననోడ్డియన్ పొణ్ణెన్.

ఈపద్యమందు కళింగదేశపురాజగు గజపతి కూఁతురికి నతని రాజ్యలక్ష్మికి నైక్యము కల్పింపబడి యిరువురును గృష్ణరాయలఁ బతిగాఁ బరిగ్రహించిరని యందముగా వర్ణింపఁబడినది,

ఆకాలముననే ప్రసిద్ధమైన 'చూడామణి' యను నిఘంటువును వ్రాసినమండల పురుషుఁడను జైనకవి కృష్ణరాయలయాస్థానమందే యుండెనని కొందఱయభిప్రాయము. ఇందులకాధారముగా నాకవి తనగ్రంథములో నీక్రిందిపద్యమును జెప్పియున్నాఁడు.

> "పడైమయక్కట్టపోదుమ్పడైమడమొయ్త్తిలాదాన్
> మడైకెటక్కటకత్తోళాన్ మతిక్కుడై మన్నగన్నన్
> గడిమన్నర్ వణఙ్గుమ్ తాళాన్ కిరుట్టినరాయన్ కైపోర్,
> కొడైమడమెన్ఱుతిమ్మత్తిక్కై యాదుకోడు తిలామే"

దీనికర్థము ప్రత్యర్థిసేనలెన్ని యెదిరించినను పరా ఁడుకానట్టియు, కటకము అంగదముగల భుజము ఁడు, ధవళచ్ఛత్రముగలరాజును, గడిమన్నులు నమ రము చేయు పాదములు కలవాఁడు నైన కృష్ణ రాయని చేతివలె సకలమైనవారికి దానము చేయుటకే "కొడమడం" అని పేరు.

అయిన నిందుదహరించిన కృష్ణరాయఁడు విజయనగరచక్రవర్తి కాదనియు నంతకుఁ జాలపూర్వముండిన రాష్ట్రకూటకృష్ణరాయలనియు నితరులయభిప్రాయము. ఈవిషయమై యింకను ద్రవిడమునను నాంగ్లమునను పత్రికలలో నుత్తరప్రత్యుత్తరములుగా వ్యాసములు వచ్చుచున్నవి.

కృష్ణరాయలపై 'మంజరిప్పా' యను నొక ప్రబంధమును 'జ్ఞానప్రకాశర్' అను శైవాళవంశమునఁ బుట్టినకవి పాడినట్లు 'తొండైమండలశతకమ్' అను గ్రంథమున నొక పద్యము సున్నది. ఆపద్యమిది:

> "ఞానప్రకాశప్పకష్టకెఱుదుట్ట రాయర్ పొ మంజరిప్పా
> కానప్రకాశప్పగట్టియస్తు కచ్చిక్కలంబ కత్తైయ్
> ఞానప్రకాశగురురాయ న్వాషకి న్దుసలజ్జిప్ద
> మానప్రకాశముడై యోర్ పశర్ తొణ్డమణ్డలమ్."

కచ్చిక్కలంబక మనుగ్రంథమును వ్రాసిన జ్ఞానప్రకాశగురురాయఁడు కృష్ణరాయనిపై 'మంజరిప్పా' అను గ్రంథమును వ్రాసెననియు నతఁడు తొండమండలమునఁ బుట్టెననియు నీపద్యమున కర్థము.

ఆకాలమున 'తిరువారూర్' అను ప్రసిద్ధశైవక్షేత్రమున నర్చకులు చక్కఁగా పనిచేయక దేవునిధ్వజా రోహణము కాకుండిన దానిఁజూచి దుఃఖించిన శైవాచార్యుఁడైన తత్త్వప్రకాశకవి ఈ క్రిందిపద్యములను వ్రాసి రాయలకంపెనట.

> "మరువుపుగళ్ కృష్ణమహారాశరాశై
> అరియవడముళై యారాశై తిరువారూర్ప్
> పాగట్కుడియిరుప్పార్ పాదన్ తిరువాశై
> త్యాగక్కుడి యిరక్కాదే"
> ఉఙ్జిత్తులుక్కెల్ల వొడ్డికూన్ తానవల్ల
> పిఙ్జిత్తులుక్కున్నవ్ మేల్కట్ట యాఙ్జి
> శిరన్ద తిరువారూర్ త్యాగరుడైప్పూశై
> ఇఅన్దదే కిట్టినరాయా"

ఈపద్యములయందు స్వామిపూజను సరిగా జరుపని పూజారులను 'తురకలు'గా తిట్టియున్నది. త్యాగ

రాజస్వామి పూజనిలుచుటకు కారణము, పట్టెతురకలు నగారు, ఒడ్డియన్ (ఓఢ్రరాజును) గాదు. తిప్పియగ్రామమండలి తురకలతో సమానులగు పూజారులు అని తిట్టియున్నది. ఈతురకలచే స్వామిపూజ కాటంకము కలిగెను అని ఈపద్యములను చదివి కృష్ణరాయ లాయూరి పూజారులను మార్చివైచెనట. పిదప దేవునిపూజ యథాప్రకారముగాఁ జరిగెనట. అప్పు డీకవియే యీక్రింది పద్యమును చెప్పెను.

"ఉణ్డవయిట్టెలు మిక్కాన్దలిట్టదే
తొణ్డరేవిష్ణులుక్కు కే-పణ్డెల్లామ్
అప్పముమదె న్నతిరసము న్దోశైగళుమ్
కప్పువముపోచ్చే కవిష్ణ"

ఇందు కవి శిక్షకపూర్వము పూజారు లుండిన స్థితియు, ఆకాలమున వీరికి పప్పుఅప్పములు, అటుకులు, అతిరసములు, దోసెలు పోయినవే అని హేళనము చేసెను. ఈతిరువారూర్ దేవాలయమందే యింకొక కాలమునందు నాగరసనంబి యనువాఁ డధికారిగా నుండినట్లును, అతఁడు దౌర్జన్యముచే నాలయమందుండిన 'అఱువత్తుమూవర్' అను అఱువదిమువ్వుర విగ్రహములలో రెంటిని గుంజగడీసెనట. ఈసమాచారమును ఒకపద్యముగా వ్రాసినట్లును ఆపద్యమొక చిలుకకు నేర్పియా చిలుకను రాయలకు బహుమానముగా నీయ నాచిలుక చెప్పిన పద్యముచే రాజాసక్తు డెఱింగించి యా 'నాగరసనంబి' యుద్యోగమునుండి తొలగింపఁబడెననియు నొక యైతిహ్యము కలదు. చిలుకకు నేర్పిన పద్యమిదియట:

"మున్నాళఱుబత్తు మూవరిరున్దారవరిల్
ఇన్నాళిరండు పేరెగినార్-కన్నాన్
వరుక్కు నాన్ విట్టువిట్ట నాగరసనంబి
ఇరుక్కు నాన్ కిట్టినరాయా."

ఈపద్యమునకు పూర్వము దేవాలయమున నఱువదిమువ్వు రుండిరనియు ఇప్పుడు వారిలో నిద్దఱేగిరనియు కంసాలికరగబెట్టుచున్నాఁడనియు వారికమ్మిన నాగరసనంబి యున్నాఁడనియు నర్థము. శైవవైష్ణవవాదములనుగూర్చి 'ఇరుశమయవిళక్కమ్' అని యొక గ్రంథము కలదు. దానికి కర్త 'హరిదాసు' అను నొకకవి. ఈ హరిదాసు కృష్ణరాయలకాలమం దుండిన ట్లాగ్రంథావతారికపద్యములచే దెలియును. ఈపద్యమునందుఁ బెద్దన

చం॥ అభిరతిఁ గృష్ణరాయఁడు జయాంకములన్ లిఖియించి
తాళస, న్నిభముగఁ బొట్టునూరికడ నిల్పిన కంబము
సింహభూధర, ప్రభుతిరువాళ్లకుం డిగు సురప్రకరం
బు కళింగమేదినీ, విభు నపకీర్తి కజ్జలము వేమరు
వెట్టి పఠించు నివ్వలన్.

అని పెద్దనచే నుదహరింపఁబడిన జయస్తంభ ముదహరించఁడినది.

'కిరిబోల్ వళర్ది కిళరుంబు యుక్కిస్టరాయర్
తిరైమాదు శింగాద్రియిల్ తంబనాట్టు
వరమాదరవాలళిత్తే వడహావమేవుమ్
కరుమామణివణ్ణనై నీడు కరుత్తుశ్రైవాహ్వాన్'

ఇందు సింహాద్రిలోని స్వామిని వర్ణించుచో 'వడహావమేవుం' అనియొక విశేషణమున్నది. ఇది ఉత్తరదేశమందలి హావమున కధిపతియని స్వామిని వర్ణించియున్నది. ఇచ్చటి 'హావమ్' అను ప్రదేశమేదో యిప్పుడు తెలియ లేదు.

కృష్ణరాయలమంత్రివర్గములో నొక యఱువమొందలారిగూడ నుండెనట. 'అఱువత్తిమొదలియార్' ఈయన నామము. ఈపేరే గొంతమార్పుతో 'అఱుమాత్తుంగళ్' అని ద్రవిడగ్రంథములలోఁ గనుపడుచున్నది. ఇతనికి తన స్వగ్రామమునుండి 'శేంబూర్ అఱుమాత్తుంగళ్' 'శేంబూరు అఱువత్తిమొదలియా'రనియు నుద్యోగము చేసిన స్థలమైన 'హంపి' నగరమును బట్టి 'అంబియఱువత్తిమొదలియా' రనియు పేర్లుపడుచున్నవి. కృష్ణరాయలకాలములో నితనికన్న పాండ్యవంశమునఁ బుట్టిన రాజులు సామంతులుగా నుండిరి. అట్టివారిలో నొకఁడు 'యఱువత్తిమొదలారి'కంకితముగా నొక 'కలంబక'మను ద్రవిడకావ్యమును వ్రాసెనట. తాను క్షత్రియుఁడై రాజవంశమందు బుట్టియు నట్లు చతుర్థకులమునఁ బుట్టిన మొదలారికి కావ్యమీయవగునా యని యొకకవి యడుగఁగా నాపాండ్యుఁడీక్రిందిపద్యము బదులిచ్చినట్లు "తమిళ్ నవలర్ చరిత"లో నున్నది.

"అఱువత్తిముదలియార్ వైస్వాద్రియన్ క
కంపాలా మో ఎన్ను పులవర్కు కిఱియది"

'ఊఙ్గఁక్ మనస్దెరియుమ్పుల వీరొదుశీర్తిరభోఙ్గ
తిఙ్గఁళ్ మరబినన్ తిఙ్గళిన్ కూడచ్చెయ్వార్తియా
తుఙ్గన్ మరబినిల్ గఙ్గయుం కూడినన్ శోదియన్జో
ఎఙ్గొన్సురబుఙ్డెనక్కు విపాడినన్ యాదవకోక్కే"

శివుఁడు తన జటాజూటమందుఁ జంద్రునితోఁ గూడ గంగను ధరించియుండుటచే, చంద్రవంశమునఁ బుట్టిన పాండ్యునికిన్ని గంగవంశమునఁబుట్టిన ముదలియారికిని సంబంధము కలదనియు నందుచేతనే తానతనికి గ్రంథమిచ్చెననియుఁ బైపద్యమునకుఁ దాత్పర్యము.

ఒకకాలమున గొందఱు వీథినాటకము లాడు నటులు, తాము వేశ్యజాతివారివలె వేషములతో వచ్చి యాడినట్లును ఆయాటచే వారు 'అఱంపళ్ ర్తముదలారి' యను వేశ్యజాతి నవమానించినట్లును ఆయవమానమును సహింపక నామొదలారి వారిని కత్తిచే నఱికించినట్లు నొకయైతిహ్యమున్నది. ఈవిషయము తొండైమండల శతకము గ్రంథమున నొకపద్యమున్నది. ఆశతక వ్యాఖ్యానమునం దీకథ క్రీ. 1511లో జరిగినట్లు గూడఁ జెప్పఁబడియున్నది. ఆపద్యమిచ్చట నుదాహరింతుము.

"తారాన్మైత్తియుఙ్గొ పుగళ్ క్కిరుష్ణరాయన్ శేమకత్తిలే
వేరాన్మలాళిప్పైప్పోతే వినోదిత్తు వేడక్కోఙ్ఙు
కోశార్వయిరియర్ హత్తాడ త్తఙ్గళ్ కుడిమైరఙ్గి
వాశాలవరియిర్ మారయ్ తవన్జో తొణ్డమణ్డలమే"

కృష్ణరాయలకుఁ దిదపఁ గొంతకాలమునకు 'రామరాజు విట్ఠలరాయ'లను రాజు, నొకపాండ్యదేశములలో విజయనగరచక్రవర్తికిఁ బ్రతినిధిగా రాజ్యమేలెను. ఈవిట్ఠలరాయలు కృష్ణరాయలయల్లుఁడై యతనికిఁదిదప మిగుల ఖ్యాతిగా రాజ్యమేలిన అళియరామరాయల పితృవ్యపుత్త్రుఁడు. ఈరాజు అచ్యుతదేవరాయల కాలమందును అళియరామరాయలకాలమందును అనేకరాజ్యముల కధిపతియై యనేక యుద్ధములలో వాసికాంచెను. ఈతని పరాక్రమము లన్నిటిలోను పాండ్యకేరళదేశములపై నితని దండయాత్రయు నచ్చటిదిగ్విజయములును ముఖ్యములు. కేరళదేశమున నొకరిద్దఱు రాజులసహాయము చేసికొని యాకాలమున 'పోర్చుగల్' దేశమువారును పాండ్యకేరళదేశములలో విజయనగరరాజులకు విరోధము గావింపుచుండిరి. అట్టివిరోధమును రూపుమాపి యూపరంగులను (పోర్చుగీసువారిని) పోఁదోలి, వారికి సహాయులైన పాండ్యకేరళరాజులనోడించి విధేయులుగాఁ జేసిన దీవిట్ఠలరాజే. ఇట్లు జయించిన పిదప నీవిట్ఠలరాజునకు పుణ్యార్థముగాను, ఆతనిదిగ్విజయసూచకముగాను బ్రకటించిన శాసనములును గొన్ని యున్నవి. ఈవిట్ఠలరాజు కన్యాకుమారిని జయించినప్పు డతనిపై సామంతుఁడైన పాండ్యరాజొకండిపద్యముఁ జెప్పినట్లు తమిళ్ నావలర్ చరితలో నున్నది.

"తొట్టిలిరుక్కత్తొడక్కియ నాణ్మొదలా
అట్టదిక్కు నిన్కుడైక్కీళ్ త్తాయిట్రే విట్ఠల కేళ్
తన్కుమరియన్ఱి త్తనిక్కు మరిక్కొళ్ళానీ
తెన్కుమరిక్కెగువదెన్ శెప్పు,"

ఈపద్యమునకర్థము "ఓవిట్ఠలరాయా! నీవు శిశువై తొట్లలోనుండిననాఁడు మొదలు నెనిమిదిదిక్కులును నీ ఛత్త్రము క్రిందనమరినవి. తన(కుమారి) స్త్రీనితప్ప నితర కుమరిస్త్రీనిఁ బరిగ్రహింపని నీవు 'తెన్కుమరి' కన్యాకుమారిపట్టణము (ఒకస్త్రీ) నెట్లు గ్రహించితివి.

విజయనగర సామ్రాజ్యము క్రీ. 1565కు వెనుక ప్రభ తగ్గినందున సామంతరాజ్యములు క్రమేణ స్వతంత్ర రాజ్యములైనవి. అందుచేత నాంధ్రదేశమునకును ద్రవిడదేశమునకును సంబంధము కొంతతగ్గినను ద్రవిడదేశములో స్వతంత్రులై రాజ్యము లేర్పరచుకొన్న వారనేకు లాంధ్రులుగానే యుండిరి. అట్టివారిలో ముఖ్యులు చెంజి, తంజావూరు, మధురదేశముల నాయకులు ప్రధానులు. చెంజి తంజావూరు పట్టణముల నాయకవంశములు శీఘ్రకాలముననే మహారాష్ట్రులకులోఁబడినను మధురయందలి నాయకవంశము మాత్రము నూటయేబది సంవత్సరముల వఱకు, అనగా దాదాపు క్రీ.శ. 1750 వఱకును ఇంగ్లీషువారికి ఫ్రెంచివారికిని కర్ణాటకదేశమున జరిగిన యుద్ధముల వఱకు నుండెను. ఈనాయకవంశపు రాజు లాంధ్రులు. వీరిలోఁ గొందఱు స్వయముగాఁ గావ్యముల వ్రాసిరి. అనేకులు కవుల నాదరించి వారిచేఁ బ్రస్తుతులై, గ్రంథములఁ గొని యున్నారు. చెంజినాయకుఁడైన కృష్ణప్పనాయకుని యాస్థానమందు దక్షిణదేశమందెల్లను వ్యాకరణ మీమాంసా వేదాంతశాస్త్రముల నసమానుఁడైన శ్రీనివాస

దీక్షితులుండెను. ఈదీక్షితులకే బిరుదములతోఁగూడి 'దంతిద్యోతిదివాప్రదీప శక్యమంగళ రత్నఖేట శ్రీనివాసదీక్షితుల'ని పేరయ్యెను. తంజావూరు నాయకుల విషయము తెలుఁగువారికిఁ దెలిసినదే. అత్యుత్తమాంధ్ర కావ్యములైన విజయవిలాస, సారంగధర చరిత్రాదులవల బుట్టినవేకదా. తంజావూరు రఘునాథరాయలు సంస్కృతాంధ్రముల కవిత్వముచెప్పి కావ్యములవందినట్లే యుత వమునందును గొన్ని కృతులనందియున్నాఁడు. తిరుమైయ్యార్పురాణమును నొక ద్రవిడకావ్యము రఘునాథ రాయలకంకితమీయఁబడెను. ఈకావ్యమందు రఘునాథ రాయలును వతని ప్రధానమంత్రియగు గోవిందదీక్షితులనుచాల పొగడఁబడియున్నారు.


మధుర నాయకులు తామాంధ్రులై యనేకాంధ్ర కవులనాదరించియు వారి ఖ్యాతియాంధ్రవాఙ్మయమున కన్న ద్రవిడవాఙ్మయమందే విస్తారముగా వెలుఁగఁజేసియున్నది. ఈనాయకవంశములో నందఱికన్నఁ బ్రఖ్యాతుఁడు తిరుమలనాయకుఁడు. మధురలో తిరుమలనాయకుని ప్రాసాదమును గూర్చి వినని వారలుదు. ఈతిరుమల నాయకునిసభలో "కుమర గురుపరమునివర్" అను ద్రవిడకవి యుండెను. ఈకవి 'మధురమీనాక్షీ'పై 'పిళ్లైతమిళ్' అను నొక ద్రవిడప్రబంధము వ్రాసెను. ఈ గ్రంథము తిరుమలనాయకునిసభలో మొట్టమొదటఁ జదువ నపుడు 'మీనాక్షీదేవియే యొకకన్యరూపమునవచ్చి వినుచుండెనని యైతిహ్య' మొకటి చెప్పుదురు. ఈకవియే 'మీనాక్షియమ్మైకుఱమ్' అని యింకొక ద్రవిడకావ్యమునుఁగూడ వ్రాసియున్నాఁడు. ఆగ్రంథమునందు తిరుమలనాయకుని యీ క్రిందిపద్యమునఁ బ్రశంసించియున్నాఁడు.

"నీరార్వాళ్ తెన్మదురై నిన్మలనారరుళ్వాళ్
కారార్వాళ్ యఱ్ఱుయర్కన్ని తిరువరుళ్వాళ్
శీరార్వాళ్ కచ్చినగర్ తిరుమలై భూపతి వాళ్
పేరార్వాళ్ యవన్ శెల్వమ్ పెరుగాళ్ వాళ్ యనే."

ఇందు కవి మధురలోని యీశ్వరుని, దేవిని, తిరుమలభూపతిని మంగళాశాసనము చేసినాఁడు. ఇందు తిరుమలనాయకుని కచ్చినగర్ తిరుమలైభూపతి యని ప్రశంసించెను. ఇందు 'కచ్చి' యనుపదము మధురలో నేలిననాయకరాజుల యింటిపేరు. ఈ వంశమువారు మొట్టమొదట 'కంచి' యందుండి యచ్చటినుండి మధురలో రాజులైరి. అందువలన వీరివంశమునకు కచ్చియని యింటిపేరయ్యెను.

ఈవ్యాసము నందింతవఱకును అతిసముగ నాంధ్ర దేశమునకు సంబంధించిన చరిత్రవిషయమే యధికముగాఁ జూపఁబడెను. ఇట్టే యాంధ్రవాఙ్మయమునకును నితరవాఙ్మయములకు నెన్నియో సంబంధములుండ వచ్చును. ఈసంబంధముల నెఱుఁగుట యత్యావశ్యకము. అట్లెఱుఁగుట కాయాభాషలలో జ్ఞానము ముఖ్యముగా నుండవలెను. అట్టి జ్ఞానముచే యాంధ్రదేశమునకు సంబంధించిన విషయము లెఱుఁగుటేకాక యాయావాఙ్మయములలో నుత్తమములైన గ్రంథములను, గ్రంథాభిప్రాయములను బరివర్తించుటకు నుపయోగించును.





'లేవ్ జే' మహాత్ముని సుభాషితములు

ఆదిపూడి సోమనాథ రావు గారు

(రెండవ సంపుటము—౧ వ సంచిక తరువాయి)

౨౪

గీ. ఆశయే లేదుగాన మహర్షి తాను
పరమ దుస్సాధ్యకార్యమై పరఁగుచున్న
దానిఁ గూడను గొప్పగాఁ దలఁపకుండు

౨౫

సుఖసాధ్యము లనుకొని సలుపఁగడఁగు
నతని కెన్నియొ కష్టసాధ్యమ్ము లగును
సాధు వన్నియుఁ దనకుదుస్సాధ్యములుగఁ
దలఁచుఁ గావునఁ దన జీవితమ్మునందు
నొక్కటేనియు దుస్సాధ్య ముండఁబోదు

౨౬

గీ. దివ్యపథ మిలయందు నదృశ్యమైనఁ
గరుణయునున్యాయమునువచ్చి కానిపించుఁ
దెలివితో లాభనష్టముల్ దెలియుటకును
మొదలిడినతో నెకపటంబు పొదలఁదొడఁగు

౨౭

గీ. సత్య ధర్మమ్ము తా నిలఁ జాటుకొనదు
ధర్మమని కాన నద్దియే ధర్మమగును
అన్యతధర్మంబు తానెపో యమలమైన
ధర్మమని చాటుకొనుచుండు ధరణియందుఁ
గాన నయ్యది ధర్మంబుగాకయుండు
నిష్క్రియాలక్షణంబయి నెగడునదియె
ధర్మమైయొప్పఁ గావున ధర్మ మిలను
గార్యపరతనుగోర దెక్కాలమందు
అన్యతధర్మంబునకుఁ గార్య మవసరంబు
గాన నదిగోరుచుండును గార్య మిలను

౨౮

గీ. దైవపథ మస్తమించిన ధర్మముండు
ధర్మ మడుగంటిపోయిన దానిచోటఁ
బ్రకటమగుచుఁ బరోపకారంబు దనరు
నవని నది యంతరింప న్యాయంబుపొదలు
న్యాయమడిగిన నాచార మతిశయిల్లు
సత్యకృత్రిమరూప మాచార మెన్న
భువి నశాంతికి హేతువై పొలిచి నిలుచు

౨౯

గీ. దివ్యపథమును నుత్తముల్ దెలిసిరేని
మించు రయమున దాని సేవించుచుంద్రు
దివ్యపథమును మధ్యముల్ దెలిసిరేని
విడిచిపట్టుచుఁ బట్టుచు విడుచుచుంద్రు
దివ్యపథమును నధములు దెలిసిరేని
నవ్వుచుండురువా రటు నవ్వరేని
దైవపథమునునామంబు ధన్యమగునె?

౩౦

గీ. చాలఁగలవాఁడె భువిఁ జాలఁగోలుపోవు
పరమసంతృప్తిగలవాఁడు భంగపడఁడు

చెదరకుండెడు మదివాఁడు చెలువుగనఁడు
పృథ్వి నాతఁడు చిరము జీవింపఁగలఁడు

౩౧

బ్రతుకుతోడ నెయుండును మృతియుఁ గాన
బ్రతుకులోఁ జొచ్చినప్పుడే మృతిని జొచ్చు
నష్ట మొందిన దేహంబు నష్టమేమి?
సత్యమైనట్టి తెలివితో స్వప్రకాశుఁ
జేరఁగల్గినఁ జాలును జీవునకును
అనఁగ నిత్యత్వమందుటే యాత్మ కవధి

౩౨

అల్పవస్తువులనుగూడ నధికమైన
శ్రద్ధతోఁ జూడఁగలుగుటే సత్యమైన
సభ్యతకుఁ జిహ్నమైయొప్పు సాధుగుణమె
బలమునకు లక్షణంబయి వెలయుచుండు

౩౩

అజ్ఞుఁడని తన్నెఱుంగుట యగును ప్రజ్ఞ
అట్టు లెఱుఁగమి యొకవిధమైన జబ్బు

౩౪

మంచిమాటలు నరు నుద్ధరించుఁ గాని
మంచిపనులన్న వానిని మించియుండు.

౩౫

గీ. అచలమగుదాని సులువుగా నాఁపవచ్చుఁ
గలుగఁగలదాని నవలీల నిలుపవచ్చు
వేడుకగ లేఁతదానిని విఱువవచ్చు
జల్లుమని సూక్ష్మవస్తువుల్ చల్లవచ్చుఁ
గానఁ దగుతఱిఁ బనులకుఁ గడఁగవలయుఁ
గలఁతకుంబూర్వమే శాంతి గొలుపవలయు

౩౬

గీ. కడఁకతోడఁ బ్రవృత్తిమార్గమును మాని
యమలమైన నివృత్తిమార్గమును బూని
చుఱుకుఁదనమును నెంతయుఁ దఱుగఁజేసి
మించుసిరులను విరివిగాఁ బంచిపెట్టి
యున్న యాడంబరములెల్ల సున్న చేసి
దుమ్మువలె నుండువాఁడె జగమ్మునందు
నైకమత్యమ్ము గూర్పగా నర్హుఁడగును

౩౭

గీ. ఆర్ద్రసుకుమారతనువుతో నవతరించి
పరమశుష్కాంగుఁడై తుది నరుగునరుఁడు
మొక్కలును చెట్లు ప్రాణులు పుట్టినప్పు
డార్ద్రసుకుమారతనులతో నలరుచుండి
అతికఠినశుష్కతనులతో నంతరించుఁ
గానశుష్కత్వమునుమఱి కఠినతయును
మరణసహపాంథులయియుండుధరణియందు

౩౮

గీ. మనుజుఁ డింద్రియములనోర్చి మనినఁ జాలు
నవనిఁబలుకుల బోధింప ననవసరము

౩౯

గీ. నీటికంటెను మృదువును నీటికంటెఁ
బరమసుకుమారమైనది ధరణి లేదు.
గాని బలుగట్టిగా నుండువాని నెల్ల
సమయఁజేసెడుశక్తిలో జలము మించి
వఱలుచుండెడువస్తువుల్ వసుధ లేదు
బలముగలవానిగెలుచుదుర్బలుఁడుమఱియు
మిగుల కఠినుని గెలుచును మేదకుండు
వసుధలో దీనిఁ దెలియని వాఁడు లేఁడు
గాని యొకఁడైన నడువఁడు దీనిఁబట్టి

౪౦

గీ. విషయభోగంబు భువిలోన విహితమంచు
నొప్పుకొనుకంటె మించిన తప్పు లేదు

౪౧

తృప్తిలేమిని మించు దుస్థితియు లేదు

౪౨

వసుధయం దాశమించు పాపమ్ము లేదు

౪౩

రాజభవనాళి శివితోఁ బ్రబలెనేని
పంటపైరు లవెల్లను పంటఁగలయు
నుర్విలో గాదెలెల్లను నుత్తవగును

౪౪

గీ. మతగురులస్తోత్రపాఠముల్ మానుకొనుఁడు
జనులలో దెబ్బలాటలు శాంతమగును

౪౫

కష్టసాధ్యములకు వెల గట్టకుండు
అపహరింపరు వానిని నప్పుడెవరు
విషయభోగేచ్ఛఁ గొలిపెడు విషయములను
వెలిపఱుపకుండు శాంతమ్ము వెలయుభువిని

౪౬

గీ. అవనిరాష్ట్రంబునేల న్యాయ్యంబు వలయు
ఆయుధంబులు ప్రజనుండి యపహరింపఁ
బ్రబలమైనట్టియుక్తిని బన్నవలయు
స్వర్గరాజ్యము నిష్క్రియ వలనఁగలుగు
మహిని వీని సమర్థించు మార్గమెద్ది?
ప్రబలనిర్బంధములచేతఁ బ్రజలయందు
సంతకంతకు దారిద్ర్య మతిశయిల్లు
వాడిగలయాయుధమ్ములు ప్రజలయందు
హెచ్చుకొలఁదిన శాంతియు హెచ్చుచుండు
ప్రజలలోపలఁ గపటంబు ప్రబలుకొలఁది
హెచ్చుగా ఘోరకృత్యముల్ పెచ్చుపెరుఁగు
ప్రకటనల్ హెచ్చుకొలఁదిని రాష్ట్రమందు
బందిపోటులు చౌర్యముల్ ప్రబలమగును
గాన సాధువు బోధింపఁ గడఁగెనిట్లు
నేను నిష్క్రియుఁడైయున్న నిక్కముగను
ప్రజలు పరిపూర్ణ వృద్ధినిఁ బడయఁగలరు
నేను శాంతిపథమ్మున నెగడుచున్నఁ
దమకుఁదామె జనమ్ములు ధరణియందు
న్యాయపథమున నెంతయు నలరఁగలరు
నిష్క్రియాశీలుఁడయి నేను నెగడుచున్న
ధరణిలోపలఁ దమ ప్రయత్నములవలన
సకలధనవంతు లగుచుండు సకలజనులు
ఆశలన్నియు నే విడనాడియున్నఁ
దమకుఁ దామె జనంబులు ధరణియందు
సరళవర్తనమును గల్గి సంచరింత్రు

౪౭

ఇలను మునివ్రేళ్ల మీఁదను నిలుచువాఁడు
నేలపై సుస్థిరంబుగ నిలువలేఁడు
పంగకాళ్లను ధర నిలఁబడెడువాఁడు
సాఁగఁజూచిన ముందుకు సాగలేఁడు
వెలుఁగులో నిల్చువాఁడు దా వెలుఁగలేఁడు
తన్నుఁదా నెన్నుకొనువాఁడు తనకునుండు
మంచిచెడ్డలఁ దాఁబరీక్షించలేఁడు
తన్ను భూషించుకొనువాఁడు తథ్యముగను
తన్ను యోగ్యునిగా మదిఁ దలఁపలేఁడు

౪౮

పరులఁ దెలిసినఁ గుశలుఁడై పరగఁగలఁడు
తన్నుఁ దెలిసినఁ బ్రాజ్ఞుఁడై తనరఁగలఁడు

౪౯

అన్యులను గెల్చి బలశాలి యగును గాని
తన్నుఁ దాఁ గెల్చి యగును ప్రతాపశాలి

౫౦
తనివితోనుండఁ దెలిసిన ధన్యతముఁడె
ధనికుఁ డనఁబడ నర్హుఁడై తనరుచుండు

౫౧
నేర్పువీడి వివేకము న్నిలుపుకొనుము
శతగుణమ్ముగఁ బ్రజలకు హితము హెచ్చు

౫౨
ఆశ లేనిమహాత్ముని యాత్మయందె
శాంతి నెలకొనియుండు నిరంతరంబు

౫౩
వచ్చెనా కీర్తిపోవునా భయముగలుగఁ
దొలఁగెనా వచ్చునటకును దోఁచకుండు
తుచ్ఛమగుఁగాదె కీర్తియం దిచ్ఛ భువిని

౫౪
నీవె నిను నమ్మకుండిన నిన్ను నెవఁడు
నమ్మఁజాలును జెప్పు జగమ్మునందు

౫౫
నాల్గుగుఱ్ఱాలుగట్టిన నవ్యరథము
నందు వెడలుటరాజయి యలరుచుంట
అధికతరసౌఖ్యమే యైన నగునుగాక
అంతకంటెను నేకాంత మందునుండి
పూజ్యదివ్యపథమ్మునఁ బూర్ణవృద్ధి
గాంచుటంతయుసౌఖ్యమై మించుఁగాదె

౫౬
చెఱుపుఁ జేసినవానికిఁ జెఱుపుఁగాక
కరుణఁజూపెడువాఁడెపో ఘనుఁడనంగ

౫౭
కలదు సిరి గౌరవమ్మును గలదటంచు
విపులగర్వమ్ముచే విఱ్ఱవీఁగువాఁడు
కూర్చుకొనుచుండు నాపదల్ కోట్లకొలఁది

౫౮
వార్ధులను మఱచెదు లిల వాగులకును
లొంగుచుండును వానిని లొంగఁదీయు
అల్ల సాధువుకూడ నీ యవనియందు
లొంగఁదీయంగఁ బ్రజలకు లొంగవలయు

౫౯
నడుపఁగలవాఁడు తొందర పడకయుండు
గెలువఁగలవాఁడు కీడును దలఁపకుండు
పోరఁగలవాఁడు పోరును గోరకుండు
జనులసన్మార్గమునఁ బెట్టఁ జాలువాఁడు
వారికాధీనవర్తియై పరఁగుచుండు
ప్రజలశక్తుల నుపయోగ పఱచికొనఁగఁ
దనకుఁగలశక్తి దీనిచే ధరకుఁ దెలుపు
ఉత్తమ ప్రజ్ఞయన నిదే యుర్వియందు
ఆత్మపరమాత్మసంయోగ మనఁగ నిదియె

౬౦
భీకరంబగుదానికి బెదరఁడేని
అతిభయంకరమైనది యతనికొదవు

౬౧
తననివాసము నిరుకుగాఁ దనదు బ్రతుకు
నెంతయును నల్పతరముగా నెన్నఁదగదు

౬౨
బ్రదుకును బ్రియంబుగా నెంచు వానికంటె
దానిఁ దలపనివాఁడె ప్రజ్ఞాఘనుఁడు

౬౩
తెలియుననువాఁడు గొంచెమే తెలిసియుండు
తెలియదనువాఁడె యెంతయో తెలిసియుండు

౬౪
వినఁగ సత్యము ప్రియమయి వెలయకుఁ
వినఁగఁ బ్రియమిల సత్యమై వెలయకు

ద్రౌపది

(రెండవభాగము)

పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ గారు

(రెండవసంపుటము మొదటిసంచిక తరువాయి)

ద్రౌపదీచరిత్రమునకును, ఇతరార్యనారీమణుల చరిత్రమునకును నెంతటి గురుతర ప్రభేదమున్నదియు మొదటిభాగమునందు యథాసాధ్యముగాఁ జూపఁబడినది. ఇఁక ద్రౌపదీచరిత్రమునకు మధ్య గ్రంథిగా నున్న తత్త్వమునుగూర్చి విమర్శింతము

ఈతత్త్వసంబంధమగు బహిర్వికాసము మిక్కిలి దీప్తిమంతమైనది. ఒక్కస్త్రీ కేవురు భర్తలైనను ఆమెను గులట యని యోజించుట కెట్టి యవకాశమును గనఁబడదు. ఇట్టి యసామంజస్యమునకు సామంజస్య మెక్కడనుండి వచ్చినది?

ఈప్రశ్నకు మన యాంగ్లేయపండితులు మిక్కిలి తేలికగా సమాధాన మిచ్చుచున్నారు. "భారతీయులు బర్బరజాతివాండ్రు వారిలో స్త్రీలకు బహుభర్తృవివాహపద్ధతి పూర్వకాలమునం దాచరణలో నుండెడిది; ఆకారణముచేతనే పంచపాండవులకు ద్రౌపది యొక్కతయే పత్నియైనది" అని వారు చెప్పుచున్నారు. ఐరోపీయార్యవర్గమునకు మఱియొకటి సాధ్యమైనను గాకపోయినను భారతవర్షమును గూర్చి యింత తేలికగా మాటలాడుటమాత్రము వారికిఁ జక్కఁగా నభ్యాసమైనది.

ఐరోపీయులు భారతదేశప్రాచీన గ్రంథముల నన్నిటి నేవిధముగా బోధపఱచుకొనిరో యాసంగతి నే నించుక తెలియఁబఱిచెదను.

సంస్కృత సాహిత్యమునందలి వేద శాస్త్ర, దర్శన, పురాణ, ఇతిహాస, కావ్య ప్రభృతులకు వారొనరించిన యనువాదములు, టీకలు, విమర్శనములు మున్నగువానిని బఠించుటకంటెను గురుతరమైన మహాపాతకము సాహిత్యజగత్తునం దింకొకటి యుండఁబోదు; మఱియు మూర్ఖతను సంపాదించుటకుఁగూడ నింతకంటె సహజోపాయ మింకొకటిలేదు. ఇప్పుడును మనవా రనేకు లట్టివానిని బాఠముచేయుచునే యున్నారు. వారలను బ్రార్థించుటకే, యీసందర్భములో నప్రాసంగికములైనను గొన్ని మాటలను వ్రాయవలసిన బాధ్యతగల్గినది.

సంస్కృతగ్రంథములసంఖ్య యింతయని చెప్పఁజాలము. ప్రయత్నించినకొలఁది నూతన

గ్రంథము లెన్నియో లభించుచునే యుండెను. సంస్కృతగ్రంథములతోఁ బోల్చి చూచునప్పు డాంగ్లేయగ్రంథముల నేవిధముగను గ్రంథము లని చెప్పుట కేవలను పడదు. ఏనుఁగుతో దోమను వటవృక్షముతో వల్మీకమును భాగీరథితోఁ బల్వలమును బోల్చిన నెట్లుండునో, మహాభారతముతోఁగాని శ్రీమద్రామాయణముతోఁ గాని యాంగ్లేయగ్రంథమును బోల్చినట్లుండును. వేదసంహితలు, బ్రాహ్మణములు, నారణ్యకములు, నుపనిషత్తులు, గృహ్యసూత్రములు, శ్రౌతసూత్రములు, ధర్మసూత్రములు, దర్శనములు, వానిభాష్యములు, వానిటీకలు, టీకాభాష్యములు, బురాణములు, నితిహాసములు, స్మృతులు, గావ్యములు, నలంకార వ్యాకరణ, గణిత, జ్యోతిశ్శాస్త్రములు నిఘంటువులు మొదలగు నానావిధసంస్కృతగ్రంథములతో నిప్పటికిని భారతవర్షము నిండియున్నది. అపారము లిపిబద్ధము నగు నీ ప్రాచీన గ్రంథసముద్రమధ్యమం దెచ్చటను, ఘుణాక్షరన్యాయముగానైనను బ్రాచీనార్యులలో స్త్రీలకు బహుపతిత్వమున్నట్లగపడదు. అయినను పాశ్చాత్యపండితులు, ఒక్క ద్రౌపదీవివాహమును నిదర్శనముగాఁగొని ప్రాచీనభారత స్త్రీలకు బహుపతిత్వము వాడుకలోనున్నదని సిద్ధాంతము సేయుచున్నారు. అట్టి యాంగ్లేయపండితులలో నొకరగు ఫర్గుసన్ దొరగారు భగ్నములైన గోపురప్రాకారములందలి వివస్త్రస్త్రీమూర్తులంజూచి, ప్రాచీనభారతదేశస్త్రీలకు వివస్త్రలుగానుండుట యాచారమనియు సీత, సావిత్రి, ద్రౌపది దమయంతి మొదలగు సతీమణులు మామలు బావలు మున్నగువారియెదుట నగ్నావస్థయందే సంచరించుచుండెడివారనియు సిద్ధాంతీకరించియున్నారు. అందుచేతనే యీయాంగ్లేయమహాపండితుల రచనలు చదువుటకంటె సాహిత్యజగత్తునందు మహాపాతకములేదని చెప్పియున్నాను.

ద్రౌపది పంచపతిత్వమునుగూర్చి విమర్శించుటకుముందు ఈకథ కేవలకవికల్పనమాత్రమా ఐతిహాసికమా? నిజముగా ద్రౌపదికైదుగురుభర్తలుకలరా లేక కవి యట్లు కల్పించియుండెనా? అను సంగతి విమర్శింపవలసియున్నది. మహాభారతమునం దెంతవఱ కైతిహాసికకథకలదో, "శ్రీకృష్ణచరిత్రము" (విమర్శనము)నందుఁ దెలుపఁబడియున్నది. మహాభారత మితిహాసమని చెప్పినంతమాత్రమునఁ భారతమునందలి కథలన్నియు నైతిహాసికములనుటకు వీలులేదు. అందు స్పష్టముగాఁ బ్రక్షిప్తములని తోఁచునవిమాత్ర మైతిహాసికములుగావు; కాని ద్రౌపదిచరిత్ర మైతిహాసికము. మూలమహాభారతమంతయు ద్రౌపదికథ ననుసరించియే యున్నదిగాన నిది ప్రక్షిప్తమనుటకు వీలులేదు. అయినను మూలమహాభారతకథ యంతయు నైతిహాసికమే యని కాని సత్యమే యని కాని చెప్పుట దుస్సాహసము. కవి, చరిత్రకారుఁడైనప్పుడుగాని చరిత్రకారుఁడు కవియైనప్పుడు గాని, కావ్యచరిత్రములకు మిశ్రమస్థితిగల్గుట సహజము. సత్యచరిత్రమునకుఁ గవి స్వకపోలకల్పితరచనలచే మెఱుఁగుపెట్టుటాశ్చర్యము గాదు. ద్రౌపది యుధిష్ఠిరునకుఁ బట్టమహిషియే

యనుట నైతిహాసికమని తప్పక యంగీకరింపవచ్చును, గాని యామె పంచపాండవులకును బత్నియనుటఁగూడ నైతిహాసికసత్యమేయని యంగీకరింపవలెనా?

ఈ ద్రౌపదీవివాహముదక్క భారతవర్షీయార్యజాతియందుఁ గాని, భారతదేశగ్రంథసముద్రమునందుఁగాని స్త్రీలకు బహుపతిత్వవివాహమున్న ట్టెట్టి నిదర్శనములు గాని కాన్పించుటలేదు, విధవాస్త్రీ కన్యవివాహమున్న ట్లగపడుచున్నది, కాని యేకకాలమునం దొక్కస్త్రీ యేకాధికభర్తలను వివాహమైన ట్లగపడదు. ఎక్కడనైన నొక్కమనుష్యునిచేతి కాఱువ్రేళ్లనుజూచిగాని, యొక్క పుట్టంధుఁడైనమనుష్యునిఁజూచిగాని, యందఱి చేతులకు నాఱేవ్రేళ్లనియు, నందఱుఁ బుట్టంధులేయనియు సిద్ధాంతము చేయవచ్చునా? అట్లే కేవలము నొక్క ద్రౌపదీ బహుపతిత్వవివాహమునుజూచి పూర్వమం దార్యస్త్రీలందఱకును బహువివాహమాచారమైయున్న దని నిశ్చయింపరాదు. మఱియు నిట్టివివాహమప్రసిద్ధమని మహాభారతమునందే స్పష్టీకరింపఁబడియున్నది. కారణమేమన? ద్రౌపదీసంబంధమున నిట్టిలోకవిరుద్ధమగు వివాహసంఘటనమును సమర్థించుకొనుటకు మహాభారతకారుఁడు, పూర్వజన్మ సంఘటితములగు ననేకవృత్తాంతములను నిరూపించి చెప్పుటకు బాధ్యుఁడు కావలసివచ్చెను.

సంఘమునం దెన్నఁడునులేని యాచారమును సంఘమునందుఁ బ్రవేశపెట్టుట లోకనిందకుఁ గారణము గాకమానదు. అట్టిది, పాండవకులమువంటి లోకవిఖ్యాతమగు రాజవంశమునందు సంఘటిల్లునని యనుమానించుటకైన నవకాశములేదు. కాని, యొకతత్త్వవిశేషమును బ్రస్ఫుటము చేయుటకుఁ గవి యిట్టికథనుగల్పించుట విచిత్రముగాదు.

ఇది కల్పితకథయనుట కనేక ప్రమాణములు గలవు. ద్రౌపది యైదుగురు భర్తలవలన నైదుగురు పుత్త్రులను మాత్రమే వడసినది. ఎవ్వరివలన, నిరువురనుగాని, మువ్వురనుగాని గాంచియుండలేదు. ఎవ్వరివలనఁ బుత్త్రికను బడసి యుండలేదు. ఎవ్వని యౌరసుఁడును నిష్ఫలుఁడు గాలేదు. ఆ యైదుగురిలో నొక్కఁడును భూపతి గాలేదు. అందఱు నొక్కమాఱే యశ్వత్థామచేతిలో నిహతులైరి. అందొక్కఁడును బ్రధానకార్య మొక్కటియుఁ జేసియుండలేదు. అందఱును గురుక్షేత్రయుద్ధమున నొక్కమాఱు, ఏకముగా వచ్చి సేనలతోఁ గలిసి యుద్ధముచేసిపోయిరి. ఇంకేమియును జేయలేదు. పక్షాంతరమున నభిమన్యుఁడు, ఘటోత్కచుఁడు, బభ్రువాహనుఁడు, నెంతటి జీవత్ప్రతిభాశాలులైయుండిరో చూడుఁడు!

ద్రౌపదీపంచపతిత్వవివాహము కల్పితకథయైనయెడల ద్రౌపదిధర్మరాజున కొక్కనికే భార్యయైనయెడలఁ దక్కిన నల్వురుపాండవులును నవివాహితులేనా? యను ప్రశ్న పుట్టవచ్చును. దీనికిఁ బ్రత్యుత్తరము చెప్పుట కష్టమే.

భీమార్జునుల కన్యవివాహము లున్నట్లు మన మెఱుఁగుదుము; కాని, నకులసహదేవుల

కన్యావివాహములైనట్లు మహాభారతమువలన మనకుఁ దెలియవచ్చుటలేదు. అంతమాత్రమున వారికివివాహములే కాలేదని చెప్పుటకు వలనుపడదు. మహాభారతము ముఖ్యముగా, ధర్మజ భీమార్జునులమువ్వుర జీవితచరిత్రము మాత్రమే యైయున్నది; తక్కిన యిద్దరు పాండవులును వారికిఛాయామాత్రులైయుండి, వారితోఁగలిసి కార్యము లొనరించిరి. వారి యన్యవివాహములను గూర్చి చెప్పుట యంత ప్రయోజనకారి కాకపోవుటచే నాప్రసంగమును భారతకారుఁడు విడిచియుండిన నుండవచ్చును. అదియొకలోపముకాదు. ద్రౌపదీ పంచపతిత్వ వివాహవిషయమున నిదివఱకుఁ జేసిన పూర్వపక్షము చాలును.

ద్రౌపదీ పంచపతిత్వవివాహము కేవల కవికల్పితమేయైనచో నిట్టి విచిత్రకల్పన మొనరించుటకుఁ గవి యుద్దేశ మేమైయుండును? విశేషగూఢాభిప్రాయ మెద్దియైన లేకున్నచోఁ గవి యిట్టికుటిలమార్గము ననుసరింప నేల? అట్లయినచో నాతని యభిప్రాయమేమై యుండును? ఇందలి నిగూఢతత్త్వమును మన మిప్పుడు నిర్ధారణము చేయవలసియున్నది. దీనిని నిర్ధారణచేయుటకుముందు, ఒకానొక పండితుని యభిప్రాయము నిచ్చట నిచ్చుచున్నాను. ఆయభిప్రాయ మిదివఱకుఁ బ్రచారములోనున్న "శ్రీకృష్ణ చరిత్ర"మునకు సంబంధించి వ్రాయఁబడినది.

"శ్రీకృష్ణుఁడు మనుష్యావతార మెత్తి భూలోకమున సంచరించెను" ఈమాటమేమును అంగీకరించెదము. కాని భారతరచనకుఁ బూర్వమునందుండియు నతిమానుష మగు నీశ్వరావతారమని శ్రీకృష్ణునిగూర్చిలోకము విశ్వసించియుండెను. ఈవిశ్వాసము సప్రమాణమే యని తోఁచుచున్నది. కేవలము మొదటినుండియు మహాభారతగ్రంథమునందుఁగూడ నా విశ్వాససంబంధమగు ప్రతిబింబము పడియుండవచ్చును. అది యాశ్చర్యము గాదు. అట్లు జరుగుటసంభవమే. మహాభారతకారుఁడు, కర్మకాండమును గూర్చి తెలుపుట వేదసారమునుగూర్చి ప్రబోధించుట మొదలగు నుద్దేశములతో నర్జును నాదర్శనరునిగను సుభద్ర నాదర్శనారీమణిగను వర్ణించినట్లును; ఈశ్వరునియందలి నిశ్చలభక్తియు నీశ్వర ప్రీతియుఁ గల యాదర్శపురుషప్రకృతిని బ్రదర్శించుటకొఱకు సర్వోత్తముఁడగు శ్రీకృష్ణుని యందు విశేషమగు నీశ్వరశక్తిని మూర్తీభవింపఁజేసి చూపుటను: గవి ప్రయాసపడినట్లును, గన్పడుచున్నది. అట్టి యీశ్వరశక్తి యే మానవప్రకృతియందును, ఏదేశమందును, ఏ కవిచేత నెప్పుడును బ్రదర్శింపఁబడియుండ లేదు. ఆదికవియగు వాల్మీకిగూడ నిట్టి సంఘటనమునకుఁ బ్రయత్నింపలేదు. మహాభారతకవి యిమ్మహాకార్యమునకుఁ గడంగెను. అతని ప్రయత్నము సకలముఖముల సఫలీకృతమగుటచేతనే మహాభారతము పంచమవేదమని ప్రఖ్యాతమయ్యెను, ఆ యీశ్వరశక్తికే నిర్లిప్తతయని పేరు. మూర్తీభవించిన నిర్లిప్తతయే శ్రీకృష్ణుఁడు.

ఈనిర్లేపము వైరాగ్యముగాదు. ఇది సాధారణముగా వైరాగ్యమని చెప్పుకొనునది

యును గాదు. దీని రహస్యమును నేనెంతవఱకు గ్రహించితినో భగద్గీతనుండి యొకశ్లోకము నీక్రింద నుదాహరించి తెలియఁజేయుచున్నాను.

శ్లో॥ "రాగద్వేష వియుక్తైస్తు,
విషయా నింద్రియై శ్చరన్;
ఆత్మయస్యై ర్విధేయాత్మా,
ప్రసాద మధిగచ్ఛతి"

రాగద్వేషవిరహితంబులు, నాత్మవశీభూతంబులు నగు నింద్రియములచే విషయోపభోగంబు లనుభవించుచు సంయతాత్ముఁడగు వాఁడే శాంతిని బొందుచున్నాఁడు.

అందుచేత నిర్లిప్తునకు నింద్రియ విషయోపభోగవివర్జనము నిష్ప్రయోజన మగుచున్నది. వర్జించుటయన సంలేపమే యగుచున్నది. వర్జనమునకుఁ బ్రయోజనము గలదు; ఇంద్రియముల కాత్మలోఁ బడినప్పుడు విచ్ఛేదమెన్నఁటికి నసాధ్యమని తెలియుచున్నది, కాని యింద్రియవిషయోపభోగములనుభవించుచు, వానియం దనురాగశూన్యుఁడై, సకలేంద్రియములను జయించి, యనుష్ఠేయ కర్మసంపాదనమునకు విషయముల నుపభోగించువాఁడే, నిర్లిప్తుఁడు. వానియాత్మకును భోగ్యవిషయములకును సంబంధము లేదు. వాఁడు పాపదుఃఖముల కతీతుఁడు.

ఈవిధముగా నిర్లేపమును, అనాసక్తిని ష్టముగాఁ బ్రదర్శించుటకై హిందూశాస్త్ర లొకవిధమగు కౌశలము నవలంబించి న్నారు. వారు నిర్లిప్తుని, అనాసక్తుని, అధికములగు నింద్రియ విషయభోగములచేఁ బరివేష్టింపఁ జేయుచున్నారు. ఇందుకొఱకే, మహాభారతమునకుఁ దరువాతిపురాణకవులు, శ్రీకృష్ణు నసంఖ్యవారాంగనా మధ్యవర్తినిగాఁ జేసియున్నారు. ఇందుకొఱకే తాంత్రికుల సాధనక్రియలయందు నింద్రియోపభోగవస్తువులు విశేషముగ నుపయోగింపఁ బడుచున్నవి. ఎవ్వఁ డీ యన్నిటియందును యథేచ్ఛముగా సంచరించుచు ననాసక్తుఁడై యుండునో యాతఁడే నిర్లిప్తుఁడు. ద్రౌపది బహుపతిత్వముగూడ నిందుకొఱకే.


స్త్రీజాతియందు ద్రౌపది మూర్తీభవించిన యనాసంగ ధర్మస్వరూపము. ఆస్వరూపముతో నామెను బ్రతిష్ఠించుటయే కవి యాశయము. అందుచేతనే ద్రౌపది గణికవలెఁ బంచభర్తృసమన్వితయయ్యును, సాధ్వియుఁ, బతివ్రతపరాయణయు నయ్యెను. ద్రౌపదికిఁ బంచపతిత్వ మేకపతిత్వమాత్రమే, ఉపాసించుట కేకవస్తుమాత్రమే, ధర్మాచరణమున కభిన్నంబగు నేకోపలక్ష్యమాత్రమే ధర్మాత్మునకు బహుదేవత లేక దేవతాస్వరూపమైనట్లు, జ్ఞాని కీశ్వరుఁడే యేకమాత్రంబగు నభిన్నోపాస్యం బైనట్లు, యనాసక్తయగు ద్రౌపదికిఁ బంచభర్తలు నేకమాత్రధర్మాచరణస్థాన మగుచున్నారు. వారి యందామెకుఁ బక్షపాతములు, భేదాభేదములు, మొదలగునవి లేవు. ఆమె గృహధర్మములయందు నిష్కామయు, నిశ్చలయు, నిర్లిప్తయునై యుండి కర్తవ్యపాలనముఁ గావించుచుండెను. ఇదియే ద్రౌపదీచరిత్రమునందలి

యసామంజస్యమున సామంజస్యము, కాని యిట్టి ధర్మనిర్వహణ మతి దుస్సాధ్యమైనది. మహాభారతకవి మహాప్రస్థానికపర్వమునం దీ సంగతిఁ జెప్పియేయున్నాడు. ద్రౌపది యర్జునియం దించుక పక్షపాతముగల్గియున్నదని చెప్పి యాపాపఫలమువలన నశరీరస్వర్గారోహణమున కనర్హయయ్యెననియు, నందఱకంటె ముందుగా మార్గమధ్యమునఁ బడిపోయినదనియుఁ జెప్పఁబడియున్నది.

ద్రౌపది యైదుగురుభర్తలవలన నైదుగురుపుత్త్రులనుమాత్రమే పడయుటకుఁ గారణమేమో మనకిప్పుడు బోధ యగుచున్నది. హిందూశాస్త్రానుసారముగా గృహస్థునకుఁ బుత్త్రసంపాదనము ధర్మము. దానియెడల విరతి యధర్మము. పుత్త్రుఁడు పుట్టినప్పుడే వివాహధర్మము సఫల మగుచున్నది. కానిచో నాధర్మ మసంపూర్ణమే యగుచున్నది, కాని యీ ధర్మ మేకపుత్త్రలాభమాత్రముననే సఫలమగుచున్నది. ఏకాధికపుత్త్రుల బడయుట ధర్మముకొఱకుఁ గాదు; అది కేవల మింద్రియలోలుపత మాత్రమే యగుచున్నది. ద్రౌపది నిర్లిప్తురాలు. అందుచేతనే ధర్మనిర్వహణమైన తరువాత నామెకుఁ బతులయెడల నింద్రియసుఖలోలుపత విచ్ఛిన్న మయ్యెను. పతి ధర్మపాలనముకొఱకు ద్రౌపది యైదుగురుపతులవలన నైదుగురు పుత్త్రులను మాత్రమే పడసెను. నిర్లేపవశంబున నింక సంతానమును బడయ లేదు. కవి కల్పనమున కిదియే ముఖ్యకారణ మని తోఁచుచున్నది.

ఇందువలన ననేకభర్తలను వివాహమాడినఁగాని, స్త్రీయనాసంగధర్మమును నిర్వర్తింపవలనుపడదని యెవ్వరును దలంపఁబోకుఁడు. దీని తాత్పర్యమిది. చిత్తశుద్ధిగలవారొకప్పుడు మహాపాతకమునఁ బడినను వారిని పాపము లంటఁబోవు. ద్రౌపది జీవితమునందలి యీసంఘటనముకంటె స్త్రీలోకమునకు మహాపాతకమింకొకటి లేదు. కాని ద్రౌపది చిత్తశుద్ధికలదగుటచే నామె యీమహాపాపమును గూడ ధర్మముగానే పరిణమింపఁ జేసికొనఁగల్గెను.

ద్రౌపది ధర్మబలంబున నతి దర్పితయని మొదటి ప్రకరణమునందే చెప్పియున్నాము. ఆదర్శమొక్కొకప్పుడు ధర్మమునుగూడ నతిక్రమించుచుండెను. ఆదర్శమునకును, ఇట్టి యింద్రియ విజయమునకును నెట్టి యసామంజస్యమును లేదు. కాని యామె నిష్కామధర్మము సంపూర్ణముగా ఫలించెనా? లేదా? యనునది ప్రత్యేకవిషయము.



ఆశీర్వాదము

తుమ్మల సీతారామమూర్తిచౌదరి గారు

అఖిల దేశోద్ధారకాగ్రగణ్యుండైన
నాగేశ్వరుని పోషణమున వెడలి
ప్రఖ్యాతపండిత ప్రవరు లర్పించిన
వ్యాసరాజములచే వాసికెక్కి
సకలాంధ్ర జనకరాబ్జములందు నివసించి
యతులితంబైన మర్యాదఁ గాంచి
సారస్వ తార్కిక సాంఘిక నైతిక
సర్వవిజ్ఞానతేజం బొసంగి
గీ. వత్సరప్రాయమున వన్నెవాసిఁగాంచి
యున్ననీకె చిరకాల మాంధ్రోర్వియందు
నెలమి వెలయించుఁగాత సర్వేశ్వరుండు
భారతీపత్రికామణీ! భవ్యవాణి.

ప్రపన్నుడు

సాహితీ సమితి సభాపతి శ్రీ శివశంకరశాస్త్రి

కాన వచ్చుట లేదు మార్గమ్ము నాకు,
ఊహ జనియింప దేమి చేయుటకుగాని,
అణచుకోజాల నీ మనోవ్యథల, నింక
నేమి చేతు ప్రభూ, సెలవిమ్ము నాకు!

ఆవరించెను నన్ను గాఢాంధకార
మన్యశరణమ్ము లేదు నా కార్తిహరణ,
దివ్యదీధితి పటల దేదీప్యమాన
మహితభవదీయ పాద యుగ్మమ్ము కన్న!

దేవ, నీయిచ్ఛ యెట్టిదో తెలియరాదు!
బుద్ధివైభవ మేను సంపూర్ణ గతిని
వదలి, నీమీది గాఢ విశ్వాస మున నె
మసలుచున్నాడ నెటో లోక మధ్యమందు.

శిథిల మైపోయె నాథ, నిశ్శేషముగను
దాసజనునకు నిపుడు స్వాతంత్ర బుద్ధి
యంత్రసదృశుని తావకేచ్ఛానుసార
సరణి నడిపింపు మో ప్రభూ, సత్పథమున!

శ్రీ కృష్ణుని కృప

భమిడిపాటి పట్టాభిరామయ్య గారు, బి. ఏ., ఎల్. టి.

౧. సత్కుటుంబచరిత్ర

బ్రహ్మశ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు గోపాలపల్లి (అను) కాపురస్థులు, సదాచార సంపన్నులు, బహునిష్ఠాపరులు. ఈ యగ్రహారమునం దుండిన యితరవైదికు లందరు స్వగ్రామము వదలి పట్టణములం జేరిరి. కాని శాస్త్రిగా రట్లు చేయ నొల్లక, తండ్రితాతలుండిన యగ్రహారమే కురుక్షేత్రముగ నెంచి, పాలుకు భూకృషిచే లభించు వందరూపాయలే లక్షలుగ భావించి, 'హాలికులైన నేమి గహనాంతరసీమల కందమూలకాశ్యాలికు లైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై' యను మత మవలంబించి కాలము గడపుచుం డిరి. ప్రాతఃకాలమున నిదుర లేచి యేటిలో స్నానముఁ గావించి సంధ్యాదినిత్యములు సలిపి, పొలముఁ జూచికొని, మధ్యాహ్నమున నిల్లుచేరి గృహిణి తన కిడిన యన్నము భుజించి, యపరాహ్ణమున జందెములు వడుకుచు, కుమారునికి వేదము నేర్పి, దినములు గడపుచుండెను. అయాచితముగ ప్రాప్తమగు దానిని గ్రహించునే కాని యాచింపనొల్లఁడు.

వేదమునందు పారంగతు లగుటయే కాక, గానమునందుసైతము శాస్త్రిగారు నిరుపమాన పాండిత్యము గలవారు. ఇందు భక్తియుక్తము లగు పాటలం బాడుదురు. తదితరముల వర్జింతురు. గానము వీరికుటుంబవిద్య యనందగు. అనేక సంవత్సరములక్రిందట వారి పూర్వులలో నొకరు నారాయణ తీర్థులవారి శిష్యులఁట. అందుచేత, తరంగములు, అష్టపదులు, అధ్యాత్మరామాయణమునందలి కీర్తనలు, త్యాగరాయకృతులు మున్నగు వానిం బాడుటయందు శాస్త్రిగారు ఖ్యాతి వహించిరి.

శాస్త్రిగారి బాల్యమున గోపాలపల్లిలో నుండి తరువాత పట్టణముల కేగిన కుటుంబములలో నిష్ఠలవారి కుటుంబమును, శాస్త్రిగారిబంధువులగు అనపిండివారి కుటుంబమును పేర్కొనఁదగినవి. ఈ వంశముల బాలు రిరువురు చిన్నతనమున వీథిబడిలో శాస్త్రిగారి సహపాఠులు—నిష్ఠలకృష్ణశర్మయు, అనపిండి నరసింహసోమయాజియు. వీరిరువురియందు బాల్యమునందే వేర్వేఱు గుణముల యంకురములు చూపట్టినవి. కృష్ణశర్మ కేవల సత్త్వమూర్తి. బడియందు నియమితపాఠములం జదువుట, గురువుగారిప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మిడుట, మరలి యింటి కేగుటయే తప్ప, యనవసరవిషయములం దగులు కలుగఁ జేసికొనఁడు. ఈతఁడు మితభాషి, బుధవిధేయుఁడు. కావున గురువుగారి కితనియందుఁ బ్రీతి యెక్కువగ నుండెను.

సోమయాజి పూర్వులలో నొకండు యజ్వ. కావున నితనికి వంశక్రమమున నీ పావననామధేయము కల్గెను; కాని, యీతఁడు బహుదుర్వర్తనుఁడు; కుటిలచిత్తుఁడు; తనకంటె బాగుగ నుండువారిం జూచిన నసూయఁ జెందువాఁడు.

ద్విపద. "ఒక్కచోటనె గుమిగూడు నిక్కముగను
రెక్క లొక రంగు గల్గిన పక్కిగుంపు"
అని యాంగ్లేయులోకోక్తి కలదు. మఱియు,

ఆ. "కప్పురము చందనంబును కలయుభంగి
సజ్జనుఁడు గూడు ననిశము సజ్జనులనె;
భంగు ధత్తూరు చేరడి భంగి నెపుడు
దుర్జనుం డిలఁ జేరును దుర్జనులనె."

అని భక్తాగ్రేసరుఁడు కబీరువల్కె. అట్లే బడియందును క్రీడారంగమునందును, శాస్త్రియు శర్మయు నరనారాయణులవలె నన్యోన్యమైత్రితో మెలఁగుచుండిరి. సోమయాజియో తనవంటి దుష్టులంజేరి పైయిరువురి

నతిరము హేళనచేయుచు, పెక్కుతెరంగుల బాధపెట్టుచుండెను.

ఒకనాఁడు వీరుచదువుచుండెడి బడికి చిన్న ఇన్స్పెక్టరుగారు పరీక్షార్థమై విజయముచేసిరి. సోమయాజి చదువులోఁగూడ దొంగయై యితరులచేతఁ బని చేయించుకొనుచుండెను. ఇక్కారణముచేఁ, బ్రశ్నలకుఁ బ్రత్యుత్తరము లొసఁగుటకుఁ దా నసమర్థుఁడని తెలిసి, తనకు పరీక్షయందు సాయముచేయకుండినచోఁ గొట్టుదు నని సోమయాజి శాస్త్రిశర్మలను ముందుదినము బెదరించెను. ఈసంగతి యుపాధ్యాయుం డెఱిఁగి, ఇన్స్పెక్టరుగారు రాకమునుపే తాను ప్రశ్నలువేసి, ప్రత్యుత్తరము లిడినవారిని పైకి పంపి, సోమయాజిప్రభృతులను దరగతి చివరకు దింపెను. ఇట్లు మంచికుఱ్ఱవాండ్రకు దూరమునం జిక్కి పరసాహాయ్యప్రాప్తి లేమింజేసి సోమయాజి మతియొక వత్సర మాతరగతిలోనే యుండ వలసివచ్చెను.

కావున బాల్యమునుండి శాస్త్రిశర్మలకు మైత్రియు సోమయాజికి వీరిరువురితోడ వైరము నుండెను. కాలక్రమమున నీ రాగద్వేషములు హెచ్చెను.

౨. పెండ్లిమాటలు

నలువదిసంవత్సరము లాయెను. శాస్త్రి యొక్కఁడే తనగ్రామమునందుండెను. కాని తదితరులు పట్టణాంతరములకేగిరి. సోమయాజి పోలీసు సబిన్స్పెక్టరై ఇన్స్పెక్టరు కానుండెను. అతనికి పిల్లలనేకులు పుట్టి చనిపోయిన తరువాత "సన్యాసయ్య ధర్మవరమున" కేగి మ్రొక్కిన తరువాత కుమారుఁ డొకఁడుకలిగె. కావున నీతనికి "సన్యాసయ్య" అను నామంబిడిరి. విత్తమెంత ఖర్చుపెట్టినను ఈతనికిఁ జదువంటదాయె. పదునెనిమిదవ సంవత్సరమున మూఁడవఫారములో మూఁడేండ్లుమురుఁగుచుండెను. సోమయాజి తన భూముల నమరకము చేయుటకును, శిస్తు వసూలుచేయుటకును స్వగ్రామమునకు తఱుచు వచ్చుచుండెను. వచ్చినప్పుడెల్ల శాస్త్రియింటనే "తిష్ఠ" వేయుచుండెను.

శాస్త్రికి యిరువదిరేండ్లకుమారుఁడు ముకుంద శాస్త్రియు, తొమ్మిదిసంవత్సరముల కూఁతురు రుక్మిణియు నుండిరి. కుమారుఁడు స్కూలుఫైనలు ప్యాసుచేసి "ట్రెయినింగు" పూర్తిచేసికొని, యాగ్రామమందే బోర్డుబడిలో పాతికరూపాయల జీతముపైఁ బ్రధానోపాధ్యాయుఁడుగ నుండెను. తండ్రిగారియొద్ద వేదాధ్యయనమును చేసెను. కావున వైదికకర్మలు జరిపించుటకు నైతము సమర్థుఁడై యుండెను. అదియునుంగాక తండ్రియొద్ద సంగీతము నేర్చుకొని భగవన్నామసంకీర్తనముకూడ చేయుచుండె.

కృష్ణశర్మ చదువులో బహుకుశాగ్రబుద్ధి యగుటంజేసి సర్కారువారి ద్రవ్యసాహాయ్యముచేఁ బట్టపరీక్షలలో నుత్తీర్ణుఁడై గొప్ప యుద్యోగముంబొందె. కాని, తొమ్మిదవయేఁట నాగ్రామము విడిచినమొదలు తన స్నేహితుఁడగు శాస్త్రిని కలుసుకొనలేదు.

ఒకనాఁడు రాత్రి పదిగంటలాయెను. కృష్ణశాస్త్రి నిత్యభజన వేణుగోపాలస్వామియాలయమున నొనర్చి యింటికివచ్చి పరుండి నిదురించుచుండె. ఎవరో తలుపు తట్టిరి. ఎవరనియడుగ, "నేనేనోయి, శాస్త్రీ!" అని బదులువచ్చె. గొంతుకంబట్టి సోమయాజియని యెఱింగి శాస్త్రి యాతనిని లోనికిరమ్మని తలుపు తీసెను. అంతట సోమయాజి, భార్యాపుత్రసమేతుఁడై లోనికి వచ్చి "అబ్బ! ఈదిక్కుమాలిన గ్రామానికి రావాలంటే యమయాతనరా! బాబు! ప్రొద్దున ఆరుగంటలకు నందస్టేషనులో రైలుదిగితే బండిలేదు. పోలీసుమూండా వాణ్ణిగనుక ఎలాగో ఓలాగ బండిచేయించుకుని ఇక్కడికివచ్చి పడేటప్పటికి, చూశావా రాత్రిపదిన్నర. అబ్బ! కాస్త ప్రసాదంమాట చూతూ!"

పాపము; శాస్త్రిభార్య ఇంటివెలుపలనుండెను. కుమారుఁడు, ప్రెసిడెంటుగారి సెలవైనదని యొక యుపాధ్యాయుల సమావేశమునకుఁ బట్టణమున కేగి యుండె. పాపము! ఆ నడిరేయి రుక్మిణి పొయ్యి రాజవేసి, వచ్చినవారికి, బండివానికి వండి వడ్డించి, వారల సంతృప్తులంజేసె. అంతట వారెల్లరు నిదురించిరి. చిరుచీఁకటి, కోడికూసినవెంటనే, రుక్మిణి నిదురలేచి, గోమయముతో నిల్లువాకిలి యలికి, ముగ్గువెట్టి, బిందెయు, పూలసజ్జయుఁ జేబూని, యేటికేగెను. స్నాతయై, బిందియనిండుగ నీరు నింపి, వేణుగోపాల

స్వామి యాలయమున కేఁగి, స్వామికి నమస్కరించి, తండ్రిగారి పూజార్థము బుట్టలోఁ బూవుల నునిచి, యింటికివచ్చి పసుపుచీర, కుంకుమ ధరించెను. పసుపుఁ బూసికొనిన మేనఁ గుంకుమ పెట్టినంతనే యాయింటి లక్ష్మియో! "రమా భగవత్యంశోద్భవ" యను నభినవ రుక్మిణియో! యన నొప్పె. వంటచేసి, తులసిపూజ, గౌరీపూజ సలిపి, వీణ చేలంబట్టి, స్వీయకీర్తనములు కలియ, మధురగానము సేయుచుండెఁ, ప్రత్యక్ష సరస్వతి యననొప్పె.

సోమయాజి కుటుంబసమేతముగా వచ్చుటకుఁ గారణమేమన, తన కుమారుఁడగు సన్యాసయ్యకు రుక్మిణికి వివాహము చేయుట కేర్పాటుకొనుటకే. రుక్మిణి, తనయన్న యొద్ద చదువు నేర్చియుండుటయే కాక, పనిపాటలు సైతము నేర్చియుండుటం జూచి, సోమయాజి యానందభరితుఁడై తన భార్య నేకాంతమునఁ జెంతఁ జేరి యిట్లని సంభాషణము సేయఁదొడఁగె.

సో:—ఏమిచే! కబురు.

భార్య:—ఏమిటండోయి?

సో:—పిల్ల ఎలాగుంది? నేం చెప్పినవల్లా నిజమే గా?

భా:—మా బాగా చెప్పారు. అలాంటి భార్యరావడం మన దద్దన్నకు కలగాలేగదా! మనవాడి కాపిల్ల నిస్తారని నేనమ్మను.

సో:—ఇవ్వడం పూసు నీ కెందుకు? ఇవ్వకుంటే ఇప్పిస్తాను. నీమనసుకు నచ్చిందా?

భా:—అటువంటి మణిని చూస్తే ఎవరికి నచ్చదు? ఆపిల్లను పెండ్లాడేటంత భాగ్యము మనవాడికున్నదా అని సందేహమే కాని ఈ మొద్దు కాపిల్లను కట్టపెడితేమట్టుకు సంసారం ముచ్చటగా వెళ్లుతుందా? అదొకటి ఆలోచించండి.

సో:—ఓసి! పెద్దమ్మా! శకుని పలుకులు పలకకు! ముడిపడితే ముచ్చట్లవే వొస్తాయి. అద్దుగా అశుభ కబుర్లాడకుమీ!

భా:—నే నేమన్నానండీ? పిల్లదేమో ముద్దులమూట. పనిపాటలన్నీ వొచ్చు. కాని ఆపిల్ల రూపురేఖలు పనిపాటలు, తెలివితేటలు చూస్తే, ఎక్కడనో గొప్పయింటిలో మంచి చదువరిని పెండ్లాడే యోగమున్నట్లు కనిపిస్తుందిగాని, మన నిరక్షరకుక్షికి భార్య అయ్యే యోగమున్నట్లు తోచదు. అదిగాదు గనక మనసులోవున్నది చెప్పాను. కోపమెందుకు?

సో:—గొప్పయింటిలోనికి పిల్లనివ్వడమంటే మాటలటే? దానికి తగినట్టే కట్నాలు కానుకలు లాగరా? రెండువేలరూపాయలు చేతపట్టుకుంటే సూక్కులు ఫైనలు పంచాంగంపట్టు దొరుకునేమో? ఆపైని చదువు స్థితిగతులుంటే దానికి తగినట్టే ఉంటాయి కట్నాలు కానుకలున్నూ! శాస్త్రిగాడివద్ద, వాణ్ణి అమ్మినా, రెండువేలు కాదు గదా రెండువందలు కూడా లేవు. పెద్దసంబంధాలు వీడి కెలా వస్తాయి?

భా;—అయితే మీరుకూడా కట్నం అడుగుతారా ఏమిటి?

సో:—తప్పకుండాను. వెయిన్నీ మాటలవల దల్లడక్క మానను.

భా:—అయితే అసలు పోవడానికే దారి.

సో:—ఛీ, వెధవా! వెళ్లిపో అవతలికి. ఒళ్లు మండుతుంది. సామితచెప్పినట్టు శుభంపలకరా పెండ్లికొడుకా అంటే.........

భా;—మీ యిష్టం మరి. [నిష్క్రమించును.]

3. భీతి

ఈసంభాషణ కొంత గోడ అవతల వంటగదిలో నుండి రుక్మిణి వినెను, తండ్రి దరిద్రుండనియు గొప్ప కట్నములు కానుకలు నతఁడివ్వలేఁడనియుఁ దెల్లమాయెను. తత్కారణముచేత నెవఁడో యభాజనుని కిచ్చునేమోయను భీతి గూడఁ గల్గెను. "ఇవ్వకున్న ఇప్పించెద" నని సోమయాజి పల్కె. ఇచ్చునట్లు చేయుటకుఁ దనతండ్రి నేమి చిక్కులఁబెట్టునో, యీశ్వరా! యని రుక్మిణి భయమునఁ గొనెను. సాయంకాలము మరల యేటికి నీళ్లకుఁబోయి, తలదువ్వి జడవేసికొని, పువ్వుచుల ధరియించి గోపాలస్వామి కోవెలకుఁబోయి స్వామికి నమస్కరించి, మనసులో నిట్లు మొఱలిడెను:—

"దేవా! వినుదఁట జీవులమాటలు, చనుదఁట చనరాని చోట్ల, శరణార్థుల కోయనుదట." నిజమేనా? అయినచో నీభక్తుని నిష్కళంకుని సద్బ్రాహ్మణుని మాతండ్రిని రక్షింపుము. నా కట్టి పెనిమిటి నిచ్చినను సరే. నీచిత్తమని సహించెదను. కాని నావలన నాతండ్రి ఋణపీడితుఁడైనను, దిక్కులలోఁ బడినను, సహింపఁజాలను. ఇప్పుడు నీపాదములచెంతనే ప్రాణత్యాగముఁ జేసికొందును. నిక్కము, నిక్కము, ముమ్మాటికి నిక్కము. ఈసోమయాజిని జూడ నాకు యమదర్శనమువలె నున్నది. నామాట కేమి! నాన్నగారిని వలలలోఁ బడకుండఁ గాపాడుము జగద్రక్షకా! నీకు దయరాకున్నచోఁ జెప్పిన పనిచేసి తీరుదును సుమీ!"

అని యెదుటనున్న వానితో మాటలాడునట్లు, కన్నీరు బొటబొట రాలఁగా విలపించెను. కనులు విప్పి స్వామిం జూడ విగ్రహము చిరునవ్వు నవ్వినటులఁ దోఁచెను. రుక్మిణి హృదయము ధైర్యమునొందె. అంతట నాపిల్ల యింటికి వెడలిపోయి మరల రాత్రి వంటమొదలగు పనులఁ జేయందొడంగె.

తా నేకాంతమునఁ బ్రార్థించెనని రుక్మిణి యనుకొనెను కాని, దుఃఖోద్రేకముచే నుడికినమాటల నొకఁడు వినెను. ఈతఁడా కోవెల పూజారి కుమారుఁడు రంగాచారి. బడిలో నితఁడు, ముకుంద శాస్త్రియుఁ గూడి బాల్యమునఁ జదివియుండుటం జేసి రుక్మిణియెడల సోదరభావము వహించి "చెల్లమ్మా" యని ప్రీతితోఁ బిలుచుచుండును. ఈకారణమున రుక్మిణిపలుకులు విన్నట్లు నటించిన నాచిన్నదాని మనసున కాయాసము కల్గునని యెంచి మిన్నకుండెనే కాని, తన చేతనైనంత సాయముఁ జేయుటకు దీక్ష వహించెను.

రుక్మిణిని దవకోసలుగాఁ జేయుటకు బహుకాలముక్రిందనే సోమయాజి దూరాలోచనతో నెత్తు వేసియుండెను. మూఁడుసంవత్సరములు ముందు ముకుందశాస్త్రి వివాహము జరిగెను: తండ్రి మహానీతిమంతుఁడుగాన కట్నముల నంగీకరింపలేదు. ఉపరి, పెండ్లిఖర్చుల నిమిత్తము, అయిదువందల రూపాయ లప్పుచేసెను. 'దేహి' యని యడిగినచో నీయన వాతనికి లభించియుండునుగాని యుచితముగాఁ బరవిత్తము గ్రహింప నొల్లక, తనకున్న గోష్పాదము భూమిని సోమయాజియొద్ద తనఖాపెట్టి, అయిదువందల రూప్యములకు దస్తావేజు వ్రాసి యిచ్చెను. కావున తన యిచ్ఛానుసారముగ శాస్త్రి వర్తించనిచో నొక్కట కీదస్తావేజు సోమయాజిచేత బ్రహ్మాస్త్రమువలె నుండెను.

ఈ రోజునఁ బగలంతయు శాస్త్రియు సోమయాజియుఁ బొలములం జూచుకొనుచుండిరి. రాత్రి భోజనముసేయు సమయమున సోమయాజి తలపెట్టిన సంబంధము విషయమై యిట్లు చర్చఁ జేయఁదొడంగె.

సో:—అయితే, అబ్బి! రుక్మిణి కేదైనా సంబంధము చూశావా? దాదాపు పదకొండేండ్లు నిండిన వనుకొంటాను.

శా:—ఆలోచింపతగ్గదే. ఎవరి నడిగినా కట్నాలు కావాలంటారు. ఛీ! కాలగతి చూశావా?

సో:—ముకుందానికి పిల్లతో నీవు కట్నం పుచ్చుకుని ఉంటే ఎంత బాగుండును? ఇప్పటి యవసరానికి పనికివచ్చియుండునా?

శా:—శ్రీహరీ! చేసినపాపాలు చాలక యిదికూడానా?

సో:—సింగినాదం! జీలకఱ్ఱ! లోకమంతా తొక్కేతోవ మనంకూడా తొక్కితే పాపమేమి? అదికాక నీ కాడపిల్ల యుండుటచే లాభించి యుండునుగదా? రేపు రుక్మిణి పెండ్లిచెయ్యాలగదా, యేంచేస్తావు? మాసన్నగారికి కెవరైనా పిల్లనిస్తామంటే నామట్టుకు నేను వెయ్యిన్నీ నూటపదహార్లు కక్కించకమానను.

శా:—పీకపోయినాసరే ఇంత తులసీదళము తీర్థము ధారపోసి, ఒకపసుపుకొమ్ముతో శ్రోవతు పాఠ్యే బ్రహ్మచారి కిస్తానే గాని కట్నాలిచ్చి కన్యాదానఫలం పోగొట్టుకుంటానా!

సో:—ఓరి! నీచాదస్తంగూల! పోనీ, కట్నమే లేదనుకుందాం మాటకు, పెండ్లిజరగవలెనా? పదిమంది రావడం పోవడం; సంతర్పణాలు వడ్డించడాలు, లేనిది కాదుగదా, దాని కేమంటావు? నీభూమి నాతనఖాలోనున్నది. మఱి యెవ్వడు దానిమీద దమ్మిడీ నీకివ్వడుగదా. ఏంపెట్టి పెండ్లిచేస్తావు? [తనలో] యిహ కట్నాలుకావాలంటే అసలు చెడేలాగుంది వ్యవహారం.

శాస్త్రి:—వరుడు లభిస్తే చేసేతోవ కృష్ణుడే చూపెడుతాడు.

సో:—నీ పిల్లకేదలా కూర్చుంటే పైబడి వరు డెవడొస్తాడోయి? నాలుగు చోట్లకు వెళ్ళి, వాళ్ళను వీళ్ళను అడిగి సంబంధాలు తెచ్చే శ్రమ నీవు పడాలవని తెలిసే, నేను మా సన్నిగాడి పేరెత్తాను. గ్రహించావో లేదో!

శాస్త్రి:—అంటే, మీసన్నయ్యకు రుక్మిణిని పుచ్చుకోవలెననా నీతలంపు?

సో:—మరేమి?

శాస్త్రి:—బాబూ! మీరందరు కట్నాలగాళ్ళు. నీకివ్వడానికి వెయ్యినీ నూటపదహార్లువన్నమిత్తి లేవస్తుందా?

సో:—అచ్చే! ఏదో మాటకలాగన్నానుగాని, మనలో మనకు కట్నాలేమిటోయి! అథవా, నీవిచ్చినా నే పుచ్చుకుంటానట్రా? [ఎవరో తలుపు తట్టిన శబ్దము విని రుక్మిణి తలుపు తెఱచును]

రుక్మిణి:—నాన్నా! అన్నయ్యొచ్చాడు.

సోమ:—బాబూ! వచ్చావూ? పట్నంలో నేమి వింతలు? శాస్త్రీ! వీడు పెరగ్గా పెరగ్గా అచ్చా! నీలాగ తయారౌతున్నాడోయి!

శా:—(ఏమియులోచో) ముకుందం! మన రుక్మిణిని నన్నయ్య కిమ్మంటున్నాడ్రా సోమయాజి. ఏమంటావు?

ముకుం:—మామా! మీకు కోపం రాదుగదా? పెద్దలకు నేను చెప్పదగ్గవాణ్ణి కాను గాని, నాలుగు సంబంధాలు చూచిన తర్వాతే నిశ్చయించడము శ్రేయస్కరమని నామనవి.

రుక్మిణి:—(తనలో):—భలే! శ్రీకృష్ణుడు నాపాలిట నుండి అన్నయ్య నిలా పలికించాడు.

సో:—(తనలో) ఓహో! ఈ గుంటవెధవ అక్షింతల్లు పెట్టేటట్టు కనిపిస్తున్నాడు. కాస్త చెట్టుమీద వుంటే గాని మర్యాద దక్కదు. వీడు అబ్బలాంటి చాదస్తుడు గాడు. గడుసుబుజ్జి. (బహిరంగముగా) శేషు! బాగా చెప్పావు నాన్నా! వయసులో చిన్నవాడైనా మంచి లోకానుభవం గల పెద్దవాడిలాగ పలికావు. నేను ఆమాటే మీనాన్నతో చెప్పానిప్పుడు. నాలుగూళ్లుతిరిగి నాలుగుసంబంధాలుచూడమనే. నేనుసన్నిగాడిమాట యెందుకెత్తానంటే, నాకు సంబంధాలు లేక కాదు. స్థితిగతులున్నవాణ్ణి గనక పైబడివచ్చి అడుగుతున్నారు; గాని, శాస్త్రి చిరకాలపు స్నేహితుడు. ఎక్కడనో తెలియని సంబంధాలు కలిగించుకోవడాని కంటే, మన రుక్మిణి అయితే వంశమంతా తెలిసినవాళ్లే. రేపు మా యింటికి వచ్చినా కొత్తగా వుండదని ఆలోచించానే కాని వేరులేదు.

ముకుం:—నాకు వట్టుకు నమ్మకంలేదన్నానా? నాలుగు చోట్ల, చూడడం మంచిదన్నానే కాని వేరులేదు.

సో:—మరి నాకేదో నిశ్చయంగా తెలిస్తే గాని, ఇతర సంబంధా లంగీకరించడరూ మానడమా!

ముకుం:—అయితే! తమరు నాన్నగారి చిరకాల స్నేహితులు గనుక సంవత్సరాదిదాకా నాకు "టై" మివ్వండి.

సో:—(గొణుగుచు) ఔనులే. ఈలోపుగా యెన్ని సంబంధాలు జారిపోతాయో. అదీకాక మరియొకరైతే కట్నాల దక్క తప్పదు. నేను, మీరిచ్చినా పుచ్చుకునేవాణ్ణి కాను. మీ నాన్న యిచ్చే స్థితిలో లేడు. నీవెఱుగవా?

ముకుం:—(మనసునొచ్చి):— ఆయన యివ్వడనండి. సమ్మతంకాదు. స్థితి కేమిటెండి, భగవత్కృపయుంటే, ఇచ్చే స్థితి కలుగగూడదా?

సో:—వహావా! శాస్త్రికొడుకులాగే మాట్లాడావోయి!

ముకుం:—[మాటలు పెంచుట కిష్టములేక] చెల్లమ్మా! ఏదో కాస్త ముద్దపడేమా. చెవులు ఖుడేలు పడి పోతున్నాయి.

సో:—(తనలో) వీడు ఘట్టిగా అడ్డుతాడు. నిశ్చయం. (బహిరంగముగా) అబ్బీ! శాస్త్రీ! లేవావా? ఏమిటేమో పరధ్యానముగావున్నావు? చేతులు కడుక్కొని వీనరుగుమీద కదుదాము రా.

ఆరాత్రి విశ్రమించి మఱునాడు దుదయమున సోమయాజి కుటుంబ సమేతముగా వెడలిపోయెను.

"అబ్బీ! శాస్త్రీ! అయితే సంవత్సరాది లోపుగా రుక్మిణి పన్నగాడి కిచ్చేదిలేనిది తేలిస్తేనేగాని, మా చెడ్డ చిక్కు పడి పోతామసుమా" అని బండియెక్కెను, "అలాగే" అని శాస్త్రిపలికెను.

ముకుందశాస్త్రి యూరు చేరినవెంటనే వాడుక చొప్పున వేణుగోపాలస్వామి దర్శనము చేయుచుండ, రంగాచారి రుక్మిణిచేసిన శపథముం గూర్చి యాతనితోఁ జెప్పి "నీవు మెలకువగా నుండకపోతే ఘోరం జరుగుతుంది ముకుందం!" అనెను. ఇంటికి వచ్చినతోడనే సోమయాజి మాటలంబట్టి యాతఁడు తనతండ్రిని నిర్బంధించుచున్నాఁడని గ్రహించి, పైఁజెప్పినరీతి మాటలాడెను. తర్వాత రుక్మిణియు ధీతిసూపుమ మాటలాడెను కాని తాఁజేసిన శపథముమాత్రము చెప్పలేదు.

మరునాఁడీ విషయముంగూర్చి ముకుంద శాస్త్రి తండ్రి నడుగఁగా నాతఁడు "వరాన్వేషణకై నేను దేశాటనము చేయజాలనురా" అనెను.

ముకుం:—నాన్నా! సెలవైతే తిరిగితిరిగి యెన్నితంటాలైనా నేపడుతాను గాని, ఈపన్నగాడి కిచ్చేమాట కలలో తలపెట్టకండి.

శాస్త్రి:—నాకు అంత యిష్టములేదురా. ఎందుకంటే, సోమయాజి మొదటినుండి దొంగవెధవ, నాడి సంతతితో సంబంధము మంచిదికాదు. నిజమేకాని, యేంజేయను? మఱియెవరైనా అయితే కట్నం తెమ్మంటారు. అదీకాక, వీడి కొడుక్కివ్వకుంటే, తనఖాసొమ్ము అసలుఫాయిదాలతో క్రిందపెట్టి మరి మాట్లాడమంటాడు. ఏంగతి? వాడంతటి వాడేను. దయాదాక్షిణ్యాలు లేవు. స్వభావము—పాముపగ.

ముకుం:—అంచేతనే; వాడితో సంబంధం తలపెట్టకండి. నేనెలాగైన చచ్చి చెడి మఱియొక సంబంధం తెస్తాను. మీకెందుకు? కాస్త తంటాలు పడకుంటే తగిన వరు డెలా వస్తాడు?

శాస్త్రి:—కృష్ణుడేదిక్కు.

ముకుం:—నిజమే; అయినను మనుష్యయత్నము చేసి, తరువాత దేవునిపై భారము వేయవలెనే కాని, ఊరక కూర్చుని భగవంతునిపై భారము వేయుట తగదు. తనకు తాను సాయము చేయువానికే దైవము తోడ్పడునని యాంగ్లేయ లోకోక్తి కలదు.

శాస్త్రి:—నీకు ధైర్యముంటే వెళ్ళు. నే నడ్డుచెప్పను.

ముకుం:—రేపు క్రిస్మస్ సెలవులలో గోదావరిజిల్లా కెళ్లితే మన ద్రావిడివారు ఘట్టలున్నారు. మంచి శ్రోత్రియులు కూడాను. పద్యంతము లోని పిల్ల దొరికితే కట్నాలుకూడా మానివేయురేమో.

శాస్త్రి:—శుభం! వెళ్ళునాన్నా. [తపాలావాఁడు ముకుందశాస్త్రి చేతికొక యుత్తర మిచ్చును] ఏమిట్రా అది, సోమయాజి దస్తూరిలా గనిపిస్తుందే.? ఎక్కడిది పోస్టుముద్ర?

ముకుం:—రైలులో తపాలాబండి ముద్ర. వెళ్ళుచూ వ్రాసినట్టు కనిపిస్తుంది.

శాస్త్రి:—ఏమంటాఁడా? చదువు.

ముకుం:—[చదువును] బ్రహ్మశ్రీ వేదమూర్తులైన వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి బావగారికి అనపిండి సోమయాజి అనేక నమస్కారములు చేసి వ్రాయుంగల విన్నపములు—ఉభయకుశలోపరి.

నిన్న సంబంధమాటలలో ఒకటి చెప్పుటకు మరిచినాను. ఒకవేళ చి. సౌ. రుక్మిణిని మాపన్నయ్య కిచ్చుటకు నీకిష్టము లేనియెడల నావద్ద నీవుంచిన తనఖా బాలాకు అసలుఫాయిదాలు ఈవుత్తర మందిన నెల రోజులలో నాకు చెల్లించవలసియుండును గాన యిందు మూలముగా తెలియపరచడమైనది. ఇంతే నమస్కారములు. చిత్తగించవలెను.

ఇట్లు విధేయుడు
"అ. నరసింహసోమయాజి."

ముకుం:—నే ననుకుంటూనే వున్నా, యిలాటి పిసుగేదో తెస్తాడని.

శాస్త్రి:—అయ్యో! ఏందారిరా! బాబూ! ఇప్పుడైదు వందలరూపాయ లియ్యమని పీకలమీద కూర్చుంటే నేనెక్కడికిపోనురా!

ముకుం:—ఎన్ని బాధలైనాపడి యాతని యాధీనత నుండి తప్పుకుంటేనే కాని మనకు క్షేమం కాదు. పెండ్లికంటే ముందీ ప్రయత్నము కర్తవ్యము.

శాస్త్రి:—(మాసిన గడ్డము, తడవుదు) కర్తవ్యమే! ఒక్కటైనా దారి కనిపించదు.

ఇంతలో తండ్రిపడెడి మనోవ్యాకులము గ్రహించిన రుక్మిణి చింతాక్రాంతయై గోపాలస్వామి సన్నిధి కేగి మ్రొక్కె. అంతట మనమున ధైర్యము పొడమె. భిరభిర యింటికి మరల వచ్చె. ఆనాడు రేయి రుక్మిణికి వింతయగు స్వప్నము గానిపించె. వేణుగోపాలస్వామి దివ్యసుందరమూర్తిగాఁ గాన్పించి "గోదావరీస్నాన మొనరించిన నీకు సద్గతికల్గు" నని చెప్పి యదృశ్యుఁడాయెను. మఱునాఁడు తల్లిదండ్రులతోను అన్నతోడను చెప్పెను. తల్లిదండ్రులు ఖర్చుకు వెఱచి రాఁజాల మనిరి కాని, ముకుందశాస్త్రి యావంతయు భీతిల్లఁడయ్యె. తాను గోదావరిజిల్లా కేగ నిశ్చయించుటయు, చెల్లియకుఁ గల్గిన యాస్వప్నమును బహువింతగాఁ దోఁచె. తాఁ బూనిన కార్యము సిద్ధించుటకుఁ గృష్ణుఁడు తోడ్పడునను ధైర్యము కలిగె. తీర్థయాత్రకు వెళ్ళినట్లు చెల్లెలిం గూడ వెంటఁబెట్టుకొని వెళ్ళినయెడల, పలుగురు పిల్లను చూచుట కవకాశము కల్గునని చెప్పఁగాఁ దండ్రి యంగీకరించెను.

గ్రీష్మము సెలవులలో ముకుందశాస్త్రియు రుక్మిణియు రాజమహేంద్రవర మేఁగుదు రని విని, రంగాచారి యాయూరనుండు తన మిత్రవారి యింట వీరికి బస యేర్పాటుచేసెను.

బయలుదేరుటకు శుభదినము నిశ్చయించిరి. క్రొత్త యూరిలో నగలు దాఁచుట కష్టమని తన నగలను రుక్మిణి తల్లి కప్పగించెను. వెంటనే వేణుగోపాలస్వామి కోవెల కేగి సగము గొణుగుచు నిట్లు మొఱలిడెను.

"దీనరక్షకా! అలనాఁడు నీవు కుచేలునికి సిరు లియ్యలేదా? అటులనే నేఁడు మానాన్నగారికి దారిద్ర్య బాధ తొలగింపలేవా? వేయేల? నీ కృపయుండినచో నీదర్శనము చేసికొనయెద; లేదా నగలుసైతము అమ్మకు అప్పఁజెప్పి ఆఖరు సెలవు నీయొద్దఁ బొందుటయే. కడసారి దండముఁ గైకొమ్ము."

...మునుపటివలెనే యీమాటలు సైతము రంగా...చెను

౪. భగవదనుగ్రహము

ముకుందశాస్త్రియు రుక్మిణియు రాజమహేంద్రవరముఁ జేరిరి. ప్రతిదినము రుక్మిణి గోదావరిలో స్నానముచేసి మడినీరు తెచ్చి వంటచేయుచుండెను. అనుదినము ముకుందశాస్త్రి యాయూరనుండెడి ద్రావిడ కుటుంబము లెవ్వియో కనుఁగొని ఒక్కొక్కరి యింటికి వరాన్వేషణకై వెళ్ళుచుండె. అనేకులు కట్నము లడిగిరి. మఱికొందరు నోరు తెఱచి యడుగలేక, "ఏమి తొందర? మావాడికింక రెండుమూఁడు సంవత్సరములవఱకు వివాహము చేయు సంకల్పము లేదు. ఈలోపుగా మంచి సంబంధములు చూచుచున్న 'సైముంటుంది" అను సూచనగాఁ బల్కిరి. తుదకు మ.రా.రా. శ్రీ శేరి వెంకటేశ్వరపంతులుగారు, బి. ఏ., బి. యల్., హైకోర్టువకీలు, రావుసాహెబు, జిల్లాబోర్డు ప్రెసిడెంటు, (ఇంకను పేర్కొనఁబడని బిరుదము లనేకములు) వీరియింటికి ముకుందశాస్త్రి వెళ్ళి యడుగఁగా "అయ్యా! ఈకాలపు పుత్త్రవాళ్ళకు మనమేమి చెప్పలేము. వాళ్ళకే తిక్కతిరగాలెగాని, లేకుంటే మనమాట సాగదు." అని బంగరు ముక్కద్దములతోడు తగిలించుకొని ముకుందశాస్త్రిని మఱి పలుకరించక "కేసులప్రసంగము" "పార్టీల"తో సలుప నారంభించిరి. ప్రాణము విసిగి ముకుందశాస్త్రి 'సెలవు పుచ్చుకుంటా'నని వెడలి వచ్చెను.

ఈవకీలుగారి కుమారుఁడు శేరి కృష్ణమూర్తి. తండ్రిగారి మాటలంబట్టి పెద్దలయెడల నవిధేయతతో వర్తించువాఁడేమో యని ముకుందశాస్త్రి ప్రప్రథమము దురభిప్రాయపడెనుగాని, విచారణసేయఁగా సుగుణోత్తముఁడని తెలిసె. ధనకాంక్షగల తండ్రి కట్నము దిట్టముగా లాగి యొక సంబంధ మేర్పాటుచేయు తరి "నాన్నగారూ! కట్నము గ్రహించి వివాహమాడుట నాకు సమ్మతముగాదు. పెద్దలకు నేను మనవిచేయఁదగినది కాదు కాని, ఈ వివాహవిషయము నా స్వేచ్ఛకు వదలి వేయవలెనని నా ప్రార్థన" అని వినయపూర్వకముగాఁ జెప్పెనఁట. అందుచే తండ్రి యాగ్రహము వహించి కుమారుని వివాహవిషయముం గూర్చి యుత్సాహము లేకయుండిరి. చి॥ కృష్ణమూర్తి ఇప్పుడు సర్కారు కళాశాలలో బి. ఏ. పట్టపుపరీక్షకు చదువుచుండె.

ఈతఁడు గోదావరీ పుష్కరమందు "స్కౌటు" గా బహుజనోపకారముఁ జేసికీర్తివడసె. "స్కౌటు క్యాంపుతో" ధవళేశ్వరమున కేగియుండెను. "త్వరలో మరలి రానున్నాఁ"డని యందరనిరి. "కట్నము కాసింపని యిట్టి సుగుణవంతుఁడు మనరుక్మిణికిలభించిన నెంత బాగు! తండ్రి యడ్డునేమో" అని ముకుందశాస్త్రి యనుకొని చెల్లెలితో నీవృత్తాంతమంతయు చెప్పెను.

రాజమహేంద్రవరమున వీరలిట్లుండ, గోపాలపల్లిలో వీరితలిదండ్రులు, పిల్లలను విడిచి యెన్నడుండ కుండుటం జేసి, యేమియు తోచక యుండిరి. ఉత్తరములంబట్టి యింకను కార్యసిద్ధి కాలేదనిమాత్రమే తెలియవచ్చెను. ఒకనాఁ డుదయమున వీరింగూర్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మనసు మిగుల వ్యాకులమొందె. ఏల నొకో యని యాలోచించుచుండఁగా నాతని భార్య, రుక్మిణి గోదావరిలోఁబడి కొట్టుకొని పోయినట్లు



శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధియందు శాస్త్రిగారు తన్మయులై యుండుట


స్వప్నముఁ గన్న వార్త తెలిపె. వెంటనే క్షేమము వ్రాయుమని యుత్తరము వ్రాసి పడవైచి, తంబుర, చిడతలు చేతంబూని వేణుగోపాలస్వామి సన్నిధికిం జని యేకాగ్రచిత్తుఁడై భజనచేయఁ దొడంగె. అప్పుడు రుక్మిణి యొక ప్రవాహములోఁ బడికొట్టుకొని పోవు నట్లు తనకు కనఁబడె. అంతట.—"ఎవుడు కృప కల్గునో" "ఇకనైన నా మొఱ వినరాదా." అను కృతులు పాడి" ఏహి ముదం మమ దేహి" యను తరంగము పాడుతఱి, శ్రీకృష్ణుఁడు చేయూఁత యొసఁగి రుక్మిణిని పైకిఁదీసినట్లు కనుపించె. అంతట నానందబాష్పము లొలుక, శాస్త్రి తరంగపరంపరఁ బాడం దొడంగె. చివరకుఁ దనయింటికి వచ్చి "భయములేదు విపత్తువచ్చి నను కృష్ణుఁడు కాపాడును. నా కభయ మిచ్చె"నని భార్యతోఁ జెప్పి శాస్త్రి యాయమకు దుఃఖోపశమనముఁ జేసె.

ఈ దినమున రాజమహేంద్రవరములో స్నానఘట్టమునొద్ద నున్న జను లున్నట్లుండి గొల్లుమని కేకలు వేసిరి. స్నానము చేయుచున్న పిల్ల యొకతె యఖండ ప్రవాహములోఁ గొట్టుకొని రైలు వంతెన గుండాపోయెను. ఇంతలో జట్టీబంగాళా చెంతనున్న రాళ్లనుండి యొక యువకుఁడు ప్రవాహములోనికి దుమికెను. జనులు గుంపులుగూడి చూచుచుండిరి. దవ్వున యానము చేయుచున్న నౌకలకు సంజ్ఞలుచేసిరి.

ఇంతలో నాయువకుఁడు రుక్మిణిని కేశములం బట్టుకొనెను. గట్టుచేర్ప నెన్నిమారులో యత్నించెను. గాని నీటివిసురుచే వీలులేకపోయెను. ధైర్యము విడువక ప్రవాహములో నీది యొకదిబ్బపైకి పిల్లనీడ్చిచూడఁగా, దివ్యసుందర యువతి. ఎవరు? రుక్మిణియే. యువకుఁ డెవరు? స్కౌటు కృష్ణమూర్తి. అప్పుడే ధవళేశ్వరము నుండి యీగట్టువెంట వచ్చుచు నబ్బాలిక పడుటఁ జూచి బనియను చడ్డీ తప్ప నితర వస్త్రములు విసరివైచి ప్రవాహములోఁ బడి పిల్లను పైకిఁ దెచ్చెనుగాని యూపిరి యాఁగిపోయెను. అంతట దాను నేర్చిన విధమున బాహులను సాగించి ముడచి ప్ర... జేయఁగా నెట్టకేలకు శ్వాస పునరపి వచ్చెను. లోఁ... నీరు కక్కించుటకై కాళ్లు పట్టుకొని గిరగిర త్రిప్పఁగా ద్రావిననీరు వెలుపలికి వచ్చెఁ" గా... యింకను ప్రజ్ఞ తప్పియుండెను.

పేవం బూసిన పసుపుచేత బంగరుబొమ్మవలె వెలిగెడి యాసుందరాంగనం జూడ కృష్ణమూర్తి మన మునం బ్రీతినొందెను. రుక్మిణి యొక్కసారి కనులు విప్పి చూచి చిరునగవుతో "కృష్ణా! రమ్మంటివి గాన వచ్చితి." అని మరల ప్రజ్ఞలేక పడియుండెను.

గాని వేంకటేశంపంతులుగారు కొమారునితో "ఏడ్చావు పెధవ! ఎప్పుడూ ఏటిలోనో నిప్పులోనో మరణం గోరుతుంటావ్" అని యాగ్రహపడెను. కాని జడ్జీగారికి కలెక్టరుగారికిని దనకుమారునిమీదఁ గల్గినదయ తనకుఁ గూడ లాభించునుగదాయని యుల్లమందు సంతసించెను.



స్కౌటు కృష్ణమూర్తి రుక్మిణిని గోదావరినుండి పైకితీసి యూపిరితెప్పించ ప్రయత్నము చేయుట

ఇంతలో, భద్రాచలముపైపు పర్యాటనమునుండి వచ్చుచున్న కలెక్టరుగారు దూరదర్శినిం జేఁబూని జరిగినదంతయుఁ జూచి తన "ధూమనౌకను" (Steam launch) అచ్చటికిం గొనిపోవ నాజ్ఞాపించెను. దిబ్బఁజేరి వీరిరువురిని లోనికిఁ దీసికొనెను. ఆయన భార్య రుక్మిణిని దనగదిలోనికిఁ గొనిపోయి తడిబట్టలఁ దీసి పొడిబట్టలిచ్చి వేడిపాలు త్రాగించెను. రుక్మిణి తెలివొంది "ఎక్కడనున్నాను? కృష్ణుఁడేఁడీ?" అనెను. కలెక్టరుగారుకూడా కృష్ణమూర్తికి క్రొత్తబట్ట లిప్పించిరి. తన బంగాళానుండి చూచుచుండిన జడ్జి నిమ్మలకృష్ణశర్మగారు మోటారు పడవబోటు తెప్పించి యొకారొకిగా నచ్చటి కేతెంచి వీరిరువురిని తనగృహమునకుం గొనిపోవ నిచ్ఛఁ జూప, బ్రాహ్మణు లగుటంజేసి వీరల కచ్చట సౌఖ్యము కల్గునని కలెక్టరుగారు సమ్మతించి స్నానఘట్టమున దింపిరి.

కృష్ణశర్మగారు కృష్ణమూర్తిని తనమోటారులో నింటికిఁ బంపిరి. అబ్బాలునితండ్రికి కుఱ్ఱవానిసాహసముం గూర్చిశ్లాఘించియుత్తరము వ్రాసిరి. ఈయుత్తరముదనువు

మఱునాఁడు సబ్‌కలెక్టరుగారి కచ్చేరిలో పెద్ద కలెక్టరుగారు సభచేసి యాయూరమందు గొప్పవారిం జేర్చి కృష్ణమూర్తి సాహసముం గొనియాడి జనోపకార సంఘమువా రిడు హేమపతకమున కీతని సిఫారసుచేసి నట్లు చెప్పిరి. చెన్నపట్టణమునుండి తంతివార్త విని వచ్చిన స్కౌటుకమిషనర్ గారు, కృష్ణమూర్తికి "కింగ్స్ స్కౌటు" అను గొప్ప బిరు దిడిరి.

ఇంతలో జడ్జీగా రీకుఱ్ఱవాఁడు కాపాడిన చిన్నది తన చిరకాలపు స్నేహితుఁడు సుబ్రహ్మణ్యశాస్త్రి కూఁతురని యెఱింగి, ముకుందశాస్త్రిని రుక్మిణిని తనయింటనుండ నియమించెను. శాస్త్రికి సొమ్మఁబంపి భార్యాసమేతుఁడై రమ్మని వ్రాయ నాతఁడట్లేవచ్చెను. కలెక్టరుగారి సభలో కృష్ణమూర్తితో నేకాంతముగా సంభాషించి వేయిన్నూటపదహార్లు చదివింప నిచ్ఛఁజూప నాతఁ డిట్లనియె. "నేను స్కౌటు కావున చేసెడియుపకారమునకు ప్రతిఫలము గ్రహింపఁగూడదను నియమము కలదు. అట్లే ప్రమాణము చేసియున్నాఁడను. కావున యీపిల్ల తల్లిదండ్రులు రిక్తదశలో నున్నట్లు

న్నడుమండుటంజేసి యీ పిల్లను జదివించిన నాకిచ్చి పెళ్లి జరిపించెద"నని పిన్నలోఁ గూడిన చిరునగవుతోఁ బల్కెను. ఆ కుఱ్ఱవాని ధైర్యము నౌదార్యమును శ్లాఘించుచు జడ్జీగారు ఉపన్యసించిరి. వకీలు వెంకటేశం పంతులు జడ్జీగారు తనకొమారుని ంగోర్చి శ్లాఘించుట యిష్టమైనను వచ్చెడి వేయిన్నీ నూట పదహార్లు పోఁగొట్టుకొనెనని మోముచిట్లించిరి. అంత జడ్జీగారు సభామధ్యమునకు రుక్మిణిం జీరి వేయిన్నీ నూటపదహార్లాపిల్లకిచ్చిరి. అంతట జనులెల్లరు "వీరిరువురికిం బెండ్లిచేసిన బాగుండు" నని కేకలు వేసిరి. కలెక్టరుగారు లేచి "సభ్యులారా! మీరిప్పుడు కోరిన కోరిక నా భార్యకును నాకును బరమ సమ్మతము, కాని సభాకార్యక్రమముతో సంబంధించిన విషయముకాదు...న, తరువాత మీరాలోచింపఁ దగిన విషయము. ఇంతటితో సభ చాలింతము" అని "హర్షము" చేసిరి.

తరువాత జనులు జడ్జీగారి చుట్టు మూగి, "మా యభీష్ట మేమి నెరవేర్చెదరు?" అని యడుగ, జడ్జీగారు, కుఱ్ఱవాని సమ్మతి వాతని పిన్నచిరునగవుం బట్టి గ్రహించిరి కావున, వకీలువైపు తిరిగి "ఏమండీ, వేంకటేశం పంతులుగారు! తమరికి సమ్మతమా? మీరంత రేక శ్లాఘించారే కదా?" అనిరి. వేంకటేశం పంతులుగారికి కట్నము లేమింజేసి తృప్తి లేకున్నను, జడ్జీగారి యనుగ్రహము సంపాదించుట మంచిదని "తమ సెలవు కర్తవ్యం తరవేమి; శుభం, కానివ్వండి" అనిరి. తర్వాత జడ్జీగారు శాస్త్రిపై పు మళ్లి "ఏం శాస్త్రీ! నీవేమంటావ్ !" అని యడుగ, శాస్త్రి యభినవ కుచేలునివలె "నీమాట కెన్నడైన నే నెదురాడుట యుండునా? అదియుంగాక బహుజనసమ్మతము భగవత్సమ్మతము" అనిరి.

జడ్జీగారే శాస్త్రిని ఋణబాధనుండి తొలఁగించి వివాహము జరిపించిరి. వివాహసమయముననే జనోపకార సంఘమువారిచ్చిన హేమపతకము వచ్చెను. తరువాత కృష్ణమూర్తి పట్టపరీక్షయందు తీర్ణుఁడై, సర్కారు వారి యనుగ్రహముచే "డిప్యూటి తహశీలుదా"రై త్వరలో డిప్యూటికలెక్టరుగా గోదావరిపై యానము చేయవలసివచ్చెను. మునుపటి దిబ్బప్రక్కనుండి వెళ్లుచుండఁగా, నాతఁడు రుక్మిణింబిలిచి యాదిబ్బఁ జూపి, "నిన్ను నీటనుండి యీదిబ్బ మీఁదకి నే నీడ్చినవెంటనే "కృష్ణా! రక్షించితివి గాన వచ్చితి" వంటివి!" అని యడిగెను.

రుక్మిణి:—గోదావరీ స్నానము చేయుమని నాతోఁ గలలోఁ గృష్ణుఁడు చెప్పినప్పుడు మీవలెనే కన్పడె. కావున మిమ్ముంజూడఁగాఁ గ్రొత్తఁగాఁ దోఁచలేదు.

కృష్ణ:—ఏమి యీవింత!

రుక్మిణి:—వింతయేమి. మీరు కృష్ణుఁడు గారా? ఇదంతయుఁ గృష్ణునికృప.

అభావప్రాదుర్భావము

జంధ్యాల శివన్నశాస్త్రి గారు

నాందు ప్రలాపమ్మునకు గర్వపడనో కో, అదియు నీతోడ మాటాడఁ జేసె
నా యసంగత జీవనమున కుప్పొంగనో, యదియుఁ గా నీపొందు నందఁ జేసె
నాయంధతకు నుబ్బనా యదే కద విశ్వ,చక్షు వొసఁగి రహస్యంబు చూపె
నా యకించనత కానందింతునా యదే,కద నాకుఁ బెన్నిధిఁ గలుగఁ జేసె
గీ. నేను నాదు రోదనముపై నేల హర్ష,మూననో కా నేర్పె నా కది గాన మొకటి
దాని నేనెయెడ వశంగత మ్మొనర్చు,కొంటి సద్దానివాంఛ యెక్కొండె నాదు
జీవనాకాంక్షయై మున్ను చెలఁగుచుండె.

నావెండిరూపాయ



భమిడిపాటి సుబ్బారావు గారు

౧

శీతకాలమున అధికమైన చలిబాధ. చలిపేరు చెప్పినంతనే భయంపడి గృహముల దూరు భీరువులనే చలి వెంబడించి గ్రహము వలె నావహించును; కాని భయమొందక యెదురించువారి కేరికి నది భీకరముగా గోచరింపదు. అట్టివీరులలో నొక్కనిగ వీరన్నను జేర్కొనఁదగు. అందునకుఁ గారణములను ముందుముందు గ్రహింపఁగలము. ప్రత్యేకము చెప్పుట యంత ముఖ్యముకాదు.

వీరన్న కిప్పటి కేబదియేండ్ల వ్యవసాయానుభవము గలదు. ఇప్పు డాతని కింట గంపెడు బలగము. 'నల్ల బంగారమును నమ్మి నవాఁ డెప్పుడును చెడిపోఁ' డనుమాటయొక్క యాథార్థ్య మీతని జీవితమున నిశ్చయమైనది. అట్లే కాకయున్నచోఁ గొడుకులు, కూఁతుండ్రు, కోడండ్రు, నల్లుండ్రు, మనుమలు, దౌహిత్రులు, వీరిచుట్టములు, చుట్టముల చుట్టములు మొదలగువారలను సమాదరించుటయు, శుభకార్యములు, పండుగలు, పబ్బములు మొదలైన న్నియో యథావిధిగ సాగించుటయు నాతని ట్లు సులభసాధ్యమైనవి ?

వీరన్న కున్న భూవసతి పెరుఁగుట యెఱుఁగము. సంసారాభివృద్ధి యన్ననో, శాఖోపశాఖలుగాఁ బెంపొందుచుండె. బహువిధశాఖాసమన్వితంబయిన విటపి, యొక్క కాండముపై నాధారపడియున్నట్లీ యీ బాహుళ్య మగు కుటుంబమంతయు వీరన్న యాజమాన్యముపై నుండుట చాల నానందదాయకమైన విషయము.

అనుదినమును 'అయ్యా! —తాతా! —మామా! యను వరుసవరుస పేరులఁ బిలుచుచుఁ బిల్లలందఱు వీరన్న చుట్టును జేరి యాతని గడ్డమును లాగుచు, మోము నిమురుచుఁ జేతికఱ్ఱ లాగుచుఁ, గథలు చెప్పుమని విసిగించుచు, నాతఁడు కసరిగొట్ట నవ్వుచు, లాలనఁ జేయుచు మఱింత దగ్గఱఁజేరుచుఁ, బలు తెఱఁగుల బాలక్రీడావిశేషముల నప్రమత్తులై యుందురు. ఒక్కొక్కెడఁ జీకాకు చెందినను, వీరన్న యాత్మబలగవ్యాపారములవలన నపారమగు నానందము ననుభవించుచుండెననుటయే నిక్కము. అట్లుగాక యాతనికి గృహమున నే మనోవ్యాకులతాహేతువో యున్నచో నొక్కగడియయైన నిల్లు విడిచి, యేనిర్జన

ప్రదేశమునకో, వాహ్యాళికో, లేదా పుర మందిరమునకో విలాసార్థ మరుగఁడా?

౨

పిల్లలకు నిర్వ్యాపారతయన్న నసహ్యము. అది పెద్దలకే చెల్లినదిగాని, మానవబాలమానసశరీరములకు వ్యతిరిక్తము. ఎప్పుడును వారేదో వ్యాపారమున మగ్నులయి యుండవలసినదే. తగినంత పనిలేనప్పుడు వీథులవెంటఁ బరుగెత్తవలసినదే! కత్తి చేతఁ బట్టి చెట్లను చేమలను నఱకవలసినదే! ఏదో సందర్భము చూచుకొని యేవతో డెందమునో బొండెనో రెంటినో యుద్ధాయించవలసినదే! ఈ నైసర్గికధర్మమును శిశు తెలియని తలిదండ్రులు 'విద్య గరపుచున్నా మన్న నెపమున' రూపుమాపుచున్నారు. పెద్దలు తాము చేయునది యొకటి చెప్పునది యొకటి యగుటచేతఁ బిల్లలు దుర్మార్గప్రవర్తన మాదర్శము చేసికొనుచున్నారు. తా మాచరించు నుత్తమకార్యముల, నేతల్లిదండ్రులు తనయులకు, మనసార నుపదేశించెదరో, యా జనకులచే శిక్షితు లగు బిడ్డలే పౌరు లనఁదగువా రగుదురు. ఆ విద్య మోసమునకు దూరమైనది. ప్రపంచభయరాహిత్యమైనది. ఫలాపేక్షాపూజ్యమైనది. బోధనమునకుఁ గాలనిర్ణయము



లేదు. ఈ విషయముల నిర్ధారణము గావించుకొనుట కొక్కసారి వీరన్న సదనమువంకఁ జూడనగు!

వేకువను వీరన్న చలియనుకొనక, దొడ్డిలోనికిఁబోయి పసులఁ బరిశీలించి, యింత గడ్డిని దెచ్చి యొక్క చలిమంట వేసెను. చలిచేఁ బిల్లలందఱును నిద్రమేల్కాంచి ప్రక్కపై దొరలుచుండిరి. లేచుటకు శీతలబాధ; పరుంటకు నిద్రలేమి; వారొకరితరువాత నొకరుగ చలిమంటచుట్టును జేరిరి. ఒడలంతయుఁ గాచుకొనుచుండిరి. మధ్యమధ్య వీరన్న 'నిప్పు—జాగ్రత్త' యని హెచ్చరించుచుండెను. అతనిమాట లెవరు లక్ష్యము చేయుదురు; లక్ష్యము చేయలే దనుటకు వా రా మాటలను బెడచెవిని బెట్టిరా? ఒకఁడు తనయల్లరి చేయుచునే యుండెను. మఱొక్కఁడా యల్లరిచేయువానిని వీరన్న పోలె వారింపఁ బ్రయత్నించుచుండెను. యత్నించువానికి నల్లరిచేయువానిని మఁ

...వేశమునకో, వాహ్యాళికో, లేదా పుర మందిరమునకో విలాసార్థ మరుగఁడా?

౨

పిల్లలకు నిర్వ్యాపారతయన్న నసహ్యము. అది పెద్దలకే చెల్లినదిగాని, మానవబాలమానసశరీరములకు వ్యతిరిక్తము. ఎప్పుడును వారేదో వ్యాపారమున మగ్నులయి యుండవలసినదే. తగినంత పనిలేనప్పుడు వీథులవెంటఁ బరుగెత్తవలసినదే! కత్తి చేతఁ బట్టి చెట్లను చేమల్నఱకవలసినదే! ఏదో సందర్భము చూచుకొని యేవతో డెందమునో బొండెనో రెంటినో యుద్ధాయించవలసినదే! ఈ నైసర్గికధర్మమును శిక్ష తెలియని తలిదండ్రులు 'విద్య గరపుచున్నా మన్న నెపమున' రూపుమాపుచున్నారు. పెద్దలు తాము చేయునది యొకటి చెప్పునది యొకటి యగుటచేతఁ బిల్లలు దుర్మార్గప్రవర్తన మాదర్శము చేసికొనుచున్నారు. తా మాచరించు నుత్తమకార్యముల, నేతల్లిదండ్రులు తనయులకు, మనసార నుపదేశించెదరో, యా జనకులచే శిక్షితు లగు బిడ్డలే పౌరు లనఁదగువా రగుదురు. ఆ విద్య మోసమునకు దూరమైనది. ప్రపంచభయరాహిత్యమైనది. ఫలాపేక్షా పూజ్యమైనది. బోధనమునకుఁ గాలనిర్ణయము



లేదు. ఈ విషయముల నిర్ధారణము గావించుకొనుట కొక్కసారి వీరన్నసదనమువంకఁ జూడనగు!

వేకువను వీరన్న చలియనుకొనక, దొడ్డిలోనికిఁబోయి పసులఁ బరిశీలించి, యింత గడ్డిని దెచ్చి యొక్క చలిమంట వేసెను. చలిచేఁ బిల్లలందఱును నిద్రమేల్కాంచి ప్రక్కపై దొరలుచుండిరి. లేచుటకు శీతలబాధ; పరుంటకు నిద్రలేమి; వారొకరితరువాత నొకరుగ చలిమంటచుట్టును జేరిరి. ఒడలంతయుఁ గాఁచుకొనుచుండిరి. మధ్యమధ్య వీరన్న 'నిప్పు–జాగ్రత్త' యని హెచ్చరించుచుండెను. ఆతనిమాట లెవరు లక్ష్యము చేయుదురు; లక్ష్యము చేయలేదనుటకు వా రా మాటలను బెడచెవిని బెట్టిరా? ఒకఁడు తనయల్లరి చేయుచునే యుండెను. మఱొక్కఁడా యల్లరిచేయువానిని వీరన వోలె వారింపఁ బ్రయత్నించుచుండెను. యఃలించువానికి నల్లరిచేయువానిని మం

లించుట ముఖ్యోద్దేశమా? వీరన్న ననుకరించుట ముఖ్యోద్దేశమా? ఇట్టి మానసపరీక్ష యేవిజ్ఞానశాస్త్రజ్ఞునకుఁ దెలియును?

ఒక బాలుఁడు సగముకాలిన జనుపకట్టెను దీసి రెండవకొనను నోట నిడికొని చుట్టకాల్చువారి నవహసించుచుండెను. వేఱొక్క-చో బాలిక యొకతె 'హా' యని నోరు దెఱచి నోటినుండి వెల్వడు నీటియావిరిని ప్రక్కనున్న తన చెల్లెలికిఁ గన్పఱచుచు, గారడీవాని ననుకరించుచుండెను. ఇట్లు వీరందఱుఁ గ్రీడామగ్నులయియుండఁ గ్రమముగా వెలుతురు చీకటిఁ ద్రోలివేయఁగడంగె. ధరాసమీపాంబరమున 'పొగమంచు' దట్టముగఁ బట్టి, చుట్టును యవనికవలెఁ గన్పట్టుచుండె. ఆ సూక్ష్మ జలకణసముదాయభారమునంతను వహింపజాలని సమీరుఁ డందుఁ గొంత చేర్చి హిమబిందురూపమున నెత్తగు వస్తువులపై ననఁగాఁ జెట్లమీఁద, గడ్డిమీఁద, ప్రోవుచేసి యుంచె. ఆజలబిందుభారమునే వహింప నొల్లనియట్లు, వానిచేతనే పరిశుభ్రమైన పత్రములా 'మంచును' సర్వభారవాహకత్వమును వహించిన భూదేవిపాలొనర్పఁ జల్లఁగ రాల్చుచుండెను. పవనుండును మెల్లగ సాగి పత్రములఁ దమయుద్యమంబున మఱింత ప్రోత్సహించుచుఁ దరంగములుగా లోకవ్యాపారము చేయుచుండెను.

అట్టిసమయమున వీరన్న 'ఓపిల్లలారా' ని పిలిచెను. ఆ పలుకుచు దనబొమ్మకు టలఁ గరపుచుఁ గథలఁ జెప్పుచున్న వీరన్న త్తి తక్క- తక్కినవారందఱును విని యాతనివంకఁ జూచిరి. ఆతని నెఱసిన శిరోజములు, దరహాసపూరితవదనము వెలుఁగులో వెలుఁగుచుండెను. ఆబాలురలోఁ బెద్దవాఁడగు గోపన్న తాతయగు వీరన్న పోలికనుండెను. ఆతఁడు బలహీనుఁడు. తమ్మునివలెఁ గాక మితభాషి. తాత కథలను వినుటయన్న నాతని కాసక్తిమెండు. ఒక్కతననే తాత ముఖగహ్వరమునుండి వెల్వడు మాటల నామూలాగ్రముగ గోపాలుఁడు వినుచుండును. తాను వినినదంతయు జ్ఞాపకముంచుకొనును. నాఁటి వేకువను తాతచెప్పిన కథను గోపన్న యాలించి దాను పెద్దయైనపిదప నొకచో వ్రాసి యుంచుకొనెను. ఆకథ మన మిప్పుడు చెప్పుచున్నదే!

3

నా జననీజనకులు పేదలు. నేను బాలుఁడనైనప్పుడు నన్నుఁగాక మఱి యాఱుగురు బిడ్డలను వారు పోషింపవలసియుండిరి. దినము గడచుటయే కష్టముగా నుండె. ధనమువచ్చుమార్గము లేదు. నా కెనిమిదేండ్ల ప్రాయము రాఁగానే నన్ను 'బసివిరెడ్డి' యను నొక ధనికునియింటఁ బ్రవేశపెట్టిరి. నా కాతఁ డన్నము పెట్టుటకును బాలము పని నేర్పి చేయించుకొనుటకును నిర్ణయము. తమ కీమూలమునఁ జేతిలో నొక దమ్మిడియైనఁ బడకపోయినఁగాని యంతకే నాతల్లిదండ్రులు సంతసించిరి.

బసివిరెడ్డి నౌకరులచేఁ బనిచేయింపఁగల సమర్థుఁడని ప్రతీతి. తమ కేమి బాధ కలుగునో యని యెవ్వరు నాతని దగ్గర పనిచేయుట

కియ్యకొనరు. ఒప్పుకొన్నచో వారు తప్పక జవదాటక పనిచేయుటకు సిద్ధముగానుండి రన్నమాటయే. అనుదినమును వేకువజామున నే లేచి పొలమునకుఁ బోయి, పాలుపితుకుట పిదపఁ బశువుల నింటికిఁ దోలుకొనివచ్చుట నా వంతుపనులలో నొకటి. వాతావరణస్థితి యెట్లున్నను, నాపని చేసితీరవలసినదే. పిమ్మటఁ జేనిలోఁ బిట్టలఁ గొట్టుట, కలుపుదీయుట, దూడల మరలించుట నాపనులు.

అయినను నాపని నేను శ్రద్ధతోఁ జేయువాఁడను. ఆవులన్నియు నన్నుఁజూచి యఱచెడివి. ఆమందలోని జంతువులు దూరమునుండియే నన్నుఁ బసిపట్టి గంతులిడెడివి. సూర్యోదయకాలమునఁ బక్షిరుతములు నా చెవుల కింపుగా నుండెడివి. పొలముగట్లపై మొలచెడు మొక్కలు, పూచెడి పూవులు నాకుఁ గన్నులపండువొనరించెడివి. ఈయానందములోఁ బాఠశాలకుఁ బోవలెననికాని చదువుకొనవలెననికాని నా కెన్నఁడును దట్టలేదు. విద్యనేర్చుటవలన ధనము సంపాదింపవచ్చు ననునూహ నాకుఁ బొడమనే లేదు. పొడమినను గొనసాగకపోయియే యుండును. ననుటలో వింత యిసుమంతయు లేదు.

'ఏ పండుగకో దొరకిన యొకటి రెండు డబ్బులుతక్క నా చేతితో నెన్నఁడును ద్రవ్యమును ముట్టి యెఱుఁగను. ఆ రెండుమూఁడు డబ్బులు వచ్చినప్పుడు నాయానందమునకు మేరయే లేదు. అట్టియానంద మెప్పుడో యేఁటి కొక్కనాఁడు కలిగెడిది. ఈ సందర్భమున, ద్రవ్యము పెట్టి పుట్టిన యే కొలఁదిమందికో కాని యందఱకు లభింపదనియు, నట్టి యదృష్టవంతులలో నేనొక్కఁడఁ గాననియు నా నమ్మకము. బసివిరెడ్డి దగ్గర నౌకరీచేసిన మూఁడేండ్లలో రాగినాణెములఁ దప్ప వెండినాణెములను నే నెన్నఁడును ముట్టి యెఱుఁగను. రూపాయ యన్న నా కెట్లు తెలిసినదో యా వృత్తాంతమే నా కథావిషయము. శ్రద్ధతో వినుఁడు:

౪

అప్పుడప్పు డంగడికిఁబోయి కావలసిన వస్తువులను కొని యజమానుని యింటికిఁ దెచ్చుట నా కలవాటు. ఆ ప్రకార మొక నాఁటి సాయంకాలము కోమటిదుకాణమునకుఁ బోయి సరుకులఁ గొని చేతఁ బట్టుకొని గృహోన్ముఖుఁడనై యరుగుచుంటిని. నేను బయలుదేరునరికే సూర్యాస్తమయ మగుట వలనఁ గనుచీకటిలో నడచుచుంటిని. దారిలో నొక చిన్న తెల్లనివస్తువు కంటఁబడియె. దానిఁ దీసికొనవలయునన్న యభిప్రాయము లేకయే దానివైపు నిర్లక్ష్యముగా నడచితిని. దాని నెత్తితిని. అరచేతిలో నుంచుకొంటిని. అం దరయైన లే దయ్యది. అది యొక కాగితపుఁ బొట్లము. దానిఁ దిరుగఁ బారవేయ నుద్యమించి మానితిని. దాని లఘుభారమే దానిపై నాకుఁ గల నిర్లక్ష్యమును బెంపొందించె. ఏ బాలుఁడో నన్ను మోసముచేయుట కీయుపాయముఁ బన్నెననియూహకూడఁ బొడమినది. ఈయాలోచనములదూరముగఁద్రోలి కుతూహలముచేత నా పొట్లముం దెఱచి నాయానందము హద్దులనతిక్రమించిపో

దానిని బట్టఁ బగ్గములు లేవు. ఎందు
దానిలోనుండి జారి క్రిందఁబడి టంగు
ధ్వనిఁజేసిన వస్తువే దీని కంతకును మూలఁ
అది యేమయి యుండునా యని దా
దిలకించితిని. అది స్వచ్ఛముగ నుండెను.
గుండ్రముగ నుండెను. 'డబ్బు' మాత్రము
కాదు, అంతకంటె విలువ గల నాణెమే,
రూపాయ; వెండిరూపాయ; సరిక్రొత్త వెండి
రూపాయ. నాసొత్తైన సరిక్రొత్త వెండిరూపాయ.
నేలమీఁదనుండి దానినిదీసి గుప్పిడిలో గట్టిగా
నొక్కి కొంత యానందము నడంచితిని. పండ్ల
సందున నిడి కొఱికితిని. దానితత్త్వ మొక్కింత
బోధపడినది. అది తిరిగి నన్నుఁ బాసిపోకుండ
భద్రముగఁ గోటుజేబులో నుంచుకొంటిని.
ఈ కార్యనిర్వహణమం దించుక కంప
మంకురించినది. అది జేబులో నున్నదో
లేదో యనుక్షణమును బైకిఁ దీసి తేరిపార
దానివంకఁ జూచుకొనుచు నింటికిఁ బోవు
చుంటిని. ఎవ్వఁడైనఁ గంటఁబడి నప్పుడు
నాణె మాతని దృష్టిని బడకుండ దాఁచు
చుంటిని. నే నొక నేర మొనరించినట్లు, కార
ణము స్పష్టమగుట లేదు కాని—భయపడు
చుంటిని. 'నీ దగ్గరనున్న రూపాయ నా'దని
యెవ్వఁడు వచ్చి యడుగునో యని సంకో
చించుచుంటిని.

'ఒకవేళ నెవ్వఁడును వచ్చి రూపాయ
నాదని చెప్పకున్నచో, నది న్యాయముగ నా
సొమ్మగదా యని నిశ్చితాభిప్రాయుఁడ నైతిని.
కాని యీసిస్థితినిత మెక్కడిది? దాని నెవ్వరు
పోఁగొట్టుకొనిరో వారి నారయ లేదని విచార

...
రడ్డికిఁగాని యాల...
గాని నేఁ జెప్ప లేదు. ఎందులకుఁ జె...
నాధనము పోవునేమోయనెడి భీతిమాత్ర...
నామానసపీఠిని దాండవించుచుండె. భయ
మునకుఁ గారణముకూడ గలదు. నన్నుఁ
గాంచినవాఁడు తప్పక నాదగ్గర రూపాయ
యున్నదని తెలిసికొని తీరునని నా దృఢనమ్మ
కము. అక్కతమ్మున సరిగ నెవ్వరి ముఖమ్మ
వైపుఁ జూడ లేకుంటిని. ఒంటరిగ నుండవలయు
ననియే నా యాశయము. రాత్రియంతయు
జాగరము. అకారణముగ లభించిన ద్రవ్య
మును దాఁచు విధంబునుగూర్చి కొంతకాల
మును, దరువాత దానిని వ్యయ మ్మొనరించు
విధమ్మునుగూర్చి కొంతకాలమును యో
జించు కొనుచుంటి.

ఉదయముననే వాడిన మొగముతో,
జేవురించిన నేత్రములతో, దుర్బల శరీర
ముతోఁ జావడిలోనికి వచ్చితిని. సాధారణ
ముగ నా కన్ని వేళల క్షుధానలబాధ మిక్కు
టము. అయ్యది వెల్లడిగాకుండఁ జేయుటకో
యన్నగతిని నైజముగఁ జిరునవ్వుతో వద
నము వికాస మొందుచుండెడిది. ఈ ప్రొద్దున
మాత్రము నేనాఁకలికిదూరమైతిని. అన్నముపై

...వము ...ను. అతఁడు నన్ను ...ముగా ర్చి ప్రశ్నించు ననుకొన్నం ...న మామకముఖము వివర్ణమైపోయె; శిరము వనతమయ్యె. "నీకు దొఱకిన రూపాయ యేదీ! దొంగా! ఎక్కడ దాఁచితివి? ఎవ్వరిదో వారి కయ్యది యియ్య నక్కరలేదా?" అని యాతఁ డడిగిన నే నేమి చెప్పుదునా యనుకొంటి. యజమాని నన్నుఁ జూచి "పేరన్నా; నీవు రామస్వామి దగ్గరకుఁ బోయి యీదినము పని లోనికి వచ్చునో రాఁడో కనుఁగొని ర"మ్మని నుడివె.

ఆ పలుకులు చెవిఁబడినంతనే యొక్క పెద్దబరువు నాహృదయమును బాసిపోయెను. కడకు యజమానుని యాజ్ఞ యిది. ఇట్టిపను లెన్నియైనఁ జేయ సంసిద్ధుఁడనై యుంటి నను కొని సంతోషముతో బయటకు గంతువేసి యాతని దృష్టిపథమునుండి తొలఁగి పోతిని.

ఒక్కసారి నా రూపాయను జేబులో నుండి పైకిఁదీసి కన్నులారఁ జూచి సంతోషించితిని. దాని వెచ్చించి నేను కొనఁగిలవస్తువుల పట్టికనూహించి యాశ్చర్యానంద నిమగ్నుఁడ నైతిని. నా హృదయమునకు స్థైర్యములేదు. నాకైనము లభ్యమైనందున నదృష్టవంతుఁడనని ...ని సంతసింతునా? అదియెవ్వరిదో తెలిసి ...టకుఁ బ్రయత్నింపకపోవుట యపరాధ ...గ విచారింతునా? ఈవిషయముల వితర్కిం ...కొన్నకొలఁదిని నా దుఃఖ మభివర్ధిత మగు చుండె. నన్ను రూపాయతోఁ బట్టుకొనిన దొంగయనరా? నాకు దొఱకినది దాఁచు కొనుట నేరముకాదా? అట్లయిన నాకీనాణె మక్కరలేదు. దాని యధికారి నన్నడిగిన వెంటనే యాతని కియ్యది యొసంగుదు. కాని, యెవ్వ రది పోఁగొట్టుకొనిరో తెలియనప్పుడు దాని నెవ్వరి కందఁజేయుదును? ఈవిధముగా వితర్కించుకొనుచు రామస్వామి సదనము సమీపించితిని.

'ఎట్లయిన సొత్తు నాకడ నున్నంత కాలము నా డెందమున కొక పెద్ద యినుప గుండు తగిలించినంత భారముగ నుండె. దుష్టధన వ్యామోహముచే నా కీ ఘోరపరితాపము. వంగిపోయి యరిగిన రాగిదమ్మిడి దొరకినప్పుడు కలిగిన యానందమున సర్థభాగమైన నిప్పుడు కలుగకపోవుట యద్భుతము. అదమ్మిడిని తోమి సుత్తెతో బహిరంగముగ నరియొనరించితిని. 'ఆ పైస మా' దని యెవ్వరు నన లేదు; అందు రన్న భయమును లేకపోయె. నాతోడి వారు స్వల్పధనమునకే నాపయి నీర్ష్యఁగొనిరి. ఆహా! అప్పుడంతకే మహారాజ నైతి నని యెగిరిపడితి. ఇప్పుడో! యీ వెండిరూపాయ నా దృక్పథమునఁ బడకుండిన మేలయ్యెడిది! దీనివలన నాకానందము రాలేదు. సరిగదా తెలియని మనోవ్యాకులత్వ మబ్బినది. మఱల నా కెన్నఁడు నిది కనఁబడ

కుండ మాయ మొనరింతునా? యనుకొనుచు గమ్యస్థానముఁ జేరితిని.

౬

రామస్వామి గృహమున లేఁడని తెలిసికొని స్వగృహాభిముఖుఁడ నైతి. మాయింటి తోఁటచుట్టు నున్న కొరడిదగ్గరకు వచ్చితిని. నాకన్ను లొక యశ్వమును దోఁటలోఁ గాంచెను. ఆ కంభాణము గ్రామాధికారిది. నాగుండె నీరయిపోయినది. ఆ గుఱ్ఱ మా యధికారిది కానిచో నాభయమునుఁ గూర్చి విన్న వారెల్లరు నవ్వెదరు కాబోలు! ఆయన దనియే నాకుఁ దట్టినది. నాభయమే యింతకును హేతువు. అతఁడు రూపిక యావద్వృత్తాంతమును విని నన్ను గారాగారమునకుఁ గొంపో



వుటకై వచ్చినాఁడని నాయుద్దేశము. నాగుండె తటతట కంతరాయములేదు. అది నిలిచిపోయి యుండునా కడకు? నా నడుము క్రుంగిపోవఁ జొచ్చె. కాళ్లు తొట్రుపడియె. మొగము తెల్లబారె. గుఱ్ఱము నిల్చియున్న పథము ప్రక్కనున్న పొదలలోఁ దాఁగుకొన వలెనని, యట కేగి, యందలి ముండ్లకు నరకు చేయక, యొక పొదమాటున నగర్చుచుఁ బడిపోతిని.

అక్కడ నేను గడపినది స్వల్పకాలమే; అదియొక యుగమువలెనుండె. ఈకాలములోనే గ్రామాధికారి వాజి నధిరోహించి వెడలిపోయె. అతని మాటల యలుకుడువలన నాతఁడు వెళ్లిపోవుచున్నాఁడని నేను గ్రహించి తొంగి చూచితిని. అతఁడు కనుచూపు మేర దాటి పోయినపిమ్మటఁ జెదరిపోయిన నా బుద్ధితునుకల నన్నిటిం బ్రోవుచేసితిని. ఇప్పుడు కాకున్న మఱొక్కింతసేపుండినయెడ లోపలికరుగక తప్పదు కావున నప్పుడే యట్లొనర్పఁదలఁచి, లేని ధైర్యమును దెచ్చుకొని, పొదవిడిచి బయటకు వచ్చి, బట్టలు దులుపుకొని, మెల్లఁగా లోని కరిగితిని.

బసివిరెడ్డి నాదెస కొక్కచూపు వీక్షణమును బ్రసరింపఁ జేసె. 'ఒక్కసారి భూమి బ్రద్దలయి నన్ను మ్రింగివేసిన మేలుగ నుండుఁగదా శంకరా!' యని యూహించితి. నాపని యప్పటితోఁ జెల్లు; నన్ను గారాగారమున కంపును గాబోలు ననుకొంటిని; కాని యట్టు జరుగలేదు. 'ఇంత యాలస్యమేల చేసితివిరా?' యని యతఁడు నన్ను నిందింపఁదొడఁగినప్పుడు నా యాశ్చర్య మేమనందును! 'ఎందు కాలస్యమైనది?

ఎక్కడ నుంటి వింతకాలము?' మొదలగు ప్రశ్నలవర్షము కురిపించెను కాని యొక్కదానికైన జవాబునకు వేచియుండ లేదతఁడు. నేను వాని కనుమును మినుమును జెప్పలేదు. దీనికేమి కారణము? ఈతిట్లుతిను నప్పుడు నే పొందునంతటి యానందము నా జన్మలో నేను పొందలేదు. అతఁడు రూపాయ సంగతిగాని, కారాగారము సంగతిగాని మాటాడలేదు. కనుక నింక నెన్ని తిట్టుకొన్న నేమి? యవి గాలికి పోవుననుకొనుచు నిలుచుంటి. అతని దూషణవాక్యములు నా శ్రోత్రములకు గానమువలె వినంబడె.

రెడ్డి తిట్టితిట్టి పొలములోఁ బనిసేయ నన్నుఁ బంపె. నారూపాయ నాజేబులో నుంచుకొనియే దినమంతయుం బొలములోఁ గలుపు తీసితిని. నా విషయమయి యజమానుఁడేల యనుమానము పొందలేదని నా యాశ్చర్యము. నాపని నప్పుడప్పుడు నిలిపివేసి, జేబుతడుముకొని రూపాయయుందున్నదనినిశ్చయించుకొని, సంతసించుచుంటి. ఇంతటి దారుణమైన చిత్తక్షోభమునకుం గారణము రూపాయగదా! ఆ విషాద హేతువగు నాధనము పోయినచో నా విచారము పోవునా? కల్ల. అది యుండినను మనోవ్యాకులతయే! పోయినను మనోవ్యాకులతయే! నాకయ్యది లభింపకున్న మేలుగా నుండునని లక్షసారులు తలంచితిని. ఏ విధముగా నయ్యది పొలములో నచ్చట దొరకినదో యావిధముగనే దానిని బొట్లము గట్టి యచ్చటనే విడువ నూహ కలిగె. అప్పుడే, తమకు హక్కులేని ద్రవ్యము ప్రాప్తించినప్పుడితరులు నావలె మనోవ్యథపాలగుదురా యను సంకోచమును గలిగె. ఈరీతిని పవలు వెళ్ళఁబుచ్చి యింటికిఁ జేరితిని.

౨

సాయంకాలము బసివిరెడ్డి నన్నుఁ బిలిచి 'రామదాసు నింటికిపోయి రేపు పనిలోనికిరమ్మని జెప్పు' మని యానతిచ్చె. ఈ సారి నేనరుగునరికి రామస్వామి యింటనే యున్నాఁడు. 'రేపువచ్చి యజమానునితో మాట్లాడుడు నను వార్త' నాతనికిఁ దెలుపవలసినదిగా నా కానతిచ్చె.

తిరిగి యింటి దారి పట్టితిని. చీకటి. నా కింకొక హృదయవికార మంకురించినది. అది దొంగలభయ మను వేధ. ఏదేండ్ల వాఁడను. ఇతరులు దొంగిలించు భయము పుట్టించుపాటివస్తువేదియు నా దగ్గర నిది వఱ కెన్నఁడును లేదు. నేఁడో, నా గుండె బెదరున కంతములేదు. సాధారణముగా, వాతావరణ స్థితి యెట్లున్నను, నడచునప్పుడీలఁ గొట్టుకొనుచుండుట నా కలవాటు కాని యీ సాయంకాలమున నీలవేయ మనసు రాకుండె. కుతూహలములేదు. పైఁగా భయమొకటి ధాపురమయ్యె. దారి కిరుప్రక్కల నున్న పొదలఁ గని యులికిపడుచుంటి. వేయేల? నానీడఁగని నేనడలిపోవుచుంటి. నాదని నేఁగలుగుచుకొన్న వెండితునక నిజముగా నాదియో, కనుక దానిని వారెవ్వరునుండియో యేవిధముననైన లాగుకొనుట కెల్లరు నధికారులేకదా!

ఈ రీతి నాలోచించుచు మా సదన సింహద్వారము చేరువకు వచ్చునరికి మా జాగిలంబు మొఱుఁగఁదొడఁగె. అప్పుడు నా గుండె యించుక కుదుటబడియె. కాని, ఆ మొఱుఁగు నాకుఁ జాలసిగ్గును గల్గించె. నేటి వఱకు నా కాకుక్కయే స్నేహితుఁడు. అను దినమును దాని కింత యాహారము వేయు చుంటిని నేను. అన్నముం గాంచి తన కాకలి తీనట్లు బెట్టునరి చేసిచేసి, నే లాలన చేసినం తనే, యా యాహారము దినఁ బ్రారంభించెడిది. ఈ దినమున నా కీ సంతాపకారణధనము సంప్రాప్తించుటచేతఁ గాఁబోలు దాని కాహార మిడుటయే మఱచితిని. నా నిర్లక్ష్యభావమును సరకుగొనక యది సంతోషముతో నేయున్నది. నేను నా రూపాయ నా జేబులోనున్నను మహాదుఃఖి నైతిని. అక్కటినఁ గుక్కను జూచి సిగ్గుపడి తలవంచుకొని తిన్నఁగా లోనికిఁబోయి లజ్జాదుఃఖప్రకంపిత హృదయముతోఁ గ్రమముగ సుషుప్త్యవస్థలో నున్న తస్థాయిఁ జేరితిని.

౮

మరునాఁడు యజమానుఁ డగు రెడ్డి భోజనముచేసి కూరుచుండెను. రామస్వామి వచ్చి యాతనితో మాట్లాడఁబోవుచుండెను. అతఁడు చాటున నున్నను నిజము చెప్పకొన వలెను. అతఁడు విశ్వాసపాత్రుఁడు. కుటుంబి కుఁడు. పరపతి గలవాఁడు. అన్నమాటఁ దప్పనివాఁడు. అతనికిఁ దొరలు నిర్ణీతభృతి నిచ్చుటయే కాక పనిముగిసినతోడనే పండ్లో, కాయలో, వస్త్రమో బహుమానముగా నిచ్చు చుందురు. అతఁడు వచ్చినతోడనే నేనును లమునని సరిపెట్టుకొని మధ్యాహ్నభోజన మునకై వచ్చితిని. రూపాయపొట్లము నా దగ్గరనే యున్నది.

అప్పుడు మా కీసంభాషణ జరిగెను.

రా—అయ్యా! నాకుఁ దటస్థించిన నష్ట మును గూర్చి మీరువింటిరా?

బ—నష్టమా?_నీకే? ఏది! ఏమది! చెప్పు!

రా—బాబూ! ఏమని చెప్పను. ఈ యుదంతము ఊరంతయు నెఱుఁగునని నా యభిప్రాయము. నిన్నరాత్రి నేను పని నుండి తిరిగివచ్చుచు మార్గమధ్యమున నా కూలి రూపాయ — పొట్లముఁ గట్టిన రూపాయ— వెండిరూపాయ— పారవేసి కొంటిని.

* * * *

రూపాయ యన్నమాటతో నా ప్రాణము లెగసిపోయెను. ముఖమునఁ జేరిన రక్తము, నల్దెసలఁ జిమ్మినా యేమి యన్నట్టులుండెను. బసివిరెడ్డి రామిస్వామివైపు చూచుచు నాతని మాటల శ్రద్ధతో వినుచుండుటచేత నావదన రక్తిమఁ గనలేదు.


* * * *

రా—కాగితములోఁ జుట్టి యయ్యది సురక్షితముగ నుండునని జేబులో నుంచుకొంటిని. ఎప్పుడో జేబులోనుండి యాపొట్లము జారి పడిపోయినది. కాగితమున నుంటచేత క్రిందపడినను రూపాయ చప్పుడుకాలేదు. ఎక్కడ పడినదో నా కెరుక లేదు; కాని యింటికిఁ బోయి జేబు తడుముకొనునరి కయ్యది లేదు. వచ్చినదారినే వెనుకకుఁ బోయి వెదకితిని. అయిన నది యలభ్య మయ్యె. అనేకు లా త్రోవనే పోవుచుందురు

కావున నెవ్వరికో అది దొరకి యుండును.
బ—దొరకినవాఁడు సంగతి వెల్లడింపఁడా?
అది నిజమైనయెడల నీపాటికి నలుగురి నోళ్ల లోఁ బడదా?

* * * *

నేను నేలలో క్రుంగిపోవుచున్నట్లు నాకుఁ బొడగట్టె. ఈసంభాషణము నాకు వినశక్యము గాకుండె. నామనస్సులో నున్నది యున్నట్లు వెల్లడిచేసి చిత్తవ్యాకులంబును బాపుకొన నెంచితిని. రూపాయపొట్లము పైకిదీసి వణకు చున్న వ్రేళ్లతో రామస్వామి కిచ్చితిని. ఇది



నీదేనా యంటి. నామాట నాకే వినఁబడనంత మందస్వరములోనుండె. అందుచేత, నదే ప్రశ్న మఱల నడిగితిని. నా చేతిలోనున్న పొట్లము విప్పి చూచుకొని రూపాయయు పొట్లపుఁ గాగితమును దనవే యనియుఁ బొట్లము మాత్రము తాఁ గట్టినట్లు లేదనియు నతఁ డనె.

నీ కిది యెట్లువచ్చెనని బసివిరెడ్డి నన్నుఁ బ్రశ్నించె. నేను బాష్పపూరితనేత్రములతో యావద్వృత్తాంతము స్పష్టముగా వెల్లడించితిని. నన్ను యజమానుఁ డింటనుండి తరిమివేయు ననుకొంటి; లేదా దండతాడనము నాకు సిద్ధించునని యెంచితిని. ఎట్టులైనను సరే; నిజముచెప్పితిగదా యన్న యనిర్వాచ్యానంద మపారమై నాభీతిని బారఁద్రోలెను.

బసివిరెడ్డి నన్నుఁ గొట్టుటకు మాఱుగ బుజ్జగించి యపూర్వకారుణ్యవృష్టి నాపైఁ గురియించె. 'ఋజుమార్గవర్తి వన్న నీవే' యని నన్నుఁ గొనియాడె అంత నా మనోభార మదృశ్యమైపోయె.

అంత రామస్వామి యానందముతో నన్ను గాఁగిలించుకొని యా రూపాయలో సగము నాకీయ వాగ్దాన మొసఁగె. ఆమాటకే నియ్యకొనలేదు. వదలిపోయినదిరా ఈశ్వరాయని సంతసించిన నాకందు భాగమేల? రూపాయతో వచ్చిన యాధిబాధ నే నెఱుఁగనిదికాదు. ఇంకను అనుభవింపవలయునా? వలదు. వలదు. అట్లొసఁగ్బినందు కేనెన్నఁడు విచారముఁ జెందలేదు.

* * * *

ఈ ప్రకారము తన చిన్ననాఁటికథ నీతిబోధకమైన కథ—బాలురకు వీరన్న చెప్పెను. ఈ వృత్తాంతమును వినిన గోపన్న తాత తనకు నేర్పిన శ్లోకమునే యప్పుడు పాడ నందఱును చలిమంటదగ్గరనుండి లేచిపోయిరి.

అర్థానామార్జనే దుఃఖం
ఆర్జితానాంచ రక్షణే;
రక్షితానాం వ్యయే దుఃఖం
కి మర్థం దుఃఖభాజనమ్.

కేనోపనిషత్తు

కవిరాజు పల్లాది వేంకట విశ్వనాథ శర్మ గారు

ప్రథమ ఖండము

శిష్యుఁడు

ఎవ్వనిచేతఁ బూన్పఁబడి
యీప్సితమందున వ్రాలు మానసం?
బెవ్వనిచేతఁ బూన్పఁబడి
యొద్దు స్వకార్యచికీర్ష ప్రాణ? మిం
కెవ్వనిచేతఁ బూన్పఁబడి
యీపలుకుల్ బలుకుం జనంబు? లా
మెవ్వనిచేతఁ బూన్పబడి
యీక్షణమున్ శ్రుతియేపుమీ తెఱుఁగ?

గురువు

శ్రోత్రమునకు శ్రోత్రము, మనస్సునకు మనసు,
వాక్కునకు వాక్కు, ప్రాణమ్ము ప్రాణమునకు,
దృష్టికిని దృష్టి యగుదానిఁ దెలిసి ధీరు
లధిగమింతురు మరణించి యమృతసిద్ధి.

పోవ దచటికిఁ జక్షువు, పోదు వాక్కు,
మనమునుం బోదు, తెలిసికో ననువుపడదు,
శిష్యునకు దాని నేరీతిఁ జెప్పవలెనొ
యెఱుఁగఁజాలక యున్నాము తెలివులేమి.

విదితావిదితములకు న
య్యది మీఁదై మఱియు నన్యమై తగునంచుఁ
విదితముచేసిన పూర్వుల
సదమలవాక్యమ్ము మాకు శరణంబయ్యెఁ.

వాక్కుచేత నేది వఱలదు దీప్తమై
వాక్కు దేనిచేత వఱలు దీప్తి
నదియె బ్రహ్మమంచు నాత్మ నెఱుంగుము
ఎద్ది గొల్తు రద్ది కాదు కాదు.

మనసుచేత నేది తనరదు వ్యాప్తమై
మనసు దేనిచేతఁ దనరు వ్యాప్తి
నదియె బ్రహ్మమంచు నాత్మ నెఱుంగుము
ఏది గొల్తు రద్ది కాదు కాదు.

కనులచేత దేనిఁ గాంచ నశక్యంబు
కనులు దేనిచేతఁ గాంచఁగలవు
అదియె బ్రహ్మమంచు నాత్మ నెఱుంగుము
ఏది గొల్తు రద్ది కాదు కాదు.

శ్రోత్రములను నేది శ్రుతము కాకుండును
శ్రోత్రవితతి దేన శ్రుతినిఁ బడయు
నదియె బ్రహ్మమంచు నాత్మ నెఱుంగుము
ఏది గొల్తు రద్ది కాదు కాదు.

ఏది ప్రాణమునను గాదు సప్రాణము
ప్రాణమునకు నేది ప్రాణ మగును
అదియె బ్రహ్మమంచు నాత్మ నెఱుంగుము
ఏది గొల్తు రద్ది కాదు కాదు.

ద్వితీయ ఖండము

ఇచటనో దేవతలయందో యెచటఁగాని
బ్రహ్మరూపము నెఱిఁగితి బాగుగనని

తలఁచితివయేనిఁ దెలిసిన దలఁపమె యగుఁ
దరిచి మఱియు విచారింపఁదగును నీవు.

శిష్యుఁడు

తెలిసితిని బాగుగ నటంచుఁ దలఁపఁ, దలఁపఁ
దెలియనని, తెలిసితినని తలఁతుఁ "దలఁపఁ
దెలియనని, తెలిసితినని తలఁతు" ననఁగఁ
దెలియువాఁడె మాలో దానిఁ దెలియువాఁడు.

వేదము

తెలియరా దనుకొనువాఁడె తెలియఁగలఁడు
తెలిసె ననుకొన్నవాఁ డది తెలియలేఁడు
జ్ఞానసంపూర్ణులకు నవిజ్ఞాత మదియు
జ్ఞానహీనుల కది సువిజ్ఞాత మగును.
అదియు నెప్పుడు ప్రతిబోధ విదితమగునో
అపుడె విజ్ఞాతమై కూర్చు నమృతసిద్ధి,
బ్రహ్మవేత్తయుఁ బొందు వీర్యము తనంత,
విద్యచే మోక్షసంపత్తి వెలయఁగాంచు.
ఇచట నెఱిఁగితేని నచట సత్యముగద్దు
ఇచట నెఱుఁగకున్న నచట సున్న
సర్వభూతములను సమతపాటించి యం
తమునఁ గాంత్రు ధీరు లమృతసిద్ధి.

తృతీయ ఖండము

బ్రహ్మమె జయించె మున్ను దేవతలకొఱకు
తజ్జయమునఁ బొందిరి సమర్థతను సురలు
'ఈజయము మాదె మాదెయా నీమహిమము'
అనుచుఁ దలపోసి రాత్మలందునను సురలు.

సురల మిథ్యాభిమానంబును జూచి బ్రహ్మ
మతులకీథితిఁ బుట్టె దేవతలకొఱకు
'ఇదియెదో గొప్పభూతమహా! ఏమిది!' యని
తెలిసికొనలేకపోయెను దేవగణము.

'జాతవేద! ఏతన్మహాభూత మేదో
తెలిసి రమ్ము'ని పంపిరి త్రిదశు లగ్ని.
'సరియెఁ గనుగొందు' నని యగ్ని సమ్మతించి
పరుగు పరుగునఁ దత్సమీపమున కరిగె.

అదియు వానిని గాంచి 'యోయయ్య! నీవు
నెవ్వఁడవో చెప్పు' మంచుఁ బ్రశ్నించె మొదట
'అగ్నియన జాతవేదుఁడు ననఁగఁ బరగు
వాఁడ నే'నని యాతండు ప్రతివచించె.

'అంతవాఁడవు! నీదు సామర్థ్య మేమి
చెప్పుమా?' యటంచు వానిఁ బ్రశ్నించె మఱల.
'ఈ సమస్తము, ఈ పృథ్వి నెసఁగు నన్ని
భస్మమొనరింతు' నని వాఁడు ప్రతివచించె.

'అయిన దహియింపుమీ గీని' నంచు నగ్ని
దేవుముందట నది యొక్క తృణము వైచె.
తృణముఁ దరిసియు నతఁడు దహింపలేక
క్రమ్మఱి 'యిదేదో తెలియంగరాని' దనియె.

'మాతరిశ్వ! ఏతన్మహాభూత మేదో
తెలిసిరమ్ము'ని వాయువుం ద్రిదశు లంప
'సరియె కనుగొందు'నని వాఁడు సమ్మతించి
పరుగు పరుగునఁ దత్సమీపమున కరిగె.

అదియు వానిని గాంచి 'యోయయ్య! నీవు
నెవ్వఁడవో చెప్పు'మంచుఁ బ్రశ్నించె మొదట
'వాయువను మాతరిశ్వుఁడ వచ్చినాఁడ
భవదుపాంతమ్మునకు' నంచుఁ బ్రతివచించె.

'అంతవాఁడవు! నీదు సామర్థ్య మేమి
చెప్పుమా?' యటంచు వానిఁ బ్రశ్నించె మఱల.
'ఈ సమస్తము ఈ పృథ్వి నెసఁగు నన్ని
పట్టి గ్రహియింతు'నని వాఁడు ప్రతివచించె.

'అయిన గ్రహింపుమీ దీని' నంచు వాయు
దేవుముందఱ నదియొక్క తృణము నైచె
తృణముఁ దరిసియు నతఁడు గ్రహింపలేక
క్రమ్మఱె, 'యి దేదో తెలియంగరాని' దనియె.

'ఇంద్రుఁడా! ఈ మహాభూత మేదో తెలిసి
రమ్మనుచు వారు మఘవుఁ గోరంగ నతఁడు
పరుగు పరుగునఁ దద్విమీపమున కరిగె
అది తిరోధానమయ్యె నాయయ్యనుండి.

ఆ యాకాశమునను శో
భాయుత యైయున్న హైమవతి నుమఁ దరియం
బోయి మహాభూతం బిది
యేయట?' యని యడిగె నెడఁద నెనసిన
తమితోన్

చతుర్థ ఖండము

'ఇదియె బ్రహ్మము ఇయ్యదియే జయింప
విపులసామర్థ్యమున మీరు వెలసినారు?'
అనుచు నాయుమ వచియింప నమరపతియు
'ఇదియె బ్రహ్మస్వరూప'మం చెఱుఁగఁగలిగె,

దాపునందున్న బ్రహ్మమున్ డాఁసి కతన
'ఇదియె బ్రహ్మ'మని మొదట నెఱుఁగు కతన
నగ్నియును వాయు వింద్రుఁడు నన్య సురుల
నతి తరించిరి మహిమచే నతితరముగ.

దాపునందున్న బ్రహ్మమున్ డాఁసి కతన
'ఇదియె బ్రహ్మమని మొదట నెఱుఁగు కతన
నందఱినిమించి యింద్రుఁడే యన్య సురుల
నతితరించెను మహిమచే నతితరముగ.

ఇదియె తదాదేశం 'బె
య్యది ధ్యానింపంగఁ దగిన దందురో కన న
య్యది స్ఫురియించును మెఱు పటు
లది ఱెంగు నిమేషమున నదియాశ్చర్యముగాన్.'

'మొదట గ్రహించిన రూపము
సదమలగతి విరతిలేక సంకల్పింపన్
బొదలును బ్రహ్మమునకు దగ'
ఇది యధ్యాత్మోపదేశ మీడిత మరయన్.

ప్రాణు లెల్ల బొందదగునట్టి బ్రహ్మము
ప్రాణులెల్లఁ బొంది యలరునంచు
భావమునఁ దలఁచి యుపాసించు వానిని
ప్రాణులెల్లఁ గొల్చు బ్రహ్మము నటు.

'ఉపనిషద్రహస్యము చెప్పుమో మహాత్మ!'
అనుచు శిష్యుఁడు గురు వేఁడ ననియె గురుఁడు,
'ఉపనిషద్రహస్యమె యిప్పు డుక్తమయ్యె.
ఇపుడు చెప్పితి బ్రాహ్మి యన్నుపనిషత్తు.'

'దానికిఁ దపమ్ముఁ గర్మయు దమము నాది,
గలవి స్థితిహేతువు లటంచుఁ దెలియు మాత్మ
సాంగముగ నొప్పు వేదముల్ సత్యనిష్ఠ
అరయ దీనికి నియతతరా నాయతనము.'

'ఎవ్వఁ డీ బ్రహ్మవిద్య నిట్లెఱుఁగఁ గలఁడొ'
వాఁడు సంసార పాపముల్ వదలివైచి
యంతమెఱుఁగని శ్రేష్ఠతరా సమ్మతపదవి
నధివసించును- తప్పక యధివసించు.

కానరానికష్టాలు

శంకరదీక్షితులు

౧

రెండు మాసముల క్రిందట నాభార్యను బిడ్డను రాజమహేంద్రవరమునకు 18 మైళ్లదూరముననున్న పట్టిస మామె పుట్టింటికి కంపియుంటిని. క్షేమవార్త మధ్య మధ్య నాగ్రామమునుండి వచ్చుచున్న రైతులవలన దెలియుచుండెననుపోయి వారినొకసారి చూచిరావలయునను నుద్దేశము మనస్సున జనించి నన్ను తొందరపెట్టుటచే పోయి వచ్చుటకు నిశ్చయించుకొని, శుక్రవారము మధ్యాహ్నము బయలుదేరుపడవలో బోవలయునని తీర్మానించుకొని, తహసీల్దారుగారి యొద్దకు బోయి నాకు సోమవారము మొదలు నాలుగుదినములు శెలవునిప్పింపవలయుననియు, మూడవశనివారము నాదివారమునుగూడ గ్రామమును విడిచిపోవుట కనుజ్ఞనీయవలయుననియు వేడుకొంటిని. మాతహసీల్దారుడు కేవలము దయార్ద్రహృదయుడు కాకపోయినను, కఠినుడుమాత్రము కాడు. తాలూకా గుమాస్తా తనకెందఱు పిల్లలో ఎఱుంగుటకైన నవకాశములేనంత పనిగలవాడని లోకములో ప్రతీతియున్నను మాతహసీల్దారుడుమాత్ర మంతకఠినముగా మాచే రాత్రింబగళ్లు పనిచేయించకుండుట కీనడుమనే చిన్నకారణము కలిగినది.

తహసీల్దారుడు, హెడ్డు గుమాస్తాతో సర్క్యూటు పోయినప్పుడొక గ్రామములో సత్రమున మకాముగా నుండిరట. ఒకనాటి మధ్యాహ్నము మూడుగంటలకు ప్రక్క గదిలో నాతడు నిద్రించుచున్న సమయమున హాలులో హెడ్డుగుమస్తా పనిచూచుకొనుచు కూర్చుండెనట! లోపలిగదిలో తహసీల్దారుని భార్య స్థూలదేహముచే వేసవితాపమును భరింపలేక, విసరుకొనుచు, తలుపువైచుకొని యుండెనట! అప్పుడొక కరణము హెడ్డు గుమాస్తానుజేరి కూర్చుండి కుశలమడుగుచు అయ్యా తమ కెందఱుసంతానమని" ప్రశ్నించెనట! హెడ్డుగుమాస్తా (పేరెందుకులెండు) చమత్కారి, దేవాంతకుడు, మాటలతో పొట్టవ్రక్కలగునట్లు చేయగల విదూషకుడు, గొంతు సవరించుకొని ఈరీతిగా నారంభించినాడట!

"నాయనా! అడగరానిప్రశ్న నడిగినావు! తాలూకాగుమాస్తాయంటే ఏమనుకొన్నావు? చెప్పెదవినుము. సూర్యోదయమింకను గాకుండగనే బయలుదేరి, యజ మానియొద్దకుపోయి, కాల్యకృత్యములకైనన తీరికలేకుండ 10 గంటలవఱకు నున్నపని లేనిపనియు జూచికొని, అవురావురని

...కేహాముతడసియు తడియనట్లు నీరు ద్రిమ్మ ...చుకొని, సంధ్యవార్చుట కైనను దీరిక లేకుండ నోటినిండ గ్రుక్కుకొని, తొడుగు కొనుచున్న కోటుతో చుట్టుకొనుచున్న తల పాగాతో పదునొకండుగంట లైపోవునేమో యను బెదరుతో పోయి, ఆఫీసులోపడి, రాత్రి పహారాజవాను బలవంతముగా దీపములార్చు ...అకుండి గాలి యనక, వాన యనక, యంధ ... మనక, రాత్రి ఏపదింటికో సంత్రెం ...తో యిల్లుచేరుసరికి నిశ్శబ్దముగా నున్న ...టిలో, ఏమూలనో గుర్రుపెట్టుచు ...ంచుచున్న యిల్లాలిని, లేపుటకుగాని, ...డిదినినదో లేదోయని విచారించుటకైన నోపికలేని హేతువుచే, నింటనామె వండిపెట్టిన మెతుకులను నిద్రాపరవశుడై నోటియందు వైచికొనుచున్నానను నమ్మకముతో క్రిందకు జారవిడచుచు, ఆపీటయొద్దనో, లేక సమీప మున నెచ్చటనో హస్తప్రక్షాళననైన సరిగా జేసికొనక నిద్రించుట మాకు నిత్యవిధి. తిరిగి తెల్లవారకమునుపే, యధికారి యింటికేగవల యుగదా యను బెదురుతో సరిగా నిద్రకూడ బోవుటకవకాశములేని మాకు పిల్లల కవకాశ మెక్కడిది? ఏవ్రతబలముననో, మతేకారణ ముననో సంతానముకలిగినను, చేసికొనిన భార్యగతినే విచారింప నవకాశములేని తాలూ కాగుమాస్తాకు, వారలసంగతి దెలిసికొనుట కవకాశ మెక్కడిదినాయనా!" అని యింకను ...నిసమాట లాప్రక్క ...సముచే నిటునటు ...ఇల్లాలు వినవిధిలేక పోయెను. తరువాత నామె పెనిమిటితో నేమి చెప్పెనో నాకు దెలియదుకాని, సాయంకాల మాయన హెడ్డుగుమాస్తానుబిలిచి, "శేషప్పా! ఏమిటి మధ్యాహ్న ముపన్యాసమిచ్చినావట? యని యడిగినాడట! "ఏదో సంసారతాపత్ర యమండీ! కష్టసుఖములు చెప్పుకొనుచున్నాము" అని శేషప్ప బదులు చెప్పెనట. తిరిగి రాజమహేంద్రవరమున కరుదెంచినది మొదలు తహసీల్దారు "సాయంకాల మారుగంటలు దాటిన తర్వాతగాని, ఉదయము పదునొకండు గంటలకు బూర్వముకాని కచ్చేరీయందు గుమాస్తా ఎవ్వరు కన్పడినను జుల్మానావిధింప బడును" అని నోటీసును పంపించినాడు. నాటి నుండియు మాశేషప్పను "సంసారసంక్రందనుడు" అని మేము పిలిచెడివారము. ఆనాటి నుండియు మాతహసీల్దారుని కఠినత్వముకూడ మాటుపడుట కారంభించెను.

"అన్నిదినములు నీకు శలవిచ్చుటకు వీలు లేదు. ఒక్కసోమవారముమాత్రము 'రజా' నిచ్చెదను కావలసినచో ఆదినముననే, ఒంటి గంటకు పడవకుబోవచ్చును" అని. ప్రత్యుత్తరనిరోధకముగా యధికారిపలికినమాటలకు సంతసింపవలసివచ్చెను. భార్యాబిడ్డలను జూచి రావలయునని నేనుచెప్పియుండుటచే నాతడా దినమైనను శలవిచ్చి యుండెను. లేనిచో నాతడు వృథగా నెవ్వరిని శలవుదీసికొన నీయడు. వెనుక నొకదొర, తద్దినమనిచెప్పిన తప్ప, గుమాస్తాలకు శలవియ్యకుండెనని చెప్పెడివారు. అందుచే వారు, ఉన్నట్టియు లేనట్టియు, గతించినట్టియు, జీవించినట్టియు బంధు

గులపేర్లు చెప్పి, వారితద్దినమని ఆ "తద్దినాల దొర"యొద్ద శెలవుదీసికొని పోవుచుండిరని ప్రతీతి. అదియొక్క పెద్దగాథ. తరువాత నెప్పుడైనను జెప్పెదనుకాని అదేవిధముగా, భార్యాబిడ్డలవిషయ మనినప్పుడు మాత్రము ఘూతహాసీద్దారు ఇంతవఱకెన్నడును శెలవర్జీని వృథాపఱపలేదు.

ఆదినమున (శుక్రవారము) మధ్యాహ్న మాఫీసునుండి యొంటిగంటకు బయలుదేరి, యింటికివచ్చి, నాతల్లితో చెప్పి, పిల్లవానికి బజారులో మిఠాయినిగొని, రెండుగంటల లోపుగా పడవలరేవును జేరి, ముందుబయలు దేరనున్న పడవను కనుగొని యెక్కితిని. నేను నాయిల్లు దాటివచ్చునప్పుడుమాత్రము, వీథిలోని రాయియొకటి కాలిబొటనవ్రేలికి తగులుటచే నది యపశకునముకాదని నిశ్చయించికొని బయలుదేరితిని కాని, వ్రేలిబాధ మాత్రము మధ్యమధ్య నావిషయమును జ్ఞప్తికి దెచ్చుచుండెను. స్వల్పముగా వీచుచున్న పైరుగాలి సహాయమున మాపడవ బయలుదేరెను. దినమెల్ల బడలియుండుటచేతను, లోనికేగి, త్వరలో గాఢనిద్రామగ్నుడనై పోతిని.

సుమారు నాలుగుగంటలకు ఉక్క ఎక్కువగ నుండుటచేతను, ఎండతీవ్రతచేతను దేహమంతయు స్వేదమయముగుటచే, నిద్రనుండి మేల్కాంచి, పడవలోపలిభాగమునుండి పైతట్టుపైకరుదెంచి కూర్చుంటిని. సాయంకాలము కావచ్చినను, ఎండ నిప్పులజెఱుగుచుండెను. ముక్కురంధ్రములనుండి వేడిశ్వాస వెలువడుచుండెను. ఎచ్చట నొక్కయాకైనను [...] కుండుటచే, వాయుదేవుడు కూడ నిలిచి[...]యెను. ఆవేసవికాలమున నిట్టిలక్షణములు ప్రకృతియం దెట్టితీక్ష్ణతను గలుగజేయునో అందఱు నెఱింగినవిషయమే. పడవకళాసులు తెరచాపదించి అందినప్రదేశములయందు గడలసహాయమున పడవను ముందునకు సాగించుచుండిరి. రాజమహేంద్రవరమునుండి ఆరే[...] మైళ్లదూరము వచ్చియుండనోపునని మే[...]హించి, నడుమనడుమ, గోదావరినుండి [...]కము నంగవస్త్రసహాయమున చెంబుల[...] పైకిదీసికొని త్రాగుచు, స్వేదరూపమున [...]నంతయు వెలికిగ్రక్కుచు, బహిరంతస్తాప[...]లచే నేనేకాకుండ, పడవలోనివా రెల్లరును గూడ తహతహపడుచు, నీటిలో కూర్చుండినచో, శీతలముగానుండునేమో యని మేమనుకొంటిమి.

ప్రకృతి మాప్రార్థనల నాలించెను కాబోలును ఆకసమున నొకమూల చిన్న నల్లటి మచ్చవలె గన్పడుచుండిన ప్రకృతి సేవకుడుప్పొంగినట్లు కొంచెముకొంచెముగా నభివృద్ధి నొందుచుండెను. కళాసులు దానిని గమనించి "వచ్చెగాలిదుమారము— సుడిగాలివచ్చింది" అని కళవళపడుచు పడవను సుమారు నూటయేబదిగజముల దూరమున నున్న యొడ్డునకు జేర్చుటకై విశ్వప్రయత్నము జేయనారంభించిరి. తనస్వేచ్ఛాప్ర[...] చారమున కీతప్ప[...] రనికాబోలును, త[...] దేవుని సహాయమ[...]

మంతయు గప్పివైచెను. ఒడ్డును జేరగలమా లేదా అని, చీకాకుపడుచు, తటతట కొట్టుకొనుచున్న గుండెలతో దిగులుపడుచున్న ప్రయాణీకుల ప్రశ్నకు సమాధానముగా కాబోలు "రంయి, రంయి"మను ధ్వనితో సుడిగాలి వీవ మొదలిడెను. పడవయొక్క తెరచాప నదివఱకే దింపియుండుటచే కొంతవఱకు వాయుతాడనము మాకు మొదట బాధకరముగా గన్పడలేదు. అప్పటికి మే మొడ్డునకు సుమారేబదియరువది గజముల దూరమువఱకు పడవలో చేరగల్గితిమి. గాలి విజృంభించెను. ఇటునటు నుయ్యాలవలె, పడవ, యూపబడుచుండెను. కళాసులు సర్వవిధముల ప్రయత్నించుచుండిరి. 'పట్టెసము వీరభద్రా! రక్షింపు'మని గోలపెట్టుచు ఏ నిమిషమున, పడవ తలక్రిందగునో యని భయముతో నిల్వబడియున్న ప్రయాణీకుల'నున్న స్థలములనుండి కదలినచో పడవ తప్పక తలక్రిందగు'నని కొంచెము మోటుగా పడవవాండ్రదలించుచుండిరి. గాలితాకుడుచేతను, పడవవాండ్ర ప్రయత్నముచేతను, గట్టునకు ముప్పది గజముల దూరమువఱకు పడవపోగలిగెను. అప్పుడొక కళాసును,నొక ప్రయాణీకుడును ధైర్యముదెచ్చికొని పడవత్రాటిని పట్టుకొని, గట్టున కీదుకొనిపోయి, తమవెంట పడవను లాగుకొనవలయునను సంకల్పముతో నీటనురికి, గట్టున కేగుచుండిరి. కాని ఆగాలిలో నెంతవానికైన కన్నులను మూసికొని, ఎదురీదుట కష్టసాధ్యమే! వారింకను నొడ్డును జేరనేలేదు! ఇంతలో పడవ తెరచాపకొయ్య, ఆగాలి దెబ్బకు, "ఘుర్ర"ని విఱిగి, "దబ్బ"ని క్రింద పడెను. ఆతొందరలో నిటునటు తప్పుకొనగల వారము తప్పుకొంటిమికాని దురదృష్టవశమున నాకొయ్యపడుటలో నొకనిజబ్బపైబడి, వానిని పడవతట్టుపై పడద్రోసి, యొకముసలి యామె తలపైబడి క్షణములో నట్టంతయు రక్తమయమగునట్లు చేసెను. ఆముసలియామె, యాక్రందనమును, రక్తసిక్తమగు నాతట్టును జూచి నాగుండెలు "గుభిల్లు"మనెను. ఈ హడావిడిలో పడవ ఇటునటును భయంకరముగా నూగజొచ్చెను. "బ్రతికియుండిన బలుసాకైన దిని జీవింపవచ్చునని" తలంచి చిన్ననాడెప్పుడో పదిబారలదూర మీదినజ్ఞాపకము దెచ్చికొని, నేనును, నీటిలోని కురుక నిశ్చయించుకొని, పడవ పట్టెసమెప్పటికైన జేరినచో, నాసామానును జాగ్రత్తగా తేవలయునని కళాసులకు జెప్పి నీటిలోని కురికితిని. నీటిని తాకినంతనే నాకొడలంతయు జలదరించెను. చేతులార బుద్ధిపూర్వకముగా గంగాప్రవేశమైతిని!

ఏనా డీదినయాత! కాకినాడలో కాలువలో నెప్పుడో పదిబారలదూరము పదిమంది మిత్రులమధ్య ఈదనేర్చిన నాకీయఖండగోదావరిలో నొకబారయైనను పడకపోవుటలో నాశ్చర్యమేమున్నది! ఆజలరాశిని, ఆప్రకృతి భయానకరూపమును జూచి, గట్టుచేరగలనా యని నాకనుమాన ముదయించెను. ఆ యనుమానముతోడనే నీరసముకూడ బయలుదేరెను. పడవలోనే నిలిచియుండినచో నలుగురితోపాటే కాగలదనియు, నీవిషమావ

స్థను నేనే తెచ్చుకొంటిననియు, నిందించుకొనిన నేమి ప్రయోజనము? ఎట్టులో పదిబారల దూరముపోవునరి కాయాస మారంభించెను. చేతులు లాగజొచ్చెను. ఒకసారి నీటిపై నిలువలేక, యొకగ్రుక్కెడునీరుకూడ మ్రింగవలసి వచ్చెను, "చచ్చె, బ్రాహ్మణుడు చచ్చె" నని పడవలోనివారి యాక్రోశము స్ఫుటముగా నాకు వినబడెను. ఇంతలో మొదటబయలు దేరినయిర్వురును నాయవస్థనుజూచి, తమ చేతియందున్న బలమైన పడవత్రాటినిపట్టుకొని నెమ్మదిగా రావలసినదని నాకు ప్రోత్సాహము గలుగజేయుచు నీటిపై యాత్రాటిని నాయొద్దకు జేర్చుటచే దానిని బట్టుకొని, బహుకష్టముతో నిక నొకరెండు బారలు వేయగల్గితిని, అప్పుడాయిద్దఱిలో కొంచెము బలవంతుడైన ప్రయాణికుడు తిరిగి నీటిలోనికుఱికి నాయొద్దకుజేరి, తా నొక చేతితో నీదుచు, రెండవచేతితో, నాకు నడుమనడుమ సహాయము జేయుచు, నాగాలిదుమారములో నన్నొట్టకేల కొడ్డున కీడ్వగలిగెను. గాలి యింకను తగ్గలేదు. నాలుగు నిమిషముల కాలము శ్రమదీర్చుకొని, పడవ నొడ్డునకీడ్చుటకు మేము ముగ్గురము నెంత ప్రయత్నించినను గాలిభారముచే, మాకది సాధ్యముకాక పోయెను. తుదకు విసిగి వేసరి, చేరువనున్న యొకతుమ్మచెట్టున కా త్రాటిని గట్టిగా బంధించితిమి. అరగంటవఱకు నాగాలి మరల లేదు. తరువాత నాలుగైదునిమిషములవఱకు చినుకులుపడి, తిరిగి ప్రకృతి నిర్మలమై పోయెను. గడలను తెల్లగావాడి కళాసులుమాకుసహాయముచేయుటచే, ఈసారి పడవ నొడ్డునకీడ్వగలిగితిమి. కాని, పడవవాండ్రా రాత్రికి దాని నచ్చటనే కట్టియుంచెదమనియు, తిరిగి పైరుగాలి తిరిగినగాని, బయలుదేరమనియుచెప్పుటచే సమీప గ్రామస్థు లిద్దఱు నాకు తోడువచ్చెద మనుటచే, నావస్తువులను పడవవాండ్ర కప్పజెప్పి, నాబిడ్డకై కొనిన మిఠాయిపొట్లమును దీసికొని, అచ్చట కింకను పట్టినము 11 మైళ్లున్నను, రాత్రి 10 లేక 11 గంటలకైన నిల్లుచేరగలనను నమ్మకముతో నీరసముగా నున్నను, భార్యాబిడ్డలను జూడవలెనను . నాత్రముతో బయలుదేరి, నడుమనడుమ కూర్చుండుచు, అర్ధరాత్రికి పట్టిన గ్రామసమీపమును జేరితిని. అచ్చట నాతోవచ్చిన ప్రయాణికులిర్వురును నాకు దారినిజూపించి, తమదారి నేగుటచే, నొంటిగా గ్రామమును బ్రవేశించి, తిన్నగా నామామగారియిల్లు జేరి, తలుపు దట్టితిని. అర్ధరాత్రమగుటచే కాబోలును నాకెవ్వరును బదులు పలుకకుండుటచే తిరిగి రెండుమూడు సారులు తలుపును గట్టిగతట్టి "తలుపు! తలుపు!" అని అరచితిని.

'ఎవరువారు? దూరముగానుండండి తలుపుదీసెదను" అని కాబోలును నిద్రాముద్రాంకితమైన యస్ఫుటనాదము విని "నేను- తలుపుతీయండి" అని తిరిగి హెచ్చరించితిని. ఆలోపలనుండి వచ్చినశబ్దము మాయత్తగారిమూలుగువలె నుండుటచే నేనీసారి సగౌరవముగా నంటిని. ఇంతలో నాపతివ్రత "తలుపు ముట్టుకొనకండి, తీస్తాను" అని సహజస్వరముతో, మేల్కొని తలుపుదీయుటకు లేచెను. తల్లి

కూతురు బిడ్డలు నొకేస్వరముగలవారని నేను మరచితిని. తలుపుదీసి కొంచెము వెనుకకొత్తిగిలి, "నన్నట్లువీథిలోనికి పోనీయండి, మీరు లోపలకు బోవచ్చును" అనెను. ఇదివఱకున్న స్వల్ప ఉత్సాహము కూడ నింతటితో నశింపగా, నాయరుగుపై చతికిలబడితిని. నాభార్య యింటిలోనికి పోకూడదని గ్రహించుటయే నావిషాదమునకు గారణము; కాని నాకష్టము లంతటితో తీరలేదు.

"మంచిసమయమునకు వచ్చినారులెండు! [illegible]న్నయుదయము, అమ్మయు నాన్నయు, [illegible]నగరము పోయినారు, తాతయ్యమాత్ర[illegible]టిలో నున్నాడు. నేనీసాయంకాలము బయ[illegible]జేరితిని. గ్రామములో నింకొక బ్రాహ్మణుల యిల్లు లేదు కదా, ఎట్లుచేయవలెనని యను కొనుచున్నాను, తాతయ్యకు కండ్లు కనబడవు గదా గోదావరి నీరెట్లు"

"ఛీ, నోరుమూయుము. పాడుగోల నీవును!" అని నావిసుగుదలనంతయు వెల్లడించితిని. ఆమె నాకిప్పుడు చెప్పుచున్న దానికర్థమిది. "ఇంట వంటచేయుటకు దిక్కెవ్వరును లేనికాలమున, సమయమునకు నేను వచ్చితిని కదా, ఇక నామెకు భయములేదట. సోమవారమువఱకు వంటచేసి, నాభార్య బుతుస్నాతయైన మధ్యాహ్నమో, సాయంకాలమో బయలుదేరి నేను తిరిగి రాజమహేంద్రవరమునకు బయనమైపోవలయును కాబోలు" నను విసుగుచే నే నామె నదలించితిని కాని నాయవస్థ యంతయు వినినతర్వాత నామె పడిన సంతాప మింతింతకాదు. ఆసంతాపముతో వాయుదేవుడును, పడసవాండ్రును, అధికముగా శలపీయుని నాయధికారియు, నామె శాపాగ్నికి గురియైనను, నాకేమియానందము? ఆమూడుదినములును వంటరాని హేతువుచే నుడికియు నుడకనిపాకము భుజించుటచే గలిగిన కడుపుబాధతోడను, అలవాటులేనిసలత్వముచే కాలిన చేతిబాధతోడను, అచ్చటనే యవలంబింపవలసిన గంగాధరత్వముచే గలిగిన యొడలినొప్పులచేతను, కేవలమును కొంటెయగు నామూడేండ్ల ప్రాయము గల బిడ్డచేసెడు నల్లరివలనకలిగిన చీకాకుతోడను, అన్నింటికంటెను, నాప్రయాణము తుదకిట్లు పరిణమించెనుకదా యను నవమానముతోడను, నేను పడినయవస్థ శత్రువునకైన గోరరాదని నేననుకొనుచు, సోమవారము నాడు సాయంకాలము కొవ్వూరున కేర్పాటు చేసికొనిన యొంటెద్దుబండికై వీథియరుగుపై కనిపెట్టుకొనియున్న సమయమున, నేను తన చమత్కారమునకు మెచ్చుకొందునను నుద్దేశముకాబోలును, నాభార్య నాయొద్దకువచ్చి, "సమయమునకు దేవుడువలె వచ్చి ఈమూడుదినములు గడిపినారు—"అని ప్రారంభించెను.

"ఎవరినైన పంపి, సీతానగరమునుండి, నీతల్లిదండ్రులను బిలిపించి, సరిగా వారము దినములలో రాజమహేంద్రవరమునకు నీవు రాకపోయినచో ఇక నాసంగతి; తెలియునా?" అంటిని. ఆమెకు నవ్వువచ్చుచున్నను, పరాభవాగ్ని నన్నుపీడింపజొచ్చెను. కాని, ఈ పరాభవమున కామె నేల నిందింపవలెనని, నాలోనేను శాంతిబొందితిని. తిరిగి పడవపై బ్రయాణముజేయవలదని నాభార్య నిర్బంధించుటచేతనే, నేనాదినమున కొవ్వూరున కొంటెద్దుబండిపై బయలుదేరవలసి వచ్చెను. "కానరానికష్టములకు" గర్తలెవ్వరో, ఈనా కష్టములకుకూడ బాధ్యులువారేయని నాలో నేను తృప్తిబొందవలసి వచ్చెను.

భక్తాగ్రణి

అనిపెద్ది జగన్నాథశాస్త్రి గారు

కనులన్ సమ్మదబాష్పముల్ గురియఁగా గాత్రంబురోమాంచముం
గనఁగాఁ జిత్తము పారవశ్యమునఁ దూఁగన్ గుత్తుకన్ గద్గద
స్వనమొప్పారఁగ నస్ఫుటంబులగు బాసల్ పల్కుచున్నాఁడ వె
వ్వనితోనో? వివరించి చెప్పు మిట భావంబిచ్చి, భక్తాగ్రణీ!

మ. చిరజీర్ణంబు, విశాలపత్రశతసజ్జీభూత, ముద్యద్ఘుణా
కురముం, జందనపంకసిక్త పటురక్షాపత్రముల్, యుష్మ దా
దరపాత్రంబు, హృదంతరస్థితకరాంతస్థంబు, శ్రీరుక్మిణీ
వరచిత్రాన్విత, మద్ది భాగవతమా? భాషింపు భక్తాగ్రణీ!

మ. తగుకాలంబుల నిత్యకర్మముల నిద్ధశ్రద్ధ గావించుచున్
సగుణబ్రహ్మముఁ బార్థసారథిని బూజల్ సేయుచున్, రజ్జు స
ర్పగతిన్, దేహ మనాత్మనాఁ గనుదు వైరాగ్యంబుఁ, బూర్ణంబుగా
భగవద్గీత పఠించినాఁడ వని నే భావింతు, భక్తాగ్రణీ!

శా. నీచిత్తంబునఁ దోఁచురూప మది వర్ణింపంగనౌ నేని నీ
ధీచాతుర్యముఁ జూపి చెప్పు మది యేదీ? బర్హచూడంబో? సీ
తాచేతోహరమో? సుధాకర కళోత్తంసంబో? మూర్తిత్రయ
ప్రాచుర్యావసథంబో? ముక్తజనతాభావ్యంబో? భక్తాగ్రణీ!

మ. తులసీమాలలు కంఠభాగమున ముద్దుల్ గుల్కు, హస్తాబ్జముం
గళతాళధ్వని మిన్నుముట్టఁ బద యుగ్మం బంటి సత్కింకిణీ
కలనాదంబు సెలంగ, నృత్యమును వేడ్కం జేయుచున్, మూఢులన్
దలలన్ ద్రిప్పఁగఁ జేయఁ జాలితివి జోతల్ నీకు భక్తాగ్రణీ!



మహాపతివ్రత

క్రొత్తపల్లి సూర్యారావు గారు

మహాపతివ్రతలకు నమస్కారము. అసూయ లేని తల్లులకు దండములు. గర్వరహితలైన [..]లకు మ్రొక్కులు. శాంతస్వభావముగల మాత[..]జోతలు. ఏ ముగ్గురు తల్లుల దయ లేకున్నఁ బ్రపం[చ]ములోనివారు తలయెత్తుటకు వలనుపడదో వారికి సాష్టాంగములు. ఏ పురుషుఁడు రాకున్న లోకములోని కథలకు గాథలకు మొదలుగాని తుదగాని దొరకదో వారికి మోడ్పుఁగేలు. సకలకల్మషములను దొలఁగించు గంగాదేవికి వందనములు. తలయెత్తి గగనముమీఁదికి రెండుచేతులు జాఁచి జయజయధ్వానము చేసితిమా వైకుంఠమును భత్యలోకమును మనస్తోత్రములు చేరినట్లు వెంటనే ప్రత్యుత్తరమిచ్చు తంత్రీమార్గము ఖేచరవాణికి స్తుతి కదంబము. లోకులకు భక్తి కుదురుటకును, గర్వము తొలఁగుటకును, మంచిపేరు గడించుటకును, మహాత్ముల మహిమముఁ దెలిసికొనుటకును లోకజ్ఞానము సంపాదించుటకును, దోషములు నశించుటకును, సన్మార్గమున బుద్ధి నిలుచుటకును బుద్ధిశాలులైన మన పెద్దలు బహుకాలము క్రిందటనే విశేషముగాఁ బ్రసంగవశమునఁ గథలక్రిందఁ గొండఱచారిత్రములు వ్రాసిపెట్టిరి. అట్టివానిలో నేను నిన్నమొన్న నొక్కచో నొక్కకథ విని నా చెల్లెండ్రకు వినిపించుచున్నాఁడను. ఒక్కసారి చదివినంతనే తెలియునంత తేటగా నున్నది. నా వ్రాఁతలోనే కాని కథలోఁ దికమకలు లేవు. విషమసంధులు లేవు. సందేహములకు సందు లేదు. నాచెల్లెండ్రు నన్ను విడువలేదు. సహోదరీతిలకములార! దినదినమును దీనిని బఠించి నాచెల్లె ఖేదిరా కనుఁగొంటిరా కొన్ని దినములకు నాకు సంతోషము గలుగును. నిర్మల హృదయములతో నా వ్రాఁతలను జదివి పరీక్షించిన నామేనగోడండ్రనుఁ గొన్ని రహస్యములు మీకు తెల్పఁగలరు. కథ చెప్పెదను వినుండు.

అగ్గికిఁ జెదపట్టునా! పట్టినదని చెప్పుకొనుచున్నారు. ఒకప్పుడుఁ దనలో దిగి మునిఁగిన వారి పాపములను బటాపంచలు చేయు గంగాదేవిని మనము విడిచిపెట్టిన పాపములన్నియు మొత్తమై "చూచితిరా బుద్ధిలేని నరులకు బుద్ధిపుట్టుటకై మనము పట్టుకొని వారిని బాధించుచుండ సహింపక గంగ మనదారికడ్డు వచ్చుచున్నది. కాఁబట్టి దీని నెట్లయినఁ గష్టపెట్టవలయును. అర్జునుని సంశప్తకులు చుట్టుకొన్నట్లు దీపము మీఁదికి దివ్వెపురుఁగులు ముసరికొనునట్లు చుట్టఁబెట్టుకొని యెవ్వరికిని లొంగక గంగను గలఁతపెట్టుటకంటె వేఱుమార్గము మనకుఁ బగతీర్చుకొనుటకు లేదు." అని గూడుపుఠాణీ చేసినవి. చూచితిరా దురాత్ముల లక్షణములు. లోకుల కష్టములను దొలఁగింపఁజాలు భాగీరథీ ప్రయత్నము వానికి సరిపడ లేదు. పట్టుపట్టుమని నడుము గట్టినవి. వాని శరీరములు మసిబొగ్గులకు గురువులు. నీలమేఘములకుఁ దాతలు. కంబళి పురుగులకు మాలకుంపలు. మిడిగ్రుడ్లు, పండ్లు కుఱుచచేతులు, తుప్పతలలు, దొ[..] దోసెకడుపులు, తొంటకాళ్లు వేలుకొండల[..] చాలు, చిరాకుగా మీకు భయము పుట్టు[..] పెట్టెదను. ఇట్టిదరిద్రపువర్ణనలపై [..] వారికై నవలలు నేఁడు శే[..]

...శ్యము చెప్పెదను. ఇప్పు డిట్టి వర్ణన ...చి. ముఖము పద్మమును బోలునని ...ఖములో రేకులున్నవా, కింజల్కములున్న ...డ్డిలున్నవా, పరాగమున్నదా, సరియైన పోలికి ...ను. స్వభావముగా వర్ణించుటచేతగాదు- చూడుఁడు యామినీతిలకలో - జగదేకసుందరిని శోకపాలుఁడు వర్ణించి నాఁడు. ఆమెముఖము చూడఁగనే దుఃఖహృదయులకు దుఃఖము పుట్టును. సంతోషముగా నున్నవారికి మఱింత సంతోషము కలుగును. ఏడ్చుచున్నవారు చూచిరేని రేడ్చుచున్నట్లే కనఁబడును. దుఃఖమునకుఁ జెల్లెలు. సుఖమునకు తోడఁబుట్టు. ఆనందమునకు వేఱువిత్తు. ఆహా! యిట్లుండవలదాయని యిప్పటికవులు పూర్వులను దెగడుదురు. పోనిండు మనము వీరిని దెగడ నేల. ఎవ్వరికిష్టములైన గ్రంథములు వారిని జదువనిండు. పాపములు గంగను జుట్టుకొన్నవి. పైఁబడ లేవు. తెంబడించును. ముట్టుకొనలేవు. తొలఁగిపోవును, గిల్లఁజూచును, అక్కడలమను. కొఱుకఁగడలగును. ముందువడచుటకుఁ గాలాడునంతస్థలమీయవు. చేయి విరుచుకొనుటకు జేనెఁడు, లోడితేఁడు, జత్తేఁడు సందుండనీయక క్రిక్కిఱిసి, నేఁడుగాదు, నెలగాదు, సంవత్సరము గాదు యుగములకొలఁది బాధింపఁజొచ్చినవి. మనకుఁ గష్టముల నడుమ రెండుదినములు వాసుకరైనదా సహించి వానిలో మెలఁగఁగలము. గంగకు మాత్రము పాపముల నడుమ నెన్నినాళ్లుండినను ప్రాంతముకాలేదు. కొన్నినాళ్లు పాపసముచేసిన వారు వీరగురు రన్న సామ్యము గంగయొద్ద వ్యర్థమైనది. పాపము! పాపములోక్కసారిగాఁ గఱచుటకు నోరు దెఱచినఁ గంగ కన్నులు మూసికొనును. బరువుటకు నోళ్లువిప్పి మొగము మీఁదికిఁ జేతులెత్తినఁ రెండుచేతులు మోముపైఁగప్పుకొనును. సాధనములు వెదకినది. పెరటిచెట్టు మందు ...కురాదు. తాను సరస్వతిలోనో యమునలోనో మునిఁ ...పాపములు తొలఁగునా యని తలఁచెను. ఏపుట్ట ...ముమున్నదోయని తానెఱింగియున్న సమస్త ...ను ఘాటిపడియలలో - మునిఁగినది. ...కొన్నదిగాని తగ్గలేదు. ఎక్కడి ...కము చూచుకొనవలయును.

ద్రొల్ల పెట్టెల వేఁడులాడఁదీయు కాలునకుఁ దనవేఁ కూడఁదీసికొనుట కింకొకకాలు కావలయును. అందఱి పాపములను బోగొట్టు దాననైనను నాపాపములను బోఁగొట్టుట కింకొరిసహాయము కావలసివచ్చినది. అట్టి మహాత్ముఁ డెవ్వఁడు? పరమేశ్వరుఁడు గాక మఱి యెవ్వఁడు? గంగ యోజించినది. ఈపనికి మగవారి దాఁకఁ బోవలయునా. ఆఁడువారి బాధ లాఁడవారే తొలగించుకొనుటకై - స్త్రీలవైద్యశాలలు, స్త్రీలపాఠశాలలు, స్త్రీలసభలు, స్త్రీలకు స్త్రీలే-ఆహా! భూలోకమా! మూఁడు లోకములకు నీవు మధ్యవర్తివి. మగవారికంటెఁ బ్రతికార్యమునకు స్త్రీలే ముందు - ఆఁడు... చేయఁబూనని పని లేదు. ఉద్యోగము మొదలు దు... మునకు - సపరికరము, సాయుధము, సవాహ... సపతికము, సపుత్ర పరివారము. ఓ స్త్రీ సమాజ... వచ్చుచున్న దానను. అయ్యో! పరమేశ్వరుని గా... యుఁబలల వేఁడుట యేల? ఉండనీ, యెప్పటికైనఁ బని వచ్చును. మనముగవలను వేయేండ్లు వర్ధిల్లనిమ్ము. నిస్సందేహముగ ఆయిన స్థలమునకుఁబోయి త్వరలోఁ గుదుర్చుకొనక- అగునా కాదా! ఏమో! అనుసందేహస్థలమున కిపుడునవలదు. ఇట్లని తనలోనిలోపములను దలఁచుకొని- భగవంతుని వైపునకే మరలినది; దేవా నాపాపములను బోగొట్టుము. నీ సెలవుపై నేను పాపుల పాపములను తొలగింపు నుద్యోగములో గుదిరితిని. పలువురికై చేసిన లేలు మందు తనకుఁ బనికిరాకపోయిన నతని వైద్యమేమిపనికి చేదుకాఁకరకాయను జక్కఁగా వండి యందఱకుఁ బెట్టు వంటవాఁడు దానిం దినఁజాలఁడు. ఓ సకలేశ్వరా! నన్నుఁ గాంచి లోకులు నవ్వకుండఁ గాపాడుము. ఎప్పుడు దీపము సన్నగిల్లునా! యెప్పుడు చుట్టఁబెట్టుకొందుమా యని దీపస్తంభము నాశ్రయించుకొన్న చీకటుల వలె నన్నాశ్రయించుకొన్న పాపములు నానాశమును గోరుచున్నవి. కల్లుద్రాగిన వారి చేతిలోని బిడ్డవలె నున్న దానను. అలజడి యెక్కువయినది. కలుగుండు పడుచుంటిని. పంకమగ్నను నన్ను లేవదీయుము. దుఃఖప్రవాహమునుండి నన్ను దరిఁజేర్పుము. అని పరిపరివిధముల దేవుని వేఁడికొనినది. రాజుగారికి వ్రాసికొన్న ప్రార్థనా పత్రమునకు ముఖ్యమంత్రి యొద్దనుండి ప్రత్యుత్తరము

వచ్చినట్లు జగదీశ్వరునకుఁ జేసికొన్న వేడికోళ్లకు గగన సరస్వతినుండి యీక్రిందిరీతిని ప్రత్యుత్తరము వచ్చినది.

“ఓ గంగాదేవి! వినుము. నీయాపదలు కాంపురముచేయవు. వ్రేలుపైఁ గొండయెత్తిన కృష్ణుఁడు నల్లే యాకులోఁ దేలినాఁడు. కాలగతిఁ దప్పించుకొనుటకు వశముగాదు. లోకుల పాపములన్నియు నిన్ను గాపవరపు తీఁడివలెఁ బట్టుకొన్నవి. నీది దీర్ఘ జాడ్యము. కాలమునుబట్టి స్త్రీలకు వైద్యము స్త్రీలే చేయవలయును. సంధికట్టుగల వైద్యురాండ్రను వెదకవు. పట్టణములోని వైద్యము పనిచేయకున్నఁ, బల్లెలలోఁ బసి నీరు గాలి మార్చికొనుము. మందులు మాత్రలు నీరోగము గుదుర్పఁజాలవు. ఏవేరో వల్లంకో రత్నప్రాగో సుంత్రపు నీరో చేర్చిన సిద్ధురాలిని సేవింపుము. తిరుగుము. కర్మ పరిపక్వము కావలయును. ఏనీమవైద్యుఁడుగాని వనజ్వర పక్వముగాఁదగిన రోగిని సాయంకాలమునకు లేవఁదీసి కూర్చుండఁ బెట్టలేఁడు. రోగము రొట్టునీయదు. అతి గర్వముగల దుష్టకవివలె నీకర్థముగాకుండ మాటలాడుచున్నదాననేమో, అచ్చతెనుఁగుగాఁ జెప్పెదను వినుము. కలలోనైనను బతివాచకముగాఁ దన పెనిమిటి నెదురాడక తలలో నాల్కవలెఁ బూసలలో దారమువలెఁ దోడునీడవలెఁ బ్రాణముతో దస్పనమువలెఁ జరించు పతివ్రతను వెదకుము. పతివ్రతయను మాటకర్థము, పతివ్రతను నీకుఁ జెప్పనక్కఱలేదు. కావలయునేని వేఱొకచోటఁ జెప్పెదను. అట్టి యిల్లాలివలన నీకష్టములు నష్టమగును. కొప్పుపెట్టినదెల్లఁ బప్పువండఁజాలదు. బల్లగట్టినంతనే బ్రమసిపోకుము.” అని మాటలు చాలించిన యాకాశవాణికి మ్రొక్కి నాకు మేలుచేయుట కేపతివ్రతకడకుఁ బోవుదునాయని గంగ చింతించినది. పతివ్రతను గుర్తించుట యెట్లు? ఏమైనఁ బతకములా, పారితోషికములా? నేను బతివ్రతనని, పెద్దపెద్దలిచ్చిన యోగ్యతా పత్రములున్నవని ప్రకటించుకొందురా? ఇండ్లపైఁ బేరుబల్ల లుండునా? లేకున్న నామె ప్రసిద్ధికి లోపము కలుగునా? మహాపతివ్రత యాకులలోని పిందెవలె నడఁగి మడఁగియుండును. కన్ను లేనివారే గాజుకన్నుఁ బెట్టుకొని కన్నుగలవారివలె మెలఁగుదురు. పద్మాక్షి, విశాలాక్షి, యని పేరులు పెట్టుకొందురు. తప్పుసాత్తములు వ్రాయు

వారికే శతావధానుల కవిత్వము నిర్ధారణచేసికొన నవసరముకలుగును. కలియుగములోనైన నిపుడే సైన వృత్తాంతపత్రికలున్న, ఏ మాధ్యకీయ విశేషించియో రేము ఖ్యాగపనింపో, ఒక్కయూరిలో నొకస్త్రీ - రాత్రిపడిన గెవ్వరికిఁ గనఁబడదు. చెల్లవారకుండ నోరులకంటఁ బడకుండ నిల్లుచేరును. ఆమెకు లీపైకి యత్నము చేయుచున్నారట యని తెలియఁబరచును. అదియును లేదు. అటుపుండి నంటికి కొనిరమ్మనినారు. ముందుగాఁ గైలాసమునకుఁ జని పార్వతిని దర్శించెదను. పతియని యాతల్లి కన్వర్థనామము. సర్వమంగళ, పెట్టకున్నఁ బోయెఁ; జెక్టేకు చోటైనఁ జాఘ్రను. ఎల్లలోకముల స్త్రీలును వచ్చుచుఁ బోవుచుందురు. ఆయమ్మకొలువుకూటము వార్తాపత్రికవంటిదియగును. కొంతవృత్తాంతము తెలిసికొనవచ్చునని గంగమ్మ వెండికొండకుఁ బ్రయాణమైనది.



రజతగిరిమీదికి ..గంగ...ఎదురెక్కి - చేత త్రొట్రుపడినది.

రజితగిరి మీఁదికి మిక్కిలి కష్టముతోఁ గంగ యెక్కినది. ఎదు రెక్కలేక తొట్రుపడినది. జాతిబంధులలో తోర్లు గింతలు పెట్టి పలుచనై చక్కనివారికిఁ జిక్కుటయు. పొగనే యనిపించినది. నేను గొప్పదానను, నాతండ్రి ధనవంతుఁడు, మావంశమునకుఁ గావలసినంత ప్రసిద్ధి కీర్తియునుగలవు. మేము శ్రీమంతులము అని పొంగుటకు సమయముగాదు. కార్యము సాధింపఁ గోనఁదలఁచినవారికిఁ ద్రుళ్లిపాటుతగదు. వినయగుణము మంచిది. ఎట్లో యెక్కినది. 'అక్కా యమ్మా!' అని యొక్క కేక పెట్టినది. గౌరిదేవియుండు మేడ ముమ్మునకడకుఁ జనినది. ఒక్కముసలి ముత్తైదువవచ్చి, 'అమ్మా! ఏవో పండుగులంట. నిన్ననే వైకుంఠములోనికి వెళ్లినారు. కొన్ని దినములక్కడఁ గడుపుదురఁట.' అని మనవి చేసినది. "కార్యార్థినః కుతో గర్వః." కార్యము కావలసినవాఁడు గర్వింపరాదు. సరియే పోయివచ్చెదను. మన పనిగాని వానిపనిగాదు. పోనీ తిరిగివచ్చి నపుడు చూతరాదా. ఏయుత్సవమో, నన్నుఁ బిలువలేదు. ఇతర సమయములందువలెఁ బంధుగులలోఁగూడఁ బిలువకుండఁ బోవుట చిన్నతనము. పిలువని పేరంటము,పేయని విస్తరి. కాని, పార్వతిబసలోనికి మాత్రము వెళ్లి తిరిగివత్తును. ఎవ్వరైన నారాకఁ జెప్పిరా, 'పద్దుమాడుము. శుభలేఖపంపలేదు! కానిమ్ము, ఇప్పుడొక లేఖవ్రాసి పంపుము. మీకు లేఖ పంపినాము, మీరిక్కడికివచ్చినారు, అది యెక్కడను వెళ్లినది'యని బొంకుదురు. మెరమెచ్చుల మట్టతికములు నాకు నచ్చవు. పిలువకున్ననేమి? పుట్టినిల్లు, తండ్రి పాదదర్శనము చేసిరావచ్చును. ఒకవేళ దాక్షాయణి 'యిట్టిపను లేకూడవు,పిలువని తావున కేలవచ్చితి'వని, అనుభవమునుబట్టి కూకలు పెట్టునేమో. కూఁతును మఱచిన తండ్రి, యెంత తొందరపనిలో నుండునో. దానికిఁ గాదు. పదిమంది చేరుదురు. నాపరితాపము తీఱుటకు దారి దొరకునేమో గుడిగకొమ్ముల సందేహము తీర్చుకొనుటకు. ఇట్లని గంగ పరిపరి విధముల వితర్కించినది. చివరకు వెళ్లుటకే నిశ్చయించినది. వైకుంఠమునకుఁ బోయినది. తిన్నగా గౌరిదేవి బసలోనికి నిక్కురు మన కుంజసేగినది. చల్లచల్లగ నమస్కరించినది.

గౌరి—నీకప్పుడందినది. నీవు నాకంటె ముందే వచ్చియుందువని తలఁచి పిలువకుండ వచ్చితిని. లేకున్న నిన్నుఁ బిలిచియుందును.

గంగ—నే నేమియు నెఱుఁగను. మీయింటి యొద్దఁ దెలిసినది.

గౌరి—నాకు రావలయునని లేదు. క్రొత్తగా రవ్వల ముక్కఱ చేయించుకొంటిని; ప్రాఁతవి చిల్లరముల్లలు కరఁగించి యేదో పెద్ద వస్తువు చేయించుకొంటిని; ఏవో కొంటిని. వానిని ధరించువాఁటికి మీరు రావలయును. పూజకుఁ బిల్లవాని నొక్కనిఁబంపి యూరకుండవలదు. అని నిష్ఠురముగా, నిర్బంధముగా, వేడుకగా వ్రాసినారు. మీ బావలేరు.

గంగ—జట్టు విడిపోయినారు. ఆయన కెక్కడ ప్రవణ! మీరిద్దఱుఁగలసియే వచ్చిరనికొంటిని. (తనలో) ఈమె పతివ్రతల పద్దులో మొదటిది. పతిని విడిచి-

గౌరి:—ఎక్కడనో లక్షపత్రి పూజలు, సహస్ర ఘటాభిషేకములు.

గంగ—పోనీ, యీ కొన్ని దినములలో నింటఁ గూర్చుండినఁ బొట్టగడవదు. తిరిగి రానిమ్ము.

గౌరి—పిలువలేనట్టున్నది. పిలువనిదే యేలవచ్చితివి?

గంగ—నీయొద్దకు రావలసి, అని చెవిలోఁ జెప్పెను. గంగ పలుకులు గౌరిచెవిని బడినవి. గడుసరి. నేను సుప్రసిద్ధురాలనే, లక్ష్మితోఁ జెప్పి యేమైనఁ జేయఁ గలదేమో చూచెదను. నేను పతివ్రతనని గర్వముగలది. అని లక్ష్మికడకుఁ దీసికొని పోయినది.

గంగనుజూచి లక్ష్మి 'మీ నాయన నీకుఁ దల్లికంటె మిక్కిలి దగ్గఱవాఁడు. ప్రేముండఁబట్టునా. పిలువఁగానే వచ్చితివి. చాలసంతోషము.' అనినది. గంగకు బింకరైనది. ఇదియేమిటి, నే ననుకొన్నదే. అని లోలోన నవ్వుకొని 'నేనొక్కచోట నుందునా, పిలుపు నాకందలేదు.' అని పలికినది. లక్ష్మి తనలో "పట్టి పిలుపులందవు. ఏ యూరికోఁ బంపినపుడందును." 'నేనిపుడేమియన్నను నాకు గజ్జెలపట్టెడ చేయింపలేదని కోపముచే ననుచున్నట్లు తలంతురు. కొందఱున్నారు. తాము చీర

చేయించుకొన్నపుడు తమ భార్యలకుఁగూడ నొకటి చేయింతురు. తమరు దండకడియములుగాని మట్టెలు మంగళసూత్రములుగాని చేయించికొన్నపుడు తమ భార్యలకింకొక జత దానితోపాటుగానే చేయింతురు. మా యింటిలో నట్లుగాదు. తమ సొమ్ముగాదు. కాకపోయినను మాకుఁబెట్టునప్పు డెంత మప్పితమైనను వచ్చును. ఏతిరుపతివారో కిరీటము, ఏశ్రీరంగమువారో హారములు, ఏకంచివారో రత్నములు సమర్పింతురు. అపత్నికునికై నను విడిచెకట్నముపలె నొక్కరి కీయఁగూడదని కొందఱు,జామాతతోఁ గోడ-భోగుపాట్లకాయలావుడి-యొక్క నాలుగుమూరల గడ్డయో రెండు తులముల యెత్తుమట్టెలో, కన్నుల నీరు తుడిచిన నికవంతే- అని కొని- సరితెలిసినది. 'నీవువచ్చిన కార్యము- ఈదినములలో మాపాతివ్రత్యము, ప్రాతబడింది పనికిరాదు. ఆనాఁటికి మేమే. ఇపుడందఱు సేవని సేవని లేమమన్నారు. భర్తకాలు విచ్చలవిడిగా లేచినది. ఆపతిపతుల యొద్దిక ఆసహాయానము- ఆసల్లాపము- ఆదనవు- ఆనుచితసేవము పేఱు- మేమే దో మూలఁబడి యుండువారము- మమ్మెవ్వరు చూచెడువారేకారు. మాకోడలు సావిత్రికేఁ, బైకేఁ జలియనీయక గట్టుగానున్నను, నాకేదో కొంచెము కొమ్మమీఁద కొంగను ఒడఁగొట్టెదనని గర్వమున్నది. నేనంటినా- కోడలిగుణము లత్తకు వచ్చునని యందురు. పైకి మేము శాఖాభేదములు పాటింపము. స్త్రీలని పురుషులని యెమ్ము తగ్గులు మాకు లేవని పలుకుచున్నను గౌరవము మాత్రము స్వపక్షమునకే. ములుచూపుమెండుట తెలియుటలేదా. కనఁగొనవలయును. గంగమ్మకూఁతురా! మే మీకాలపువారముగాము. మాకట్టు మాబొట్టు చూచి పడుచుకాలువాండ్రు నవ్వెదరు. మామాటలు చెల్లవు-మాకాలము గడచినది. నీరు పెద్దతనముగాని కార్యములు మావలనఁగావు. మేము తెగించి, యెంతచనవున్నను, భర్తలతో సభలకెక్కుటకు, ముసలితనములోఁ గూడ జంకే. పతివ్రతయనఁగాఁ బతితోఁగూడ నుండుట యేవ్రతమఁట. అనువ్రత- యనఁగా నతఁడెక్కడకుఁ బోయిన నక్కడికల్లఁగూడ బొక్కిసావలె వెంటాడుట యఁట. మీవదినె నడుగు; ఎన్ని యర్థములు చెప్పునో,' అని యుపన్యసించిన లక్ష్మి మాటలకుఁ గోడలును నిందింపుట-తాను జల్లఁగఁ దప్పుకొనఁజూచుట. కనిపెట్టి గంగ పీరివలనఁ బని సాగదనిక్కొనిరెను.

కుంకుమభరిణి చేతఁబట్టుకొని సావిత్రివచ్చి గంగకు బొట్టుపెట్టి 'మామగారికి ముసలితనములో సొగసు లెక్కువ యగుచున్నది; సాయంకాలము పీటలమీఁదఁ గూర్చుండురు. నలుఁగులు రాహుకాలము రాకుండనే మొదలుపెట్టెదము.' అని చెప్పుచుండఁ దన్నుఁ గూర్చి కోడలు వేళాకోళము చేయుచున్నదేమోయని లక్ష్మి పని కల్పించుకొని లోనికిఁజనినది. సావిత్రి, గంగతో, 'నీవు చిన్నదానవైనను- పెద్దదానవైనను- ఇంటి యాఁడుబిడ్డవు- ఎల్లప్పుడు నింటనుండు కోడలికి వారొక్కనగ లేదు. మసలితము లైదుకము, అత్తగారికి ముక్కులో ముల్లవరు- మగవారికి ముసలివారికి నగలేమిటి ! మీ నాయన నేంటివని కోపముపలదు; నీవెఱుఁగవా! అఱువది యేండ్లవాఁడు. రెండవ పెండ్లి చేసికొని శారసాల పీఁటలపైఁ గూర్చుండినట్లు, మామగారు పీటలమీఁదఁగూర్చుందదురఁట. నలుఁగులఁట, నగలు ధరింతురఁట. కావ్యనీరథ విరామము నాకుఁ బండితు లిచ్చుచున్నారు. మీ రానాఁటికి రమ్మని యందఱకు నుత్తరములు వ్రాయువారివలె, నగలుచేయించి యిచ్చువారొకరు, ధరించు తామ్రు, శుభలేఖలా! దీని కగుపవ్యయమైనను దమడిగాదు. అందఱు గౌరవముగా నీయుత్సవ జ్ఞాపకార్థము కట్నములు, కానుకలు, చదివింపులు- లక్షల మాలధనము ప్రోగుచేసి, ధర్మకార్యములఁట- దురాచార నిరాకరణములఁట.) ఇట్టి వేడుకలకు రమ్మనిన పిదు తగుదుమని, పోయి యలంకరించుకొని యున్నతస్థానమునఁ గూర్చుండి లోకులు పొగడు పొగడికలకుఁ జెవియిచ్చి వినుటయెట్లు! పోనీ, ఇంట మాలుగుమన్నది. లక్ష్మీవంకులు- ఆమాలధనము లోనికిఁ దామొక్క చిల్లిగవ్వ, తమ కష్టార్జితము- పోనీ ఒక్కనాలుకు పీనవిద్యార్థితము- మాకాయవ్యయము, మాకారోగ్యము- ఊరందఱును దమ్ము బ్రహ్మరథము పట్టుచున్నపుడు సంతోషము, నాకెందుకు- మీకే వ్యయమేల? యనిమాటాడుచుండిన- ఇట్టి వారొక్కరి సాక్షేపించుటయా. ఘంటామీఁద దెబ్బకొట్టి శిశుపాలుఁడు తెగవేసి యడిగినాఁడు. ఏమయినను గాని యూతఁడే నాకు నచ్చినవాఁడు. పదినవో మఱఁదలివో, నిన్నుఁ

జాగరదేమా. రమ్మనిన సభలోని కెల్లవచ్చుటకు తనకు పుట్టినమ్మా తల్లీ! లోకోపకారకమైనట్టి శ్రేష్ఠ సభ జరగు చున్నపుడు వీరు-నాకిట్టిది వచ్చునని యేమాలనో కూర్చుం దురు. పని యున్నదని గ్రామాంతర ప్రయాణము పెట్టు కొని యభిలాషపడువారినిగూడ దీసికొని పోదురు. ఆహా, లోకమా!' ఈవీరి సంభాషణము గౌరి వినియు విననియట్లున్నది- సంభాషణము ముగియ నప్పటికి 'బ్రోలేడంత తంతు ముందు బెట్టుకొని యింటికై వచ్చారే యిక్కడ గూర్చుండినట్లు బని రెట్లు జరగును రండు-' అని లక్ష్మి మరలవచ్చినది. ఎక్కడనుండియో నారదుడను వచ్చినాడు. ఈపురుషుడు లేనిదే కథకు,గాథకు తుద మొదలు కనబడవు. వలుగురకు నమస్కరించినాడు. తనలో, మాటనుకొప్పు బిముడుకుందుకు- నాలుగె ట్లిమిడినది! మాటికేగాని నాలుగింటి కానిషేధము లేదాయని విచారించెను.

గంగ—అల్లుడా, మేనల్లుడా. తాతగారింబనే ఫలాహారముల గది పెత్తనము నీకువచ్చిన దనుకొంటిని.

నార—నాకిదియే పనిగాదు. దోలుమీద దెబ్బపడినంతనే వచ్చి వాలుదునా. కలిగిన వారియింట గడియ గడియను బందులే.

గంగ—మరి యేలవచ్చితివి?

నార—మరి నీవేలవచ్చితివి?

గంగ—నీకు దెలియకుండునా, నన్ను నేల కొలేము-

నార—ఒట్టుపెట్టు. నేనేమియు నెఱుగను.

గంగ—నాతోడే.

నార—ఛీ! అత్తా! ఎటులగి మరల జెప్పుచుం దువా. అది మనుష్యులపద్ధతి. నదిలో స్నానముచేసి వచ్చు స్నేహితునిజూచి స్నానముచేసి వచ్చుచున్నారా? అందురు. అన్నము తినుచున్నవానిని జూచి భోజనముగు చున్నదా? అందురు. మీరు నలుగురును గూడి యున్నారు. ఏదోవింత గలదని తలచితిని.

గంగ—చెవిలో జెప్పుచున్నది.

నార—చింతకొమ్మలు పట్టుకొన్నావు. నీకేమి పార్వతమ్మగారు, మాయమ్మ- మాయమ్మ- అందువారికి- అందులో నీకు - దేవతలకు దేవతలు. పతివ్రతలకు బతి వ్రతలు- చెప్పవలసినది లేదుగదా-మీరు మిక్కిలి స్త్రీ లకు స్త్రీలు.

గౌరి—నారదా! నీవు తీరగలేని తంత్రీవార్త గాడవు. నీచెవిని బడకుండ నుండదు.

నార—అమ్మా! మీరును మా మేనత్తగారివలె ననుచున్నారు. నేను క్రొత్తగానే వినుచున్నాడను.

గౌరి—మేము ముసలివారము. కాలముచెల్లినది. ఏదో మిమ్ముమీద మాపాతివ్రత్యము బరీక్షించుటకై గంగ వచ్చియున్నది.

గంగ—అక్కా! నాబావగారి నేర్పుడు గాబోలు- ఏచెడ్డది? మిమ్మేమి, నేనేమి, పరీక్ష యేమి? గగన వాణి లేదా.

నార—(తనలో) "వృద్ధనారీ పతివ్రతా" నవ్వు కొని, మీకు వచ్చిన పేరేదో యిదివరకే వచ్చినది. అడుగు క్రొక్కనేల- కాలుగడుగనేల- మీకీ పనిలో దిగవలదు.

గౌరి—ఆ! ఆ! తెల్లవారుచుండిన ప్రొద్దు- రాలుగ నుదువా.

నార—మిమ్ము నే నెఱుగను- కావుననే నేను మిమ్ము తప్పుకొమ్మని చెప్పుచున్నవాడను. గోపాలా చార్యులుగారని యొక వైద్యులుగలరు. అతడనే యేసభ కును సభాధిపతిగా బిలుచుచున్నప్పుడు, 'నేనేదో కొంతగ జైగట్టి యుండితిని. బైటికి రావలసినవారు బుద్ధి మంతులు చాలమందియున్నారు. ఈసారి వారిని బిలువు' డని చెప్పినారు. కాబట్టి, యింకమీద లోకములో దలలెత్తుమన్న బుజ్జ జట్టును లేపదీయవలయును

గౌరి—పోనీ నేను గాను. మీయమ్మగాదా- మీ యవ్వగాదా.

నార—నేను దప్పుచెప్పలేదు. మీరు ముగు రమ్మలు. చాల పెద్దమ్మలు.

పావి—కొడుకా! నీయుక్తి ప్రాయమేమి?

నార—అమ్మా! నీవు రాక- నలుగురితో నారా యణ. నేను మాయమ్మలతో, మనుష్యుడను గనుక. మీరం దరు పతివ్రతలే యగుదురు, కాకపోవుదురు, ఈకార్య ముమాత్రము మీవలన గాజాలదు.

గంగ—నీకడుపుచల్లగ, వీరిని మనచేతిలోనివారిని- ఇట్లు జగద్విదిత ప్రభావముగలవారిని దొఁడుకొందము. ఎవ్వరివలనఁ బ్రస్తుతకార్యము జరుగునో తెల్పుము.

ముగ్గురుతల్లులును శిరసులెత్తి—'ఇంకెక్కడను న్నారు- ముందు మామీఁద వైరమెత్తి పుట్టవలయును.'

నార—అక్కఱలేదు- సిద్ధముగా నున్నది.

గంగ—ఎవ్వ రామె?

ముగ్గురమ్మలు—ఏఁ; పట్టినమాట పేము వినకుండ నున్నామా?

నార—మీవలె మిద్దెలమీఁద మేఁడలమీఁదఁ దిరుగునదియైన మీకుఁ దెలిసియుండును.

ముగ్గురు- ఎవ్వరయ్యా! అంత కూరలుదిని నారలు గట్టి యడవులు పట్టియున్న పతివ్రత?

నార—అమ్మలారా! భూలోకములో.

ముగ్గురు—ఆ! మనుష్య స్త్రీలలో?

నార—అగునమ్మలార! భూలోకములో- మనుష్యస్త్రీలలో-'దుంపలు, తూండ్లు దిని యడవులవెంటఁ దిరుగుచున్నది. అత్రిముని యిల్లాలు! అనసూయ' మహాపతివ్రత!

ముగ్గురు—(తమలో) అనసూయ నెఱుఁగ కేమి! రామాయణములో వచ్చినది.

నార—అగును, అనసూయ.

ముగ్గురు—సీతకు నలుఁగుఁబిండి, మెఱుఁగు బిళ్లలు చేసి యిచ్చినది.

నార—ఆమెయే- ఆమెయే- అత్రిఋషుల వోమ్మవలె మీకుఁ దోఁచుచున్నది. రాక్షసాంగీకరణమును కడియ మిచ్చినది యీమెయే.

ముగ్గురు—ఎఱుఁగుదుము. చెప్ప నక్కఱలేదు. జానకీ పరిణయ నాటకములో.

నార—మీ కెఱుఁగ కేమి. నన్ను క్షమింపుఁడు.

ముగ్గురు—మంచిది- నీవు నడుమఁ ద్రోపుడుగాఁ కలవుగదా! మంచిది, మానవమానవతి మాచేతఁ బని చేయఁగలదని నీవు తలఁచుచున్నవాఁడవు- యుంపుము.

నార—అందుకే క్షమింపుఁడని కోరితిని. మిమ్ము గాదని యెన్నఁడును గాదు. మీరూరకుండుఁడు- మీరీ పనికి రావలదని మొదటనే యంటిని.

ముగ్గురు—కానిమ్ము; ఏమట్టికిల్లిగాని, మానిపిల్లిగాని యెలుకను బట్టుట ముఖ్యము. దీని పర్యవసానము మాకుఁ దెల్పెదవుగదా!

నార—మీకుఁ గోపమువచ్చి నట్లున్నదే.

ముగ్గురు—లేదు, లేదు.

గంగ—అమ్మలార! యీదీనురాలికి సెలవిండు. నేను గార్యము సాధించుకొనఁ బోయెదను. నారదుని నట్టి మీరు సాధింపుఁడు. నాకు సందుదొరకినది.

అని గంగ వారి సమ్మతి గైకొని భూలోకమునకుఁ బోయెను.

నారదుఁడు ఉత్సాహసమయమునకు విష్ణుమూర్తి గారలంకారము చేసికొనుచున్న తావునకుఁబోయి 'తాతగారు! లక్ష్మిగలవారికి నాలుగు చేతులున్నను, ఇరువది గాదు ముప్పది వ్రేళ్లున్నను మురుగులు, మురిడీగొలుసులు బొట్టువ్రేలు మొదలుకొని బటువులు వజ్రపుటుంగరాలు, దుట్టులు, కవచలు, పెట్టుకొనవచ్చును. భూలోకములోఁ గొన్ని కులములఁగలవు. వారు జన్మములోనుండి స్త్రీపురుషులు స్థూలశరీరముగలవారు. మగవారికేమిగాని స్త్రీలు మీవలె నలంకారప్రియులు. నిర్భయముగా వారికిఁ బరిమాణాతీతమునైన నగలు చేయించి పెట్టుచున్నారు. కొన్ని రోగభూములలో బోదకాలికిఁగూడ వారు కడియములు చేయించుచున్నారు. మీకు మీసములు లేవు. గనుక ముత్తెముగల కమ్మిగాని యడ్డబాసగాని బాగుగా నుండును. గడ్డాల వైరవులు, మహాదేవాదులకు వికారముగా నుండును.' అని హేళనము చేయుచు దగ్గఁర గూర్చుండెను.

వైకుంఠమునుండి గంగ వెళ్లఁగా దిగుచున్నది. భూమికి సమీపించినది. ఇంతలో నాలుగైదునాళ్లు, పండుగలు, వేడుకలు, కాలక్షేపములు, పంపకములు, విందులు జరిగిపోయినవి. గౌరి, లక్ష్మి, సావిత్రి వరల నిట్టాలోచన సభగావించిరి. మన యొద్దకువచ్చినది మన చేతనగునో కాదో చూడకుండ నారదుని మాటలువిని గంగ

భూలోకములోని పేరంటాలు దగ్గఱకుఁ బోయినది. ఆ నదుఁ జిన్నతనము గదా. అనసూయ యెంతపతివ్రతయో చూడవలయును. ఇతరులకుఁ దెలియరాకుండ గంగను వెంటాడి చూడఁబోవను రండని యొకరి నొకరు పిలుచుకొని చప్పుడు గాకుండ మనుష్యలోకమునకు దిగిరి. అత్రిముని యాశ్రమములోనికి గంగాభవాని దిగినది. 'ఆశ్రమము సమీపమున మనుష్యులు కనఁబడుదురా? ఏదయిన పనిమీఁద గొప్పవారిని జూడఁబోయినవారు తమంతట తాము గోత్రనామములు చెప్పుకొనుచుఁబోయి దర్శించుట యీభూలోకములో మర్యాద గాదు. మధ్యవర్తి యొక్కఁడు తీసికొనిపెళ్ళిచూపించి వీరు వీరని చెప్పి పరిచయము కలిగించిన మీఁద, రెండవసారి యెప్పుడు వెళ్ళినను కత్తెఁడు చీటి ముక్క వ్రాసి లోనికిఁ బంపవలెను. నన్నుఁ దీసికొనిపోయి యెదుటఁబెట్టి చెప్పువారెవ్వరు! ఈ భయముల నెఱిఁగిన వారదుఁడుండవలసినది. పోనీ, నేనే దర్శనము చేసెదను. వీరు మహారాజులు, ధనవంతులు, నరులపై గొప్పయధికారులును గారు. వీరికి సమ్మములో, సేవకులు లేరు. నేను వారిచేఁ బొగడించుకొనవలసినపని లేదు. నాగొప్పలు, నాయుక్తులు పరుగలు వారియొద్దఁ గనఁబఱుపనవసరము లేదు. నేను గ్రంథము వ్రాసితినా? నాగ్రంథము పరనార్హమని వ్రాసియిమ్మని, తప్పులతడికె నొప్పులకుప్పయని, పొగడించుకొనవలయునా! నేను జనోపకారకమైన యేపెద్దపని చేసెదనని- లేదు. నావిరోధులనుండి తప్పించుమనుటకు నారోగము కుదుర్చుకొనుటకు వారిపాదముల పైబడుటకు- సమయములు, మధ్యవర్తులు, రాయబారులు, నక్కఱలేదు. ధర్మవైద్యశాలలవారు ప్రాణాపాయకర రోగములకుఁ జికిత్స చేయుటకై వేళపాళలు చూతురు. ప్రతిక్షణము సిద్ధముగా నడుము కట్టుకొని . యే సమయములో నెవ్వరు పిలుతురోయని. రాత్రి ప్రక్కపైఁగూడ సన్నాహముతో నిద్రింతురు. అనసూయ మహాత్మురాలు. అత్రి మహాతపశ్శాలి. నన్నుఁ గాంచి కొంచెమైనను గారవింపరు,' అని కోరికలగొడ్డురాలెఁ దనమట్టునున్న పాపములను ద్రోలుకొనుచుఁ జేతులతో మసరికొనుచుఁ బర్ణశాలాద్వారమునకు నడచినది.

ఎండలు తీక్ష్ణముగాఁ గాయుచున్నవి. అత్రి కమండలువులోనిజలము చెల్లినది. మరలఁ గొంచెము నీరు త్రాగవలయునని- యాచమనము చేయవలయునని తలంపుగలిగినది. భార్యను నీరు తెమ్మని యాసతిచ్చెను. ఉటజములో (పర్ణశాలలో) నీరు లేదు. వెదురు బిందెలో నీరు చుక్కకూడ లేదు. చెలువులా, నూతులా. నాపతియాజ్ఞ నెట్లు నెఱవేర్తును! నీరుకోనేను, కోనేరు చాలదూరము; ఏఱు కడుదవ్వు, తెల్లవాఱుజామున నదికి వెళ్లివచ్చువారము. ఈరెండలో నడువఁజాలను. ఎక్కడనయినను నీరు వెదకవలసినదే. పెనిమిటి మాటకుఁ బ్రతిచెప్పుటగాని, బద్ధకించుటగాని కూడదు. నీరే ప్రాణాధారము. దానికై వెదకెదను. అని పతివ్రత కలశము పట్టుకొని యీవలకువచ్చి, చుట్టుప్రక్కల మూలనయిన యోచించి తెచ్చెదను. ఉదయమున లేనినదులు ప్రవాహములు నేనెఱుఁగనివి యీ యడవిలో నెక్కడనుండి యిప్పుడు నాకోసమెవ్వరు తెత్తురు. అని దీనవదనముతో రాతిక్రింద , బండక్రింద వంగిచూచుచు, చెవియిచ్చి వినుచు గన్నులెత్తి చూచుచుఁ దిరుగాడుచుండిన పతివ్రతాతిలకమును గంగ దర్శించినది. ఆమె బెంగయు, తలంపులు, పెదవులు తడవుకొనుట, మెల్లగ మాటలాడుట, కనిపెట్టినది. 'అమ్మా! నమస్కారము. నీవేమి వెదకుచున్నదానవు. నాతోఁ గొంచెము సెలవిమ్ము' అని గంగ ప్రార్థించెను. 'నాపతి నాదైవము. ఎంతకష్టపడియైనను వారి యాజ్ఞ గావించుచుందును. ఇదినా వ్రతము. నేటినుఱకు సాగినది. ఇక దానికి భంగము రానున్నది. జలము తెమ్మనిరి. ఇంట లేదు. ఎండమిక్కుటముగానున్నది. నీరు త్రాగనున్న నొకప్పుడు ప్రాణహాని, సంకల్పాదుల కాచమనమునకు లేకున్నఁ గర్మహాని, యెట్లురా భగవంతుఁడా యని చింతిల్లుచున్నదానను. ఎక్కడనైన దొనయున్నదా? సెలయున్నదా? జాతి గుంట కనఁబడునా? అని తిరుగుచున్నదాన.' ఇట్లని పతివ్రత తనకుఁ గావలసిన విషయము తెల్పెను. 'దీనికై మీరు శ్రమపడవలదు నేను దెచ్చెదను. ఆ పాత్రమిటు తెండు. నేను తాఁకవచ్చునా? యని చేయిచాఁచెను. 'సరిసరి, మీకంటె నాకాచారమా?' మీకేల శ్రమ? మీతో నేను వచ్చెదను.' అని యనసూయ యుపచరించినది. ఇటురండు ఈ బాయిచూరకించిన మీకుఁ గావలసినంత జల అని చేతితో నొక్కసుదుకుఁ దిరుగవైచినది. ఆవం నెక్కడనుండి లేచినదో, జలజల-గలగల- ప్రవా



ఎక్కడనుండి లేచినదో, జలజల - గలగల -
ప్రవాహము! ... ఒక్క శిలలోనుండి.

ఒక్క శిలలోనుండి - అద్భుతము! తొలుకివచ్చిన కళ్ళలము తొలఁగనిచ్చినది. పిమ్మటవచ్చిన కలకనీరు విడిచినది. తర్వాత లేటనీరు రాఁగాఁ పాత్రము పట్టి యనసూయ నిండించి, యంత ముఖము చేసికొని -'చల్లని తల్లి మీరెవ్వరో తెలిసికొననమ్మా? నావలె మీరును మిట్టమధ్యాహ్నమున రాఁగతంబేమి? రండు నీడకొని పోయి నాభర్తకిచ్చి యాశ్రమములో మాటలాడుకొందము-' అని వేఁడినది. 'తల్లీ! నేను దీన రాలను; ఆయుధము చేతనున్నను గొట్ట జాలనిదానను, కొట్టుటకు స్వాతంత్ర్యము లేనిదానను, గంగను. నన్నుఁ బాపములుముట్టుకొని బాధించుచున్నవి. ధర్మశాస్త్రము గర్వవాక్యములు ...డుఁడు. ఒక్కడు తన్నుఁగొట్టినఁ దానుగొట్టరాదట. తనకు మొత్తివెట్టుకొనవలెనట. మరలఁదామే చెప్పును. కొట్టినదానికంటెఁ గొట్టెదననుట గొప్ప నేరమని. నాస్థితిఁజి త్రసింపుఁడు. ఆకాశవాణి, మహాపతివ్రతవలనఁ గాని నీకు వచ్చిన యీ బాధ తీరదనియెను.

నారదుని వలన మీమహత్త్వ... మీదర్శనమే పనిగా నీయాయెండ... టిని.' అని విన్నవించిన మిన్నేటి... మంగళకరంగే!' అని యనసూయ న... 'అమ్మా! నన్ను శ్లాఘింపవలదమ్మ. నేనె... నను. నా మహత్త్వమెంత! కొడుకు... కొమ్ములా! ధనమా! ధాన్యమా! యిల్లా! నా కలియా! ఉందురు మహాపతివ్రతలు. వారులేనిదే లోకము నిలువదు. వెదకఁబోవమ్మను. నేనశక్తురాలనైనను నాకు నీవు చేసిన యుపకారమునకై కొంతసేపు మాకుటీరములో నిలుపుకొన నిచ్చపుట్టుచున్నది. నాతో రావలయు' నని కోరినది. 'ఓజననీ! నీకంటె వేఱు మహాపతివ్రతలుండురు. లేనుందురా. నారదుఁడేమియు నాలోచింపకుండ మిమ్ముఁ జెప్పలేదు. నాకార్యము దీర్చుటకు మీరే సమర్థులు. నామనోజ్ఞము బ్లీయున్నది. నేను వేరొకరిని నమ్మలేదు. "అన్యథాశరణం నాస్తి త్వమేవ శరణంమమ." నాకు వేఱుశరణములేదు.' అని గంగపలికి చేతులు జోడించినపుడు, 'నేనల్పురాలనైనను నాయందు నీకున్న విశ్వాసమైనను నాకుఁ దోడ్పడునుగాక! నాకుఁ గావించిన యుపకారమునకైన నేను ప్రత్యుపకారము చేయవలెనుంచుట నావిధి. చూచెద'నని కాలుసేతులు కడిగికొని యాచమనముచేసి, భర్తను మనస్సునందలంచుకొని పుడిసెడు నీరు చేతఁబట్టి - 'ఓ పాపములార! నేనే పతివ్రతను - నాదే సత్యవాక్యము - అని నారదాదులు తెలిసికొన్నది వ్యర్థముగాకుండ మీరు నశించి భస్మమైపొండు. మీదుష్కార్యములకు ఫలమును ఫలించి పెద్దల సత్యవాక్యమును నిలువఁబెట్టుఁ' డని కన్నులు మూయఁబోవునప్పటికే కొన్ని దూరముగాఁ బాఱిపోయినవి, కొన్ని తొలఁగఁబోవుచున్నవి, కొన్ని నుమ్ముకై సెయిచే పెదరని నిర్ణయముగా నక్కడనే పండ్లి గిలించి చూచుచున్నవి. కన్నులు విచ్చినీరు గంగకుఁ జుట్టును జల్లినది. అల్లంతదూరమునఁ జిటచిటమ్మను ధ్వని వినఁబడినది. కొంతదూరమునఁ బటపటమను శబ్దము వినవచ్చెను. గంగచుట్టును ప్రేలాపన నిప్పు

... అనేక విధములుగా - శాపము ...ద్దలైనవి. బూరెప్రోగయినది. నీళ్లుగారు ...పఁ దలగడుగుకొన్నట్లు శరీరము తేలికపడి ...గకు సంతోషము పట్టఁజాలకుండఁగలైను. ...ఁడు నాకు మహోపకారి. నాకు నీవు తల్లివలె ...డి నన్నుఁ గాపాడితివి. నీకు నేను కృతజ్ఞురాలను. నీమేలు మఱువను. మీపర్ణశాలకు దాపుగ నీజల ప్రవాహ మెల్లప్పుడుఁ బాఱుచుండును గాక; ఇది మీస్నాన పానముల కుపయోగించును గాక; దీని నిట్లుండ నిమ్ము. నీదర్శన మైనది, కృతార్థురాల నైతిని. సెలవిండు. నేను బహుతావులకుఁ బోవలసినదానను, ఒక్కచో నిలుచుటకష్టము, నాకుఁ ద్రిప్పుట యెక్కువ. నాకాలు నిలువదు. నాయనగారికి నానమస్కారములు నివేదింపుము." అని పదిపది దండములు పెట్టి గంగ వేంచేసెను. అనసూయ తన భర్తకడకుఁ బని సవిస్తరముగ జరగిన దానిం జెప్పెను. ముగ్గురు శిష్యులును మూతులు బిగించి కొనుచు నిజనివాసములకుం జనిరి.

సోదరీమణులారా! ముల్లోకములు ముట్టికొన్నవి. మర్త్యలోకములో సావిత్రిమూలమున వైకుంఠములో లక్ష్మీకారణమునఁ గైలాసములో గౌరికతమునఁ - అనసూయపైఁ గిసరుపుట్టె - అసూయ లేచి - అహంకారము మెండై పోఁగ రాఁజుకొనఁ జొచ్చెను. సావిత్రి - తిండితినక, నిద్రపోక, అనసూయపైఁ జాపోషముచే సాగరోఁజుమఁ జిక్కులు పెట్టుటకు మార్గములు వెదకుచుండెను. తనయింటిలోనున్న దుర్వాసుఁడు మొదలైన పలుతిక్కమునులపద్దులు తిరుగవైచినది. అట్టిమునులి - అట్టిపడుచు కాకుండ నడితరము వానిని బిలిచి - 'నీవు నిర్భయముగ భూలోకములో అనసూయయొద్దకు వెళ్లి యెన్నివిధములనైన బాధించి చిక్కులు పెట్టి చీకాకు పఱచిరమ్ము. ఎట్లయిన వంచించి రావలయును.' అని పంపిన మునివచ్చి - అత్రిమునికిఁ బ్రొక్కవైచి పండుకొన్న తరువాతఁ దొడమీఁదఁ గాలు పెట్టి నిద్రపట్టుటకై మెల్లఁగ నొత్తుచుండిన సమయము గనిపెట్టి, 'అనసూయా! భిక్షాందేహి. ఆఁకలి, ప్రేవులు మాఁడుచున్నవి. గొంతుక యెండిపోవుచున్నది. నాలుక పిడుచగట్టికొనిపోవుచున్న'దని యెండు నాలుకతో నఱచెను. ఈపలకు వచ్చుటకుఁగాని వచ్చుచున్నదానవని యఱమటకుఁ గాని సమయముగాదు. కొంతజాగుచేసివచ్చినది. మునికి తలలోని యొక జడమ వెజేకినేలఁ బెట్టికొట్టెను. దా... నొక రాక్షసుఁడు పుట్టి నోరు దెఱచికొని పళ్లెరములో నన్నము పెట్టుకొనివచ్చు పతివ్రతపై నట్టహాసము చేయ బోయి వెనుకకుఁ ద్రిప్పి-దండము నేలఁగొట్టి మునిమీఁదనే పడి గోళ్లతోను గోఱలతోను జీరిదంపి శవమునుబట్టుకొని యెక్కడికో పాఱెను. సావిత్రికి గర్వభంగమైనది

పార్వతికూడఁ గొంత చిన్నతనపుఁబనిచేసినదని చెప్పుకొనుచున్నారు. అదిచెప్పుట నాకు సిగ్గగానున్నది. లోకమాత యట్లుచేయునా! ఏమిచేయుదును? కిరియాశీచరిత్రములో శివుని గౌరిని సొగటాలయాటలోఁ బెట్టితిని. శివరాత్రి మహాత్మ్యములో శివునిచే గంజాయిపత్రి పీల్పించితిని. దేశమెల్లవారు నట్లుచేయించిన నట్లుచేయుటకు సిద్ధపడు వీరు సర్వేశ్వరులని యెంచి లోకులయాటలనే నేను నాడింపకున్న మూర్ఖులు నన్ను నిందింతురు గావున - ఊఁ! మీరట్లు తలంపవలదు. పార్వతి ముట్టయినది. గంగచేపలది - కృష్ణుఁడు గొల్లవాఁడు - అరుంధతి మాలది. ఇట్లని చెప్పువారిని, గాదనిన నీకేమి తెలియునని కొట్టవత్తురు. నేను వ్రాసినదాని నెవ్వరయినఁ జదువవలయునను తలంపే నాకున్న - వారని నట్లే యనవలయును. నిజమాడిన నిష్ఠురము. మూర్ఖులే కాదు. ఒక పండితుఁడు. 'కాళిదాసుగారు రాజులేని సమయములో భోగముదానియింటిలో.' అనిరేమొకా కథ చెప్పుమన్న నేను నవ్వితిని. ఒక్క కాళిదాసుగారు; ఇద్దఱో ముగ్గురో యున్నారని చెప్పుదును. వారికాల నిర్ణయము లేక చరిత్రము తెలియక తల్లక్రిందుపడుచున్నారు. కాళిదాసేమి భోగముదానియింటిలోనికేమి- యంటిని. అట్లయిన భోజచరిత్రము - అక్షరలక్షలు - అబద్ధమేనా - నీది వెఱ్ఱితనము. అనిపదిమందిలోఁ దిట్టినాఁడు. ఆయన తిట్టినకొలఁది నాకునవ్వు. పిట్టకథలు నమ్మినట్టులు సత్యకథనము లోకులు నమ్మరు. తెనుఁగువారు- అఱవవారు పిట్టకల్పితకథలు చాలఁ దలిచిన వారుక... అత్రి తనయిల్లాలితోడఁ దలపైఁ బాదములుంచి పండుకొ...యెను. ఆసమయమున పార్వతి తనమగనియొడలి భూషణములలోని యొక పామును దీసి సేవకుఁడను ప్రమథుని చేతి కిచ్చి వారి మీఁదఁబడవేయుమని పంపినదఁట. ప్రమథుఁడు మెల్లగాఁ బ్రాఁకుచు అనసూయమీఁది

కట్టివేట్ల విడిచిపెట్టెనట - సర్పము మెడమీఁదికెక్కి మొగముమీఁదికిఁ బడగెత్తి తొంగి చూచుచుండఁగా నాయమ్మ కనిపెట్టి నిర్భయముగఁ గదలక మెదలక యున్నది పూవులమాలయై మెడలో వ్రేల్లపడియుండెను. నిద్రనుండిలేచి అత్రిముని యీమాలయెక్కడిదని యడిగెను. గౌరిపంపినదని దానిని ధాముమగా మార్చితోలివేసెనట.

లక్ష్మి ధనగర్వముచే నేమిచేయించిన దనినను సమ్మతమ్మును. ఆమె తనకుమారుఁడగు మన్మథుని, వసంతుని తోడిచ్చి పంపి, అనసూయకు మనోవికారము కలిగింపుమని ప్రోత్సాహపఱచెను. ఈమదనుఁడు నొక్కపేదరాలు తన ముగ్గురు బిడ్డలతో నెక్కడనుండియో వచ్చి యత్రిముని యాశ్రమము దగ్గఱ నిర్భయముగా నుండునని చెట్టులనీడఁగూర్చుండెను. ఆబాలురను గాంచి అనసూయ నాకు బిడ్డలు లేరు. పుత్రులుగల తల్లిదే యానందమని మనస్సునఁ గొంచెము విచారము నొంద, దానిని భర్త యెఱిఁగి నీవు విచారింపకుము. నేను బదరికావనమునకుఁ జని నారాయణమూర్తిం గూర్చి ఘోరతపంబొనరించి పుత్రులంబడయుటకు వరము గొనితెత్తునని తన యిద్దఱు శిష్యులను, "అనసూయకు సహాయము గానుండుఁడు, ప్రాతఃపాకములు వల్లించుకొనుచుండుఁ"డని ఆశ్రమము విడిచి యెందును బోవలదని-"ఇతర మునికుమారులతోఁ జదువులలో గర్వమునఁ బంతగింప రాదని" బోధించి- ఇంకనెన్నియో నీతులు చెప్పెను. వానిని మేము తెలుఁగ నొకనీతిగ్రంథము వ్రాయఁదలఁచియుంట విడిచితిమి. అత్రి బదరికాశ్రమమునకు వేంచేసెను. ఆపేద బిడ్డలకు రొట్టెలు, పండ్లుపెట్టి వారి యాటలు వినోదములు చూచుచున్న యనసూయకడకు మన్మథుఁడు, అత్రిముని వేషము దాల్చివచ్చి తనచమత్కారములు గారడివానివలె సంబిధిప్పి చూపఁబోయెను. ఈదుష్ట చేతలను గ్రహించి- నీమాటలు నాయొద్దనా! నీ [...]లకుఁ దోడు మాయవేషములు కూడ నేర్చిన లోకమున మర్యాదలు నిలుచునా. తొలగిపొమ్ము. నాయెదుట నుండరాదు. నీవైదునిమిషములలో నీసామగ్రితో నీపరివారముతో నాయాశ్రమము విడిచిపోవలయును, అని పలికిన మన్మథుఁడు సిగ్గుపడి పడలిపోయెను. లక్ష్మి యేమిజరగినదని కొడుకు నడుగలేదు. మానమును గొడుకు చెప్పలేదు.


ఒక్కరొక్కరిగర్వము నీరీతిగా న[...] కానివవస్తువులో నమూయముఅంత వృద్ధి పొంద[...] అనసూయ పాతివ్రత్యము వారికి ఘనమనిపిం[...] దానికింకొక్క చిన్నవిషయములో నైనది. వినుండు.

ఒక్క బ్రాహ్మణకన్యగలదు. ఆమెపేరు సర్మద. సద్గుణవతి, విద్యనేర్చినది, బుద్ధిగలది, యని పేరుపొందినది. కన్యాత్వమునందే దైవవశమున మరణించి స్వర్గమునకుఁబోయెను. ఏమూలనో యొక్కమూలఁ బడియుండమని యెన్నక పెద్దలిండ్ల కెపరుపెట్టు మనవారిం జూచుటలేదా. ధనమున్న హాయిగా నొకరికిఁ బెట్టి తాను తినియుండక, ధనము వ్యర్థముగా వెలపుచేయుచుఁ బెద్దపెద్దపదవులకు, కార్యదర్శులకు మంత్రులకు, గావలయునని యెన్నికలు, పరాభవములు, న్యాయస్థానము కెక్కుట మనకు విదితమే. సర్మద, చేరితిని, నరకముగాదు స్వర్గము. కడుపులోని చల్లకదలకుండ నొక్కచోట నెక్కడనో వారు చూపించినచోటఁ గూర్చుండమనక, పతివ్రతలలోఁ జేరుదమని యత్నము. నేను పతివ్రతలలో నొక్కతెనుగా నిలిచెదనని యభిప్రాయము నడిగినది. తగునని కొందఱు, కొన్నిగుణములు తక్కువయని కొందఱు, నింద్రసభలోఁ దర్కించిరి. ఇంద్రునకు మనవి వ్రాసికొన్నది. నాగిరము సభలోఁ బెట్టినాఁడు. సభలో ధర్మసందేహము- ఉపసభయొకటి నిర్మించి యీవిషయమై చర్చించి నిర్ధారణచేయుఁడని యింద్రుఁడా కాగితము మీఁద వస్తుగా వ్రాసి బృహస్పతి యొద్దకిఁ బంపెను. కొన్ని దినములవఱకు దానిని బుట్టలోఁ బడవైచిపెట్టిరి. చిత్రగుప్తులయొద్ద నాకాగితమునకు బదులువచ్చినదాయని సర్మద యడుగుచుండును. ఒక్కనాఁ డుపసభకూడినది. ఎన్నుట, బలపఱుచుట, చప్పట్లు చఱచుట, నేనెంతటి వాఁడను, మీకు నాకీ గౌరవమునిచ్చిరి. అధ్యక్షుఁడను గానని మీకెల్లఁగిరేయున్నారు. నన్నుఁ బీఁటమీఁద నాఁడుఁబడుమనవలెఁ గూర్చుండఁబెట్టి మీరే యీకార్యక్రమమునందు భంగములేకుండ సభను నిర్వహించుకొందురని ప్రార్థించుచున్నాఁడనని యధ్యక్షుఁడు తన వినయభావమును, నాదుక ముక్కలను వెలిపుచ్చుట-గొంతు

కూర్చున్నది మొదలు సభాధ్యక్షునికి …డి ప్రక్క బారున చీటులందించుట మీరే ముక్కలు చెప్పుఁడని ప్రక్కవారిని గిల్లుట ముగిసిన పిమ్మట- యథావిధిగా కార్యక్ర …ల్లమీఁదఁ బెట్టలేదేమి యని చిత్రగుప్తునిపైఁ …ర్యదర్శి కన్నెఱ్ఱజేసెను. ఇందేమున్నది. ఒక్కటే యంశము. దీనికిఁ గార్యక్రమ పత్రిక లేదని తేలేదని చిత్రగుప్తుఁడు సమాధానము చెప్పెను. తేలేదుగదా యని చెప్పుము, అంతియ కాని సభాక్రమమునకు విరుద్ధముగదా! అధ్యక్షుని యొక్క నేఁడేమి క్రొత్తయని యీ చప్పట్లు మొదలైనవి. ఇది యొక పద్ధతి. కానిండు. వర్షప్రార్థన మొక్కటియే నేఁడు చర్చింపవలసినది. అని సభవారు సభాధ్యక్షునితో లేచి చెప్పిరి. కట్టిపెట్టి దను. విరాకీహాస్యము చెప్పను. సభ జరిగినది. తీర్మానములు చేసిరి.

"ఇంద్రుఁడుగారు నియమించినట్లు వర్షప్రార్థనమునకే సభవారి యభిప్రాయ మతుకున్నారు. కొన్ని కొన్ని చట్టములప్పుడప్పుడు రద్దుచేయుట, మార్చుట, సవరించుట మొదలైనవి కొన్ని రాజ్యములలోఁగలదు. ఇక్కడ బహుకాలమునుండి యట్టి తలంపే లేదు. పూర్వాచారము ననుసరించి కవచధారిని గుడిలోనికి రానీయమని వనిపుడు, కవచములు, మీసములు ముందుజుట్లు లేనివారెవ్వరు? ఈచర్చ ముండు ముఖ్యముగా జరుగును. ఇఁక వర్తకను గూర్చి పూర్వశాస్త్రముల ననుసరించిరే యిప్పటి తీర్మానము. విధవల కట్టడములలోనికి వారెన్ని విధములుగాఁ జెడినను విధవలే చేర్చఁబడుదురు. కన్యల కట్టడములలోనికిఁ బెంపవరసి వచ్చినను గన్యలనువారే రావలయును. వివాహమైన వారికట్టడములలోనికి నాకబలి నాఁడు చనిపోయిననుదుకుమంగళ స్నానములు చేయుమఁ జచ్చినను వివాహసంస్కారమైనదనిపించుకొనిన వారే రావలయును. విధవలన్నీ వివాహితలని భేదము లేకుండఁ బతివ్రతలందఱు నొక్కభవనములో నుండవచ్చును. కాని వివాహముకానిదాని పాతివ్రత్యము పరిశీలన కెట్లువచ్చును? పతివ్రతయనఁగాఁ దాత్పర్యమేమి? పతిని దైవముగా వ్రతముచేయునది. పతిని బూజించునది ఇక్లెన్నియో రీతులు. ఎన్ని రీతులనాలోచించినను పెండ్లికాని వారికిఁ బతులున్నారో లేరో బహిరంగముగాఁ దెలియదుగానఁ గన్యకలు (కన్యకలనఁగాఁ జిన్నపెద్ద భేదము లేకుండఁ బెండ్లికానివారు) పతివ్రతలలోఁ జేరుటకు వీలుకలుగదు."

ఈతీర్మానము నేకగ్రీవముగా నామోదింపనివారున్న యెడలఁ జేతులెత్తుమంటిమి. ఒక్కఁడును జేయెత్తలేదు. కాబట్టి తీర్మానమయినది అని యధ్యక్షుఁడు చేతులుచేయు నప్పటికిఁ గొందఱు సభ్యులు దీనికంటె ముందు, దీనికంటె ముఖ్యమైన పనిలోనికి వెళ్లవలయునని లేచిపోయిరి. నేనొక గంటక్రిందనే వచ్చినట్లు వ్రాసి కొందఱు కూర్చుండిన వెంటనే వెళ్ళిరి. కరతాళధ్వనులలో (చిత్రగుప్తులమాత్రమే) సభ ముగిసినది. దేవేంద్రుఁడుగారి యొద్దకుఁ బంపిరి. దాని ప్రతి యొకటి వర్షునకిమ్మనిరి. చిత్రగుప్తులట్లు చేసిరి. వర్షన పదిమందికిఁ జూపించినది. ఎవ్వరికిఁ జూపినను నిష్ప్రయోజనము. భూలోకమునకుఁ బోయి పెండ్లియైన దనిపించుకొని రామన్న వీరి పట్టు వీడుచుకుండును. అయ్యో, తీర్మానముల



సూర్యుఁ డుదయింప కుండునది యని వర్షనపలికెను.


సంగతియే యిట్టిది పొమ్మని యందఱును జెప్పిరి. తప్పదని నర్మదకుఁదోఁచినది. పెద్ద పేరువచ్చుననియే కాని పడవలసిన కష్టములెన్నోయని యాలోచింపరు. భూలోకమునకువెళ్ళి, కుష్ఠవ్యాధి, వఃపలితము, చిత్తకోపము, పెండ్లి చేసికొనవలయునను వాంఛయుఁగల యొక బ్రాహ్మణుని, వీఁడు శీఘ్రకాలములో మృతినొందును. విధవ వైనను పతివ్రతలలోఁ జేరవలయునను పట్టుదలతోఁ బెండ్లియాడినది. అతఁడామెను బహుబాధలు పెట్టెను. తిట్టెను, గొట్టెను, చెప్పనేల! ఒక్కనాఁడు నడువలేను. నన్నెత్తుకొమ్మని కఱ్ఱతోఁగొట్టి, పుంటికాలు కడిగి యీఁగలు వాలకుండఁ గట్టుకట్టి నదికి స్నానమునకుఁ దీసికొని పొమ్మని ముసలి బ్రాహ్మణుఁడు పట్టుపట్టెను. భుజముమీఁదఁ బెట్టుకొని మోచి నది యొడ్డునఁజేర్చినది. కన్నులు కానరాక తపస్సు అచట చేసికొను నొక యోగిని ద్రొక్కినాఁడు. అతఁడు దానికిఁ గోపగించి నీవు సూర్యోదయము కాఁగానే చత్తువని శపియించెను. నామగఁడు చనిన నేను విధవ గావలసివచ్చును. ఈరెండు కష్టములు రాకుండుటకై సూర్యుఁడుదయింప కుండునదియని నర్మద పలికెను. లోకములు చీకట్లు కప్పినవి. ఒక్కరికిని దోపకుండెను పట్టపగలు దీపములు పెట్టుకొని తిరుగుటకును గష్టమేగదా! దేవతలు, దానవులు, మానవులు నేకమైరి. ఏమి చేయుదమాయని సర్వవర్ణ సమామ్నాయ సభ జరిగినది. నర్మద మనమాటలకు లక్ష్యపెట్టదని కొందఱు, ఆఁడుదానిని మగవారు ప్రార్థించుటకు సిగ్గులేదాయని కొందఱు, సిగ్గు పౌరుషములున్నచో సూర్యునిఁ బోణిపింపకుండని కొందఱు కొట్టుమిట్టాడిరి. ఇంతలో నొక కొఱవి పొలకట్టి వెలిఁగించుకొని నారదుఁడువచ్చెను. మీరు మీరు గింజుకొన్నను, సూర్యుఁడుదయింపఁడు. నామాటవిని మీరందఱును గలసి అత్రిముని భార్య మహాపతివ్రతయగు నన సూయను వేఁడుకొనుఁడు. ఆమె వచనములకు నర్మద వెనుకదీయదు అని చెప్పిపోయెను. పెద్దకాఁగడాలు వేయించుకొని యందఱును మహాపతివ్రత కడకువచ్చి గోలపెట్టిరి. పాపమామె వారినెల్లర వెంటఁ బెట్టుకొని నర్మద యొద్దకువచ్చి సూర్యుఁ డుదయించుటకు సెలవిమ్ము. నీ పెనిమిటి చనిపోయిన నేను బ్రదికించెదనని నర్మదను బతిమాలెను. ఆమెయట్లు చేసినది. ఈమె యిట్లు చేసినది. పైఁగా నాబ్రాహ్మణుఁడు రోగములన్నియుఁబోయి దృఢశరీరము, యౌవనమును వచ్చునట్లు ననసూయ యనుగ్రహించెను. ఈపతివ్రతమహిమ గౌరిలక్ష్మి సావి



ముగ్గురు మూఁడుపంటిబిడ్డలైరి. కేరుకేరుమని రోదింపఁజొచ్చిరి.

త్రులకు మఱింతయనసూయను గల్గించినదంట నింతలేదు గదా.

తనతను పతులను జేరి 'వలదు; ప్రయోజనము లే' దని వారెంత చెప్పినను వినక మూర్ఖపుఁబట్టుపట్టి మీరు స్వయముగాఁ జని యనసూయను మోసపుచ్చిరమ్మని కోరిరి. అయ్యో, మేమును స్త్రీలమాటలు పట్టుకొని తిరుగ వలసినదేనా. అత్రియింటలేడు. ఎట్టిపనిచేయఁగల మని చింతించుచునే త్రిమూర్తులును (బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) అనసూయ కడకు యోగిరూపములతో వచ్చి మా కాకలిగానున్నది. మీయింటనున్నదే చాలును. మేము స్నానము జపము చేసికొని సిద్ధముగ నున్నారము. నీవు వస్త్రము విప్పివైచికొని వడ్డింపుమనికోరిరి. కోరిక యామెకుఁ జిరాకుపుట్టించినది. కాని సమయోచితమైన యూహయామెను గాపాడినది. కూర్చుండుఁడని పీటలు పెట్టినది. కూర్చుండిరి. కమండలువులోని నీరు కొంచెము తీసికొని వారి ముగ్గురిమీఁదఁ జల్లిన ముగ్గురు మూఁడు చంటిబిడ్డలైరి. కేరు కేరుమని యేడువఁజొచ్చిరి. ఇంతలో దిగంబరయై పాత్రలలో వడ్డించి మరల బట్టకట్టుకొన్నది. కాని బిడ్డల యేడుపు తనకు జాలిగొలిపినది. తానొకబిడ్డను తన శిష్యురాలిద్దఱు ఇద్దఱు బిడ్డలనెత్తికొని యూడించుచుండిరి. నారదుఁడు పరుగెత్తికొని ముగ్గురమ్మల దగ్గఱకుఁబోయి, 'యిట్టిట్టు జరిగినది. మాయమ్మలార! మీరీ గొడవకు రావలదని చెప్పితిని. నామాట వినలేదు సరి గదా మైఁగా నిట్టి తప్పుపనిచేయించిరి. రండు. మీరువచ్చి యనసూయను బతిమాలుకొనుఁడు. అత్రి యింటలేఁడు. కాఁబట్టి మగవారిమాట లామె వినదు. స్త్రీలను స్త్రీలే పలుకరింపవలయును. మించినది. నాతోఁ జెప్పరాదా. నన్నుఁబంపరాదా. పెద్దతలకాయలకు గౌరవహానికలిగిన లోకములో నెంత చిన్నతనము. రండురండు. జాగుసేయ వలదని గుంజెలు కొట్టుకొనుచు తనవెంటవచ్చు వారికి నారదుఁడు, అనసూయదర్శనమునకుఁగొనివచ్చెను. 'అమ్మా! మమ్ము రక్షించి మాకుఁ బతిభిక్ష పెట్టు'మని గౌరియు లక్ష్మియు సావిత్రియు వేఁడుకొనిరి. 'మీకేమి! పతిభిక్షయేమి! నేనేమిచేసితిన'ని యనసూయ వింతపడియెను. 'మీరు ముగ్గురు మాభర్త'లని వారు చెప్పుకొనిరి-'నాకు బిడ్డలు లేరు. నేనీయఁజాల'నని యనసూయపట్టుపట్టి వారిని తిరస్కరించినది. అప్పుడు వీరు ముగ్గురును గోలుమనిరి. ఆకాశవాణి, 'అనసూయా! నీపతి భగవంతుని వరము గోరి తెచ్చుచున్నాఁడు. ఈ త్రిమూర్తుల యంశమున నీకొక్కకుమారుఁడు కలుగును. వీరి పతులను మరల నిజస్వరూపులనుజేసి యిచ్చివేయుము. దీనివలన నీపతివ్రతాత్వము మఱింత వన్నెకెక్కు'నని పలికెను. ఇంతలో నత్రిమునివచ్చెను. నీరు మంత్రించి చల్లి బాలురను త్రిమూర్తులనుజేసి యెప్పటియట్లునిలిపెను. త్రిమూర్తులును వారివారి భార్యలవంకఁ దలలు వాంచి చూచుచు మాకు శృంగభంగము చక్కఁగానైనదని సంజ్ఞలు చేసిరి. నేను, మీరు పరమపురుషులని యెఱుఁగను. ఎవ్వరోయతులని తలంచితిని. నన్ను క్షమింపుఁడని యనసూయ వేఁడికొనియెను. నీ తప్పింతయైనను లేదని వారు సపత్నీకులై దయచేసిరి. నారదుఁడు వారితోఁ గొంతదూరము వెళ్ళి నాకు దత్తాత్రేయదర్శనముచేయ వలయునని యున్నది. సెలవిండని తిరిగివచ్చెను. అనసూయగర్భమునఁ గొన్ని దినములకు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల యంశంబుల నొక్క పుత్త్రుఁడు దత్తాత్రేయుఁడు జనించి యాముని దంపతులకు హర్షము గలిగించెను. దత్తాత్రేయుని వర్ణించుట నాతరముకాదు. రవివర్మ పటములోఁ గొంత విషయము జూచి యెల్లవారు నానందింతురు గాక!



సేవ్య సేవకోపదేశము

(క్షేమేంద్రుని కృతికి దెలుఁగు)

శ్రీరాజా వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద బహద్దరుగారు

ఉ. వాకిట నడ్డఁబడ్డఁ గని వద్దనఁ బెట్టులో చేర రా సమా
లోకముచేయఁ డేమనవులున్ గజవాలితముల్ పొసర్చుచున్
గైకొనఁ డేఁగినన్ వెదకు గంపెఁడుతప్పులు, తప్పులందుఁ గా
లాకృతియౌఁ బిశాచమున కాతని కేమిట భేదమోకదా!

చ. గురులను రాజపూరుషులఁ గొల్వఁడు కొల్చును రాజదాసులన్
వరదుఁ దలంపఁ డీశ్వరుని వారక విత్తమునే తలంచెడున్
నరపతి కీడుమేళ్లను గనండు స్వకార్యములే కనుంగొనున్
జెఱుచుఁ జెడున్ గడున్ జడుఁడు సేవకుఁ డెప్పుడు శ్రీనిమిత్తమై.

ఉ. చేరరు గోఁతఁగూల్చువిషచిత్తులు మత్తులు, చాటదుమ్మునన్
గూరదు నీమొగమ్ము, పెనుగోలయు నుండదు, ద్వారపాలదో
స్సారపుభీతి కల్గదిఁకఁ జప్పనఁ జేరుము పుణ్యకానన
ద్వారము; మూఁఢుఁడా యచట దంభనృపాలురబాధ లేదురా.

శా. అన్నా! కష్టవినష్ట! సేవకుఁడ! పోషాశన్ మహాయాసమున్
గన్నావో, నయమో నపుంసకుని రాగద్వేషదోషార్తిదున్
మన్నిన్ భజియింతువే పరతరున్ మాహేశ్వరున్ గొల్వు మా
పన్నత్రాణపరాయణుం డతఁడు నిన్ బాలించు నెల్లప్పుడున్.

గీ. తృష్ణలేశుల యవివేకకారణమున, వెలయు దైన్యంబు లెన్నగా విడుఁడు సుమతు
లెద భవగ్రంథి నిఁక జనియింపనీక, దివ్యవిజ్ఞానమణిఁ గొల్చి భవ్యు లగుఁడు.

సీ. వ్యాజంబులకు నిత్య మావాసమగువారు, విజనసుఖేచ్ఛులై వెలయువారు
వసుధేశ్వరులు వారి బడిపంచలం బడి, యూడిగం బొనరించు టుడుగుఁ డింక

త్రెంపుఁడీ యాశాఖ్యదృఢపాశబంధంబు, చిత్తంబు నెంతయుఁ జిక్కఁ బట్టి
విమలంబు పూతంబు శమజలంబును జల్లి, యార్పుఁడీ తీవ్రతృష్ణానలంబు
గీ. హృదయకుహరాంతరాంధ్యంబు చెదరఁగొట్టఁ, జాలుపరమామృతజ్యోతిఁ గీలుకొలిపి
నిర్వికల్పసమాధిలో నెగడి మీరు, శుద్ధసౌఖ్యప్రపంచంబుఁ జూడుఁడయ్య!.

గీ. వృత్తిచేతనె జగము జీవించు; నిజము, వేరికో కొందఱకె సేవ వృత్తియగును
దాస్య మస్థానమునఁ దీవ్రతర మగుటను, దెగడుఁడీ దానిఁ బ్రాజ్ఞులు తెగువమీఱ.

గీ. పండితులఁ గొల్వ మక్కువపడెడువాఁడు, తోషసేవారసాంబుధిఁ దోఁగువాఁడు
చెలఁగి క్షేమేంద్రుఁడనువాఁడు చెప్పెదీని, బుద్ధిమంతులు సౌఖ్యంబు పొందుకొఱకు.

గీ. దేశమెల్లను దాస్యంపుఁదెవులుచేతఁ, గూలు నీకాలమున నిది మేలుగూర్చు
నని యథాశక్తిగాఁ దెలుంగునను దీనిఁ, జెప్పినాఁడ మన్నింపుఁడీ తప్పిదములు.

తొలిపలుకు

వ్యాసదాసుఁడని నామాంతరముగల క్షేమేంద్రమహాకవి యీసేవ్యసేవకోపదేశమును సంస్కృతమున రచించినాఁడు. అతఁడు ౧౧-వశతాబ్దివాఁడు. కాశ్మీరదేశీయుఁడు. మంత్రికులమువాఁడు. సంస్కృతమున నాతఁడు ముప్పదిగ్రంథముల రచించెను. వానిలోఁ గొన్ని విమర్శగ్రంథములు. అవి ఔచిత్యవిచారచర్చ, దేశోపదేశము, సువృత్తతిలకము, మొదలగునవి. భారతమంజరి, రామాయణమంజరి, బృహత్కథామంజరి, మొదలగునవి యితిహాసకథాగ్రంథములు. ఔచిత్యవిచారచర్చయం దీతఁ డితరులనేకాక తన్నుఁగూడ విమర్శించుకొని దోషములఁ గణించుకొన్నాఁడు. క్షేమేంద్రుని స్వాతంత్ర్యప్రియత్వము నీచిన్నిగ్రంథము ప్రకటించుచున్నది. ఇందు సేవకుల కుండుసంకటములను ధౌర్త్యములను చక్కఁగా లెక్కించినాఁడు. సేవ్యులకును జక్కనిమందలింపు లున్నవి. పుస్తకము చిన్నదైనను, లోకవృత్తమును జక్కఁ బఱుచునదిగా నున్నదిగాన ప్రియపడి తెనిఁగించితిని. 9-37 శ్లోకములు తెలిఁగింపలేదు. అవి సరిగాఁ దోఁపలేదు.

జయంతిపురము
29-1-1925

వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వరప్రసాద్.

నెశవ్రౌక్షోమ్ము

అబ్దుర్ రజాక్

భావరాజు వెంకటకృష్ణారావుగారు, బి. ఏ., బి. యల్.,

సంపుటము ౧, సంచిక ౧౫ తరువాయి.

రాయల సందర్శన భాగ్యము

"ఇట్లుండ నొక నాడు రాయలవారి సన్నిధినుండి నాకొఱకై చారులువచ్చి, సార్వభౌముని యాజ్ఞయైనదని, తెలియచేసిరి. ఆసాయంకాలము నేనును సర్వసన్నద్ధుడనై, కొలువుకూటమున కేగి, రాయలసందర్శన ప్రాప్తికి పరమానందము నొందుచు, నాదేశీక యాభిమతానుసారముగ, నైదు పారసీకయుత్తమాశ్వములను, తొమ్మిదిరకములు ఎఱ్ఱపట్టు, ముఖమలు పట్టువస్త్రములు, అంగీబడ్డలు, రెండుపళ్లెరములలో బెట్టి, రాయలకు కానుకగా సమర్పించితిని. వెనుక నేను వర్ణించిన నలువది స్తంభములుగల సభామంటపమున నత్యంతవైభవముతో నొకవేదికపై గల సింహాసనముపై రాయలు సుఖోపవిష్టులై, నాకు దర్శనమిచ్చెను. కర్ణాటకసామ్రాజ్యపాలకుడగు నా రాయలు ఒకవంక, పండితులు బ్రాహ్మణులు, కవులు, వేదాంతులు, వేశ్యలు ఒకవంక, వీరభటులు, సామంతమండలేశ్వరులు బలసి కొలువమండ, మహావైభవముతో కొలువుదీర్చియుండెను. ఆతడు పసుపుపచ్చని పట్టుతో చేయబడిన యుడుపులను ధరించియుండెను. మెడలో, నవరత్నఖచితమై వెలలేని మంచిముత్యములచే చుట్టబడిన కంఠపట్టికను నానావిధరత్నభూషణములను ధరించియుండెను. ఆతని యాభరణముల విలువ ప్రపంచమున నేరత్నవర్తకుడు కూడ కట్టజాలడు; ఆతడు పచ్చని సంపగపు మేనిచాయ గలవాడు. కొంచెము పలుచగానుండి పొడవైనవాడు ఆతనిరూపరేఖాదులుచూడ చాల చిన్నవయసువాడుగా గానుపించినాడు. [1]. ఆతని చెక్కిళ్లించుక పలుచగానున్నవి. సొగసైన విగ్రహమున్నది. గడ్డము మాత్రము లేదు. ఆతని చూపులును, దృష్టియు, చల్లనివై హృదయానందకరములై విశ్వాస, భయ, గౌరవములను గలిగింపజాలినవిగ నున్నవి. కొలువుకూటమును ప్రవేశించినపుడు నేనును గౌరవసూచకముగ శిరసువంచియుంటిని. ప్రతీహారులు, రాయలకు నన్నెఱిగించిరి. రాయలును అంతట నన్ను చిరకీర్తిని సంభావించి, తన చెంత గూర్చుండ నాజ్ఞాపించెను. నేనపుడు మా ప్రభువుపంపిన సుహృల్లేఖను రాయల కందీయ, [2] నాతడు దానిని

---

1 అబ్దుర్ రజాక్ వ్రాసిన దీసందర్భమున సంశయమునకు తావొసంగుచున్నది. అప్పటికిరువదిసంవత్సరముల నుండి యేలుచున్న యిమ్మడి దేవరాయలు యౌవనవయస్కుడెట్లగునో తెలియదు. ఒకవేళ నీ పారశీక రాయబారి సందర్శించినది, యిమ్మడిదేవరాయ లగునో కాదో? కాకున్న మరియెవరై యుండురు? ఒక్కటి నిజమయి యుండవచ్చును. యిమ్మడి దేవరాయలు క్రీ. ౧౪౪౩ ఏప్రిలుమాసమున క్రూరముగ చంపబడబోయిరి. ఆనిఘాతమున, నాతడు మరణించినట్లు అబ్దుర్ రజాకు దెలుపడు. కావున, యిమ్మడి దేవరాయలు, కాయవంటి వాడు గావచ్చుననియు, వృద్ధకాయుడగుటచేతగాని, పిన్ననాటనే సింహాసనమెక్కి యుండుటవలనగాని వయసు మీఱిన వాడుగాడనియు నూహింపనలయును.

2 అబ్దుర్ రజాక్ రాయలకొసగవలసిన యుత్తరములను పొరబడి సామూరి కర్పించెను. సామూరి ఆయుత్తరములు తనకు గావని తెలిసికొనినపుడు అబ్దుర్ రజాక్ను కిద్బివేసియుండును. అందువలననే కళ్లికోటయందు దితనికి [illegible]ను గౌరవము జరిగియుండలేదు. తనకు సామూరి సన్నిధిని జరిగిన పరాభవమును, నిరాదరణయు, గడుసు[illegible]గా నబ్దుర్ రజాక్ చెప్పక దాచినాడు.

తనదుబాసిని నైశొమ్మని యాదేశించి యిట్లని మృదు మధురగంభీర భాషణముల బల్కెను. "మీరాజు అత్యం తాదర గౌరవములతో ప్రత్యెంచిన రాయబారమును ఈ లేఖను గాంచుటచే నాహృదయము పరమానందభరితమై నది." నేనాసమయమున, నాపేరి సలుపకుండునంతటి దట్టముగా మడుపులను ధరించినవాడ నగుటచే, తమక మును దాముకొనజాలమి యున్నను పైకబికి, నాకు ముచ్చెమ్మటలు గ్రమ్మకేసి నైచెను. అంతట నేను చెమ టచే బాధనొందుచుండ క రుణార్ద్రహృదయుడైన రా యలు, తమచేతనున్న వట్టివేళ్లవిసనను విసరుకొనుటకై నాకు ప్రసాదించిరి. ఆమహాగౌరవమునకు నేను మిక్కిలి అలరితిని. ఇంతలో సేవకులు కొందఱు ఒక బంగరు పళ్లెములో రెండుమోదల తమలపాకులును, ఇన్ని పోక లును, సుగంధద్రవ్యములును, అయిదునూర్ల పణములు గల నొక పట్టుసంచియు, నిరువది దీనారము లెత్తు పచ్చ కర్పూరమును, దెచ్చియొసంగిరి. ఆ కర్పూరతాంబూల మందిన తరువాత రాయలు సెలవుతీసికొనుట కను జ్ఞనిచ్చిన విడిదికి వచ్చి చేరితిని. నాకు విజయనగ రమున నున్నంతకాలము దినవెచ్చమునకై రెండుగొ ఱ్ఱెలు, ఎనిమిదికోళ్లు, ఒకమణుగు నేయి, ఒకమణుగు పంచదార, రెండువరహాలును, పంపబడుచుండెను. ఈరీ తిగనేనుఆనగరముననున్నంతవఱకు జరుగుచునేయుండెను. వారమునకు రెండుపర్యాయములు, రాయలుకొలువు నకు నన్ను బిలువనంపుచుండెను. సాయంతనపువేళ, నేను సముఖమున కరిగినపుడు, రాయలప్పుడప్పుడు మాయేలికయగు ఖాకానిసయ్యదు సుల్తాను వారిని గూర్చి కుశలప్రశ్నలు చేయుచు వచ్చెను. కొలువుకూట మునుండి సెలవుగైకొని యరుగుసమయమున, తొలి నాటియట్లె కర్పూరతాంబూలము బంగారుపణము లయిదువందలుగల పట్టుసంచి యొకటియు, నాకొసంగ బడుచుండెను. ఇట్లు నన్ను బహూకరించు సందర్భమున నొకనాడు రాయలు, నన్నుచూచి, "ఓయీ,! మీ రాజులు, తమకొలువు కేతెంచు రాయబారులతో సుఖ వినోదగోష్ఠితో తనివినొందక సపంక్తిభోజన మిచ్చి గౌరవింతురు. కాని నీవు విమతస్థుడవు, విజాతీయుడవు నగుటచే నీతో మాకు సపంక్తి భోజనభాగ్యము లభిం పదు గావున, అందులకై నీయట్టి చక్రవర్తిచే నంప బడిన రాయబారి కుచితమైన రీతి భోజనమునకు మారు గా, మాగౌరవమును జూపుట కీ సువర్ణటంకము లొస గితిమి." యని పలికెను.

తమలపాకులు - తాంబూలము

* * * * *

ఈ తాంబూలము నములుటచే గాబోలు నేమి తమలపాకులయొక్క గుణములవలన నేమి, కర్ణాటభూపా లుడు అంతఃపురమున, నించుమించుగా నేడువందలమంది రాణులను, ఉంపుడుకత్తెలను భరించుకొనుచున్నాడు! అంతఃపురములోనికి పదియేండ్లు గడచిన మగచిన్నవాడు నయితేము బోరాదు. ఒక్కొక్కయువతికి, రాణిగాని, ఉంపుడుకత్తెగాని, ప్రత్యేకముగ వేర్వేఱు వసతులు, పరిచారికలు, దాసదాసీజనమును గలరు. చివరకిద్దరు రాణులయిన, యిద్దరు ఉంపుటాండ్రయిన నొక యింట నివసింపరు. ఈవిశాలరాజ్యమందెచ్చటనయిన సుందరి యగు బాలికయుండుట తటస్థించెనేని వెంటనే రా లామె జననీజనకుల యనుజ్ఞ బడసియో రొక్కమిచ్చి యో, ఆబాలికను, తీసుకొని వచ్చి మహావైభవములో, తన విలాసార్థము అంతఃపురమును జేర్చుకొనుచుండును. రాణీవాసమున జేరిన తరువాత నామె యింక పరునికంట బడదు.

రాయలను జంపుటకు జరిగిన ప్రయత్నము

ఈ చరిత్రకారుడింకను కళ్లికోటనగరమున, కారణవశమున వేచియుండిన కాలమున విజయనగర మున దారుణమయిన వింత వృత్తాంత మొకటి జరిగి యుండెను. అందలి విశేషము లిట్టివి. రాయలసోద రుడు, తన నివాసముకొరకు నూతన భవనమును నిర్మించు కొనెను. నూతనగృహప్రవేశమహోత్సవమునాడు రాజ ధానియందుగల సకల సామంత మండలేశ్వరులను, సేనా పతులను, ఉద్యోగులను, విందారగింప నాహ్వానించెను. ఇచ్చటి దేశీయుల యాచారసంప్రదాయములను బట్టి ఒకరు చూచుచుండగ నింకొకరు భుజింపరు. విందునకై యరుదెంచిన అతిథులందఱు, ఆ నూత్నమందిరమున గల యొక విశాలమంటపమునందు సుఖాసీనులయి యా యజమానిరియో, లేక యాతని పరివారములో పె

యొకరు అతిథులు కూర్చుండియున్న మంటపముకడకు వచ్చి, లోపల సిద్ధమయిన భోజనాదికము నారగించుటకు ఒకని తరువాత నింకొకరిని లోనికి దీసికొని పోవుచుండిరి. ఆమహోత్సవ సందర్భమునకు పట్టణమునందుగల యన్ని వాద్యములవారిని రప్పించి, రాయల సోదరుడు భేరీ, మృదంగ, ఢక్కా, కాహళాదివాద్యగణముల చేతను, సంగీతవాద్య విశేషముల చేతను, హర్మ్యమంతయు, గింగురుమని మార్ మ్రోగునట్లు కోలాహల శబ్దమును చేయించుచుండెను. ఆ గొప్పసందడిసమయమున, నొకరి మాట యొకరికి కష్టముమీదనుగూడ వినబడుట లేదు. ఒక్కొక్క అతిథిని లోనికి తీసుకొనిపోవుచు, ప్రత్యేక మందిరములందు కూర్చుండబెట్టుచుండిరి. అట్లు ఒక్కొక్కడే లోనికి ప్రవేశించునపుడు ద్వారముచెంతను తలుపుచాటున దాగుకొనియుండిన హంతకులిరువురు, హఠాత్తుగా మీదబడి, యాతని కత్తితో బొడిచి ముక్కలు ముక్కలుగ జీల్చివైచుచుండిరి. ఆ నిర్భాగ్యుని శవ మచ్చటినుండి యతిత్వరితముగ గొంపోవబడిన వెంటనే, మరియొక యదృష్టహీనుడు లోనికి ప్రవేశపెట్టబడుచుండెను. ఆనాడు అతిథులయివచ్చిన, అదృష్టహీనులెవ్వడును తిరిగి తన యింటి ముఖమును జూడబోయి యుండలేదు.

ఆనాడు జరుగుచుండిన భేరీ, తూర్యముల ఘోషవలన, నూతన గృహప్రవేశ సందర్భమున నిరపరాధులను వారెందరి ప్రాణములు, పరులెరుగకుండ క్రూరముగ గైకొనబడుచుండెనో, యాహంతకుని పరివారము తప్ప నొరు లెవ్వరు నెఱుంగరు. ఇట్లు నగరమున నారును, పేరును పలుకుబడియు గల్గి రాజభక్తిగల ప్రతిమనుజుడును దారుణముగ వధింపబడియెను. ఒకమూల నీ దారుణ కృత్యములు జరుగుచుండ, రాయల సోదరుడు, రాయల యంతఃపురమునకు జనెను. అచట కావలివాండ్రను మచ్చికలాడి, తనయింట జరుగుచున్న విందునకై యాహ్వానించి, మెల్లగా వారినందరి నొకరి తరువాత నొకరిని తనయింటికి బంపివైచెను. ఇట్లు యింతయిం జేయగా, నగరికావలివాండ్రనందరిని బంపివైచి, మెల్లగా రాయలను సమీపించెను. రాయల సమ్ముఖమునకు జనునపు డాతడు చేత నొక బంగరు పళ్లెరము బట్టుకొని, యందొక బాకును దాచియుంచి దానిపై తమలపాకులు కప్పివైచి యుంచెను. రాయలను సమీపించినతోడనే " జగత్ప్రభూ! ఏలినవారు విందారగించుటకై సర్వము సన్నద్ధము చేయబడినది. ఇక తమ రాక మా కనుగ్రహింప వేడెదను." అనిపల్కెను. అదృష్టవంతులును, కారణ జన్ములు నగు మహారాజులకు రాబోవు విపత్తులు సూచితములగుచుండునని పెద్దలవలన విందుము. అందుచేతనే కాబోలు రాయ లదృష్టవశమున తన కష్టస్థితగా నున్న దిగియు తమ్ముని యాహ్వాన మంగీకరింపజాలకునికి మన్నింపకలయుననియు వేడుకొని విందునకు బోయియుండలేదు.

రాయ లిట్లు తన మా యోపాయమును భగ్నపఱచుట గ్రహించి, యాగ్రహము పట్టజాలక, నాదురాత్ముడు పళ్లెరమునుండి బాకును దీసి రాయల దేహమంతయు తూట్లుపడునట్లుగ హఠాత్తుగ మీదపడి గాయములు గలుగజేసెను. ఈ దారుణ కృత్యమును లేశమయినను అనుమానింపకయున్న వాడుగావున రాయ లసహాయుడై, గాయపడి, సింహాసనముమీదనుండి వెనుకకు పడిపోయెను. ఇద్దురాత్ము డంతట రాయలు మరణించెనని భావించి, తన చెంతనున్న సేవకున కాతని శిరము ఖండించవలసినదని యాజ్ఞాపించెను. తానును తమకము నాపుకొనజాలక, రాజద్వారము కడకు బోయి, యచ్చట నున్న పరివారముతో " నేను రాయలను, మంత్రిని, ధన్నాయకులను, దండలేశ్వరులను ఎల్లరును జంపితిని. ఇప్రుడు సింహాసన మధిష్ఠింపబోవుచున్నాను" అని బిగ్గరగ నఱచెను. ఇంతలో రాయల తలను గొట్టుట కాజ్ఞాపింపబడిన ద్రోహి మెల్లగా రాయలచెంతకు జేరి కత్తి యెత్తునప్పటికి, రాయలు సింహాసనపు కాలు నూతగొని లేచి ఖడ్గమును దీసికొని యాహంతకుని హృదయము పై నొక్క వ్రేటువేసి క్రిందకు బడద్రోసెను. ఆ సమయమున రాజభక్తి, విశ్వాసములుగల యొకభటుడు అంతవఱకు భీతచిత్తుడై మూలను దాగియుండి రాయలు లేచుటయు, జీవించియుండుటయు గాంచి ధైర్యము దెచ్చుకొని, రాయలకు సాయముబోయి, హంతకుని యమపురి కంపియుండెను. రాయలును, జరిగిన బీభత్సమునకు వెఱగంది యాభటుని సాహాయ్యమున, అంతఃపురము

లోనికి జారిపోయెను. ఇంతలో నారాయలసోదరుడుసింహాసన మెక్కి యచ్చటనున్న వారి నందరిని తన్ను రాయలుగా బరిగణింపవలసినదని యాజ్ఞాపించుచుండెను. ఆ సమయమున రాయలే మరియొక ద్వారమునుండి ప్రవేశించి "ఓరోరి రాజద్రోహులారా! నే నింకను జీవించియుండగనే మరియొక దురాత్ము డెట్లు సింహాసన మధిష్ఠింపగలడు! నా కండ్లయెదుట ద్రోహియై నాసింహాసనము నధివసించియున్న యాతని పట్టుకొనుడు" అని బిగ్గరగ నఱచెను. ఈ సంవడినంతయు నిశ్చేష్టులయి యవలోకించుచున్న జనసమూహము ఆదుర్జాతిమానవుని పైబడి కత్తులతో కండకండలుగ జీల్చివైచి చంపివేసిరి. రాయ లంతట కొలువుదీరి, తన యితర సోదరులను, సామంతులను, పళెగాయి, ధన్నాయకులను రాజబంధువులను రావింప నాజ్ఞాపించెను. ప్రధాని* తప్ప నందరును మృతులయిన వృత్తాంతమును దెలిసికొని రాయలు విషణ్ణుడయ్యెను. ధన్నాయకుడనబరగు ప్రధానమంత్రి, ఈ దారుణ విప్లవమునకు కొంతకాలము క్రిందటనే సింహళద్వీపమువీదకు దండయాత్ర వెడలియుండెను. లేకున్న అతడును చచ్చియేయుండును. రాయలును, నిజరాజధానియం దట్టిఘోరకృత్యము జరుగుటకై చాలకడవు చింతించి ధన్నాయకుని (మంత్రి) వెంటనే బయలుదేరి త్వరితముగ రావలసినదని సింహళమునకు చారులను పంపెను. ఈ కుట్రయందు దేమాత్రమయిన జోక్యముగలవారి నందఱిని బ్రతికియుండగనే కాల్చించియో, ఒడలు చీల్పించియో, మరియొక విధముగనో చంపించి శిక్షించెను. వారికుటుంబముల నన్నింటిని నాశముచేసి వారి సొత్తు స్వాధీనము చేసికొనెను. మొదట విందునకును గృహప్రవేశసందర్భమునకును ఆహ్వానము గొనివచ్చినవాడుకూడ మిగిలిన రాజద్రోహులవలెనే శిక్షింపబడెను. ధన్నాయకుడు రాజధానికి తిరిగివచ్చినపుడీవృత్తాంతమంతయు విని యాశ్చర్యమగ్నమానసుడయ్యెను. రాయలు సముఖమున ధన్నాయకుని కటాక్షవీక్షణములతో దయ చూచినపుడు, అతడు సాష్టాంగముగ నమస్కరించి "యేలినవారి మహోపద్రవమును సుఖముగ దాటచేసిన యీశ్వరునకు నాకృతజ్ఞతావందనము లర్పించుచున్నాను" అని పల్కెను. ఆ సంవత్సరము రాయలకు గొప్పగండము తప్పుటచే, పునర్జీవియయ్యె గావున ధన్నాయకుడు మహర్నవమి మహోత్సవములు ద్విగుణీకృతవైభవములో జరుపవలసినదని యాజ్ఞాపించి సన్నాహము చేయించెను.

మహార్నవమి† మహోత్సవములు

ఈదేశీయులు భాగ్య, వైభవ, బల సంపన్నులు. అందువలన, తమవిభవమును, ఐశ్వర్యమును, గౌరవమును సగర్వముగ ప్రకటింపవలయునను కౌతుకము గలవారు. ఈ మహార్నవమి పండుగ నీరాయలు, ఆతని మండలేశ్వరులు మున్నగువారలు, తమతమ యైశ్వర్యవిభవముల ననుసరించి అతి వైభవముగ జరుపుదురు. ఆమహోత్సవములు కన్నులపండువుగ జూడవలసినదేకాని వర్ణింపనలవిగాదు. అయినను ఆమహార్నవమి వృత్తాంతమును వర్ణించి తీరముచూచెదను. ముందుగా సామ్రాజ్యములోని యన్ని ప్రాంతములనుండియు, మండలేశ్వరులను, మహామండలేశ్వరులను, దుర్గాధిపతులను, పళెగాయిలను, మహర్నవమి పండుగలకు రాజధానికి రావలసినదని యాజ్ఞాపించును. కొందరు మండలేశ్వరుల రాజ్యములు రాజధానికి మూడుమాసముల ప్రయాణ దూరమునందుగూడ నున్నవి. ఆవచ్చిన సామంత రాజులందఱును తమ పరివారములో వేయేసియేనుగులకు తక్కువగా కుండ నుండును. సుపానుచే నల్లకల్లోలమైన, యలలచే నొప్పారు మహాసముద్రపు కెరటములవలె నీమత్తగజములు తొండములు విసరుకొనుచు, ఊగుచు లేచుచు ఊపుకొనుచు నడచుచుండును. ఆమత్తేభముల ఘీంకారములు మేఘగర్జనములని భ్రమింపజేయుచుండును. తొండములకు ముఖమునకు తళతళ మెరయు యినుపకత్తులు, బాకులు, బల్లెములు, తాపించిన కవచములును సర్వాలంకారభూషణములతో,

* ప్రౌఢ యిమ్మడి దేవరాయల ప్రధాని యెవ్వడో యెప్పుటకు తెలియవచ్చుటలేదు. ప్రధానియే ధన్నాయకుడని, అబ్దుర్ రజాకు ముందొకచోట చెప్పియున్నాడు. మరియు నాతడు బ్రాహ్మణుడుట. రాజ్యమునకు గలసేన కితడే అధిపతి.

† అబ్దుర్ రజాక్ మహార్నవమిని మహానవమి యనిపిలిచినాడు.

వింతవింతరంగులతో, శృంగారింపబడిన హవుదాల నమర్చబడి, యామదొకరు లొండొంటి నొరసికొనుచు, తొండములు సాచుచు, మావటీండ్రను వెదకించుచు, చూపరులు విసరు ఫలముల నందుకొనుచు నడచుచుండును. ఈయేనుగులపైనొక్కొక్క ప్రభుదాయామండలేశ్వరుల పరివారమునకు జెందిన గారడివాండ్రు, దొమ్మరివాండ్రు, విప్రవినోదులు; మున్నగువారు ఆసీనులయి తమ నేర్పరితనమును, చూపు విద్యలను ప్రదర్శించుచుందురు. ఈయేనుగుల ముఖములపై, తొండములపై, వింతవింతరంగులతో చిత్రింపబడిన రూపములు చిత్రములు చిత్రింపబడి మనోహరముగ గట్టబడియుండును.

రజాబ్‌మాసమున పూర్ణిమనాడు (సెప్టెంబరు ౧౪౪౨ (క్రీ. శ.) విశాలమయిన యొక మైదానముమీద రాయలు డేరాలు వేయించి కొలువుండెను. ఆతడేర్పఱచిన మహార్నవమికి రాజ్యమునందలి మహాప్రధానులు, దళవాయిలు, దన్నాయకులు, మండలేశ్వరులు, బ్రాహ్మణులు, రాక్షసులనుబోలు ఏనుగులు రాయల సమక్షమున కొలువు బలిసియుండిరి. * ఆవిశాలమయిన మైదానము, నవ్వుగింజలు చల్లిన రాలని యా జనసమూహము, నడుమనడుమ మహోన్నతములయిన యేనుగులు వింతరంగులు కనులకు మిరుమిట్లు గొల్పు చిత్రములు, పతాకములు, హవుదాలు, అన్నియు నొక మహాసముద్రము వలపునకు దెప్పుచుండెను.

సుందరమయిన యాబయలునందు, రమణీయమైన మందిరములు, అయిదేసి అంతస్థులు ఎత్తుగలవి అనేకములు నిర్మింపబడి యున్నవి. ఆమందిరస్థలయందు అత్యద్భుతములయినవి యనేక విధములయినవి నానావిధ రూపములతో చిత్రములు, చిత్రపటములు వ్రేలాడగట్టబడియున్నవి. ఆచిత్తరువులలో పక్షులు, జంతువులు, మృగములు, మనుష్యులు, స్త్రీలు, మున్నగునవి యనేకములు చిత్రింపబడియున్నవి. ఇవియన్నియు నత్యాశ్చర్యకరమైన కళాచాతుర్యముతో చిత్రింపబడిన చిత్తరువులు కాని యొండుకావు. ఇట్టి మందిరములలో కొన్ని పాంచాలికాయంత్ర నిర్మితములయినవి గలవు. అవి యూరక యప్పుడప్పుడు ప్రదక్షిణము సేయుచుండును. అవి, యొక్కొక్క ప్రదక్షిణమునందు ఒక్కొక్కవింత రూపమును దాల్చుచుండును. మరియు ప్రతిక్షణమునందును ఆమందిరములు క్రొత్తక్రొత్త శృంగారములతో మనోహరముగ గన్పట్టుచుండును. ఒకమారు చూచి తనివినొందుటకు వీలులేనియుండెను, వింతలు, వర్ణింపనలవి గాని శృంగారములు, నాబయలునందెచ్చట చూచినను గానవచ్చుచుండెను.

ఆబయలున కెదురుగా సోపానమంటప మొకటి నిర్మింపబడెను. ఆసోపానమంటపము స్తంభములపై కట్టబడెను. ఆ సోపానమంటపమునకు తొమ్మిది విశాలమయిన అంతస్తులు గలవు. తొమ్మిదవదానిపై రాయలు సింహాసనస్థుడై కొలువుదీరియుండెను. నాకీసోపానమంటపముమీద నేడవయంతస్తుమీద, ఆసనమిప్పింపబడియెను. అచ్చట నాపరివారమును, ప్రాణమిత్రులును తప్ప నితరులెవ్వరికిని స్థల మిప్పింపబడలేదు. ఈసోపానమంటపమునకును మైదానములో నిర్మింపబడిన మందిరములకును నడుమగల విశాలమయిన బయలునందు వింతవింత విషయములు చూపరులకు గన్పట్టుచుండెను. అందు గాయకులు, వీరకథలు పాడువారును విశేషముగా నుండిరి. గాయకులలో చాలమంది జవ్వనులే గలరు. ఆవిలాసినుల తళుకు చెక్కులు చంద్రునిసోయగమును బోలియుండెను. యౌవనప్రాదుర్భావముతో వికసించు వారి నేత్రములు వసంతాగమనమున చివురించు తొలకరివలె మనోజ్ఞములయి యుండెను. సర్వాలంకారభూషితలయి, శృంగార కళికలయి, నృత్యముచేయుచున్న, యాబాలికల రూపము, సౌందర్యము, విలాసము, హొయలు, సింగారము, వేయేల వాలుచూపులు మావంటివారి హృదయములను, గులాబిపువ్వులను జూచినపుడువలె తహతహలాడించుచుండెను. ఈ సౌందర్యవతులు రాయల కెదురుగా నొక అందమైన తెరచాటున కూర్చుండిరి. ఇంతలో తటాలున నా తెర రెండువైపులనుండి లాగివేయబడెను. తెర దింపినంతలో నాబాలికలు నృత్యముచేయ నారంభించిరి. ఆహా ఏమి ఆనృత్యము! సర్వసంగపరిత్యాగులయిన మునులకు మతిచలింపజేసెడి వారి నృత్యములు, హస్తవిన్యాసములు, కడగంటిచూపులు, ఆహా మా

* అబ్దుర్‌రజాక్ మహర్నవమి యుత్సవమునాడు విజయనగరమున నుండిన ట్లాతని వ్రాతవలన దెలియుచున్నది.

యాత్మ లానృత్యదర్శనముచే సంతుష్టిచెంది పరవశము లయ్యెను. (పద్యములుగలవు వాటినిట వదలితిమి.)

బొమ్మలాటవాండ్రు, దొమ్మరి, గారడివాండ్రు

గారడివాం డ్రత్యద్భుతమయిన వింతలను జూపిరి. గజముపొడవును ఒక మూరెడువెడల్పును, మూడునాలుగు గజము లెత్తును గల దూలములను మూడింటిని కలిపి కట్టి యొకచో నుంచిరి. వానిలో మొదటి రెండు దూలములమీదను, అంతేయెత్తును లావును వెడల్పును గల మరి రెండుదూలముల నమర్చియుంచిరి. వీటిపైనొక చిన్నదూలము నుంచిరి. ఇయ్యది యంతయు మెట్లవలె నమర్పబడియుండెను. ఈవిద్యకే శిక్షణగావింపబడిన యేనుగ నొకదానిని దెచ్చిరి. అది మెల్లగా సోపానములుగా గట్టబడిన యాదూలములపై నెక్కెను. మొదటి సోపానముమీదనుండి, రెండవదాని మీదకు, అందుండి శేషమైన వెడల్పులేని మూడవ మెట్టుమీదకుకూడ నా ఏనుగు నేర్పరితనముతో నెక్కి నాలుగు పాదములను మోపెను. అంతట దానిపాదములు మోపినదూలము ప్రక్క దూలముల నన్నిటిని దీసివైచిరి. అచ్చట నిలువబడిన యాగజముక్రింద దొమ్మరివాండ్రు పాడు వింత పాటలకు తొండముతో తాళము వేయుచు, ఎత్తుచు, దించుచుండెను.

మరియొకచోట పదిగజము లెత్తుగల స్తంభము నొకదానిని నిలువబెట్టిరి. ఆ స్తంభముకొనయం దొక రంధ్రమును జేసి యందుండి మరియొక దూలమును దూర్చి త్రాసువలె నమర్చిరి. ఆవాసమున కొకవైపు ఏనుగు బరువుగలయంతటి పెద్దరాతిని వ్రేలాడగట్టిరి. రెండవ వైపున ఒకగజముపొడవును, చాలవిశాలమును గల యొకపలకను త్రాళ్లతో కట్టి వ్రేలాడతీసిరి. ఆపలకకొక బలమైన త్రాడును గట్టిరి. ఒక ఏనుగును దెచ్చి యాపలకమీద నెక్కించి, త్రాసునందువలె, యొకప్రక్క బండరాతిని, మరియొక ప్రక్క యేనుగును ఎక్కించి, త్రాడులాగుచు రాజు ముంగిట ఏతాముతోడు టఖినయించిరి. రాయి క్రిందకువచ్చి ఏనుగు, గాలిలో పైన నున్నప్పుడు నయితము తొండమును తనహాంగు పాటదారులపాటలకు లయచెడకుండ తాళము వేయునట్లు ఎత్తుచు దించుచు నుండెను.

పౌరాణికులు, కథకులు, పాటలవాండ్రు, సుద్దులవాండ్రు, గాయకులు, నటులు, గారడివాండ్రు, విప్రవినోదులు మున్నగువారలకెల్లను రాయలు, వారివారి విద్యాగౌరవమునుబట్టి, సువర్ణాభరణములను, నూతన వస్త్రముల నొసంగి సత్కరించెను. ఇట్లీ మహోత్సవము లెడతెఱపిలేక మూడహోరాత్రములు, అత్యంత వైభవముతో జరిగెను. అచ్చటి వింతలను, విశేషములను ఒక్కొక్కటిగా చెప్పినగాని తనివితీరదు. అటు చెప్పుటకు తగినంత సావకాశము గాని కాలముగాని లేదు. వాటి నన్నిటిని జూచియుండవలసినదే.

దేవరాయ మహారాయల సందర్శనభాగ్యము

పండుగ మూడవనాడు రాయలు సోపానమంటపము నుండి పయనమయి యింకొకచోటకు బోవును. ఆదినమున నన్ను అచ్చటిపరివారము రాయలసన్నిధికి దోడ్కొనిపోయిరి. కర్ణాటాంధ్రాధిపు డధిష్ఠించియున్న సింహాసనము మహోన్నతమయి యుండెను. అంతేయు స్వర్ణమయమును, రత్నఖచితము నయియుండెను. ఆసింహాసనమును చేసిన యగసాలి యొట్టిశిల్పియోకాని యందలి కళానైపుణ్యము వర్ణనాతీతమయియుండెను. ప్రపంచమందు ఏదేశమునందును ఏరాజున కిట్టిసింహాసన ముండుటనే నెఱుగను. ఇట్టి వనితవమునుగూడ ఎచ్చటను జూచియుండలేదు. సింహాసనము మీద మూడువరుసల ముత్తెపుసరు లంచులు కుట్టబడిన పసుపుపచ్చని చీనా పట్టుతో చేయబడిన తల్పముగలదు. ఆముత్యముల పొరుపు కాంతియు నద్భుతముగనుండెను. అట్టివానిని నేనెచ్చటను జూచియుండలేదు. ఆమహార్నవమి పండుగలలో రాయ లీసింహాసనముపై యాపట్టుమెత్తపై నాసీనులై యుండెను. మహార్నవమిపండుగ గడచిన మరునాడు రాయలవారు నన్ను నగరునకు రావలసినదని యాజ్ఞాపించిరి. అప్పుడు సాయంసమయము, నమాజు చేసికొనువేళ. నేను నగరు ప్రవేశించునప్పటికి అచ్చోట పదిచతురపు గజములమేర నొకకూటము సోపానమంటపమును బోలినది నిర్మింపబడి కానవచ్చెను. ఆమంటపమునకు పైకప్పు, గోడలును, కత్తివెనుకభాగమున్నంత దళసరి బంగారురేకుతో కప్పబడి యుండెను దు వేలయిన నవరత్నములు మనోహరముగ స్థాపితమయి యుండెను.

ఆమంటపములో పైనుండి మొదటి అంతస్తుమీద రాయల సింహాసనము అమర్పబడియుండెను. ఆసింహాసన మంతయు స్వర్ణనిర్మితమే! అది చాలయెత్తు గాకూడ నుండెను. రాయలందు రాజసమొప్ప నిండుగా కొలువు దీరియుండెను. నే నాప్రభుని సమీపించి బహూకరింపబడి యాసీనుడనయిన పిదప మృదుమధుర గంభీరభాషణముల, హొరేలికయగు కాఖాని సయద్ సుల్తానువారిని గూర్చియు నాతనిసామంతులను గూర్చియు ప్రసంగించెను. మాప్రభువున కెంతసైన్య మున్నదనియు అశ్వబల మెంతయుండునని యడిగెను. మా దేశపు నగరములందలి వింతవిశేషములను, అందు ముఖ్యముగ సమరఖండము, హీరాటు, షిరాజు, మొదలగు నగరములగూర్చి ప్రశ్నించెను. నేను మున్నెన్నడు నెఱుగని యపార కరుణావిశేషములతో నాదరించి మన్నించెను. పిమ్మట నన్నుగాంచి "మీరాజు, మాకు నీయట్టి రాయబారిని బంపి మైత్రి నెఱపుచున్నందులకు మే మెంతయుసంతసించినారము. ఇపుడు మేము కొన్ని యేనుగులను, ఇరువురు తుర్కీఖొజ్జాలను, అమూల్యములును అద్భుతములును నగు వింతవస్తువులను కానుకలుగానిచ్చి మీకాఖానిసయదు సుల్తానువారికి, యోగ్యుడును, నీతికళారహస్యజ్ఞుడు నగు నొకరాయబారి నిచ్చి, పంపుచున్నాము" అని నాకు సమ్మోదము కలుగబల్కెను.

ఆకొలువు కూటమునందు పరివేష్టితులయియున్న రాజకుమారులలో నొకడు నన్నుజూచి, ద్విభాషిద్వారా రాయలసింహాసనము మీదనున్న జరీపనిపీ, అంచులు లతలు, పుష్పములు అల్లి నవాల్లుమెఖములు పట్టు సోపాలు ఎటులున్నవని ప్రశ్నించెను. ఆతని యభిప్రాయము అట్టివి మాదేశములో చేయజాలరనుట నే నెఱింగి "అవి చాలబాగున్నవి. అట్టివి మాదేశములో తయారు చేయు అలవాటు లేదు. ఒకవేళ చేయదలచిన యింత అందముగను చేయగలరని నానమ్మిక" అని ప్రత్యుత్తర మిచ్చితిని. రాయలును నాప్రత్యుత్తరమునకు సంతసించి ఎప్పటియట్ల అనేకదీనారపణములతో నింపబడిన సంచులను తాంబూలమును,తనకై ప్రత్యేకముగా నుంచుకొనిన కొన్ని మధురరూపపు ఫలముల నిచ్చి యింటికి బంపివైచెను.

హొర్ముజు (హొరుమంజి) నగరవాసుల మాత్సర్యము

విజయ నగరమున కొంతకాలమునుండి నివసించుచుండిన హొర్ముజునగరవాస్తవ్యులు కొందఱు నాకు రాజు జూపిన గౌరవమును, ఆదరమును, ప్రేమను జూచి సహింపజాలక, మీదుమిక్కిలి, హొరేలికకు రాయబార మంపబూనుట విని యోర్చుకొనజాలక మాత్సర్యగ్రస్తులయి యెటులయిన మా స్నేహసౌధమును ధ్వంసముజేయ బ్రయత్నించిరి. ఈ అల్పజ్ఞుడు, నిజముగా ఖాకానిసయదు సుల్తానువారి నిజమైన రాయబారి కాడనియు, కపటవేషము బూని వచ్చినాడనియు నొక యపవాదమును వ్యాపింపజేసిరి. నా దురదృష్టవశమున నీవార్త క్రమక్రమముగా, ఆనోటనుండి యానోటబడి రాజోద్యోగులనుండి మంత్రి దళవాయులకు, తుదకు రాయలవారికి జేరెను. ఆపల జరిగిన వృత్తాంతమును పిమ్మట జెప్పెదను.

కల్బరిగపై దండయాత్ర

విజయ నగరమునందు వృత్తాంతము లిట్టులుండ నన్నింతవఱు కత్యంతాదరగౌరవములతో మన్నించుచుండిన ధన్నాయకుడు (మహాప్రధాని) కలబరిగె రాజ్యముపై దండెత్తి పోవుట సంభవించెను. కలబరిగె రాజ్యము నా కాలమున సుల్తాను అల్లా ఉద్దీన్ అహమదుషా పరిపాలించుచుండెను. సుల్తాను అహమ్మదుషా, విజయనగరమున దేవరాయలను, ఆతని సామంతులను వధించుటకు జరిగిన ప్రయత్నములకెల్ల విని సంతుష్టాంతరంగుడై, రాయలకు తన ధూర్తస్వభావము తేటబడ "ఏడు లక్షల వరహాల నిపుడు నాకు గప్పముగా జెల్లింపుము, లేనియెడల నీ రాజ్యమును భస్మీపటలము చేయజాలు సైన్యమును బంపి, నిన్నును నీమతస్థులను రూపుమాపెదను" అని వార్తనంపెను. విజయనగరాధీశుడగు దేవరాయ లామాట లాలకించి క్రోధావేశ పరవశుడై "ఔరా! ఏమి యీ కండకావరము, తురుష్కుల ముష్కరత! నే నింకను జీవించియుండగనే, ఎవరో, కొద్దిపాటి మంది, మావారు చనిపోయినంతమాత్రాన అహమ్మదుషా యిట్టి విపరీతపు తలంపుతో నన్ను జయింప దలచెనా! మంచిది, మీ సుల్తానుతో కయ్యము

సేయుటయే మాకుపన్నుతి. మిమ్ముకలను ఎదుర్కొనుటకు సమరము చేయుటకు నాకు దగిన బలమున్నది. ఒక్క రోజులో నొక లక్ష సైన్యమును గూర్చగలను. సూర్యుడు తేజోమూర్తి వెలుగువంతకాలము ప్రతియణువును కనబడును. నా శత్రువులు, నాకు మహోపద్రవము తటస్థించినదనిగాని, నా బంధు మిత్ర పరివారము నశించిరనిగాని నన్నుండలు ద్రోహులయి మీ కిరనిగాని యెంచినయెడల వారు మిక్కిలి పొరబడినవారగుదురు. నాకిది శుభ దినములు, నాకిది మంచిదశ, నాకేయాపదయు వాటిల్లదు. నా సైన్యము లెక్కడబోయిన జయభేరియే మ్రోగింపగలవు గాని పలాయనముకావు. అదృష్టదేవత నావైపున్నది. ఇప్పుడు మీ సుల్తాను నా దేశములోని ప్రజలను కొల్లగొట్టి ధనమును గొనిపోయి, సయ్యదులకు మౌల్వీలకు నొసంగును. నేను అతని దేశమును ధ్వంసముచేసి నా వేట కాంద్రకును, ద్విజోత్తములకు నొసంగుదును" అని గంభీర భాషణముల దిరస్కరించి పల్కి, రాయబారి నవమానించి పంపివైచెను. పిమ్మట ఉభయులును సమరసన్నాహము చేయించి రణరంగమున సైన్యముల నడిపిరి. ఒకరి దేశముల నొకరు కొంతకాలము కొల్లగొట్టి పాడు చేసిరి. *

ప్రధానమంత్రి హంబనుకీర్ †పారశీక దేశమునకు రాయల రాయబారము

కలబరిగె రాజ్యముపై దండెత్తి పోయిన, బ్రాహ్మణ దన్నాయకుని స్థానమున, దేవరాయలు కార్యనిర్వహణమునకై, "హంబనుకీర్" అనువానిని ప్రధానిగా నియమించెను. రాయల యభిప్రాయమున నీతడు ఆ బ్రాహ్మణ ప్రధానియంతటి ప్రజ్ఞావంతుడగుటచే, నాయుద్యోగ మొసగియుండెను. కాని యీతనియంత దురాగ్రహుడును, కుటిలుడును, క్రూరుడును, మరియొకడు లేడు. ఇతడు చూచుటకు పొట్టిగను, అసహ్యాకరముగ నుండును. వీడు మిక్కిలి హీనకులసంజాతుడు, అసూయాపరతంత్రుడు, ముక్కోపి, కుటిల ప్రవర్తనము గలవాడు, దురాగ్రహుడు, నీచుడు, గౌరవమెఱుగనివాడు, వేయేల! యీ యతనియందు దుర్గుణము లన్నియు మూర్తీభవించినట్లు దోచును. చెప్పుకొనుటకు మంచి విషయ మొకటియైన లేదు. రాజకార్య నిర్వహణపాలబడినతోడనే ధర్మాసనము గూడ మాలిన్యపూరితమయ్యెను. అతడధికారము పూనిన తరువాత మొదట గావించిన ఘనకార్యము నాకు ప్రతి దినమును బంపబడుచుండిన దినవెచ్చమును ఆపివేయుట. హూరమంజి నగరపువారికిప్పుడు నా మీద తమకుగల అసూయను దీర్చుకొనుట కవకాశము గలిగెను. ఎన్నెన్ని విధముల నామీద చాడీలు చెప్పి మనస్సు పాడు చేయగలరో అన్నియు చెప్పి నామీద ప్రధానికి మనువున్నదానికంటె నసహ్యము నెక్కువజేసిరి. హంబనుకీర్ యభిప్రాయము తెలిసినవారగుటచే, నాతని యిష్టానుసారముగ, నేను నిజముగా పారశీక చక్రవర్తిచే నంపబడిన రాయబారిని గాననియు, వర్తకము చేయ దలచివచ్చి, కపటరాయబారినై మెలగుచున్నాననియు ఎన్నియో మంతనములను జేర్చుచుండిరి. ఈ రాజకీయోద్యోగులు నమ్మునట్లనేక అనృతములను కల్పించి, మెల్ల మెల్లగా వాటిని రాయల చెవి సోకునట్లు గూడజేసిరి.

---

* ఫెరిష్టాకూడ నీ కాలమున (౧౪౪౩—౪ క్రీ. శ.) దేవరాయలకును, అహమ్మదుషాకును, యుద్ధము సంభవించె నని తెల్పుచు నందులకు వేరుకారణములను దెలిపియున్నాడు. మూడుమాసములకాలము యుద్ధము సాగెను. అందు మూడు ఘోరయుద్ధములు జరిగెను. మూడింటియందును కర్ణాటాంధ్ర సైన్యములే గెలుపొందుచువచ్చినవి. చూడుడు: Briggs Ferishta Volume II, P. P. 430-435.

† ఈ పదము నిపు డెవ్విధముగ పూర్వస్థితికి సమన్వయింపవలెనో తోచకున్నది. అబ్దుర్ రజాక్ యీ పేరును తప్పుగా నుచ్చరించి వ్రాసికొనినట్లు కన్పట్టుచున్నది. అబ్దుర్ రజాక్ గ్రంథముయొక్క మరియొక ప్రతియందు "నిమపజీర్" అని యున్నది. కాని పెక్కు ప్రతులందు హంబనుకీర్ అని యున్నందున నిదియే సరియైన పాఠమని యెంచ దగును. హంబనుకీర్ అను పేరు "హంపీస" అనుదాని సమీపమున నున్నది. లేక "హనుమంతిపిర" కావచ్చును. లూయిరైసు దొర దేవరాయని దన్నాయకులలో నాగన్నయను వాడొకడుండినట్లు మాత్రము దెలుపుచున్నాడు. ఇంక నీహంబనుకీర్ యెవరయియుండునో ?

ఇట్లు దినవెచ్చము లేక, శత్రువులయవమానమునకు గురియై, ధనము లేక గౌరవము చెడి నిరాశచెంది కొంత కాల మెట్లో యీపాపిష్ఠి రాజ్యమున, దురాత్ములయిన విగ్రహారాధకులగు ప్రజలమధ్య కాలము గడపితిని. నే నిట్లు ఇడుములబడుచుంటినను, అప్పుడప్పుడు పురవీథులందు రాయ లూరేగుచు నా కెదురయినపుడు మదపుటేనుఁగు నాపి, చిరునగవుతో, దయారసము లొలుక నాయోగక్షేమ మారయుచు నే యుండెను. నిజముగా మహారాజు చాల ఔదార్యముగలవాడు. సుగుణముల పుంజ మనదగిన మహానుభావుడు.

ఇంతలో బ్రాహ్మణ దణ్నాయకుడు కలబరిగ రాజ్యము పై దండయాత్రలు ముగించి, మరదృష్టవంతులగు కొందరిని బానిసలగను, ఖైదీలుగను బట్టుకొని, రాజధానికి విజయ లక్ష్మితో మరలివచ్చెను. ఆతడు రాజధానిని ప్రవేశించినదినముననే, నా దుస్థితిని గూర్చి విని, హాంబనురీర్ ను, చాల మందలించి, ఆ దినముననే నా ఖర్చులకై ఏడువేల పణముల నివ్వవలసినదని టంకసాలకు బరాతమిచ్చెను. విజయనగరవాస్తవ్యులయిన ఖ్వాజా మసూద్, ఖ్వాజామహమ్మదు (ఖురాసాను దేశీయుడు) అనువారలను, రాజపరమేశ్వరు డనదగిన రాయలు అనేకఅమూల్యాభరణములు, దుస్తులు, రత్నములు, కానుకలు, మొదలయినవి యొసంగి మాపారశీక చక్రవర్తి కడకు ప్రతిరాయబార మంపించెను. ఆ సమయముననే, ఢిల్లీ సుల్తానుగానుండిన ఫిరోజుషావంశీయుడగు ఫత్తేఖానుగూడ, ఖ్వాజా జమాలుద్దీను అనువానిని తన వకీలుగా, నేర్పఱచి, మా చక్రవర్తి కడకు అనేక కానుక లర్పించుచు నొక విన్నపమును బంపించియుండెను.

నేను విజయనగరమునుండి, రాయలయొద్ద సెలవు గైకొని ప్రయాణమగు రోజున, చక్రవర్తి నన్ను జూచి కృపాలువై "ఓయీ! నీవు నిజముగా, పారశీక సుల్తాను షారూఖ్ వారి భృత్యుడవు గావనియు, మమ్ము మోసము చేయ నేతెంచినవాడవనియు ననేకులు మాతో చెప్పియుండిరి. లేకుండిన ఇంతకంటె గొప్ప యాదరణకును, గౌరవమునకును మావలన, నీవు పాత్రుడవై యుండుదువు. గడచినదానికై వగవవలదు. ఎన్నటికైన నీవు తిరిగి మాకు విశ్వాసము గలిగినపిమ్మట, మా రాజ్యమునకు మీ సుల్తానువారిచే బంపబడుదువేని మా సామ్రాజ్యగౌరవప్రతిష్ఠలకు దగినరీతిని నిన్ను గౌరవించి బహూకరించెదము" అని పల్కెను.

... ...

మా సుల్తానువారికి వ్రాసిన సుహృల్లేఖలో దేవరాయ మహారాయలు నా విషయమును, తన దేశములో బుట్టినయపప్రథల నన్నింటిని మఱియు హోర్ముజు నగర వాస్తవ్యులు జూపిన యవమానమును వర్ణించి, మరియు నీ విధముగా వ్రాయించెను. "మీతోడ మాకు నెయ్యమును, స్నేహమును ఎంతయు శిరోధార్యములును, వాంఛనీయములును, గాని, కొందఱు మాకు అబ్దుర్ రజాకు మీ భృత్యుడు గాడని చెప్పుచు వచ్చిరి; లేకుండిన యింతకంటె నెక్కువగా, మా గౌరవము జూపుదుము, మాస్థితికి దగినట్లుగా కానుకల నంపియుందుము. మీ రాయబారిని గౌరవించియుందుము."

పిమ్మట నా ప్రయాణ సన్నాహము బూర్తి చేసికొని శుభదినమున స్వదేశమునకై బయనమైతిని.

స్వదేశాభిగమనము నడుమ తుపాను

అస్పష్టమగుఆకాశమున దైవకృప అనుభానుడుదయమయ్యెను. ఆశాభువనగోళమున, భాగ్యతార ప్రకాశింపజొచ్చెను (?) కటికిచీకటి రాత్రియందు, సంతోష కాంతులు వెలుగసాగెను. అంతట నాకు దైవమును నమ్మినవారికి బాధయు నెప్పుడును గల్గదని తోచెను.

... ...

హిందూస్థానమునం దొకచోట మారుమూల నున్నది విజయనగరము. దేశమంతయు, విగ్రహారాధన పరులు. నేను సంపాదించుకొనినదంతయు, నా కష్టకాలము! వ్యయమయిపోవుటచేత, ప్రయాణమునకు గావలసినంత ధనము నాయొద్ద లేకుండెను. ఇక, నా దురదృష్టపు సంగతులను చెప్పను. ఎట్లో అల్లా నాయందు కరుణాళువై యుండినందున ప్రయాణము సాగించితిని. షాబాను మాసమున * పండ్రెండవ దినమున నేను విజయ

* షాబానుమాసము మనకు పుష్యమాసమగును.

నగరమునుండి యితర రాయబారులతోపాటు బయలు దేరితిని. పదునెనిమిదిదినము లహోరాత్రములు పయ నము గావించి 'రమజాను'* మొదటిరోజున మంగళూరు నగరమును జేరితిని. మంగళూరులో రమజాను ఉప వాస దినములను జరిపి, పిమ్మట హొనూరురేవునకు బయలు దేరితిమి. మంగళూరులో సయ్యదు అల్లాఉద్దీన్ మహాడీ అను మహమ్మదీయఫకీరు గలడు. అతనికి నూట యిరువది సంవత్సరములు వయస్సుండునని చెప్పుదురు హిందువులును, మసల్మానులునుగూడ వాతని మహ నీయునిగా భావించి పూజింతురు. అట్టి మహనీయుని సందర్శించి, యాశీర్వాదము బడయుభాగ్యము నాకు లభించినందుల కెంతయు నదృష్టవంతుడనని యెంచెదను. ఇచ్చట నుండగనే విజయనగరరాయబారులలో ప్రధా నుడగు ఖ్వాజామసూద్ అకస్మాత్తుగ మరణించెను.

హనూరు రేవునందు పారశీక దేశమునకు బోవు టకై యోడ నొకదానిని గుదుర్చుకొని నలుబదిదినముల ప్రయాణమునకు వలసిన సామగ్రి నంతయు సమకూర్చి తిని. ఇచ్చట శుభశకునమును పరీక్షించి, జిరాకదా మాసమున ౨౫ వ తేదీన ఓడలంగరు నెత్తించితిని. ఓడప్రయాణము మాకు చాల యుపద్రవకరమయ్యెను. వరుసగా రెండు మాసము లించుమించుగా తుఫాను లేచుచుండుటవలన మేము చాల యిబ్బందుల పాలబడి తిమి. ఎట్టకేలకు హిజరాశకము ౮౪౫ సంవత్సరమున

మొహరము పండుగ సమీపించునప్పటికి (ఏప్రిల్ = చైత్ర ము: క్రీ. శ. ౧౪౪౪) సముద్రపుగండములను గడచి మా దేశములోని కలహోట్ † శిఖరమును సందర్శింప గల్గితిమి.

సముద్రయాన సమాప్తి హొర్ముజునగర ప్రవేశము

నా ప్రయాణ చారిత్రముగూడ ముగియుచున్నది. మొహరముపండుగ గడచునకు మేము మస్కాటు రేవునుగూర్చి సుఖముగా పయనము సేయుచునే యుంటిమి. మస్కాటు రేవునుజేరి కొంతకాల మచ్చట లంగరు దింపి, సముద్రముమీద తుపానుకలవ గల్గిన నష్ట మును కూడి తేర్చుకొని హొర్ముజునగరమునకై ఓడ లంగ రెత్తించి పయనము సాగించితిమి. మస్కాటురేవు దాటిన పిదప "ఖూర్ ఫకాన్" రేవున రెండుదినము లాగి, మరల బయలుదేరితిమి. అప్పటికి వేసవికాలపు వేడి దుర్భరముగుటచేత నారేవున రెండుదినముల విశ్ర మించవలసి వచ్చెను. ఖూర్ ఫకాన్ రేవునుండి బయలు దేరి సురక్షితముగా హొర్ముజురేవున సఫర్ నెల ౧౨ వ తేదిని మధ్యాహ్నమగునప్పటికి లంగరు దింపితిమి. ఆనాడు శుక్రవారము.

హొనూరు రేవునుండి హూరుమంజి (హొర్ముజు) రేవు నకు మాకు పయనము సేయుటకు డెబ్బదిరెండు దినములు పట్టెను

* రమజాను మొదటిరోజు మార్గశిర శు ౨, యో ప్రథమతిథియో యగును.

† కలహోట్ శిఖరము మస్కాట్ రేవునకు నలుబది మైళ్లదూరమున నున్నది. దానియెత్తు ౬,౦౦౦ అడుగులుండును.

నవనాగరికత - విద్వన్నిరాదరణము

వైద్యరాజ దంటు సుబ్బావధాని గారు

శా. ఉన్నారిప్పటికైన నేగుడిసెనో యున్నార లేమూలనో
యున్నావా యనువారి గాన కకటా! యొక్కొక్క ప్రాణంబుతో
నన్నంబే కరవై మహామహులు విద్యాపారగుల్ జ్ఞానులున్
అన్నా! వేంకటశైలభర్త! యభయం బవ్వారి కీవే సుమా!

ప్రాచీనాంధ్రు లెవ్వరు? ఆర్యులుకారా?

- చిలుకూరి వీరభద్రరావుగారు

(రెండవసంపుటము - మొదటిసంచిక తరువాయి)

దక్షిణహిందూస్థానము నలంకరించియుండిన నేఁటిపరిశోధకులలో నగ్రపీఠము నధిష్ఠించియున్న శ్రీమాన్ డాక్టరు యస్. కృష్ణస్వామి అయ్యంగారు మున్నొకప్పుడు హిందూదేశమున సార్వభౌమపదవి నలంకరించిన యాంధ్రులు కొందఱు తా మార్యులమని చెప్పుకొనుటచేతను, ఆర్యులకన్నను విశేషనాగరికతాసంపన్నులమని ద్రావిడులు చెప్పుకొనుటచేతను, ఆంధ్రుల తోడను ద్రావిడులతోడను చేర్చుట కిష్టపడక తెలుఁగులను బడుగులని వక్కాణించిరి. దీనికిఁ గారణము నూహించి వారిట్లు చెప్పిరి.

"Generally speaking, however, the Andhra power came into touch with the Tamil on the northern frontier marked by Tirupati and Pulikat. The wild people called Vadukar by the Tamils must have interposed between the Tamils and the Andhras * * * * This position is still more difficult by the reference to the Vadukar, which term occurs very often in the literature of this period. Vadukar is the present day vernacular name for the Telugu speaking people in the Tamil country; but they are described still as in the same savage stage of frontier tribes being as marauders. They are located in the region immediately to the north of the Tamil frontier of Pulikat and Tirupati. This would seem to preclude the equation that the Tamils regarded the Vadukar and the Andhras as one"

"అయినను సర్వసామాన్యదృష్టితోఁ జూచినపుడు తమిళులరాజ్యమయిన తమిళకమున కుత్తరపుసరిహద్దులుగ నున్న పులికాట్ (పులికాడు) తిరుపతులకడను ఆంధ్రరాజ్యమునకు తమిళులకు సంబంధము కలుగుచున్నది. తమిళులచే 'వడుగర్' అని పిలువఁబడు నాటవికజనులు తమిళులకును, ఆంధ్రులకును నడుమ నడ్డపడియుండవలయును...... ఈస్థితి యీ యుగమునాఁటి వాఙ్మయమునఁ దఱచుగా 'వడుగర్' శబ్ద ముదహరింపఁబడియుండుటచేత నింకను మఱింత కఠినమగుచున్నది. 'వడుగర్' అనుపదము తమిళదేశమున నివసించుచు తెలుఁగుమాట్లాడుచున్న తెగలవారిపట్ల తమిళులచే వ్యవహరింపఁబడు నిప్పటి దేశభాషానామమై యున్నది. కాని వా రిప్పటికిని సరిహద్దులలోని బందిపోటు దొంగలవలెనె యింకను కిరాతకస్థితియందే యున్నటుల వర్ణింపఁబడియున్నారు. తమిళకమున కుత్తరపుసరిహద్దులగు పులికాడు, తిరుపతులకు నుత్తరము నత్యంత సమీపము ననే వారికి నివాస మేర్పఱుపఁబడి యున్నది. ఇదియు 'వడుగర్' అనువారిని ఆంధ్రులను వారిని నొక్కటేయని తమిళులు భావించుటకు ప్రతిబంధక మగుచున్నది."

అయ్యంగారికి తెలుఁగువారినిగూర్చి యెట్టి యభిప్రాయముగలదో పైవాక్యముల వలన స్పష్టపడఁగలదు. ఇంక నాంధ్రులను గూర్చి వీరు వ్రాసినదానిని జిత్తగింపుఁడు.

The Andhras are described as Aryan people who had given up the Aryan customs and practice in religion, in other words mlecchas or even Vratyas

ఆంధ్రు లార్యాచారములను మతాచరణములను విడిచిపెట్టినవారు. అనఁగా మాఱుమాటలలో మ్లేచ్ఛులుగను, వ్రాత్యులుగను గూడ నభివర్ణింపఁబడియున్నారు. * తమకును తమిళులకును నడుమనున్న బడుగు లను కిరాతులనుండి (తెలుఁగువారు) యేయుపాయమును గలుగకుండఁ దమ్మును దమరాజ్యమును సంరక్షించుకొనుటకై యాంధ్రు లిప్పటిగుంటూరు మండలములోని యమరావతికడ ధాన్యకటక మనుపేర నొకరాజధాని నేర్పఱచుకొనిరఁట. ఆంధ్రులకు తమిళులకు నడుమ బందిపోటు దొంగలయిన బడుగు లుండుటచేత క్రీస్తుశకమునకుఁ బూర్వమున రెండువందలసంవత్సరములును, బరమున రెండువందలసంవత్సరములును బరిపాలనము చేసి చక్రవర్తులైన యాంధ్రులకోడ నిప్పుడు తెలుఁగుమాట్లాడువారేవిధమైన సంబంధమును గల్పించుకొనుటకు హక్కుగలిగియున్నారా యను ప్రశ్నము పుట్టుచున్నదట! ఇంతవఱకు దొరకినసాధనములనుబట్టి యిదమిత్థమని నిర్ణయించుటకు సాధ్యపడదఁట!

ఈ పైవాక్యములనుబట్టియు, వీరివ్యాసములో వెలువఱిచిన తక్కినవిషయములను బట్టియుఁ, దేలిన సిద్ధాంత మెట్టిదనిన:—
"వడుగర్" అనుతెగవారు బందిపోటుదొంగలనియు, తమిళదేశములో నిపుడు తెలుగు భాషమాట్లాడుచున్నవారిని 'వడుగర్' అను నీతమిళ భాషానామముతోనే వ్యవహరించుచున్నందున 'వడుగర్' అనువారు తెలుఁగువారేయనియు, ఈ శబ్దము ఆంధ్రశబ్దమునకుఁ బర్యాయపదముకాదు గనుక యాంధ్రులు తెలుఁగువారుకారనియు సిద్ధాంతమగుచున్నది."

అయ్యంగారి కిట్టిభావములు 1922-వ సంవత్సరములో జనించినవి. కాని 1909 దవ సంవత్సరమునాఁటి కిట్టిభావములున్నట్టు వీరి వ్రాఁతలనుబట్టి కన్పట్టదు; కాని 1909-దవ సంవత్సరము. 'ఇండియన్ ఆంటిక్వేరీ' అను పత్రికయొక్క 'మే' నెల సంచికయందు 'ఆంధ్రపూర్ణ' విరచితమైన 'యతిరాజవైభవ' మనుపేరుగల శ్రీరామానుజచరిత్రమును వీరు భాషాంతరీకరించి దానిని బ్రకటించియున్నారు. అందలిపీఠికలో, నాకవినిగూర్చి యిట్లు వ్రాసియున్నారు.

"Nothing is really known about Andhrapurna, the author of this work. Except what he chooses to tell us himself, Viz, that as he was engaged in the milkservice of Ramanuja." Even tradition has few things to tell about him We find his name however among those of the 74 successors of "Ramanuja" in the propagation of Vishnava Gospel, and the author of Prapannamritam, who lived a Contemporary of Venkatapatiraya (died 1614 A. D.) claims to be a descendant of Andhrapurna (Vaduganambi as he called in Tamil.)

రామానుజునకు క్షీరము సమకూర్చునుద్యోగములో నుంటినని తనంతట తాను

* See the Quarterly Journal of the Mythic Society. Vol. XII, 1921-1922—p. 25.

మనకు వెల్లడించినది తక్క యీశ్ళతికర్త యైన యీయాంధ్రపూర్ణునిగుఱించి నిజముగాఁ దెలియఁబడిన దేమియును లేదు. అతనిగుఱించి తాలిపెడుగాథలోఁగూడ వానిఁగూర్చి యేమియుఁ గానఁబడదు. అయినను అతని నామము రామానుజుని తరువాత వైష్ణవమత ధర్మమును బోధించిన డెబ్బది నలుగురు మతప్రవర్తకులలోఁ గన్పట్టుచున్నది. 1614-వ సంవత్సరములో మృతినొందిన వేంకటపతిరాయలతో సమకాలికుఁడై ప్రపన్నామృతమను గ్రంథమును విరచించినకవి తాను ఆంధ్రపూర్ణుని (తమిళభాషలో వడుగ నంబియని చెప్పఁబడినవాఁడు) సంతతివాఁడనని చెప్పుకొనియున్నాఁడు. ఈ వడుగనంబి యనునాంధ్రపూర్ణుఁడు పదునొకండవ శతాబ్దిలో నున్నవాఁడు. ఆంధ్రశబ్దమునకు, బర్యాయపదముగా వడుగశబ్దము వ్యవహరింపఁబడుచున్నం దుకు నింతకంటె దృష్టాంతము మఱే యేమికావలయును? అయ్యంగారు ఆంధ్రులు తిరుపతి, పులికాడులు దాటి తమిళదేశములో నెన్నఁడు ప్రవేశింపలేదని మిక్కిలి ధీరత్వముతో వ్రాసిరి కాని తమయభిప్రాయమునకు విరుద్ధముగా తమిళవాఙ్మయమునందు నొక యాంధ్రప్రభువు మిక్కిలి యతిశయోక్తులతో వర్ణింపఁబడియుండుట దలపోసి కాదని నిరూపించుటకై వెజ్జిమొజ్జి ప్రత్యుత్తరములు చెప్పఁ జొడంగినారు. వారివ్యాసములో నిట్లు వ్రాసిరి.

" There is a chieftain known by the name of Aay Andiran. The second word of this name is rendered Andhra by some. It is just possible that it is the Tamilised form of the word Andhra."

"ఆయ్ అందిరన్" అనుసామంత ప్రభువు (మాండలికుఁడు) గలఁడు. ఈ నామములోని రెండవశబ్దము కొందఱిచే ఆంధ్రశబ్దముగాఁ బరిగణింపఁ బడుచున్నది. అయ్యది ఆంధ్రశబ్దమునకు తమిళభాషా స్వరూపమని చెప్పుటకు సాధ్యపడును."

ఇట్లు పైరీతిని వ్రాసియుండియు నడుగు భాగమున (Foot-note)లో నిమ్నోక్తవాక్యమును వ్రాసి యున్నారు.

" If the term Andar used to designate shepherds comes from the Sanskrit Andhaka, a Tamil derivation seems impossible, there is justification for this interpretation. The term Andiran is used in this compound in contradistinction to the term Einan in Aay-Eyinan undoubtedly denoting the caste or tribe from which he came The two names would stand 'Aay' the she herd and 'Aay' the hunter."

గొల్లవాండ్రకు పేరుగా వాడఁబడిన (Andar), (అండార్) శబ్దము 'అంధక' అనుసంస్కృత శబ్దమునుండి పుట్టినపుడును, ఈశబ్దమునకు వ్యుత్పత్తి తమిళభాషలో సాధ్యము కాక యున్నపుడును, ఇట్టి వ్యాఖ్య చేయుట న్యాయమే. ఈమిశ్రనామములోని 'ఆందిరన్' అనుపదము 'ఆయ్- ఎయినన్' అను మిశ్రనామములోని 'ఎయినన్' శబ్దమునకు వ్యత్యాసముగా వాడఁబడియుండుటచేత నిస్సందేహముగా నతనికులమునుగాని వర్ణమును గాని తెలుపుచున్నది. 'ఆయ్' అనఁగా గొల్లవాఁడని, బోయవాఁడని (వేఁటకాఁడు) రెండు నామము లేర్పడుచున్నవి.

ఇంత వ్రాసియుఁ దుదకు వీరు తమయభిప్రాయము నీక్రిందిరీతి వెలువరించిరి.

"It would be unsafe, however, to assert that the Andhras, as such, came and settled in the South."

"అయినను, ఆంధ్రులు దక్షిణమునకు వచ్చి నివాసులయిరని వక్కాణించుట సురక్షితము కాదు." ఎందుకు సురక్షితము కాదో?

ఇమ్మహనీయులకడనే 'యూనివర్సిటీ రీసర్చిస్టూడెంటు' గా నుండి తరిబీతుగాంచి నేడు 'మద్రాసు ఆర్క్యాలాజికల్ సూపరింటెండెంటుగారి కార్యాలయమున 'అసిస్టాంటు ఎపిగ్రాఫిస్టుగానున్న శ్రీమాన్ ఏ. రంగస్వామిసరస్వతి. బి. ఏ. గారుకూడ 'The Origins of South Indian Dynasties' అను గ్రంథమును వ్రాసి యాగ్రంథములో నీపైవిషయమునుగూర్చి యొకింత వ్రాసియున్నారు. ఆగ్రంథమింకను ముద్రితము గాకయున్నను వారు నాకోరికను మన్నించి యందలివిషయములనుపయోగించుకొన ననుజ్ఞ దయచేసియున్నందున వారి కెంతయుఁ గృతజ్ఞుఁడను. 'ఆయ్ అందిరన్' అనువానిని గుఱించి వారు వ్రాసినదానిమాత్రమే నే నిచటఁ దెలుపుచున్నాను.

"దక్షిణహిందూస్థానమును బరిపాలించిన యనేకరాజవంశముల యుత్పత్తులను దెలుపు శక్తి ద్రవిడవాఙ్మయమునకుఁ గలదు. ఆంధ్రశబ్దముయొక్క వ్యుత్పత్తిని దెలుపు జాడ నేమైన నయ్యది తెలుపఁగలదా? ఆంధ్రశబ్దము తమిళభాషలోనికి మాఱినపుడు 'అందార్' 'అందిరన్' అనుపదములుగాఁ గన్పట్టగలదు. ప్రాచీన ద్రవిడవాఙ్మయమునం దీపదము లొకతెగవారికి నామములుగాఁ గన్పట్టుట చిత్రము. సంఘముకాలమునాఁటి గ్రంథములలో 'అందిరన్' అనునొకప్రభువు గన్పట్టుచున్నాఁడు. అతఁడు పరిపాలించిన దేశముతిన్నెవెల్లిమండలములోని 'పొదియిల్' కొండకు చుట్టునుండు దేశమయి యున్నది. అతనిరాజధాని 'ఆయక్కుడి' అనునది. అందమైన నీటిబుగ్గలుగల 'కవిరమ్' అను కొండలవరుసయొకటి యాతనిదేశ మలంకరించియుండెనని 'అగం' అను కావ్యమున వర్ణింపఁబడినది. అతనిదేశమున 'ఏనుగ'లు నధికసంఖ్యగాఁ బుట్టుచుండెననియు, వానిని బహుమానములుగా నొసంగుచుండురనియు 'నట్రినై' అను గ్రంథమున వర్ణింపఁబడి యుండెను. అతనికనేకులు భార్యలు గలరనియు, అతఁడు సురపొన్నపూలదండలను ధరించుటయం దెక్కువయభిలాష గలవాఁడనియు, అతఁడు కొంగులతోఁ బోరాడి పశ్చిమసముద్రతీరమునకుఁ దఱిమివేసెననియు, 'పురం' అనుకావ్యమునందు వర్ణింపఁబడియుండెను. మఱియు నాగ్రంథముననే యతని యాస్థానమండపముయొక్క సొగసు 'ఉఱైయూర్ ఏనిచ్చేరిముడమోసియర్' తుఱైయూర్ ఒడైకిల్లర్, కుద్దవాన్ కిరనార్' అనుకవులచేతను, 'అగ'మను కావ్యమున 'పరణ కొత్రనార్' 'పరనార్' అనుకవులచేతను, 'నట్రినై' అను గ్రంథమున 'కఱికన్ననార్' మొదలగు కవులచేతను విశేషముగా నభివర్ణింపఁబడియుండెను. వీరిలో 'మోసియర్' అను నాతఁడు ముఖ్యుఁడు. 'అదిగమాన్' అనువాని కవ

యిత్రియగు 'సుపైయర్'ను, 'వేల్ పటి'యను వానికి 'కపిలర్' కవియు నెట్లో - 'ఆయ్- అందిరన్' అనువానికి 'మోసియర్' అట్టి వాఁడని చెప్పఁదగును. మొదట నీతనిగాని యీతని దాతృత్వమునుగాని యెఱుంగక దేశదేశములు తిరిగితిరిగి తుద కీతని ప్రఖ్యాతిని విని యీతని యాశ్రయమును బొందెను. ఈ ప్రభువు నాటక ప్రదర్శనములను బ్రదర్శించుటయందు నభిరుచిగలవాఁడై యనేకములను బ్రదర్శింపఁ జేసె ననియును, ఇయ్యది తనగొప్పకొఱకును, స్తోత్రపాఠములను బడయుటకొఱకునుగాక తన ధర్మమని నమ్ముటచేతను తనపూర్వు లాచరించినవారగుటచేతనుఁ బ్రదర్శింపఁజేయుచు వచ్చెనని కవి వర్ణించియున్నవాఁడు. ఇతఁడు మృతినొందినపుడు వీనిభార్యలు పెక్కండ్రు సహగమనము గావించిరట. ఇతని మృతిని గుఱించి 'మోసియర్' 'కిరనార్' కవులిరువురు మిక్కిలి జాలిని పుట్టించెడు విధముగా వర్ణించిరి. వీరిలో 'ముడమోసియర్' అనుకవి వర్ణించినపద్యములలో నొకపద్యములోని సార మిట్లున్నది.

"భూలోకమునుండి "ఆయి- అందిరన్' ప్రభువు వచ్చుచున్నవాఁడని విష్ణులోకములో ఇంద్ర దేవాలయములో గానములును, పండుగలును మెండుగా జరుపఁబడుచుండెను.

ఇక్కడ నొకచిత్రభాగవతకథ వినిపింప వలసియున్నది. డాక్టరు కృష్ణస్వామి అయ్యంగారు ఆయ్‌శబ్దమునకు గొల్లవాఁడనియు, వేటకాఁడనియు నర్థమున్నట్లొప్పుకొనియున్నారు. శాతవాహనరాజు లాంధ్రరాజు లను విషయము పురాణప్రసిద్ధమనుట యంగీకరించియె యున్నారు. మున్నొకప్పుడుసాత లేక శాతవాహనుఁ డను నాతఁడు సార్వభౌముఁడై విఖ్యాతిఁ గాంచియుండెననుట జగద్విదితము. ఇతనింగూర్చినకథలు భరతఖండమునం దంతట చెప్పఁబడుచున్నవి. శాతవాహనుని దక్షిణ హిందూస్థానమునందంతట నొకదైవముగాఁ బూజించుచున్నారు. తమిళదేశమున 'అయ్యనార్' అను పేరుతోడను, కన్నడదేశమున "అయ్యప్ప" అను పేరుతోడను మనదేశమున 'పోతరాజు' అను పేరుతోడను పూజింపఁబడుచుండెడి దేవుఁడు శాతవాహనుఁడే. ప్రాచీన తమిళభాషా నిఘంటువులగు 'దివాకరమ్' 'పింగళనిఘంటువు' లలో శాతవాహనుఁడే 'అయ్యనార్' అని వక్కాణింపఁబడియుండెనని రంగస్వామిసరస్వతిగారు వక్కాణించియున్నారు. తమిళదేశమున 'అయ్యనార్' మిక్కిలి జనరంజకుఁడైన దేవుఁడుగ నున్నవాఁడు. ఇతనికి 'శాస్త' అను మఱియొకనామముగలదు. కాని శాస్త బుద్ధదేవుని నామములలో నొకటిగా నున్నదని అమరనిఘంటువులో నిట్లువక్కాణింపఁబడియున్నది.

> సర్వజ్ఞ స్సుగతో బుద్ధో ధర్మరాజ స్తథాగతః,
> సమంతభద్రో భగవాన్ మారజి ల్లోకజి జ్జినః.
> షడభిజ్ఞో దశబలో ద్వయవాదీ వినాయకః,
> మునీంద్రశ్శ్రీఘన శ్శాస్తా మునిః...

"దుష్టాన్ శాస్తి శిక్షతీతి శాస్తా" అనఁగా దుష్టులను శిక్షించువాఁడనియర్థము. మఱియు జనులు వీని నిట్లు ప్రస్తుతింతురు.

"భూతనాథ సదానంద సర్వభూతదయాపర;
రక్ష రక్ష మహాబాహో శాస్త్రే తుభ్యం నమోనమః"

కాని యీ 'శాస్త' నామముతోఁ బ్రవర్తింపఁ బడుచున్న 'అయ్యనార్' అను దేవుని (శాతవాహనుని) హరిహరపుత్రునిగాఁ బౌరాణికు లభివర్ణించియుండిరి. వీనింగుఱించి యీ క్రింది మంత్రములు గన్పట్టుచున్నవి.

"ఓంనమోభగవతే హరిహరపుత్రాయ పుత్రలాభాయ శత్రునాశాయ (గాలిదోష వినాశాయ) మదగజవాహనాయ మహాశాస్త్రాయ నమః"

"అస్యశ్రీ మహాశాస్త మంత్రస్య రుద్రఋషిః అనుష్టుప్ఛందః మహాశాస్తా దేవతా"

"మమ సర్వాభీష్టసిద్ధయే వినియోగః షడంగం హరిహరపుత్రాయ హృదయాయ నమః అర్థలాభాయ పుత్రలాభాయ శిరసే స్వాహా, శత్రునాశాయ శిఖాయైవషట్, సర్వస్త్రీమోహనాయ కవచాయ హుం, మదగజ తురంగావహనాయ నేత్రత్రయాయ వౌషట్, మహాశాస్త్రాయ హుంఫట్, స్వాహా అస్త్రాయఫట్"

"ఓం ఐం హ్రీం సౌం క్లీం శ్రీం హ్రీం హ్రీం క్లీం హరిహరపుత్రాయ అర్థలాభాయ పుత్ర లాభాయ శత్రునాశాయ సర్వస్త్రీ మోహనాయ మదగజ తురంగావహనాయ మహా శాస్త్రాయ నమః"

అయ్యనార్, మహారాష్ట్రదేశమున 'ఖాంఢోబా' అను పేరిటను కొడగుదేశమున 'బేట అప్పయ్య' లేక మలెదేవుఁ డను పేరిట నారాధింపఁబడుచున్నాఁడు. వీని యారాధనము శైవులలో భైరవారాధనముగను, వీరభద్రారాధనముగను, వైష్ణవులలో వేంకటేశ్వరారాధనముగను మార్పుగాంచినది. ఈహరిహర పుత్రునిగుఱించి పౌరాణికులైన శైవు లొక వింతగాథను బుట్టించిరి. ఒకప్పుడు భస్మాసురుఁ డనువాఁడు తపస్సుచే నీశ్వరుని మెప్పించి తాను చేతితో ముట్టిన నేవస్తువైనను భస్మమగునటుల వరమిమ్మని వేఁడెనట. ఆయన తన కావరమును బ్రసాదించిన వెనువెంటనే యావరముయొక్క యాథార్థ్యము నరయఁ గోరి వాఁడు తనకు వరమను గ్రహించిన యాశివుని నెత్తిపైనే తనచేయి నిడఁ బ్రయత్నించెను. అతఁడు సర్వజ్ఞుఁడయ్యును వానిభవిష్యద్వర్తనము దెలిసికొనఁజాలక యట్టివర మనుగ్రహించిన మహానుభావుఁడు ప్రాణభీతిచేఁ బఱువిడి యొకకొలనిలో నొకపుష్పములో దాగుకొని భయార్తుఁడై ప్రాణరక్షణార్థము విష్ణువునుగూర్చి ప్రార్థించె నట. విష్ణువు వాని యుత్తలపాటును దెలిసికొని మోహినివంటి స్త్రీ రూపధారియై వానిముంగట నిలువంబడి మరులు గొలిపెను. ఆమెనుగాంచి వాఁడు కన్నుచెదరినవాఁడై హృదయముచలింప మదోన్మత్తుఁడై వెంటఁబడ నామె తుద కొడంబడినట్లు నటించుచు, "శుచివైయుండుటకు ముందుగా నీవు కొలనిలో స్నానముచేసి కురులార్చుకొని తలకు చమురురాచికొని రమ్ము" అని పలికెను. కామపీడితుఁడుగావున వాఁ డామాటలను విశ్వసించి యట్లుగావింపఁ దనతలను తానే

ముట్టుకొన్న వాఁడయినందున వెంటనె భస్మ మయ్యెను. శివుఁ డాపదవసానమును దెలిసి కొని కొలనిలోనిపుష్పమునుండి బైటకువచ్చి విష్ణువు జరిగినవృత్తాంతము నివేదింప మరల నొకమాఱు 'మోహినివిగమ్మ'ని యడిగెనఁట. మరల నొకమాఱుమోహినీరూపమునుదాల్చి యెదుట నిలువంబడ మున్నొకమాఱు తన్ను మరులుగొలిపిన మన్మథునే రూపడంచినంతటి తపశ్శాలియగు భగవంతుడే కాలకర్మవశమున మోహమత్తుఁడై యామాయామోహిని వెంటఁబడి సఫలీకృతమనోరథుఁ డయ్యెను. అప్పుడాపురాణదంపతులకుఁ బుత్రోదయప్రాప్తి లభించెను. అతఁడే హరిహరపుత్త్రుఁడు. ఇందలి సత్యమును జదువరులు గ్రహింపవలయును. దక్షిణదేశమున ముఖ్యముగాఁ దమిళకమున 'అయ్యనార్' అనుశాతవాహనునిగుడి లేని గ్రామ మెచ్చటనోకాని కానరాదు. ఈగుళ్లు సామాన్యముగాఁ జిన్నవిగానుండి యేకాంత ప్రదేశమున నూరునకుఁ బడమరగా నొకచోట నున్నతములైనవృక్షచ్ఛాయలనడుమ నిర్మింపఁ బడియున్నవి. వీనిముందు మట్టిచేఁ జేయఁ బడిన గజతురగాదిజంతువులయొక్క విగ్రహములలోఁగొన్ని చిన్నవియుఁ బెద్దవియుఁ గూడ నుంచఁబడియుండును. అనేకులు ప్రజలు నిరంతరము మ్రొక్కుబడులు చెల్లింపుచుందురు. ఈగుళ్లద్వారముల నిరుపార్శ్వముల నిరువురు ద్వారపాలకులు భయంకరాకారములతో నొప్పుచుందురు. వీనితలలపైన కిరీటములును సింగపుకోరలతో నొప్పెడుమోములును, చేతులలోఁ బెద్దకత్తులును గలిగియున్నట్లుగా వీనిం జిత్రింపుదురు. గుడికి ముందటిభాగమున సప్త మాతృకల విగ్రహము లుండును. ఇవియును బూజింపఁ బడుచుండును. (త్రికరాశూరి, మాయాకరశూరి, రక్తచాముండా, వనచారిణీ (శాకేరి), భగవతీ, బాలశక్తి, భువనశక్తి, అనునవి సప్తమాతృకలు). గుడికి లోపలిభాగమున తలుపునకిరుప్రక్కలను రెండువినాయకవిగ్రహము లుండును. గర్భాలయమున పూర్ణా(పూరణై) పుష్కలా (పుట్కలై) అనునిరువురు భార్యలు చెరియొకప్రక్కనుండ 'అయ్యనార్'దేవుఁడు తనచుట్టును సప్తకన్య లొప్పుచుండ నడుమ నధిష్ఠించియుండును. ఉత్సవకాలమున నూరేగుటకై కొయ్యతోఁ జేయఁబడిన గజతురగాది వాహనములు ప్రక్కగృహములోనుండును. 'అయ్యనార్' విగ్రహము స్వారి వెడలు సందర్భములఁగాక తదితరకాలముల సామాన్యముగా నెఱుపువన్నెగల చర్మముతోఁ గూర్చుండియున్నటుల విగ్రహము చిత్రింపఁ బడియుండును. తలపై కిరీట ముండును. ఫాలతలమున మూఁడు విభూతిరేఖ లుండును. అనేకములయిన యలంకారములతో నలంకరింపఁబడియుండును. అహింసతోఁగూడిన బలులను బ్రాహ్మణులును, హింసతోఁగూడిన బలులను బ్రాహ్మణేతరులు నాదేవున కొసంగుచుందురు. కష్టకాలములందుఁ బ్రజలు మ్రొక్కుబడులు చెల్లించుచుందురు. పూర్వము మన దేశమున హరిహరారాధన ముండెనని సూచనలు గన్పట్టుచున్నవి. తిక్కనసోమయాజి మహాభారతమును నాచనసోముఁడు యుత్తర హరివంశపురాణమును హరిహరనాథునకే

యంకితము గావించిరి. హరిహరపుత్రుల మూలముననే హరిహరారాధనము నద్వైతము నెలసినవని తోఁచుచున్నవి. 'అయ్యనార్' దేవేరులలో పూర్ణాదేవి నల్లనికస్తూరి బొట్టు నలంకరించుకొనియుండఁ బుష్కలాదేవి తెల్లని మూఁడువిభూతిరేఖల (తిరుసీరు) నలంకరించుకొనియుండును. ఇతనికి పవిత్రకిరీటము గల యోధుఁడను నర్థముగల 'తిరుముడిసేవకర్' అనియు, మంచియోధుఁడను నర్థముగల 'నల్లసేవకర్' అనియు, గ్రామబాహ్యాంతరమున నివసించుదేవుఁడను నర్థముగల 'పురత్తవాన్' అనియు, అందమైన కడలివన్నెగల వాఁడనునర్థముగల 'పూన్ కడల్ వన్నాన్' అనియు, 'యోగి' అనియు, మచ్చలేనివాఁడనునర్థముగల 'బరుమాశత్తాన్' అనియు, భయంకరాయుధము గలవాఁడను నర్థముగల 'చండాయుధన్' అనియు, పూజ్యుఁడను నర్థముగల 'అరియాన్' అనియు, ధర్మరక్షకుఁడనునర్థముగల 'అరట్టైకాప్పోన్' అనియు, 'తెల్లయేనుఁగుకాఁపు' అనునర్థముగల 'వెళ్లైయానైయూర్తి' అనియు, యువకుఁడను నర్థముగల 'కుమారన్' అనియు, తండ్రియను నర్థముగల 'అయ్యన్' అనియు, హరిహరుని కుమారుఁడనునర్థముగల 'హరిహరపుత్తిరన్' అనియు మొదలుగాఁగల నామాంతరము లెన్నో గలవు.

తమిళదేశమునకును ఆంధ్ర చక్రవర్తియైన మొదటిశాతవాహనునకును నింతటి పురాణప్రసిద్ధిగల సంబంధము గన్పట్టుచుండి నపుడు సంబంధములేదని డాక్టరుకృష్ణస్వామి అయ్యంగారు చెప్పఁబూనుట వింతలలో వింత గదా.

అయ్యదేవర యాంధ్రుఁడైనపుడు మన అయ్యరులు మనఅయ్యంగారు లన్యులగుదురా? అయ్ శబ్దమునకు బహువచన ప్రత్యయమైన 'అర్' అనుదానిని చేర్చినపుడు అయర్ - అయ్యర్' అగుచున్నది. సెట్టియార్, మొదలియార్, అన్నట్లుబహువచనరూపములతోఁ బ్రశంసించుట తమిళుల సంప్రదాయమగుట 'అయ్యరు' లని వ్యవహారములోనికి వచ్చినది. 'గారు' అనుపదము తెలుఁగులో గౌరవసూచకమైనపదము. అయ్యన్ + గారు'= అయ్యంగారు' అని యేర్పడుచున్నది. తెలుఁగులో 'అయ్యగారు' అనుదానికి 'అయ్యంగారు' అనునది పూర్వరూపము. 'గారు' అనుదానిని తెలుఁగువారు మాత్రమే వాడుదురు. కన్నడులు 'గారు' అనుదానికి బదులుగా 'అవర్ గళు' అనివ్యవహరింతురు. కావున మన 'అయ్యంగార్లు' కూడ పూర్వము తెలుగు వారయి యుండి తెలుఁగు దేశమునుండి తమిళదేశమునకుఁ బోయినవారని చెప్పఁదగును. ఇయ్యది పెక్కుదృష్టాంతములను జూపి సమర్థింప నవకాశము గలదు.

'వడుగర్' అనుశబ్దము మొదట తెలుఁగువారికి వర్తింపఁబడియుండలేదని తెలిపెడువాక్యములు డాక్టరుకృష్ణస్వామి అయ్యంగారికి, బ్రత్యుత్తరముగా వారివలన తెరిబీరుగాంచిన వారి శిష్యవర్గములోనివారయిన శ్రీమాన్ రంగస్వామిసరస్వతిగారి "ద్రవిడవాఙ్మయము



యమ్. హెచ్.
స్టాక్‌ఫర్డు దొరగారి సతీమణి
చెన్నపురి గౌరవ న్యాయాధికారిణి



శ్రీయుత
పాండురంగరావుగారి సతీమణి
చెన్నపురి గౌరవ న్యాయాధికారిణి



న్యాయమూర్తి
శ్రీయుత సదాశివయ్యరుగారి సతీమణి
చెన్నపురి గౌరవ న్యాయాధికారిణి



శ్రీమతి కోకా కృష్ణవేణమ్మగారు
కాకినాడ పురపాలకసంఘ సభ్యురాలు
గోదావరిజిల్లా విద్యాసంఘోపాధ్యక్షురాలు



అఖిల భారత ప్రాచ్య విద్వత్పరిషత్తు
మూడవ సమావేశము
1924 వ సంవత్సరము డిసంబరు నెల 22 వ తేది చెన్నపురి



1924 వ సంవత్సర డిసంబరు నెలలో చెన్నపురియందు సమావేశమయిన మూడవ అఖిల భారత ప్రాచ్య విద్వత్పరిషత్తువారిచే సన్మానింపబడిన
పండిత బృందము

ఆంధ్రులు," అను శీర్షికగలిగి క్రిందటినెల భారతిపత్రికలోఁ బ్రకటింపఁబడినవారి వ్యాసమునుండి యెత్తిచూపినఁ జాలును'

"భాషల నెన్నుచో నీక్రిందియగ స్త్ర వ్యాకరణపఙ్క్తి ముఖ్యమైనది" "కొఙ్గజ్యాన్నడ క్యోల్లింతెలుఙ్గం" దీనినే యనుకరించి పదునేకొండవశతాబ్దిలో వెలువడిన 'సన్నూల్' అను వ్యాకరణమునకు వాఖ్యాన మొకదానియందు 'కన్నడమ్ వడుగు కలిఙ్గమ్ తైలుఙ్గమ్' అనియున్నది, 'వడుగ'అను పద మిప్పు డఱవములో తెనుఁగుభాషకును, దేశమునకును వ్యవహారమునకునుండినను మొట్ట మొదట నట్లుకాదనియు నాంధ్ర దేశమునకుఁ బశ్చిమమున నిప్పటి బళ్లారిజిల్లా ప్రాంతభూమికే పేరనియు, నాదేశపుప్రజలకే 'వడుగ' శబ్దముండెననియు, నిప్పటి కప్పటనే బడగనాటి వారనుజాతివా రున్నారనియు స్థలాంతరమున వ్రాయుచున్నాను. కాలాంతరమున నాపదము యొక్క యర్థము మారి యిప్పుడు తెనుఁగు, కన్నడము రెండుభాషలకు నర్థమగుచున్నది"

ఇప్పుడు డాక్టరు కృష్ణస్వామిఅయ్యంగారు దక్షిణహిందూదేశమునందలి ద్రావిడ పరిజ్ఞానమేది(Dravidian Culture in South India) కలదని లోకమునకుఁ బ్రదర్శింపుచున్నారో యాద్రావిడ పరిజ్ఞానమనునది యాంధ్రజ్ఞానముకంటె భిన్నమైనది కాదనియు, ఆంధ్రపరి... వన్నెపెట్టఁబడినది 'ఆంధ్రసంస్కృతి' ...మును దెలిసికొన్నవారికి స్పష్టము ...దు. ఇప్పుడు ... గాకపోయినను భవి... గాకమానదు.

మఱియు నింకొకవిషయము నిచట వివరింపవలసియున్నది.

పంజాబు ఆర్క్యాలాజికల్ డిపార్టుమెంటు నలంకరించి యుండిన బి. హెచ్. బేడెన్, పవెల్. ఎమ్. ఏ. సి. ఐ. ఇ. అను వారు (Mr. B.H. Baden Powell M. A., C.I, E.) హిందూదేశ గ్రామసంఘము(Indian Village Communities) లను గ్రంథములో ఆంధ్రులనుగూర్చి యిట్లు వ్రాసియున్నారు.

"It is possible that the known invasions about the time of Darius Hystaspes (6 th Century B. C.) brought new Turanian tribes to North India. A Turanian Royal family appears about that time to have succeeded to the Earlier Aryan Dynasty of the Magadha Kingdom (E. Bengal.) From them are derived the Andhra, who at one time dominated the upper part of the Peninsula, and also the Naga or snake, kings of Eastern Central India. These latter invasions were of clans probably identical in race with the earliest Dravidians of epic times."

"క్రీస్తునకుఁ బూర్వమున నాఱవశతాబ్దిలో డెరయస్ హిస్టాస్పెసు కాలమునఁ దెలిసికొనఁబడిన దండయాత్ర లుత్తరహిందూస్థానమునకు క్రొత్తతురానియాగుంపులు లేక తెగలు గొనిరాఁబడినవి. ఆకాలమునకుఁబూర్వమున మగధరాష్ట్రమును బరిపాలించుచుండిన యార్యవంశమువారిని దొలఁగించి యొక తురానియారాజవంశమువా రారాజ్యమును జేకొని పరిపాలించినట్లు కన్పట్టుచున్నది. ఒకప్పుడు హిందూద్వీపకల్పముయొక్క యుత్తరభాగమును, నాగరాజులచేఁ బరిపాలింపఁబడు మధ్యహిందూదేశముయొక్క పూర్వభాగమును ఆక్రమించి దొరలైయుండిన యాంధ్రులు

వారినుండి యుద్భవించిరి. ఈకడపటిదండయాత్రలలోఁ జాలుగొన్న తెగలవారలు పురాణేతిహాస యుగములనాఁటి ప్రాచీనద్రావిడుల తెగలతో సంబంధించిన తెగలవారయియుండ నచ్చును," 'ఆర్యులు, ద్రావిడులు' అనువారి జాతివిభేదమునుగూర్చి వీ రెట్టియభిప్రాయము గలిగియున్నను గౌతమబుద్ధునకుఁ గొంచెము పూర్వమున 'డెరయుసు' దండయాత్రలు నడచి యున్నవి గనుక నప్పటికి బహుకాలమునకు ముందే యాంధ్రులు భరతఖండములో దొరతనము నడుపుచున్నారనుట యీనానూతనపరిశోధనములకు బలమునొసంగుచున్నది. నేను వంగదేశీయులకును నాంధ్రులకును సంబంధముగలదని పౌరాణికవాఙ్మయమును బ్రమాణముగాఁ గొని తెలిపియుండఁగా నామిత్రులు కొందఱు పరిహాసింపుచున్నారు. వారికొఱకు నే నీక్రిందివిషయమును బ్రత్యుత్తరముగాఁ దెలుపుచున్నాను. ఇదివఱకు తమిళులు గంగానదీముఖద్వారమునందున్న తమలిట్టీసు(తామ్రలిప్తి) నగరమునుండి దక్షిణహిందూదేశమునకు వచ్చినవారివలనఁ దమకు తమిళులన్న నామము కలిగినట్లుగా వి. కనకసభాపిళ్లగారి గ్రంథమునుండి వారియభిప్రాయములను దెలిపెడి వాక్యముల నుదాహరించియున్నవాఁడను గదా. ఇప్పుడు కలకత్తా యూనివర్సిటీలో (Lecturer of Comparative Phylology and Indian vernaculars)గానుండిన విజయచంద్రమజుందారుగారు వ్రాసిన "Ancient Bengal" (పురాతనబంగాళము) అను గ్రంథములో వ్రాసినవారియభిప్రాయములనుగొన్నిటి నిచట నుదాహరించుచున్నాను.

తమిళభాషయు, తమిళదేశమును వీరి మనస్సు నెక్కునగా నాకర్షించియున్నకతమునఁ దమ వంగదేశమునకు తమిళదేశమునకు నడుమనున్న యాంధ్రులను తెలుఁగుభాషను మఱచిపోయి, యీ క్రింది విషయములను వ్రాసియున్నారు.

(1) తమ బెంగాళీభాషలోనున్న పదములు పెక్కులు తమిళభాషలోఁగూడ నున్నవఁట. అవియేవియన నీక్రిందిపదములనుదాహరించిరి.

(1) ఆకలి (2) కల్ (కల్లు = రాయి) (3) కాఇ (కాయ) (4) కడల (కడలి) (5) చక్కన (6) చిన్న (7) తల్లి (8) పాలు (9) పిల్ల (10) పిల్లి.

ఇవి తెలుఁగుపదములో, తమిళ్ పదములో, మేధావంతులైన చదువరులు నిర్ణయించుకొందురుగాక.

(2) బంగాళాదేశములోనుండు తెగలవారే తమిళదేశములోనుండు తెగలవారుగా నుండుట. ఆంధ్రులలోని తెగలు వీరితెగలకంటె భిన్నములయినవా? వీ రుభయులకు సరిపడిన 'Ethnology'(వేర్వేఱు తెగలవారలను గుఱించిన శాస్త్రము) ఆంధ్రులకు సరిపడదా?

చరిత్రనిర్దిష్టమైన మఱియొక గొప్పవిషయ మేమనఁగా బంగాళమునుండి పోయిన ప్రజల వలసవిధానము ద్రావిడవ
దుండుటయే. మిక్కిలిప్రాచీనములైన
పా గ్రంథములు సర్వారాధకులయి
బంగాళమును

యొక్క యితరభాగములనుండియు తమిళకములోఁ దమయాధిపత్యమును నెలకొల్పుటకు బోయియుండుట వక్కాణింపఁబడియెను.

ఈ తెగలలో ముఖ్యముగా 'మరన్', 'చేరన్', 'పాంగలతిరయార్' అనునవి యెక్కువగా మాకు ముచ్చట కలుగఁజేయుచున్నవి. 'చేర' తెగలవారు బంగాళముయొక్క వాయవ్యమూలనుండి తమిళ దేశమునకుఁబోయి చరిత్ర ప్రసిద్ధమైన చేరరాజ్యమును స్థాపించిరని చెప్పఁబడియెను. ఈ తెగవారు మగధరాజ్యముయొక్క తూర్పుభాగమున నుండిరని ప్రాచీన బ్రాహ్మణ వాఙ్మయము తెలుపుచున్నది. 'మరన్' అను తెగవారుఉత్తర హిందూస్థానమునందు 'చేర' తెగవారికి సమీపనివాసస్థులై యున్నారు. ప్రఖ్యాతులయిన పాండ్య రాజులు 'మరన్' తెగవారమని చెప్పుకొని యున్నారు. కాళికాదేవిని పూజించుమరవలు భయంకరులయిన రణశూరులని చెప్పఁబడి యున్నారు. ఇంకను పాంగలతిరయానులను వారు (తీరవంగులు) బంగాళమునుండి మద్రాసు తీరమునకుఁ బోవుటకుముందు 'ఆర్యసంస్కరణము'లను బంగాళాదేశములోఁ బొంది యుండిరనియెంతమాత్రము జంకులేక వక్కాణింపఁగలము. ద్రావిడకవు లీతెగలను గూర్చి వారి గ్రంథములలోఁ వ్రాసినగాథలు విశ్వసించుటకు వివరణాదులలో భేదము గన్పట్టినను ముఖ్యమైనకథ నంగీకరింపఁదగును. ఆగాథ ...ు గ్రంథస్థలములను జేసినకవులకు బంగాళమును గూర్చిగాని దాని సమీపప్రదేశముల గూర్చికాని సరియైన జ్ఞానము లేకపోవచ్చును. ఆదేశములోనాగులు స్థిరనివాసములు కుదుర్చుకొనుకాలమున మక్కలనువారు (Makkalar) మిక్కిలి పలుకుబడి గలవారుగ నున్నారు. 'మక్కల లేక మక్కడ' అను తమిళపదము రామాయణములోని మర్కటపదముగా సంస్కృతీకరించినది. వీరు మధ్యహిందూదేశములో నాగజాతులవారితో సంబంధములుగలుపుకొని దక్షిణహిందూదేశమున నున్నతస్థానముల నధిగమించిరి. బర్మాలో తెలుగువారు విశేషముగాఁ బలుకుఁబడిగలిగి యున్నకాలమున 'బోంబు' తెగలవారు అనాములో దొరతనముచేయునట్టి రాజవంశమును స్థాపించిరి. తిరయానులు బంగాళాసముద్రతీరమున గొప్ప నావికులుగా నుండుటచేత సముద్రము మీదుగా దక్షిణహిందూదేశమునకుఁ బోయిరని తెలిసికొనుచున్నాము.

ఈవిజయచంద్ర మజుందారుగారు పైని వక్కాణించిన 'చేర' అను తెగవారు 'అంధవన' తెగలవారనియు, పాంగలతిరయారులను సంస్కృతమున సాగరకులు లందురు. 'పాక్కడయర్' అను మారుపేరుగల వీరు అంధపవనయనఁబడు ఆంధ్రపల్లావు లనియును, 'మరన్' అంధవన తెగవారనియును వీరెల్ల రాంధ్రులేయని తెలిసికొనవలయును. మన పురాణేతిహాసములను, బౌద్ధవాఙ్మయమును జక్కఁగాఁ బరిశోధించినవారికిఁ జక్కగా బోధపడకమానదు. నేననేకవిధములయిన దృష్టాంతములతో నిప్పటి యాంధ్రులకన్న భిన్నులు కారని సహేతుకముగా రుజువు చేసెదను. ఇదియొకవ్యాసమ... గావునను ఈవ్యాసమే యిప్పటికే ... ందునఁ బ్రస్తుతము దీని ముగించుచు...

ఆహ్వానము

మక్కపాటి వేంకటరత్నకవి గారు

శ్రీ రాజకమలోల్లస,దారామాంతరసదావిహారిణి! కరుణా
పారీణశీలశాలిని! భారతి! భవదరుణచరణపాళిఁ గొలిచెదన్.

సీ. కెందామరలు బుట్టుబోఁదిన ట్లలరు నీ, మృదుపదంబులఁ దొట్రు వోదవ నేల?
వివిధోన్నతానర్ఘవిలసితాలంక్రియల్, తాలుమాత్రై చెన్ను దక్క నేల?
లోకసంజీవనోత్సేకభావకళల్, సిరిఁ బాసి కనువిందు సేయవేల?
సుమనోభిరామ మంజుల ఝుంఝుణధ్వనుల్, పదపదంబున వినంబడ వదేల?
గీ. తల్లి! తావకనిరుపమోదాత్తమూర్తి, చేవచెడి సొంపుదక్క కృశించె నేల?
మాడఁజూడంగ నిను మది గాఁడివారి, దండిచెడి గుండె నీ రగుచుండె నమ్మ!

సీ. ప్రభవించితివి జగద్వంద్యప్రభావమా, ప్రాచేతసుని ముఖపంకజమున,
పారాడనేర్చి తుజ్జ్వలధీప్రసన్నమా, వ్యాసమౌనీంద్రుని వదనసీమ,
మాటపొం దెఱిఁగితమ్మా! శాబ్దికాగ్రణి, భాససూక్తిసుధాప్రవాహకలన,
రస భావ కళల సారస్య మెఱింగితి, కాళిదాసుని పరిష్కారమహిమ,
గీ. సార సౌజన్య సౌశీల్య సరససాహి,తీ మహోదాత్త భావప్రదీప్త వగుచు,
భువనసంస్థితి కాధారభూత వైన, నీవు నిట్లైతె సుతుల దుర్నీతికతన.

గీ. స్వజనమునకైనఁ గన్గట్టు పగిదిఁ దనరు, వైభవోన్నతి విలసిల్లు పట్టభద్ర,
వక్కటా! నీవు నేఁ డిట్టు లరులకైన, "నయ్యయో"! యనుదుర్గతి కగ్గమైతె.

సీ. ఎల్లవిధాల వర్ధిల్లఁ జేయఁ గలట్టి, నృపులకు నీ వన్న నేవపుట్టె.
కొంచెమో! గొప్పొ! నిన్గొలుచువారలకుఁ బెద్దమ్మదాస్యమునఁ జిత్తమ్ము లవిసె,
ధనికులు నీదు దుర్దశఁ గాంచుటకు నైనఁ, గలిమిచేడియ వారి కన్నులకప్పె,
తక్కువా రైన నీ చక్కఁదా పరికట్టఁ, బశ్చిమబుద్ధి నిర్భరతమస్సు,
గీ. తల్లి! జగమునఁ బెద్దముత్తైదు వైన, నీదు కడగండ్ల నెసరు గణించువార,
లనుచుఁ గవిపుత్రు లేమి[illegible] సహించి, కడఁక నినుఁ దేర్ప నడుములు గట్టినారు.

గీ. మాతృసేవాపరాఙ్ముఖమానసమైన, సంతతినిఁ బాసి పరుల పంచలను జేరి,
సుడివడుచు దిక్కుమాలి నీ పడినయట్టి, కఱకుఁగష్టాలు గట్టెక్కఁగలవు తల్లి!

గీ. ఇన్నినాళ్లొల్లమిని భవద్హృదయతాప, మపనయింపమి కడుదోస మగునుగాక,
కృపవహించి క్షమించి రక్షింపు మమ్మ! తనయు లెఱుఁగమిఁ జేసినతప్పు లెల్ల.

సీ. భోజుని రోజ నపూర్వవజ్రతనుత్ర, మలవరింపంగ దార్ఢ్యంబు లేదు,
వీరరుద్రుని లీల విశ్వసన్నుత పరి,ష్కారంబు నీ కిడ్డ సలుపలేరు,
రాజనరేంద్రుతరాన సామ్రాజ్యాభి,షేకోత్సవంబును సేయలేరు,
రాయలువోలె రారాజదలంకార,కోటులు నీకుఁ జేకూర్పలేరు,
గీ. గాని నీప్రజ విమల నిష్కామభక్తి, రంగదాత్మార్పణంబు సేయంగలారు,
తల్లిరో! తన్విఁ జెందు మద్దానితోడఁ, గాలము దలంచి సుతుల సంకటము లెంచి.

సీ. కాచియున్నారు స్వాగత మొసంగఁగ మార్గ,ములయందు మధువారి జలకమాడి,
అలవరించిరి దోయిళులు బొంగిపోరల న,ర్ఘ్యమునకై పరిశుద్ధరాగరసము,
చేకొన్నవారు కైసేఁతకై నవనవో,ద్యద్భూరిమందారదామకములు,
పాడుచున్నారు నీపై గీతమాలికల్, శ్రవణపేయముగ నచ్చంపుభక్తిఁ,
గీ. జెలఁగి దిక్కులు కదిసివచ్చిన విధానఁ, గూడ ముట్టిరి సుతుల రేపాడినుండి,
భారతీ! రమ్మ! సుతులతో స్వాంతమలర, మఱల హాయిగ నాత్మసామ్రాజ్యమేల?

సీ. ప్రావృట్పయోదగర్జారావమునకంటె, ధీర మపారగంభీరతరము,
చిత్తమోహనవిపంచీస్వనంబునకంటె, సుకుమార మతులమంజులతరంబు,
కోమలపికవధూకూజితంబునకంటె, సురుచిర ప్రణయబంధురము వరము,
సలలిత భ్రామర ఝుంకారమునకంటె, మధుర మనర్ఘ్య సమ్మదకరంబు,
గీ. ప్రణుతనిర్ఘరఘుమఘుమ ధ్వనులకంటె, రమ్య నవరసభావనిరంధ్రమైన
మృదుమయస్వనమున వీణ మేళవించి, విశ్వగాన మొనర్పు మో విశ్వజనని.

గీ. కళ లఖిల మింక నభివృద్ధిఁ గాంచుఁగాత, కవికుమారులు సంతృప్తిఁ గంద్రుగాత,
భారతి కటాక్షమహితసంపదుపలబ్ధి, నసయమును విశ్వకళ్యాణ మగునుగాత.

నెలవృత్తమ్ము

అజంతా గుహాలయములు

III

కొ. నరసింహాచారిగారు

(సంపుటము ౧ సంచిక ౧౨ తరువాయి)

గుహాలయములలోని చిత్రములన్నియు వాటి నిర్మాణకాలము నాటి జనుల జీవయాత్రను దెలుపు నవిగా నున్నవి. ఇందును ముఖ్యముగా గౌతమబుద్ధుని జననమాదిగా నిర్యాణపర్యంతమును గల చరిత్ర విశదముగా చిత్రింపఁబడియున్నది. గౌతముని జననము, బాల్యమున నాయన సహపాఠకుల గూడి విద్యాభ్యాసము చేయుట, శరీరవ్యాయామముల నభ్యసించుట, యువరాజై పురవీథుల నేగునపుడు చూపు భూతదయాదిగుణముల వెల్లడిచేయు పనులు, వైరాగ్యోదయము, సతీసుతులవీడి యర్ధరాత్రమున పురము వెడలిపోవుట, తపము, సన్న్యాసాశ్రమము, మతబోధకుడై నానాదేశ సంచారము మొదలగు విషయములు బయస్కోపు ఫిల్ములను, త్రిప్పుచు కొంతకొంతగా తెరపై జూపునట్లు గాక, యేకకాలముననే దానియందుగల చిత్రములన్నియు నా తెరపై బడునట్లు జేయురీతి, గుహాలయ కుడ్యములపైనను, స్తంభములపైనను, లోకప్పునను చిత్రింపబడి ప్రదర్శింపంబడియున్నవి. మఱియు బోధిసత్త్వుడు (బుద్ధుడు) మృగపక్ష్యాది జన్మముల నెత్తినట్లును, ఆ జన్మములయందును దయాళుత్వము, త్యాగశీలత మొదలగు గొప్పగుణములు గలిగియున్నట్లును కొనియాడు "జాతకము"లన బరగు జన్మకథలు నూరులకొలది చిత్రితములై యున్నవి.

ఈ చిత్రములయందా కాలమునాటి జనుల జీవయాత్రను చక్కగా జూడగలము. వారి వేషములు, ఆచారములు, వైభవములు, ఆభరణములు, వాహనములు, ఆయుధములు కరతలామలకములుగా చిత్రింపబడి యున్నవి. ఎచటజూచినను, రాజులు, భిక్షువులు, ధనవంతులు, దరిద్రులు, వ్యాధులు, పరిచారకులు, దాసదాసీజనంబులు, గాయకులు, వైణికులు, వేత్రధరులు వారివారి యుద్యోగముల శ్రద్ధతో జేయుచున్నట్లును, పద్యమునందలి పొల్లు పదములు పాదపూరణ పదములవలెగాక ప్రతి ప్రాణి చిత్రమును భావగర్భితముగనట్లును చూడగలము.

ఒక్కొక్కచోట దండశాసకులయ్యును, దయామయులయి ప్రజాపాలనమొనర్చుచు తమ స్నేహము నభిలషించి యితర రాజులచే బంపబడిన రాయబారుల గౌరవించుచు మహావైభవమున గొలువుండు రాజులు, చతుర్విధ సైన్యసమేతులయి మృగయావినోదార్థము పోవు ప్రభువులను, నొకచోట పట్టాభిషేక మహోత్సవములను కన్నులపండువైయొప్పుట చూడగలము.

హంస, కీర, కుక్కుట, పారావతాది పక్షులను; సింహ, వ్యాఘ్ర, భల్లూక, వరాహ, వృక, గజ, అశ్వ, వృషభ, మహిష, కురంగ, మర్కటాది జంతువులను; కదళీ, క్రముక, పలాశ, నారికేళాది వృక్షములను; ఇంకననేక పుష్పజాతులును, వాటివాటి స్వాభావిక స్థితులలో నందముగ జిత్రించబడియున్నవి. ఈమృగపక్ష్యాదిప్రాణుల వాని సహజస్థితియందు జిత్రించుటయే కాక చిత్రకారులు తమ బుద్ధివికాసమును, కల్పనాశక్తిని వెల్లడించుచు నా రూపములనే యలంకార చిత్రముల (Decorative and Conventional design) యందు ప్రవేశపెట్టి చిత్రించియున్నారు. వారికి క్షేత్రగణిత జ్ఞానము గలందులకు వారిచే జిత్రితములగు నగాసు (Fret work) పనియు ఇతర (Geometrical Pattern drawings) చిత్రములను సాక్షులు. కేవలమానవ



గుహాలయ: గర్భగృహమునకు వామపార్శ్వమునగల రెయిక చిత్రముయొక్క వస్త్రాలంకారభాగము.


ప్రతిమలేకాక దేవజాతులకు కిన్నర, గంధర్వాదులును సందర్భానుసారముగా నజంతా చిత్రకారంగమున వచ్చుటఁ జూడఁగలము.

బోధిసత్త్వుని యవతార కథలు (జాతకములు)


షడ్దంతజాతకము

ఒకానొక సమయమున బోధిసత్త్వుఁడు (బుద్ధుఁడు) హిమాలయ వాసియు, 8,000 యేనుంగుల కధిపతియు నగు నొక గజరాజపుత్రుఁడై జనించెను. ఈ గజ సమూహమంతయు హిమాలయమునగలసీ షడ్దంతసరోవరసమీపమున నొక బంగారులోయయందు నసించుచుండినది. తత్పరిసరమున నెచ్చట జూచినను తెల్లగలువలు, ఎఱ్ఱగలువలు, తామరలు మొదలగు పుష్పయుతములగు కొలఁకులును, నేత్రానందకరముగునట్లు వల్లులు, తమ పైకెగఁ బ్రాకుచుండ, నాటలాడించుకొనుచు బిడ్డలకుఁ జేయూతనొసఁగి తమపైకెగఁబ్రాకించుకొని యానందించు తల్లుల వలెనొప్పు వృక్షంబులును గలవనములు నేత్రపర్వముగ నుండినవి. ఇట్టి వనముల మధ్య నా గజరాజపుత్రుఁడు తనకళత్రద్వయముతో సుఖంబుండి యొకనాఁడు తనయొక్క కళత్రములకు కోపము గల్గించినవాఁడయ్యెను. తదాది యాకరిణి భర్తయెడ ననూయాగ్రస్తయై తానొక యప్రతిమాన సౌందర్యవతియై జన్మించి కాశీరాజునకు భార్యయై తన సౌందర్యాతిశయమున రాజును వశీకరించుకొని తనమాత్రలమున తన వైరమును సాధింపనెంచెను. రాజుచే వేటకాండ్రను బంపునట్లు చేసి విషబాణమున తన భర్తను జంపించి షడ్వర్ణకిరణముల వెదజల్లు ప్రభావముగల యాతని దంతముల దెప్పించుకొని తన పగ దీర్చుకొన సంకల్పించుకొని జన్మాంతరమునుగోరి చింతించుచుండెను. తదాది నిరాహారయై కృశించి కృశించి తుదకా కరిణి మరణించెను.


తన కోరిక ప్రకారముగనే యా యేనుగు సుందరస్త్రీజన్మము నొంది కాశీరాజును చేపట్టెను. ఆమె తత్క్షణమే యొక వేటకాని నడవులకు పంపి తన తొలిజన్మమున భర్తయైయుండిన గజమును వెదకించెను. వేట



గుహాలయమున లోకప్పులోనిసొరుగుబిళ్లలయందుగలఅలంకారచిత్రములు, చిత్రములకుమధ్య నడ్డముగాగలభాగములనుకలపసామానని గ్రహించునట్లుగాదారురేఖలతో చిత్రించియున్నారు.



కుడ్యోపరిచిత్రములలోనిహస్తవైఖరులు. హస్తములేయెంతభావగర్భితములైయున్నవో చూడుడు



గుహాలయమున 12 గుర్తుగల స్తంభముపైగల అలంకార చిత్రములు.

గుహాలయపటమునకు భారతి కార్తీకమాస సంచిక 158 పుటకెదుట చూడుడు.

కాదు ఏడు సంవత్సరములు తిరిగి తిరిగి తుదకా గజమును గనితన విషబాణమున దానినేసెను. ఆ వ్రేటునకు గజము క్రిందబడెనుగాని ప్రాణము లింకను పోలేదు. వ్యా[ధు]డు దానిదంతముల నూడబెఱుక నెన్నియో కష్టము [ప]డెను. వాటి నూడబీయజాలకపోయెను. అయిన నా [గజము] కడు దయార్ద్రహృదయము గాన తానే తొండమున [దంత]ములబెఱికి వానికిచ్చి పంపెను. పరోపకార[మ]ై తా నాదంతముల నిచ్చుట యావశ్యకమనియు మోక్షకామికి పామరశక్తిమునగల ప్రతిపాశమును త్రెంచివైచుటయే మోక్షమార్గదర్శియనియు నా గజరాజిట్లు చేసెను. వ్యాధుడును గజరాజు నుదారబుద్ధికి మెచ్చుకొనుచుపోయి రాణి కాదంతములనర్పించి జరిగిన వృత్తాంతమును నివేదించెను. రాణియు నాదంతముల దన మేనపై వంచుకొనగనే తన పూర్వవైరభావ మెటుపోయెనోకాని తా నొనర్చిన భర్తృద్రోహము దావాగ్నివలె నామెను దహింపజొచ్చెను. ఆచింతయే

మిక్కుటమై యామె వెంటనే మరణించెను. షడ్వర్ణకిరణములనీనుదంతములుగాన నావర్ణము లాలంటిని ఆజులుంతములుగా నన్వయించి యీ బుద్ధజన్మాంతర చరితను "షడ్దంత జాతకమనివాడెదరు.

రురుజాతకము

ఒకానొకనగరమున ధనికుడుండెను. వానికొక కుమారుడుకలడు. తల్లిదండ్రులచే నతిగారాబున పెంపబడి ధనసమృద్ధిచే నావణిక్పుత్రుడు కన్నుగానక తనచే జిక్కిన ట్లాయాస్తినంతయు వ్యయపఱచి యప్పులపాలయ్యెను. తుదకు ఋణదాతల బాధ లధికములకాగా నతడు ప్రాణత్యాగమున దనకష్టముల బాపుకొనదలంచి గంగానదిలో దుమికెను. నీటబడిన వెంటనే యతడు ప్రాణములపై యాసమరల బాధింప నచ్చుటకు ధైర్యము చాలక యతికరుణముగా రోదించెను. బోధిసత్త్వుడు హరిణముగా జన్మించియుండెను. తన మందను వీడి యొంటరిగ గంగానదీ ప్రాంతములందిరుగుచుండి యావణిక్పుత్రుని యాక్రందనమును విని యతనిగాపాడి యతనిచే తన్నెవరికిని పట్టీయకుండునట్లు వాగ్దానము గావించుకొని పంపెను.

ఒకనాటి రాత్రి యావణిజు డుండు పట్టణమున రాణి యొకస్వప్నము గాంచెను. తన కొకబంగారులేడి తత్త్వమును బోధించినట్లామెకు స్ఫురించెను. వెంటనే యామె కురంగమునకై వెదకించెను. దానిని పట్టిన వాగ్దానము గావించియు కృతఘ్నుడగు వర్తకపుత్రుడు హరిణాన్వేషణతత్పరుడగు రాజునకు దానియునికిపట్టును జూపెను. దేదీప్యమానముగ వెలుగుచుండు నట్టియు స్ఫురద్వర్ణవర్గములుగల యామృగమును చూచినంతనే రాజు పరవశుడై దాని నేయ నెత్తిన బాణమును జారవిడిచెను. పిమ్మట నామృగమును మహాగౌరవముతో నాదరించుకొని తన రాజధానికి గొంపోయి దాని కిచ్చి తదాది సకల ప్రాణులకును రక్షకుడనై యుండునని దీక్ష వహించెను.

ప్రణయప్రభాతము

చిట్టూరి సత్యనారాయణగారు, బి. ఎ.

పాకలో సిగాలి సోకితే సాలు
వొయికుంటమే నాకు వొచ్చినట్లేను! పాక!

యిడుపు పొలమూలంటె యిడిశెల్లుతాను
పట్టమంటే నల్లె కొట్టమంటాను! పాక!

కారడివి నడిమికీ పారి పొమ్మంటేను
శెట్లతో నీమాట శెప్పుకుంటాను! పాక!

వొక్క మావిడికినీ సక్కనీ పేరెట్టి
దానికిందా నేను తల దాసుకొంటాను! పాక!

తెప్పలో నన్నెట్టి తేలిపొమ్మంటేను
నిన్ను తలుసుకొంటూ నేనెల్లిపోతాను! పాక!

నివ్వు గుండెల్లోను నిలుసుండ మంటేను
మనసునీమీదెట్టి మాడిపోతాను! పాక


స్వరాజ్యమననేమి?

టి. శివశంకరం పిళ్లెగారు

ఈ నడుమ కొన్ని సంవత్సరములుగ ఆసేతు హిమాచలము ప్రజలు 'స్వరాజ్యము' అను పదమును ఎక్కువగ వాడుచున్నారు. ఈమాట క్రొత్తది కాకపోయినను ఏభావమున కిది సంకేతమో ఆభావము జనుల కిప్పటిపరిస్థితులందు తెలియుట క్రొత్తదనియే చెప్పవచ్చును. భారతదేశాభ్యుదయమునకు స్వరాజ్య సాధన గమ్యస్థానమై యుండబట్టియు మితవాదులు అమితవాదు లనక నాయకులందరు దీనిని ఘటించుటకు దీక్షాబద్ధులయి యుండుటవలనను ఈ మహాకార్యము నందు మీరనక వారనక ప్రజలందరు ఏకగ్రీవముగ తోడు పడవలయుట సన్నిహితకర్తవ్యమై యుండుటచేతను, రాజసభలందు ఈ ప్రజాకాంక్షనుగూర్చి తీవ్ర మయిన చర్చలు జరుగుచుండుటం బట్టియు 'స్వరాజ్యము' అనుపదముయొక్క పరమార్థ 'మియమిత్థం' మని నిర్ధరించి నిర్ణయించుట ప్రస్తుతకార్యక్రమము నందు ప్రథమ సోపాన మగునెల్లు.

'యద్భావం తద్భవతి' యను పురాతనలోకోక్తి యందు దాగియుండు తత్త్వము మనకు క్రొత్తదికాదు. ఒక మనుష్యుడు తాను కోరినది తా నగుననుటయే దీని యర్థము. ఇది యథార్థమును నగు. అట్లుండ దేశమే సముదాయమున స్వరాజ్యమును కోరినపుడు తాము కోరు స్వరాజ్యమునకు లక్షణ మిదియని జనసామాన్య మునకు విశదముగ తెలియు కొలది ఆభావమునకు తీవ్రత హెచ్చును. అట్టితీవ్రత ఈ మహాసంకల్పమునకు సాఫల్యమగుటకు ఈ సంగతియందు మనము చేయు యత్నములు విచ్ఛిన్నములై గురిజేరుటకు చాలినంత శక్తిమంతములుకావు.

ఇప్పటిస్థితియందు స్వరాజ్యమన నెవ్వరు జను లను నెవ్వరుగ తోచుచుండుట, కొంత దీర్ఘముగ విమర్శించితేగాని స్ఫురించబోదు. ఫారెస్టు పీడ తొలగుటయే స్వరాజ్యమని పల్లెటూరివా రనుకొనెదరు. దేశమునకు స్వరాజ్యము ఘటించిన తోడనె కుడుచుటకు కూడును కట్టుటకుబట్టయు కొదువలేక దొరకుననుట బీదసాదల యాశ. స్వరాజ్య మబ్బినగాని పన్నులు చెల్లించవలసిన భారము వెంటనే తొలగునని ఏమియు నెరుగని కృషీవలుల మనోరథము. వరుసబడి వృత్తి పన్నులవంటి తొడుసులు స్వరాజ్యాగమనములో సూర్యరశ్మిచే మంచువలె పటాపంచలగుననుట గ్రామవర్తకుల భ్రాంతి. స్వరాజ్య సంఘటనతో తమకు విడుదలయగుననుట కారాగృహవాసుల యాశయమై యుండునో. నిమ్నజాతుల నాయిడి తగ్గి నానాటికి తూగిపోవుచుండు వర్ణాశ్రమధర్మముల నిల్పుకొనగల్గుటకు స్వరాజ్యమే శరణ్యమని పూర్వాచారపరాయణు లనుకొనవచ్చును. దేశమునకు స్వరాజ్య మాసన్నమయినపుడు, ఇప్పటి ఖర్చు వెచ్చములులేకనే తమపని పండునని విద్యార్థియాశ. వాణిజ్యమునో యధికారపదవినో తమకుగా గైకొని విజృంభించుచుండు శ్వేతముఖవర్గమునకు, దేశమున స్వరాజ్యము పాదుకొనునేని తమ పరువు క్రిందికి నీరు తెచ్చుకొన్నట్లగుననుట వారిభయము. కార్మిక పక్షనాయకుడై (Labor Party Leader) బ్రిటిషు సామ్రాజ్యమున ప్రధానమంత్రిస్థానము నలంకరించియుండు 'రాంసే మెక్డోనాల్డ్' వంటి మహోదారులగు రాజ్యతంత్రవేత్తలు స్వరాజ్యము దేశమునకు భాగధేయమందురు. ఖద్దరుధరించుటయే స్వరాజ్యానుభవ



పెనుకొండవాస్తవ్యులు శ్రీయుత పి. యస్. వెంకటరావుగారి చిత్రమునుండి ప్రకటితము

మనుట సహాయనిరాకరణపాషండులమతము. విదేశీయు లను తెల్లవారిని వెనుకలేక భారతభూమినుండి వెడల గొట్టగల్గుటయే స్వరాజ్యమనుభవమున కావలెననుట తామసభక్తుల పరిజ్ఞానము. స్వరాజ్యము, కట్టులేని స్వేచ్ఛకు పేరనుట జాడ్యమనస్కుల యభిమతము. కైంకర్యము లేని యధికారమె స్వరాజ్యమనుట గ్రామసంత్రాసకుల (Village Tyrants) యభిప్రాయము. పాతకాలపు సనాతన ధర్మదర్శనులకు కంకంటి పాపరాజు

సీ. సుతులు లేక కలంగు సుదతు లెక్కడ లేరు,
  పుత్రవియోగము చెందు పతులు లేరు
పతులఁ బాసిన కళావతు లెయ్యెడను లేరు,
  పడఁతులఁ బాసినపతులు లేరు,
దారిద్ర్యదుఃఖసంతప్తు లెందును లేరు,
  కలిమి గర్వముఁ జెందుఖలులు లేరు,
వ్యాధుల బాధల నగమువారలు లేరు,
  నిందలొందినవార లెందు లేరు,
గీ. లేరు జారులు చోరులు లేరు దుర్వి
చారు లగ్నిజలాహిర్వృష్ట్యాద్యుపాధి
వాతదుర్భిక్షభయులైనవారు లేరు
రఘుకులోత్తంస ! నీయేలు రాజ్యమునను.

అనవద్యమగు తనయుత్తరరామాయణమున వర్ణిం చినట్లు రామరాజ్యము స్వరాజ్యమని తోచునేమో ?

ప్రజలకష్టములు తగ్గుటయుసౌఖ్యములు హెచ్చు టయు ఇట్టి వివిధాశయములకు సామాన్యాంశములయి యుండబట్టి స్వరాజ్యమనుభవమున కారెండేలక్షణములను యనువాదము ఈవ్యాసపు శీర్షికలోని సమస్యకు సిద్ధాంత మని యనేకులు భ్రమించవచ్చును. ఈనికషమయినను (test) స్వరాజ్యపరమార్థమును తూచుటకు చాలదు. ఆఫ్ ఘనిస్థానము స్వతంత్రరాజ్యమే. అట్లున్నను అక్కడి ప్రజకు ఈదేశీయులకుండునన్ని సౌకర్యములున్నవని చెప్ప రాదు. పారసీకమందును ఇపుడిపుడు స్వాతంత్ర్యము గడించిన తురుష్కమందును గల స్థితులను పరికించినపుడు, ఆరాజ్యతంత్రములందు ప్రజాహితమునకై మనదేశమం దుండునన్ని యుపకరణము లుండవనుట కనుగొనవచ్చును. అంతయేల, సంపూర్ణమయిన స్వరాజ్యపద్ధతికి పుట్టినిల్లను ఉత్తర అమెరికాయందు మూగజంతువుల బొమ్మ ధరిం చుట జనులు అలంకారముగ భావించి అందుకై సంవత్స రమున ఇరువదిలక్షల జంతువులు ఉక్కుపంజరముల యందు చిత్రవధకు పాలుపరచబడుచుండుట ఇప్పటి యాచారమైయున్నది. ఇంగ్లాండున నేడు లక్షలకొలది జనులకు పనిలేక 'అన్నమో రామచంద్ర'యని యల్లా డుచున్నారు. వారయినను, కుంటి, గ్రుడ్డి కురూపులను చేతకానివారుకారు. కడచిన ఘోరసంగ్రామమందు బ్రిటిష్ సామ్రాజ్యమునకే జయ మాపాదించినవారి శేషు లగు వీరవరులలోనివారు. దేశాభిమాన తత్పరులు. యుద్ధ మునకై చేసిన కోట్లకొలది ఋణముపై వడ్డీ యయినను చెల్లించుటకు వెరవుగానక నేడు అట్టి ఇంగ్లాండే తల్లడిల్లు చున్నది. ఇప్పటి కార్మిక ప్రభుత్వమువారు (Labour Govt.) ఈభారమును ప్రజలనుండి తగ్గించుటకై యుప పన్నులనువారి మూలధనముపైన కన్నువేయ నారంభించు చున్నారు. ఇట్టి విపరీతపు పోకడలకు రష్యా మరియొక నిదర్శనము. ఈ సామ్రాజ్యము చిరకాలము నిరంకుశ ప్రభుత్వమునకు లోనైయుండి దౌర్జన్యజాలక, నిరంకు శాధికారమును ధిక్కరించి అంతకుముందున్న కట్లను త్రెంపుకొనుటయే విమోచనయని తలచి బంధముం బరిత్య జించుకొనిరికాని, పరిణామమందు తామెదురుచూడని యుచ్ఛృంఖలవృత్తి ప్రజల నావరించి, యామూలమున దేశమే పడరాని కడగండ్లపాలయి, చేయునది లేక త్రెంపుకొన్న వెనుకటి కట్టులను ఒక్కొక్కటిగ వెతకి కొన నారంభించుచున్నది.

చిరకాలముగ స్వాతంత్ర్యము ననుభవించు సామ్రా జ్యములగతియే యిట్లుండ మనకు రాబోవు స్వరాజ్యమున మాత్రము చిక్కులుండవనుట యపభ్రాంతి. రాజ్యభార మంతయు నెత్తినపడి ప్రజలే నిర్వహించ బూనినపుడు, క్రొత్తసంసారమును సమకూర్చుకొనుట యందువలె మనము సవరించుకొనవలసిన సమస్యలు సర్వతోముఖము లయి మనల నావరించియున్నవి. భిన్నజాతుల రెండల చెలిమి, హిందూమహమ్మదీయసఖ్యము, కులభేదముల సవ రణ, సంస్థానాధీశుల సమాధానము, వాణిజ్య నావికా వాణిజ్యసరణి, భూమ్యాకాశసముద్రములందు రాణువుల నెలకొల్ప నిర్వహించుట, ఆర్థిక సంపదుద్ధారమునకై యంత్రసాధన సంపత్తి మున్నగు వేనవేలు సమస్యలు ప్రజల నెదుర్కొనుచున్నవి. ఇట్టి సందిగ్ధసమయమున

స్వార్థపరతను నిగ్రహించు నవపరము తీవ్రముగ నన్ని దిశల వ్యాపించును. అతిరయమున 'స్వరాజ్యము స్వరాజ్యమో'యని ఇపుడు పలవరించు మనలో ననేకులు 'ఇది యేటికి పీడ'యని విసుగుకొను కాలమువచ్చినను రావచ్చును. స్థానిక పరిపాలన శాఖయందు (Local Self Govt.) ఇపుడు ప్రజలకు సంఘటించియుండు స్వాతంత్ర్యానుభవము ఇట్టి కేసటకుమచ్చు.

ఇట్టి ప్రమాదముల చేయి త్రిమ్మాకి యాపర్పితా కల్పనముచే స్వరాజ్యభాగ్యము నాశించువారిని భయ పెట్టవలెననుట యీవ్యాసకర్త యాశయముకాదు. ప్రజలు ఇట్టి విపత్తులను మునుమున్నుగా తెలిసి కార్యము నెరపవలెననుటయే. హిందూ మహమ్మదీయ స్పర్థలు నిమ్న జాతుల సంత్రాసము ఆ ధీరోదాత్తుడగు మహాత్మునే కలవర పెట్టుచుండునపుడు తక్కిన వారన నెంత!

'నేతి నేతి' యను సిద్ధాంతసరణిని ఉపమగా గైకొని యియ్యదిస్వరాజ్యము కాదన సూచించుట సులభమయి యుండునేమో కాని దాని పరమార్థము అనుభవము చేతనే గ్రహింపనగినది. స్వరాజ్యామృతము దానిని చవిగొన్నవారికే వేద్యమగును తప్పకాదు.

ఐహిక స్వరాజ్యము ఆముష్మికమోక్షపదమునకే చరమ సోపాన మగునేమో. స్త్రీజన్మమునకు మాతృత్వ మెట్లు భాగధేయమో వృక్షవర్గమునకు ఫలపుష్ప ధారణ మెట్లునియతియో జాతీయతకు స్వరాజ్యానుభవ మట్లు. కనులకు వెలుతురెట్లో ప్రజ బ్రతుకునకు స్వరాజ్య మట్టి పన్నుగడ. ప్రయాణమునకు రైళ్లెట్లో ప్రజాభ్యుదయమునకు స్వరాజ్య మంతటి మహోపకరణము. బరువు నీరు పొగబండికి అడుగునవేసి యుండు ఇనుపకమ్మి యెట్లు సౌలభ్యకారణమో జనుల జీవయాత్రకు స్వరాజ్య మట్టి సాధనోపాయము. ఈ పరమార్థము ప్రజలమనమును నావేశించునేని దాని సాధనకై సంతోషముగ సమర్పింపబడలేనంతటి త్యాగము మరియొకటి లోకమందుండదు. ఏదేశచరిత్రయందుగాని స్వాతంత్ర్యమునకై తమయసువుల సమర్పించిన వీరవరుల స్మృతి ఆకసమున చుక్కలవలె వెలుగుచుండును. అట్లుకాదేని కడచిన ఐరోపా మహాసంగ్రామ మందు పాల్గొనిన యోధాగ్రేసరులు తమదేశస్వాతంత్ర్య రక్షణకై తమప్రాణములనే యొక్కుమ్మడిగ సమర్పించుట కుపక్రమించి యుండెదరు. స్వరాజ్యమునకు మూలమగు త్యాగమునకిదియే పరిమాణము.

స్వరాజ్యమన నిర్దిష్టమగు స్థలముకాదు. సముదాయమున ప్రజల మనోవీథియం దుదయించు స్వాతంత్ర్యదర్శనము (Scene of Freedom). తలుపులను కిటికీలను మూసియుండు ఇంటి వెలుపల రోండ యెట్లు సందుదొరకునా! ఎట్లు లోపల ప్రవేశింతునా! యని కాచుకొన్న తెల్లదీపల వ్యాపించి యుండునో అట్లే స్వాతంత్ర్యము జనులమనోవృత్తుల నాక్రమించుటకు సాన్నిధ్యమందే వేచియున్నది. స్వరాజ్యభారము చులకనగాదు. ఘనతరమే దాని లక్షణము. దాని తత్త్వమెఱిగినవారు ఆభారమును ధరించుట కువ్విళ్లూరజొత్తురు. అట్టి భారవాహిత్వమునకు విశ్రాంతి బరువుతగ్గించుటయందు కాదు. దానిని మోయుశక్తిహెచ్చుటయే. తల్లికి బిడ్డల బరువెట్లో, వివేకవంతమగు ప్రజకు స్వరాజ్యభారమట్లు. తల్లి యెప్పుడైనను తనబిడ్డల బరువుతగ్గవలెనని తలంచునా? దినదినము తనబిడ్డలు పుష్టిగలవారలగుకొలది తనయందు వారల నెత్తికొనుటకు శక్తి హెచ్చుచుండవలెనని కోరును.

ఇట్టి మహత్తరభాగ్య వీక్షణమున దేశమునే యూదుకొన రాబోవుచున్నది. వివిధపక్షముల ప్రజాప్రతినిధులు రాజసభలందు నిచ్చ

గా. శాఖాబంధములన్ని యూడ్చి, యనురాగారావపత్రాళి
నెంతో శోభిల్లఁగఁటించి తోరణములన్ తుష్టిన్ సుధా
లేపన, ప్రాశస్త్యం బొడగూర్చి భక్తిమయదీపం
బుంచుమా నీంద్రియహ్యత్కోశంబున్ గన వాసయోగ్య
ములు నీకున్ భక్తచింతామణీ!

వడ్డాది సుబ్బారాయుడు.

అని కైవారములపాడి రానున్న స్వరాజ్యలక్ష్మికి స్వాగత మొసగుచున్నారు.

ఆమహాదేవి వచ్చినిల్చుటకు ప్రజాహ్వానయ సింహాసనమును నిర్మలముగ సిద్ధపరతురా? జాతివైషమ్యముల విడనాడుదురా? కులభేదముల బోకార్తురా? అస్పృశ్యతాపిశాచమునకు పుణ్యాహవాచనము చెప్పుదురా? స్వార్థ

మను యజ్ఞోపవీతమువధించి యాగమెంచ ర్తురా? అల్లదిగో! గాంధీపురోహితుడు, వీరితో సంకల్పము చెప్పించుటకు సంసిద్ధుడై యున్నవాడు.

'ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాపవ
రాన్నిబోధత' (?)

యనుమహామంత్రము నుపదేశించ లేచియున్నాడు. ప్రజలేమిచెప్పెదరు.

క. కొందరు వెసలువ మందురు
కొందరు వెసలుటయు సిగ్గుగోను గోవిందుం
డందురు కొందరు మదిలో
కొందలమందుదురు కడకు గొని మునుకేంద్రా!
(గోపికా వస్త్రాపహరణము, భాగవతము)

ఇట్టిసంశయమున కిది తరుణముకాదు.? భవసమర్ప ణముయొక్క మహాఫలము మున్న మనమూహించ లేము. స్వాంత నివేదన మొనర్చిన పిదపగాని దానిరసాను భవమున కర్హతపొసగదు. అది పొసగినపుడు గోపికలవలె

గీ. చీరలపహరించి, సిగ్గులు విడిపించి,
పరిహసించి యయినఁ బరగ మనకు
క్షమముడు నోము కొంటి కాపుంప మొక్కించె
నను హరినుతించి రబలలెల్ల.

అని దేశభక్తులనవా రుద్ధతిని పొసెనవు.

మ ర ణ భీ తి

దామరాజు పుండరీకాక్షుడు గారు, బి. ఏ.

మరణమా! నన్నేమిచేతువు - మాటిమాటికి బెదరగొట్టెదు
పరమపతితు డనంతమూర్తికి - దరినిచేరి సదాభజించెద;—మరణమా!

ఆలుబిడ్డల పీడజాలక - గోలగోలగ నేడ్చువారిని,
చాలవిభవము విడువలేక వి-చారవార్ధి మునుంగువారిని,
కఫ పరంపర లెగసి తట్టగ - కాళ్లు చేతులు చల్లబడగా
"గావుగావు" మటంచు వైద్యుల - కాళ్లుపట్టి తపించువారిని,
లోకసుఖములె నాకసుఖమని - లోలులై భ్రమసేటివారిని,
జేరుపో నీమాట లచ్చట - జెల్లిపోవును, చెల్లవిచ్చట;—మరణమా!

రామతారక మంత్రరసము ప-రాకుసేయక గ్రోలువాడను,
నేమమున నీ జీర్ణకాయము - నిలిపి నూతనవస్త్రధారణ
చేసిచేసియు తుట్టతుదకా - (శ్రీ) రమేశు పదాబ్జములనె ని
వాసముగ నేర్పరుచుకొనియెద - భయము నాకేమిటికి ఛీ! ఛీ!
మరణమా! నన్నేమిసేతువు - హరికృపారసమున నశింతువు.

సూత్ర కాల వ్యవసాయ చరిత్ర

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారు

క్రీ. పూ. 1000 మొదలు క్రీ. పూ. 500 వరకు సూత్రకాలచరిత్రమును వ్రాయుటకు కల్పసూత్రములు, జైమిని పాణిని ఆపస్తంబ గౌతమాది మహర్షులచే రచింపఁబడిన పూర్వమీమాంసా వ్యాకరణ ధర్మశాస్త్రగ్రంథములు; మహాప్రఖ్యాతినొందిన మనుస్మృతి, తోడ్పడినవి. ఈకాలపుజనులు, ఋగ్వేదమాత్ర కాలములజను లవలంబించిన వ్యవసాయవిధులకంటె హెచ్చుసువిధులచే వ్యవసాయముఁ జేసి లాభమునొందిరి. భూమికిఁ దగిన దోహదముఁ జేసి, తగినబీజమును విత్తినచో ఫలాభివృద్ధి కలుగునని నాఁటివారు తలంచుచుండిరి. చూడుఁడు:

(1) (వరిమొదలగు) ఓషధులకు, (మామిడిమొదలగు) వృక్షములకు, భూమికిఁ దగిన దోహదవిశేషమునందు, బీజమునకుఁ దగినఫలాభివృద్ధి కలుగును.

పైసూత్రార్థముచే నాఁటివారేభూమి కేదోహదముఁ జేసి యేబీజములను నాటిన ఫలాభివృద్ధి కలుగునో దానిని బాగుగ గుఱుతెఱిగిరని నమ్మవలసి యున్నది.

శ్రౌతకర్మలలో "చైన" భేదమున యజ్ఞస్థానమును దున్నెదరు. ఈ దున్నుటను, యజురథర్వవేదముల యందు విధులు కలవు. ఆవిధులే లౌకికకర్షణమునకును బనికివచ్చునని, సాయనాచార్యులవారు తమ కృష్ణయజుర్వేదసంహితాభాష్యమునం దిటుల వ్రాసిరి.

(2) మూడరకలతో చివరనుండి మొదటికి దున్నగా మూఁడుచాళ్లేర్పడును. కాని మూఁడుచాళ్లయొక్క మధ్యభాగము పూర్తిగ పెల్లగింపఁబడదు. కాన యీయు అకలను ప్రదక్షిణముగాఁ ద్రిప్పి తూర్పుపశ్చిమములకు దున్ని పిమ్మటను దక్షిణమునుండి యుత్తరమునకు దున్నిన రెండల భూమి బాగుగ దున్నఁబడును.

ఇటులనే యథర్వసంహితయొక్క (3-17) మంత్రమునకు భాష్యమును వ్రాయుచు విద్యారణ్యులు, కౌశిక, వైతానిక, సూత్రము లను క్రోడీకరించి, పై యజుర్వేదభాష్యమున వ్రాయఁబడినదానినే దృఢపఱచి యున్నారు. అందు స్వల్పభేదములే కాన్పించినందున గ్రంథము పెఱుగునని వ్రాయలేదు. దానిపర్యవసానము నాలోచింపఁగా యజమాని కొంతదున్ని, భృత్యునకుఁ బిమ్మటనిచ్చి దున్నించుటయే విశేషమని తోఁచునది. ఇందు యజమాని శ్రద్ధావిశేషము కాన్పించును. "కౌశిక సూత్రీకులు" తమపొలము బాగుగ పండవలెనని "కృషి లాభకర్మ" యను నొకకర్మఁ జేయుచుండిరి. దాని నిటు వ్రాయుచున్నాఁడను.

(3) కృషిలాభకర్మయందు బాగుగ పండిన యన్నమునందు వెన్న, గుగ్గిలము, పసుపు, ఉప్పు వేసి "సీతే ఇంద్రామహే త్వా" యనుమంత్రమును బఠించి, భుజింపవలెను. పైసూక్తముచే హాలికునిచే మూఁడుచాళ్లు దున్నించి పిమ్మట యజమాని "సీరా

---

(1) యథౌషధివనస్పతీనాం బీజస్య క్షేత్రకర్మవిశేషే ఫలపరివృద్ధిరేవం॥ ఆపస్తంబధర్మసూత్రం. 2-1-4.
(2) కల్పః॥ పుచ్ఛాచ్ఛిరోఽభికృషతి ...ప్రదక్షిణమావర్తయం స్తిస్ర స్తిస్ర స్సీతా స్సంహితాః కృషతిమధ్యే సంభిన్నా భవంతి దక్షిణా ల్పృష్ఠా దుత్తరస్మాద్దక్షిణాయై శ్రోణే దుత్తర మంస ముత్తరాయై దక్షిణమ్॥ కృష్ణయజుర్వేద భాష్యం. 5-2-5. (3) కృషిలాభకర్మణి, పాయసపక్వే ఓదనే నవనీతగుగ్గులులవణాని ప్రక్షిప్య అనేన సూక్తేన సంపాత్య అభిమంత్ర్య అశ్నాతి "సీతే ఇంద్రామహే త్వా" ఇత్యృచా హాలికేన కృష్యమాణా స్తిస్ర స్సీతాః కర్తా ప్రత్యేక మనుమంత్రయతే. అత్ర "సీరాయుంజంతీతి" యుగలాంగలం ప్రతినోతి దక్షిణం ఉష్టారం ... మం యునక్తి — కౌశికశ్రౌతసూత్రం. 3-3-11.

యుంజంతి" అనుమంత్రముఁ బఠింపుచు, విశేషముగ దున్నుచున్నాఁడు. ముందు దక్షిణమునుండి యుత్తరమునకు దున్నుచున్నాఁడు.

"వైఖానస"సూత్రీకులు ముందు తాము దున్ని, పిమ్మట భృత్యునిచే దున్నించుచున్నారు. ఆది భృత్యునకుపదేశమాత్రమై యున్నది. కాశిక సూత్రీకులు ముందు భృత్యునిచే దున్నించి తృప్తిఁబొందక పిమ్మట, తాము దున్ని శ్రద్ధాభరితను జూపుచున్నారు. రెండును, వ్యవసాయమునందలి శ్రద్ధనే సూచించుచు "కృషిలాభకర్మ" యనుటకుఁ దగియున్నవి. వైఖానససూత్రములో (5-1) "కృతేయోనా" అనుఋక్కును బఠింపుచు విత్తనములఁ జల్లవలెనని కలదు. ఋగ్యజుస్సామవేదీయులకంటె నథర్వవేదీయులు 'దున్నుట, విత్తుట' యనుకర్మల నతిశ్రద్ధతోఁ జేసి విశేషలాభము నొందుచుండిరని తోఁచుచున్నది. కృషికర్మకుఁగూడ విశేషసాంప్రదాయములు ప్రాచీనకాలమునుండి నేటివఱకును గలవు. మఱియు దున్నుట, విత్తుట, వేదకాలమునుండి నేటివఱకు శుభకర్మగా నాలోచించి ద్విజులు తమయిండ్లలో జరుగు వివాహోపనయనాదులలో "అంకురారోపణము" అను కర్మ చేయుచున్నారు. ఆకర్మయం దయిదుమూఁకుడుల దీసికొని, పుట్టమట్టితో వానిని నింపి, తొమ్మిదికంటె హెచ్చురకముల విత్తనములఁ బాలతో జడిపి పైమూఁకుడులలోఁ జల్లెదరు. విత్తనములఁ జల్లినమూఁకుడు లయిదింటికి, 'పాలికలని' పేరు. ఈపాలికలకు, శుభకర్మ జరుగుదినములలోఁ బూజ సలుపుదురు. పాలికలలో నున్నను బోయునపుడు, "ధాన్యదేవతాక"సూక్తమును విత్తనములఁ జల్లునపుడు "ఓషధీసూక్తమును" బఠింతురు. అందు మంత్రపఠనములో నొక్కొక్క వేదశాఖవారి కొక్కొక్కసాంప్రదాయ విశేషము కలదు. "అంకురారోపణకర్మ" యీ సూత్రకాలమునందే బయలుదేరెను. ఆపస్తంబాదులు, పుట్టమట్టి తెచ్చి పాలికా ప్రతిష్ఠాపనతోఁ దృప్తిఁబొందిరి కాని "పారస్కరగృహసూత్రకారుఁ"డంతటితోఁ దృప్తిఁబొందక శుభకర్మ చేయుటకుఁ బూర్వమే, మంచిముహూర్తముఁ జూచికొని, పొలములో దున్ని విత్తనములఁ జల్లవలెనని విధించుచున్నాఁడు. ఆగృహ్యసూత్రమునుండి కావలసినయంశముల నిట వ్రాయుచున్నాఁడను.

(1) పుణ్యదినమున నాఁగలిని గూర్పవలెను.

(2) ఎద్దులను, పెరుఁగు, నెయ్యము, పరిమళద్రవ్యములచే నర్చించి వానిచేఁ దేనెను నేతిని నాకింపవలెను.

(3) "సీరాయుంజంతి" యనుమంత్రముచే నాఁగలిని గట్టవలెను.

(4) "సువర్ణసుఫలా" యనెడుమంత్రముఁ బఠించుచు దున్నవలెను. లేక కఱుకోలనైనఁ బట్టుకొనవలెను.

(5) అఱకలవాండ్రలో వెంబటివాని నభిషేచించిన పిమ్మటఁ దక్కినవారు వాని ననుసరించి దున్నుట కారంభింపవలెను.

(6) స్థాలీపాకదినముకంటె పూర్వదినమునందే యూసీతాదేవిని బూజింపవలెను. వ్రీహులగాని యవలగాని చల్లవలెను. వ్యవసాయారంభమును, నైప్రకారమే చేయవలెను.

(7) పిమ్మట బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను.

వ్యవసాయదారులు నేటికిని, శుభనక్షత్రాదులఁ జూచికొని "ఏఱువాక" యనునొకకర్మ నమంత్రకముగాఁ జేయుచున్నారు. ఆకర్మను వృషభహలముల బూజించి తా నలంకరించుకొని, మౌనవ్రతమూని చేయుచున్నారు. మఱికొందఱు (గోదావరీమండలవాసులు) "దొంగఏఱువాక" యను పేరుతో, ప్రతిఫాల్గున బ 30 నాఁటిరాత్రి, శుభాశుభములను విచారింపకయే చేయుచున్నారు. దీనికిసమ్రతయే ప్రధానముగా నున్నది.

---

1. పుణ్యాహే లాంగలయోజనం; 2. దధ్నా తండులై ర్గంధై రిష్ట్వానడుహౌ మధుఘృతైః ప్రాశయేత్ 3. సీరా యుంజంతీతి యోజయేత్; 4. సువర్ణసుఫలా ఇతి కృషేత్ ఫాలం వా లభేత; 5. అగ్ర్య మభిషిచ్య చ్యాకృష్టం తథా కృషేయుః; 6. స్థాలీపాకస్య పూర్వవద్దేవతా యజే దుభయో వ్రీహియవయోః ప్రవప నైతాయజ్ఞేన; 7. తతో బ్రాహ్మణభోజనం—"పారస్కరగృహ్యసూత్రం" (13 కండికా).

పాలకాప్యగ్రంథమునకు, "పాహారాత్రిక" గ్రంథములలోఁ గొన్ని నిబంధనలు కలవు. వాని ననుసరించియే సిద్ధాంతులు, తమపంచాంగములలో గొన్ని ముహూర్తములను, "వసంతర్తువునందు" వ్రాయుచున్నారు. "పారస్కరుఁడు" తనగృహ్యసూత్రములలో హాలకర్మారంభమునకు విశేషవిధులను సూచింపక, జ్యేష్ఠా స్వాతీనక్షత్రములు మంచివని మాత్రము చెప్పియున్నాఁడు. "ఆపస్తంబ" ఇతి సూత్రకారులమతము ననుసరించి, "పాత్రార్తానుక్రమణికా" దిగ్రంథములలోఁ జెప్పఁబడిన యంశములను గ్రంథవిస్తరభీతిచే వ్రాయలేదు.

ధాన్యవిశేషములు

శ్రౌతకాలమునందుండిన ధాన్యవిశేషములకంటె సూత్రకాలమునందు నానావిధములగు బీజముల నార్యులు కనుపెట్టి వ్యవసాయముఁ జేయుచుండిరి. శ్రౌతకాలమునఁ జెప్పినవానిని విడిచి యీకాలమునందు వాడఁబడినవానిలోఁ గొన్నిటినిమాత్రమే వ్రాయుచున్నాఁడను.

పాణిన్యాచార్యులవారు, తమయష్టాధ్యాయియందు శబ్దనివృత్తిఁ జేయుపట్టులలోఁ గొన్నిబీజములను వృక్షములను నుచ్చరించియున్నారు. అందిక్రిందివి ముఖ్యమైనవి. [1]కందులు, ఆవాలు, శనగలు, షష్టికములు (2) ఉలవలు, (3) చెఱుకు దోటలు, (4) చెఱుకుబెల్లము, (5) పసుపు, (6) క్షీర, ద్రాక్ష, పిప్పలి, చింత, (7) పత్తి, పెక్కుచోటులను సొరకాయ, గుమ్మడికాయ, దోసకాయ మొదలగువాని నుచ్చరించియున్నారు. మఱియుఁ బాణిన్యాచార్యులవారు పెక్కుచోటులను, బిల్వ, ఖర్జూర, తింత్రిణీ, చూత, శాల్మలీ, పిప్పలి, దాడిమ, కపిత్థ శబ్దములను, అట్టివనములను వచించియున్నారు. దేశమునందు, నానావిధధాన్యములు పండు పొలములు లున్నవని యీ క్రిందిపేరులచే రూఢిపరచుచున్నాఁడు (8) పెసలు పండుపొలము "మౌద్గీనము," ఎఱ్ఱజిలమధాన్యము పండుపొలము "వ్రైహేయము," తెల్లధాన్యము పండుపొలము "శాలేయము," తెల్లగోధుములు పండుపొలము "యవ్యము" లేక, "యావక్యము," షష్టికలు (60 దినాలకు బండుధాన్యము) పండుపొలము "షష్టిక్యము," తిలలు పండుపొలము "తిల్యం" లేక, "తైలీనం," మినుములు పండుపొలము "మాష్యం" లేక, "మాషీణం," అగిసెవిత్తులు పండుపొలము "ఉమ్యము" లేక, "ఔమీనము," (పతంజలి ఉమాలుధాన్యము కాదనినాఁడు. ఉమయన యగిసె యనుట యర్థము) జనుము పండెడు పొలము "భంగ్యము," సల్లకత్తు పండుపొలము "అణవ్యము" లేక, "ఆణవీనము" అనుశబ్దము లనుచున్నవనిరి. దమ్ముచేసి యూడ్చెడిచేలలు నాఁడు కలవు. అట్టిపొలములసమూహమునకు, "కైదార్యం" లేక "కైదారకం" అనిపేరు. (చూడుఁడు అష్టాధ్యాయి; 4-2-40) కాని 4, 5 సంవత్సరములకుఁబూర్వమునఁదక, మనదేశమునందలి పాశ్చాత్యవ్యవసాయశాస్త్రజ్ఞులు దమ్ముచేసినయెడల భూమి పాడగునదియు, పండదనియుఁదలంచి యటుల బోధించుచుండిరి. 1907-వ సంవత్సరము ప్రారంభవ్యవసాయశాస్త్రపరీక్షకుఁ బోయినవిద్యార్థులకు "దమ్ముచేసినయెడల కలుగు చెఱుపేమి" యను వర్ణమిమ్ము ప్రశ్నను గూడ పరీక్షాధికారు లడిగిరని జ్ఞాపకము. నేఁ డట్టులుకాక, దమ్ముచేలలుగా కొన్ని యుండు టవసరమని, ప్రభుత్వవ్యవసాయశాఖవారు తలంచుచున్నారు. నేటికి మూఁడువేలేండ్లక్రితమే మనదేశీయులు, దమ్ముచేలలుగాఁ గొన్ని, మెట్టదుక్కిగాఁ గొన్ని పొలములుండు నావశ్యకతను గ్రహించియున్నారు. బాగుగదున్నుటను పాణిని చెప్పియున్నాఁడు (9) షష్టికలను ధాన్యము అఱువదిదినములకుఁ బండునది. ఇది మూఁడువేలేండ్లనుండి మనసీమాదేశమునందు లాభదాయకధాన్యమై యున్నది. స్మృతికర్తలు షష్టికలను పవిత్రధాన్యమని శ్రాద్ధాదుల కుపయోగింపు మనిరి. ఇది నేటి, "దాళువా, గరికసన్న" మనుధాన్యమునకు పితామహస్థానీయ మనవచ్చును. షష్టికలనుధాన్యము విశాఖపట్టణపుజిల్లాలోఁ గలవు; అవి షష్టికలేమో. "కలుపు"

---

1. 2-4-3; 2. 4-4-4; 3. 8-45; 4. 4-4-103; 5. 4-4-53; 6. 4-3-167; 7. 4-3-136; 8. ధాన్యానాం భవనే క్షేత్రే ఖఞ్, (5-2-1) వ్రీహిశాల్యోర్ఢక్ (5-2-2) యవయవకషష్టికాద్యత్ (5-2-3) విభాషా తిలమాషోమాభఙ్గాణుభ్యః (5-2-4); 9. కృష్టేశ్చందసి. 7-4-64.—అష్టాధ్యాయి సూత్రములు.

సస్యమునకు నడుమ బయలుదేరిన యనవసరపు మొక్కలు తీయుపద్ధతిని నాఁటివా రెఱుఁగుదురు.

(1) పైరుఁ బెట్టువాఁడు, పైరునందలి కలుపు నూడఁబెఱికి యెట్టులు పైరును గాపాడునో.

పైనిచెప్పిన సస్యములేకాక "వల్లలి" కలవని గౌతమసూత్రమునందును, చెఱకుపానకమును గాఁచి "ఫాణిత" మనుమధురద్రవ్యమును, వండుచుండిరని, నుండి పంచదార దిగుమతియగుచుండుటకుఁ గారణ మేమై యుండును? (2) పట్టుబట్టలు, ఎల్లనిబట్టలు (3) లక్కచే లత్తుక, రంగులువేయఁబడినబట్టలు కలవు. వస్త్రములకు, రంగుబట్టలకుఁ బ్రసిద్ధికెక్కినభరతఖండమున కేల పరదేశములనుండి బట్టలు రంగులు దిగుమతి యగుచున్నవి? పంటలెక్కువగాఁ బండుటకుఁగాను "ధాన్యసమృద్ధి" కర్మను "కౌశికసూత్రీకులు" చేయుచుండిరి. గ్రంథవిస్తరభీతిచే దానిని వ్రాయలేదు. పాణిన్యాచార్యులు, ద్రాక్షచూతాదివనములను, పెక్కుపాదు లుచ్చరించుటచే తరుకృషి విస్తారము కల దని తోఁచుచున్నది. వృక్షముల నుండి (4) గుగ్గిలమును, కర్పూరమును దీయుచుండిరి. ద్రాక్షేక్షుఖర్జూరాది మధురద్రవ్యసమృద్ధి కలుగుటచే శాస్త్రకాలమునందుండి నంతే సరభూ (తేనె) వృద్ధి సూత్రకాలమునందు లేదని తెలంపవలసియున్నది. శిల్పులయొక్క సూత్యానయానములు మొదలు, సూర్యమండలపర్యంతముఁగొలిచెడి



చెఱకురసముతోఁ బంచదారను వండుట

ఆపస్తంబధర్మసూత్రమును చెప్పుచున్నది. "ఫాణితము" తేనె పానకమో, లేక, చెఱకురసమునుండి వండిన "మద్యమో" యైయున్నది. "బాహటా"ది గ్రంథముల లోని వర్ణనలచే, తేనెపానకమని తెలియుచున్నాను. సూత్రకాలమునందే చెఱకుకోట భరతఖండమున వ్యాపించి, ఫాణితము, బెల్లము, పంచదార వండఁబడుచున్నదని, పాణినికృతాష్టాధ్యాయిలోని పదములచేఁ దెలిసికొనుచున్నాము. అనూచానముగ గుడ, శర్కరాదులకు స్థానమైన భరతఖండమునకు, "జావా, జమైకా"ద్వీపముల సూత్రకాలగణితశాస్త్రజ్ఞులకు భూమిఁకొలతే, వర్షపుఁగొలతే తెలిసియుండుట లెక్కలోనిది కాదు. పాణిని అష్టాధ్యాయియందు, భూమిఁకొలతను, వర్షపుఁగొలతను జెప్పినాఁడు. (5) స్వల్పసంఖ్యాకులగు బ్రాహ్మణులు, విద్యాకృషిలో నిమగ్నులగుటచేతను, వైదికకర్మపరతంత్రులగుటచేతను, అట్టి బ్రాహ్మణులను ప్రభువులు పోషించుచుండుటచేతను క్షత్రియులు రాజకీయపరతంత్రులగుటచేతను, పై రెండు జాతులవారికిని, వ్యవసాయము చేయుటకు సావకాశము లేక, వాణిజ్యవృత్తితోపాటు, కృషి పాశుపాల్యవృత్తులు

1. "యథోద్ధరతి నిర్దాతా కక్షం ధాన్యంచ రక్షతి." మనుస్మృతి (7-110); 2. గౌతమసూత్రం 7 ఖండ; 3. అష్టాధ్యాయి (4-2-1,2); 4. అష్టాధ్యాయి (4-4-53) (4-2-80); 5. కాండాంతాత్ క్షేత్రే (4-1-2) వర్ష ప్రమాణ ఊలోపశ్చాస్యాన్యతరస్యాం (3-4-32).

వైశ్యులవృత్తులైనవి. అందువలననే నాఁటిగ్రంథములలో వ్యవసాయవృత్తి, వైశ్యవృత్తియని వ్రాయఁబడినది. శూద్రుఁడు, త్రైవర్ణికసేవకుఁడుగా నాఁడుండెను. పంచముఁడు లేఁడును నాఁడును, ఇంచుమించు సమానస్థితిలోనే యుండి



గ్రామమును కొలతచేయుట

వాఁడు. కొన్ని విధములనే నాఁడే పంచముఁడు, కొంత మంచిస్థితిలో నుండెనని తలంచుచున్నాను. కృషి వాణిజ్యాదులు, వైశ్యుని ముఖ్యవృత్తులనియు బ్రాహ్మ క్షత్రియులు ఆపదవచ్చినప్పుడేకాని వ్యవసాయముఁ జేయరాదనియు, అప్పుడైనను, బ్రాహ్మక్షత్రియులు స్వయముగ దున్నక దున్నించి వ్యవసాయముఁ జేయించుకొనవలెననియు బోధాయనఆపస్తంబ, గౌతమ, మనుస్మృతులు చెప్పుచున్నవి. గ్రంథము పెరుగునని యాచర్చ యిందు వదలఁబడెను. వ్యవసాయ



గ్రామపరిసరము - పశువులు

మొకజాతివారి వృత్తిగ నుండుట సూత్రకాలపు భారతీయులకు లాభకరమై కాన్పించెను కాని ప్రస్తుతకాలమునం దొకజాతివారివృత్తిగ నుండుట నష్టదాయకముగాఁ గాన్పించుచున్నది. సూత్రకాలపు వాఙ్మయముఁ బరిశీలింపగా, నాఁటి కాలమునందు వ్యవసాయము మహోన్నతస్థితిలో నున్నదని తోఁచగలదు. నాఁటికాలపుసర్వశాస్త్రవేత్తలు ప్రభువులు, ప్రజలు సుఖముగ జీవించుటకనువగుపద్ధతులఁ గని పెట్టిరని నాఁటిగ్రంథములచే నూహింపఁబడుచున్నది.

పశువర్ధనము

ఈ కాలమున భరతఖండమునందు పశువు లత్యధికవృద్ధి నొందినవి. గ్రామనిర్మాణముఁ జేయునప్పుడు ముందుగ పశుసౌఖ్యమునే గమనించుచుండువారు. చూఁడుఁడు:

(1) పశువులు గ్రామసమీపమున స్వేచ్ఛగ సంచరించుటకు గ్రామమునకు చుట్టును, నాల్గువందలమూరల దూరము

1. ధనుశ్శతపరీహారో గ్రామస్యస్యాత్సమంతతః; శమ్యాపాతా స్త్రయోవాపి త్రిగుణో నగరస్యతు. తత్రాపరివృతంధాన్యం విహింస్యుః పశవో యది; నతత్రప్రణయేద్దండం నృపతిః పశురక్షిణామ్. మనుస్మృతి 8—237,238.

వరకు మందబయలు నేర్పరుపవలెను. లేక బలముగల వానిచేత విడువబడినవాఁడు కోలలుపోవు దూరమువరకైనను మందబయలు నేర్పరుపవలెను. పట్టణమునకు మూఁడురెట్లధికముగ మందబయలు నేర్పరచవలెను.

ఆమంద బయలులో కాపుసల చేయని ధాన్యాదులను పశువులు తినినయెడల పశుపాలకుఁడు దోషికాఁడు.

ప్రాచీనకాలమున నేర్పరుపఁబడిన మందబయళ్లనుగుఱించి యింకను నామమాత్రముగ నున్నవి. ఈమంద బయళ్లు గోదావరి, కృష్ణా డెల్టా గ్రామములలో క్షీణించి క్షీణించి నా[illegible]డులమూరలకుబదులు, నాలుగుమూరలైన లేనస్థితి కలవై యున్నవి. మందబయళ్లు లేని గ్రామములలో మంద లెటులుండును? ఇందునుగుఱించి, యాంగ్లకాల చరిత్రలో వ్రాయఁగలను. మనువు చెప్పిన చోప్పున మందబయళ్లు, హైదరాబాదు రాజ్యమునను పశ్చిమాంధ్ర రాష్ట్రమునను కొన్నిచోటులఁ గాన్పించుచున్నవి. మను స్మృతిలోఁ జెప్పినదానిని, గౌతమధర్మశాస్త్రమిటులు బలపఱచుచున్నది.

(1) నోగఱము దేశమునఁ దీక్షింపఁబడిన నది ప్రభు దోషము, పశుపాలకుఁడు రక్షింపకపోయినచో నది పాలకునిదోషము. దారిసమీపమునందుండిన పొలము కాపుసల చేయకపోయినచో నందుఁ బశువులు పడినయెడల, కొంత పొలమువానిది కొంతఁ బశువులకాపరిదియౌ దోషమగును.

గ్రామసమీపస్థక్షేత్రాధికారి తనపొలము నకు, ఒంటెకుఁ గనఁబడనంతయెత్తుగఁ గంచెను వేసికొనవలెనను విధిని మన్వాదిస్మృతులు చెప్పుచున్నవి. ఎద్దుల వాతలనుగా, నథర్వవేదకాలమునసే విధించుటకుఁ బ్రారంభించిరి. అది యీసూత్రకాలమున వృద్ధినొందెను. పశుసంబంధమగు నభియోగాదులకు మనుస్మృతియం దెట్టి నిబంధనలు కలవో దిఙ్మాత్రముగ నుదాహరించుచున్నాఁడను.

( ) ముక్కుత్రాడు తెగికాని కాడి విఱిగికాని ఎద్దులవలనగాని బండివలనఁగాని, మఱియొకని కాపద సంభవించినయెడల బండియజమానిని దండింపరాదు. పశువులను మేపువాఁడు పగలు పశువులఁ దోలుకొనిపోయినది మొదలు రాత్రి యజమానికడ నప్పగించువఱకు నాపశువులకును పశువులవలనఁ బైరులకునుఁ గలుగునష్టమును, పశుపాలకుఁడే భరింపవలెను. ఇంటికడ నొప్పఁజెప్పినపిమ్మట యజమానుని దగును. మందలోఁ జెడిపోయినను, క్రిములు మొదలగువానిచేఁ జంపఁబడినను, కుక్కలు మొదలగువానిచేఁగఱవఁబడినను, మిట్టపల్లములఁబడినను, అశ్రద్ధగా మేపుటవలననశించినను, కలిగెడిపశునష్టమును మేపువాఁడు భరింపవలెను. పశువులు తమంతట నవియే యడవిలోఁ జచ్చినయెడల యాపశువులచెవులు తోకచంద్రుకలు గోరోచనము కొమ్ములు మొదలగునవి పశుపాలకుఁడు యజమానికి నమ్మకముకై చూపవలెను.

పశువులబీడులు విస్తారముగ నాఁడుండెను. "వ్రజ, గోచర" శబ్దములను "పాణిని" అష్టాధ్యాయియందుఁ బెక్కుసారు లుచ్ఛరించుటచే, దేశమునం దనేకప్రదేశములలో, గోశాల లుండెనని తలంపవలసియున్నది. ఋగ్వేదకాలమునం దారంభింపఁబడి, సూత్రకాలమున వృద్ధినొందిన పశువైద్యము స్మృతికాలమున విశేషాభివృద్ధి నొందెనని క్రిందినిదర్శనములచే నూహింపఁబడుచున్నది.

"అల్గండువు" అను క్రిమి గోశరీరమున వ్యాపించి రక్తమాంసములఁ బీల్చును, తోకచివర నంటుకొనును. ఈ క్రిమికిఁ దగినచికిత్స:( )గోశరీరగతమగు "నల్గండువు" లను నశింపఁజేయుటకు "ఇంద్రస్య యామహీ" యనెడి యథర్వసూక్తముచే నేతితో నల్ల సెనగలకు హోమముచేయవలెను.

1. పశుపిడితే స్వామిదోషః, పాలసంయుక్తేతులస్మిన్, పథి క్షేత్రే అనావృతే పాలక్షేత్రికయోః॥ గౌతమ ధర్మసూత్రం. 12 ఖండ.; 2. శ్లో. ఛిన్న నాస్యే భగ్న యుగే న దండోమనురబ్రవీత్. 8-291,292, శ్లో. దివా వక్తవ్యతా పాలే రాత్రౌ స్వామిని తద్గృహే, యోగక్షేమే ఽన్యథాచేత్తు పాలో వక్తవ్యతా మియాత్. 8-230, శ్లో. నష్టం వినష్టం క్రిమిభిః శ్వహతం విషమే మృతమ్, హీనం పురుషకారేణ ప్రదద్యాత్ పాల ఏవతు. 8-232, కర్ణౌ చర్మచ వాలాంశ్చ వస్తిం స్నాయుంచ రోచనామ్, పశుషు స్వామినాం దద్యాత్ మృతేష్వంగాని దర్శయేత్. 8-234. మనుస్మృతిః; 3. "ఇంద్రస్య యామహీతి" ఖల్వాంగాక్ అల్గండూనాశనాక్ ఘృతమిశ్రాక్ జుహోతి. వాలాక్ అసిత కాండే నృత్యం పరివేష్ట్య సంధినత్తి ప్రతపత్యాదధాతి పచ్యేన దక్షిణాముఖః [illegible]గుం ఉపమన్యకిరతి. పమృద్వా తృ దధాతి. (కౌశిక సూత్రం-4-3).

గోవుయొక్క తోకకొనను విడదీసి కాల్చవలెను. మార్గ మధ్యమునందుండిన బూడిద నెడమచేతితోఁ దీసికొని, కుడిచేతితో స్పృశించుచు, దక్షిణాభిముఖుఁడై పైసూక్తము జపించుచు రోగము వచ్చిన గోవుయొక్క శరీరముపైఁ జల్లవలెను. పైసూక్తము జపించుచు మార్గమధ్యమునందలి బూడిదను రోగవంతమగు గోశరీరమునందంతటను రుద్దవలెను. నేఁడు పల్లెలలో "గోమారు" అను పురుగు గోశరీరమునం దంతటను వ్యాపించినయెడల బాగుగ కడిగి శరీర మారినపిమ్మట "కరుమాపమును" (తోటాకుల యిండ్లలో పొగబారుచోటున వ్యాపించు ధూళి) బట్టింతురు. తోక కుచ్చునకు మాకగింజలవంటి పేలుపట్టి యంటుకొనినపుడు తోకను విడదీసి పిడుగనిప్పుతో కాల్చెదరు. పైవైద్యములకు వ్యయ మేమియును లేదు. కౌశికసూత్రమునఁ జెప్పఁబడిన వైద్యమునకును వాటికాలమున నల్లనెనగలు, నేయి హోమముఁజేయుటలో వ్యయ మేమియు గలుగదు. కాని నేటి యాంగ్లేయ పశువైద్యప్రకారము గోమారు, పేలు, వదలుటకు అర్థరూపాయవఱకు వదలవలసి యుండును. క్రిమినాశకాయిలుగాని నిప్పులో 2, 3, పారులు కడుగుటలో వ్యయ మెక్కువకాదా.

పశువుల శరీరమునఁ బుండ్లుపడి పురుగులుపట్టినపుడు చేయఁదగినకర్మ

(1) "ఉద్యన్నాదిత్యః" అను సూక్తముచే సంధ్యాత్రయమునందును, గోవులకుఁ బుట్టినపుండ్లపై దర్భలతో రాయవలయును. చేతిలో నల్లనెనగలను పైసూక్తములో హోమములఁజేసి, అపురుగులు, చంపఁబడినవి చంపబడినవి యని చెప్పవలయును.

(2) "బ్రహ్మజిజ్ఞానం, ఆగాసః, ఏకాపపేః" అను మంత్రములఁ బఠింపుచు, కాచి చల్లార్చిననీటిలో ఉప్పును జేసి, గోవులచేఁ ద్రావింపవలెను. సంతానమునఁ గోరువారు గోవులు నీరుఁ ద్రావుటకుఁ దొట్టెలఁ గట్టింపవలెను.


పశువులు నీరుఁ ద్రావుటకుఁ దొట్టెలను ఋగ్వేద కాలముననే యార్యులు కట్టుచుండిరి. ధర్మము కొఱకు సూత్రకాలమునఁ దొట్టెల గట్టుటకు ప్రారంభించిరి. పైని చెప్పఁబడిన చిన్నచిన్న వైద్యములను బల్లెలలో నేఁడును వ్యవసాయకులు చేసికొని, తమ పశుగణమును రక్షించుకొనుచున్నారు. పశువు లరణ్యమునకుఁ బోవునపుడును, తిరిగివచ్చునపుడు పాలు వృద్ధినొందుటకును, పెక్కులు పశువృద్ధికరతంత్రము లావశ్యకములని కౌశికసూత్రములు చెప్పుచున్నవి. గ్రంథము పెరుగునని వ్రాయలేదు.

రాజునకు వ్యవసాయదారునకుఁగలసంబంధము

ప్రభువునకు భూమిపై నెంత యధికారము కలదో పూర్వమీమాంసాశాస్త్రకర్తలు నిర్ణయించియున్నారు. పూర్వమీమాంసలో యాగ దక్షిణావిధానమునందు భూమినిఁ బ్రభువు దానమీయవచ్చునా కూడదా యను మీమాంస యాశాస్త్రజ్ఞులకుఁ గలిగి, "విశ్వజిద్యాగ" దక్షిణావిధానములో చర్చించియున్నారు. పూర్వ మీమాంసాశాస్త్రకర్తయగు "జైమిని" యొక్కయు, ఆజైమిని సూత్రములకు భాష్యముఁజేసినవారి యొక్కయు చర్చ నిందు వ్రాయుచున్నాఁడను.



1. ఉద్యన్నాదిత్య ఇత్యుద్యతి గోనా మేత్యాహ. అహావితి సూక్తాం తేతే హతాహాతిఇతి దర్భైః రక్షిష్యస్యతి మధ్యందినేన ప్రతీచీం అపరాహ్ణే చాలస్తుకాం అభేద్య ఖల్వాదీని ఇతి. (కౌ. సూ. 4-3): 2. "బ్రహ్మజిజ్ఞానం, ఆగాసః, ఏకాపీతు" ఇతి గా లవణం పాయయ త్యుపతాపినీః ప్రజననకామాః ప్రపాం అవరుంద్ధి. (కౌశికసూత్రం. 3-2).



సహగమనము

శ్రీ శేషాద్రిరమణ కవులు

రాఢవిక్రాంతి కాకతి రుద్రదేవ, చక్రవర్తి సమగ్రాంధ్ర శాసనుండు
హనుమకొండాభిధాన పురాంతరస్థ, రత్నసింహాసనస్థుఁడై రాజ్యమేల.

సీ. ప్రాక్సరోవరాశితరంగడోలికలపై, నామోదమెసఁగ నుయ్యాలలూఁగి
శ్రీశైలవిశ్వేశసేవాసమారబ్ధ, మహితసౌభాగ్యసంపదల నొంది
మాల్యవత్సహకారమంజరీమకరంద, కలితగంధానిలంబులను దనిసి
కళ్యాణపురరాజ్య కళ్యాణసమధికై, శ్వర్యసంపదలను సంగ్రహించి

తే. గీ. ఆంధ్రసీరకుమార కరాంతరస్థ, రమ్యహేతులపై నాంధ్రరాజ్యలక్ష్మి
యాటలాడుచు నుండెడి యవసరమునఁ, గలిగె దుస్తరమైన సంగ్రామ మొండు.

ఉ. మేళగిదేవభూవిభుఁ డమేయపరాక్రమశాలి; ధారుణీ
పాలకు రుద్రదేవు గెలువన్ దలపోసి సమగ్రసైనిక
శ్రీలలితాత్ముఁడై రణము సేతకు వచ్చెను. హన్మకొండ కీ
కీలకముం గ్రహించి యుఱికించిరి వాజుల నాంధ్రపుత్రకుల్.

ఉ. * బాలసముద్రతీరమున వైరులడంపు వసించె, రుద్రభూ
పాలుఁడు శైలదుర్గ పరిపాలకులం దిలకించి మార్తురన్
దోలుఁడటంచు వాకొని కుతూహలియై జవనాశ్వమెక్కి ని
ర్వేలపరాక్రమాప్తి నెదిరించె విరోధివరూధినీ తతిన్.

క. †పోలవాస రాజ్యలక్ష్మీ, తిలకుఁడు మేళగి విభుండు తీవ్రాత్ముండై
బలములను రుద్రవిభుబల, ములపైకిన్ ద్రిప్పె భటసమూహము పొలిసెన్.

చ. మిగుల భయంకరంబుగ సమిద్భువి రుద్రనృపాలుసైనికుల్
పగతుర ముట్టడించి యెటుఁ బాఱఁగనీక వధింపుచుండగా
దెగువ దలిర్ప మేళగిపతిన్ దునుమాడఁగ రుద్రదేవుఁ డా
వగ గ్రహియించి వైచెఁ బయిపై నిశిత ప్రదరప్రతానమున్.

ఉ. అమ్ముల తాకిడిన్ నొగిలి యంగకసంధులు వీడిపోవ న
శ్వమ్ము మఱల్చి మేళగి నృపాలుఁడు యుద్ధభరంబు వీడి ప్రా
ణమ్ముల కాసచేసిచనినన్ విడనాడక రుద్రభూవిభుం
డమ్మెయి వెంటనంటెఁ బ్రళయాంతకు కైవడి సాహసక్రియన్.

---

* బాలసముద్రము. ఇది హనుమకొండ చెంతగల యొకానొక తటాకము.

† మేళగి దేవుఁడు పోలవాసరాజ్యము పాలించుప్రభువు. పోలవాస నిజాంరాష్ట్రమున గోదావరీ తీరమునఁ గలదు.

తే. గీ. ప్రభుఁడు వెన్నిచ్చుటం గాంచి ఫౌజులెల్ల, మొగ్గరంబును విడి పాఱిపోవుచుండ
రుద్రధరణీశు భటులు వైరులనుబట్టి, బలియొనర్చిరి పద్మాక్షి* పార్శ్వమందు.

ఉ. మేళగి భూమినాయకుఁడు మృత్యు భయంకర శాతదంష్ట్రికా
జాలనిబద్ధశీర్షుఁడయి సంగరరంగ మతిక్రమించి వా
తూలరయాను సారియయి తుంగతురంగక మెక్కిపోవుచోఁ
గాలవశంబునన్ ధరణి కాంతు తురంగము పందగింపఁగన్.

తే. గీ. మేళగి నృపాలుఁ డత్తఱి మేదినీగ్ర, కాననాదికముల నెల్లఁ గడచిగడచి
కాకతి నృపాలు ఛాటిని గన్నబ్రేమి, తెఱువు విడనాడి యెందో యదృశ్యమయ్యె.

చ. "అరినృపుఁ డెందుఁబోయె నిశితాసికి నుత్సవ కారణంబు రూ
పత్తె" నని రుద్ర భూవిభుఁ డుదగ్ర పరాక్రమ బాహుదర్ప వి
స్ఫురణము తాండవింప వనభూములు గ్రుమ్మఱసాగెఁ గాననాం
తరమున నెందు నేనియుఁ గనంబడ వశ్వఖురాగ్ర చిహ్నముల్.

ఉ. ఎక్కడ వైరి చిక్కఁ, డటనే విజయాంకము లుల్లసిల్లగా
నక్కజమైన శాసనజయధ్వజముల్ నెలకొల్పవచ్చు నన్
మక్కువతోడఁ ద్రిమ్మరఁగ మైళగిభూవిభుఁ డేగుత్రోవ, నే
దిక్కునఁ దోఁచదయ్యె నెదఁ దీవ్రత హెచ్చెను జక్రవర్తికిన్.

సీ. తలిరు తీవియలచే తొలిగొన్న యెలమావి, తరుమూలములనెల్ల నరసి యరసి
పరువంపుఁ జివురు జొంపములచే రాజిల్లు, పొదరిండ్ల లోనికిఁ బోయిపోయి
జనదుర్గమములైన శైలభాగములెల్ల, విసువక నొంటిమై వెదకివెదకి
తరణికిరణంబులు చొరరాని ఘోరకాం, తారభాగములందుఁ జేరిచేరి


తే. గీ. ఆంధ్రసామ్రాజ్యశాసనుఁ డనుమకొండ, రుచిరసింహాసనారోహి రుద్రవిభుఁడు
వెదకె పొలవాన మేళగివిభునిఁ గొఱకు, పౌరుష సుమంబు రేకెత్తఁ బ్రతిపదంబు.

ఉ. కొండలమధ్యభాగమునఁ గ్రుమ్మరుచుండఁగ, నొక్కచో లతా
మండప పార్శ్వభాగమున మైళగిదేవునివాజి కన్పడెన్
నిండు ముదంబుతోడ ధరణీపతి రుద్రవిభుండు; వైరి యిం
దుండఁగ వచ్చునంచుఁ జనుచుండెఁ దదంతరమధ్యసీమకున్.

చ. జ్వలనుఁడు మండుచుండె నొకచాయ మహోన్నతకాష్ఠపంక్తిపైఁ,
చెలియ యొకర్తు పార్శ్వమునఁ జేరి సుమాంజలి దాల్చి ధ్యానని
శ్చలమగు దృక్పరంపరలు శాంతరసంబు సృజింపుచుండఁగాఁ
బలుమరు ప్రేమగీతికలు పాడఁగసాగె శ్రవఃప్రియంబుగన్.

తే. గీ. పావనతరుండు ప్రత్యక్ష దైవతంబు, వహ్నిభట్టారకునిచుట్టు వనిత తిరిగి
యంజలిస్థసుమంబుల నందు విడచి, సమధి కోన్నతమైన ప్రస్తరము నెక్కె.

* హనుమకొండయందున్న జైనదేవత.



ఉ. "ప్రాణవిభుండు మైళిగి నృపాలుఁడు పోయిన త్రోవనాకు, ని
ర్వాణసుఖ ప్రదాయకము భౌతికదేహము పొందుచాలు, ని
ర్వాణమునొంద భర్తృచితి యందు విలీనమ నాదువంచు" పూఁ
బోఁణి వచించి కన్నుఁగవ మోడ్చెఁ బతిస్మరణానురక్తయై.

చ. "ఇఁక నిముసంబు సైపు జననీ! జననీ! జననీ!" యటంచు, రా
జకులుఁడు రుద్రభూవిభుఁడు సత్వరరీతి వచించుచున్, దురం
గకము వదల్చుచుండ, నల కంజనిభానన దూఁకె నగ్నిలో
వికచపయోజకర్ణికను వేగమ వ్రాలెడు తేఁటి పోలికన్.

తే. గీ. గాటపు కౌఁగిలింతలఁ గలసి మెలసి, దహనుపేటియ వనికాంతరమునందు
దంపతులు కొంతసేపు శాంతముగ నుండి, దృశ్యలోకంబు విడిచి యదృశ్యమైరి.

క. పావనతరసహగమన మ, హావ్రతమును నిర్వహించి యైహికసౌఖ్య
శ్రీ వదలె నేకవీరా, దేవికిఁ దులనిడఁగఁ దగిన తెఱవలు గలరే.

తే. గీ. స్నిగ్ధభావాదికోన్మాద చిత్తయగుచు, భర్తృచితిలోన శయనించి భస్మమైన
కాంతబూదినిగూర్చి, విగ్రహ మొనర్చి, సలిపెనట దేవళము రుద్రచక్రవర్తి.

క. మగువ సహగమన నియమము, మొగిలిచరలలోన సలిపె, భూవిభుఁ డచటన్
భగవతికి * ఏకవీరకు, వగణితవృత్తుల నొసంగె సర్వాధికిన్.

తే. గీ. కాకతీయుల రాజ్యంబు గంగఁగలసె, మైళిగినృపాలు రాజ్యంబు మాయమయ్యె
ఇప్పటికి శాశ్వతంబుగా నేకవీర, యాదరించుచునున్నది యాంధ్రసతుల.

* మైళిగిదేవునితో సహగమనవ్రతము సలిపి మృతజీవినియైన ఏకవీరాదేవి యాలయము హనుమకొండకు నాలుగు మైళ్లదూరములో మొగిలిచర్ల యందుఁగలదు. ఏకవీరాదేవి యిప్పటికిఁ బ్రత్యక్షదేవతగా భావింపఁబడుచున్నది.

మూఁడవ వజ్రహస్తుని చిక్కాలవలస శాసనము

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు

ఈ తామ్రశాసనము ఉర్లాము, కంబకాయ గ్రామములకు మధ్యగా నొకమైలు దూరముననున్న చిక్కాలవలస అను నొక గ్రామమునందలి రైతు తనపొలమును దున్నుకొనుచుండఁగా బయలుపడినది. ఈ సంగతి తెలిసికొని, చిక్కాలవలస నివాసులు, శ్రీ ఖైరి అప్పలస్వామి నాయుఁడుగారు ఆ రైతునుగలిసికొని, ప్రకటింపఁబడినపిదప నాశాసనముమఱల నతని కిచ్చివేయఁబడునని యతనికి నచ్చఁజెప్పి దానిని దీసికొని ప్రకటనార్థము దేశోద్ధారక శ్రీయుత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారికిఁ బంపిరి. పంతులుగారు 'భారతి' లో బ్రకటించునిమిత్తము దయతో దానిని నా కొసంగిరి.

ఆకారాదికములు

శాసనమునంగల రాగి రేకులుఅయిదు. ఒక్కొక రేకు పొడవు ౮. ౫ అంగుళములు: వెడల్పు 3.౫ అంగుళములు. రేకులు కుడి యెడమ వైపులఁ గొంచెము వెడల్పుగను, నడిమిభాగమునఁ గొంచెము సన్నముగను ఉన్నవి. రేకుల యెడమభాగమున అంచులకు 3/౮ అంగుళము దూరమున రంధ్రములుకలవు. ఆరంధ్రములగుండ పోనిచ్చిన యొకరాగి కడియముమూలమున నీయైదు రేకులును బంధింపఁబడియున్నవి. కడియముయొక్క వ్యాసము ౮. ౫ అంగుళములు. ఈ కడియ మొకరాజ ముద్రికలో నతికింపఁబడి యున్నది. రాజ ముద్రికమీఁద పరిస్ఫుటముగ నొకనంది చెక్కఁబడియున్నది. ఆనంది కిరుప్రక్కల చంద్రుఁడు, సూర్యుఁడు, శంఖము, నాగలి, మత్స్యము మొదలైనవి కలవు. మొదటిరేకు మొదటి పెడ నేమియు వ్రాయఁబడి యుండక, పుస్తకమును అట్టవలె, శాసనమును గాపాడుచున్నది. నాలుగవరేకు రెండవపెడఁగూడ వ్రాయఁబడియుండుటవలన క్రిందిభాగమున శాసనమును గాపాడుటకు ఒకరేకు చేర్పఁబడినది. శాసనపరిరక్షణమే ఆరేకును జేర్చుటలోఁగల యుద్దేశము. ఆ యైదవ రేకునకు రెండువైపులఁగూడ వ్రాత లేదు.

లిపి - భాష

శాసనమునందలిలిపి నాగరి; కాని యిప్పటినాగరి అక్షరములకు, శాసనములోని అక్షరములకుఁ జాల వ్యత్యాసము కలదు. అయినను ఇప్పటి నాగరి లిపి శాసనము నందలి లిపియొక్క పరిణామమే యనుట స్పష్టము. పూర్వమునకు ఇప్పటి[illegible] మిక్కిలి వ్యత్యాసముగల అక్షరములలో ఇ, ఏ, ఖ, ఘ, జ, చ, ఞ, ణ, ధలు పేర్కొనఁ దగినవి. నకారపుఁబోల్కి 'న' అనుఅక్షరము

నకు క్రింద నొకగీటు గీయుటచేఁ జూపఁబడినది. ఉదా ౧౩-వ పంక్తిలోని '°నివహాణా', ౧౬-వ పంక్తిలోని '°త్రింశతమష్ఠకాణా' అనునవి చూడఁదగును. మకారపుఁబొల్లు పై నొక యనుస్వారము వ్రాసి దానిక్రిందతలక్రిందయిన అర్ధచంద్రాకృతివంటి యొకగీటు వ్రాయుటచేతఁ జూపఁబడినది. ఉదా: రెండవపంక్తిలోని '°గోత్రాణామ్', ౪-వ పంక్తిలోని '°మహీణామ్' మొదలగునవి చూడఁదగును. ఈ పద్ధతికి వ్యతిరేకముగ ఈ మకారపుఁబొల్లు అక్షరమునకు నెత్తిమీఁద నిచ్చు అడ్డుగీటు తీసివేయుటవలనను జూపఁబడినది. (చూడు పంక్తి 33 'మహీమ్') ఇట్లే రకారపు పొల్లుకూడ ఆయక్షరమునకు నెత్తిమీఁదనున్న యడ్డుగీటు తీసివేయుటవలనఁ జూపఁబడినది. (చూడుఁడు పంక్తి ౪౬ 'తస్యభార్యార్ రయపా') అనుస్వారము కొన్ని కొన్నిచోట్ల అక్షరముల శిరోభాగమునను, కొన్నికొన్నిచోట్ల అక్షరమునకు అక్షరమునకు మధ్యగా నెగువను గలదు. అక్షరమున కెడమవైపున నీయఁబడు గీటు అక్షరమునకు నెత్తిమీఁద నీయఁబడు అడ్డుగీటును దాటి పైకిపోనిచ్చుట వలన ఇకారమును, అడ్డుగీటుతో సమముగా వ్రాయుటవలన ఏకారమును, ఇట్లే అక్షరమునకుఁ గుడివైపున నీయఁబడుగీటు అక్షరమునకు శిరోభాగమున నీయఁబడు అడ్డుగీటునుదాటి పోనిచ్చుటవలన ఈ కారమును, అడ్డుగీటుతో సమముగా నిచ్చుటవలన ఆ కా ర ము ను సూచింపఁబడినది. 'ణ' 'ల' అనునక్షరములకు స్వల్ప వ్యత్యాసము కలదు: మొదటిదానికి నెత్తిమీఁద నడ్డుగీటులేదు: రెండవదానికిఁ గలదు. కాని 'ల్ల' 'ణ్ణ' అక్షరములు రెండును ఇంచుమించుగ నొక్కరీతి నున్నవి. 'ఞ్చ' 'ఞ్ఛ' అని వచ్చినపుడెల్ల చ, ఛ లు ముందును, పిదప అనునాసికమును వ్రాయఁబడినది. 'జ్ఞ' 'ఞ్ఖ', 'ఙ్గ', 'ఙ్ఘ' అను సంయుక్తాక్షరముల స్వరూపములు గమనింపఁదగినవి. రేఫము పిదపవచ్చు ప్రతిహల్లును ద్విత్వముం జెందినది. ఇట్లు ద్విత్వములేని హల్లులును గొన్నికలవు: ఉదా: పంక్తులు ౧౦, ౧౨, ౧౯, ౨౧, 33. శాసనమునం దంతటను బకారమునకు వకారము వ్రాయఁబడినది. ఇట్లే కొన్ని కొన్నిచోట్ల శవర్ణమునకు సకారమును, సకారమునకు శవర్ణమును వ్రాయఁబడినది.

శాసనమంతయు సంస్కృతభాషలోఁ గలదు: గద్యపద్యాత్మకము. శాసనమున పండ్రెండు శ్లోకములు కలవు: ఇవి శార్దూలవిక్రీడితము, మాలిని, వసంతతిలకము మొదలగు వేర్వేఱు వృత్తములలోఁ గలవు.

శాసన వృత్తాంతము

ఈ శాసనము గాంగవంశజుండైన అనంతవర్మాభిధానుండగు వజ్రహస్తదేవునిది. గాంగవంశజులలో వజ్రహస్తుఁ డను పేరు గలవారిలో నీతఁడు మూఁడవవాఁ డగుటచేత నీతనిని గాంగవంశచారిత్రమున మూఁడవ వజ్రహస్తుఁ డందురు. ఈ వజ్రహస్త వంశీయులైన గాంగులు ఆత్రేయ గోత్రులు; పరమమాహేశ్వరులు; పరమ భట్టారకులు; త్రికలింగ మహీభుజులు. శాసనమున

మొట్టమొదట వారివంశప్రశస్తి కలదు. పిదప వజ్రహస్తుని వంశానుక్రమము తెలుపఁబడినది. అది యీరీతిని గలదు:

గాంగవంశమున కలంకారభూతుఁడైన వాఁడును, విక్రమముచేత భూతలమునంతను ఆక్రమించిన వాఁడును అగు గుణమహార్ణవ మహారాజొకఁడు కలఁడు. అతనికి వజ్రహస్తుఁడు అను కొడుకుగలఁడు. పూర్వము అయిదుఖండములుగ విభాగింపఁబడి, అయిదుగురు రాజులచేత పరిపాలింపఁబడు భూమినంతను ఒకటిగఁజేసి శత్రుసమూహమునంతను జయించి అతఁడు నలువదినాలుగు సంవత్సరములు పరిపాలించెను. అతనికి గుండమరాజు, కామార్ణవుఁడు, వినయాదిత్యుఁడు అను ముప్వురు కుమారులు గలరు. ఈ ముప్వురిలో వజ్రహస్తుని అనంతరము గుండమరాజు మూఁడు సంవత్సరములును, పిదప నాతని యనుజుఁడైన కామార్ణవదేవుఁడు ముప్పదియైదు సంవత్సరములును, అటుతరువాత నాతని యనుజుఁడైన వినయాదిత్యుఁడు మూఁడేండ్లును పరిపాలనముచేసిరి. వినయాదిత్యపరిపాలనానంతరము కామార్ణవుని కొడుకును, అనియంకభీమనృపతి అనుపేరు గలవాఁడును అగు (రెండవ) వజ్రహస్తుఁడు ముప్పదియైదు సంవత్సరములు రాజ్యమేలెను. ఈ రెండవ వజ్రహస్తునికి ముప్వురు కుమారులు కలరు (౧)(రెండవ) కామార్ణవుఁడు,(౨) (రెండవ) గుండమరాజు, (3) మధుకామార్ణవుఁడు. వీరు వరుసగా నొకరితరువాత నొకరు రాజ్యమునకు వచ్చిరి. వీరిలో కామార్ణవుఁడు అర్ధసంవత్సరమును, గుండమరాజు మూఁడేండ్లును, మధుకామార్ణవుఁడు పందొమ్మిదేండ్లును పరిపాలనముచేసిరి. వీరిలోఁ గడపటివాఁడైన మధుకామార్ణవుఁడు గుండమరాజునకు సవతితల్లి కొడుకు. ఇతని తరువాత (రెండవ) కామార్ణవునికి హైదుంబవంశీయురాలైన వినయ మహాదేవి వలనఁ గలిగిన (మూఁడవ) వజ్రహస్తుఁడు రాజ్యమునకు వచ్చెను. ఈతఁడే యీ శాసనమునందలి దాత. ఈతనిదే యీ శాసనము. సూర్యుఁడు వృషభ రాసియం దుండఁగా, తొమ్మిదివందల అఱువదన శకవర్షమున చంద్రుఁడు ధనుర్లగ్నమున రోహిణిలో నుండ, అనఁగా క్రీస్తుశకము ౧౦౩౮ - వ సంవత్సరము మేనెల మూఁడవతేది ఆదివారమురాత్రి ఎనిమిదిగంటల ఇరువదియేడు నిమిషములకు శుక్లపక్షతృతీయా ఆదివారమునాఁడు అనంతవర్మాభిధానంబునం బరగునీ (మూఁడవ) వజ్రహస్తుఁడు సకలధరాతలమునుసంరక్షించుటకుఁ బట్టాభిషిక్తుఁడయ్యెను. శకము ౯౬౨-వ సంవత్సరమున నీ వజ్రహస్తదేవుఁడు కోలువర్తని విషయములోని కుద్దమాఖ్య గ్రామమును మల్లపశ్రేష్ఠి అనునొక వైశ్యునికి దానమొసంగెను.

ప్రతిగ్రహీత

దానమును పట్టినవాఁడు మల్లపశ్రేష్ఠి అనునొకవైశ్యుఁడు. ఇతనితాత పేరు మాధవశ్రేష్ఠి. తండ్రి పేరు సోమనశ్రేష్ఠి. తల్లి పేరుఅరయప. వీరిది దత్తగోత్రమని చెప్పఁబడినది. వైశ్యుల కులదేవత యగు వాసవీకన్యతో

గాంగవంశవృక్షము

౧. గుణమహార్ణవ మహారాజు

౨. (మొదటి) వజ్రహస్తుఁడు (౪౪ ఏండ్లు)

౩. గుండమరాజు (౩ ఏండ్లు)   ౪. కామార్ణవదేవుఁడు (౩౫ ఏండ్లు)   ౫. వినయాదిత్యుఁడు (౩ ఏండ్లు).

౬. అని యంకభీముఁడు నాఁబరగు (రెండవ) వజ్రహస్తుఁడు. (౩౫ ఏండ్లు)

౭. కామార్ణవభూపతి (వైదుంబవంశజ యగు వినయమహాదేవిని పెండ్లిచేసికొనెను.) (అర్ధసంవత్సరము)   ౮. గుండమహీపతి (౩ ఏండ్లు)   ౯. మధుకామార్ణవుఁడు (౧౯ ఏండ్లు)

౧౦. మూఁడవ వజ్రహస్తుఁడు.
(క్రీ. శ. ౧౦౩౮ లో పట్టాభిషిక్తుఁ డయ్యెను.)

నగ్నికుండమును జొచ్చిన నూటరెండు గోత్రములవారిలో దంతగోత్రియులు కలరుకాని దత్తగోత్రియులు లేరు. అందువలన దంతఅనుటకు శాసనమున దత్త అని తప్పవ్రాయఁబడినదని నాయూహ. శాసనములలో లేని సున్నలుపెట్టుట, ఉండవలసిన సున్నలు లేక పోవుట యిట్టి లేఖకప్రమాద దోషములు సర్వసాధారణము. అందువలన ప్రతిగ్రహీత యైన మల్లపశ్రేష్ఠిది దంతగోత్ర మనియే నా నిశ్చయము. దంతగోత్రియుల ప్రవర వైశ్య పురాణమునందును, వైశ్యగోత్రాంకిత పద్యావళిలోను నీరీతిని చెప్పఁబడినది.

దంతాఖ్యగోత్రుండు దంతకులాన్వయుం
డెంతయు వింధ్యాద్రి నెలమితోడ
వలసి సుతీక్ష్ణనామాహ్వయమునికిని శిష్య
వర్యుఁడై పదివేలవత్సరములు
తపముచేసి సుఫలదానంబు లొనరించి
జమ్మివృక్షంబు వర్జంబుగాఁగ
జహ్నుసాగరమును జామదగ్నీశ్వర
నిలయముఁ గల్పించి నలువదేను
దీపకళికల నొసఁగి యుద్దేశ్యనకును
బందుక్షేత్రంబు లేఁబది పదిలపఱచి
సకలవైభవయోగముల్ జరిపి [పిదప]
నొకరి కొకరికిం బ్రసరమై యొప్పుచుండు.

మనము గమనింపవలసిన మఱియొక విషయముకలదు. నేను చూచినంతవఱకు పూర్వచాళుక్య శాసనములలో వైశ్యుల కిచ్చిన దానమును దెలుపు శాసనమొక్కటియుఁ గానరాదు. ఈ కళింగ గాంగవంశజులు బ్రాహ్మణులకే కాక వైశ్యులకుఁగూడ నగ్రహారములను దానముచేసి పుణ్యమును, యశస్సును సంపాదించుకొని యున్నారు. మన శాసనమునందలి దాతయైన వజ్రహస్తునివలెనే యతని పూర్వుఁడును, అనంతవర్మమహారాజు కుమారుఁడు నైన మధుకామార్ణవ

దేవుఁడు[1] కూడ "గాంగేయ వంశ ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరము" ౧౨౬ లో వైశ్య కుల సంభవుఁడును, మంచినాయకుని కుమారుఁడు నైన ఎరపనాయకునకు పటుగ్రామము, హోండరవడ్, మోరఖని అను మూఁడు గ్రామములను వైశ్యాగ్రహారముచేసి యొసంగి యున్నాఁడు.[2] ఈవిధమున కళింగదేశము నందలి వైశ్యులు గాంగవంశజుల యాదరణ పోషణముల క్రింద వర్ధిల్లినట్లు తెలియఁగలదు.

దాన ప్రతిగ్రహీతయైన మల్లపశ్రేష్ఠి కుద్దమాఖ్య గ్రామమునకు రాజునుండి దాన శాసనమును సంపాదించి పిదప తనకు నివేశన స్థలమును, ఉద్యానస్థానమును, ఆగ్రామములోని నూఱుమురల ధాన్యోత్పన్న భూమిని అనఁగా ధాన్యముపండు భూమిని మిగుల్చుకొని మిగిలిన కుద్దాముగ్రామ శేషమును జలమ్వూరు గ్రామనివాసియు, ఉపమన్య గోత్రుఁడును, ద్విజోత్తముఁడు నైన పిల్లిశర్మ మనుమఁడును, కరంటమ నాయకునికిని రేకమకును పుత్రుఁడును అగు మాపయ నాయకునితోఁ గూడ ముప్పదిమంది బ్రాహ్మణులకు ఉత్తరాయణ పుణ్యకాలమున నగ్రహారముచేసి యాగ్రామమునకు వచ్చు కప్పములు నూఱుమురల ధాన్యముతోను, ఎనిమిదిమాడలతోను ధారాపూర్వకముగ మఱల దానముచేసెను.

స్థలనిర్దేశము

ఈశాసనమునఁ జెప్పఁబడినవి మూఁడు గ్రామములు మాత్రమే: ఒకటి మాపయ నాయకుని నివాసస్థలమైన జలమ్వూరు; రెండవది దానముగ నిచ్చిన కుద్దాముగ్రామము. దానమిచ్చిన యీగ్రామము కోలువర్తని విషయములో నున్నట్లు తెలుపఁబడినది. మూఁడవది కళింగనగరము. ఇది గాంగ వంశజుల రాజధాని. ఇచ్చటినుండియే దాతయైన మూఁడవ వజ్రహస్తదేవుఁడు మల్లపశ్రేష్ఠికి దానము నొసంగియున్నాఁడు. ఈ గ్రామములు ఎచ్చట నున్నవి?

గంజాము మండలమునందలి శ్రీకాకుళము తాలూకాలో జలుమ్మూరు, కుద్దాము అను గ్రామములు కలవు. కుద్దాము గ్రామమునకు జలుమ్మూరు ఈశాన్యదిక్కుగ ఆఱుమైళ్ల దూరముననున్నది.[3] కుద్దాము గ్రామము ఉర్లాం సంస్థానమునకు రెండుమైళ్లదూరముననున్నది. ఈ కుద్దాము గ్రామము పొలిమేరనే మన యీశాసనము చిక్కాలవలస నివాసియైన యొకరైతునకు దొరకినది. అందువలన మన శాసనమునందలి జలమ్వూరు శ్రీకాకుళము తాలూకాలోని యిప్పటి జలుమ్మూరుగను, కుద్దాఖ్యగ్రామ మనఁబడు కుద్దమాఖ్య గ్రామము ఇప్పటి కుద్దాముగ్రామముగను గుర్తించుటలో సంశయింపం బనిలేదు. కుద్దాము గ్రామమున గృహస్థానమును, ఉద్యానస్థానమునుగాక ప్రతిగ్రహీతయైన మల్లపశ్రేష్ఠి తనకు మిగుల్చుకొనినది 'శతమురధాన్యో

---

1. ఈ మధుకామార్ణవునికి మనశాసనమునందలి దాతయైన వజ్రహస్తదేవునికిఁ గల సంబంధము తెలియదు.
2. Ep. Coll. Cp. No 5 of 1918-19.
3. కుద్దాము, జలుమ్మూరుల స్థానమును, వాటికిగల దూరము మొదలగు విశేషములను దయతోఁ దెల్పినందులకు శ్రీ భైరి అప్పలస్వామినాయుఁడుగారి కెంతయుఁ గృతజ్ఞుఁడను.

...ామి' అనఁగా నూఱుమురలధాన్యము ...ుభూమి. మఱల మల్లపశ్రేష్ఠి అగ్రహా...రముచేసి యిచ్చిన కుద్దాము గ్రామమువలన ప్రతిగ్రహీతలైన బ్రాహ్మణులకువచ్చు ఆదాయము శతమురధాన్యము, అష్టమాడలును : అనఁగా నూఱుమురలధాన్యమును, ఎనిమిది మాడలును. మొత్తముమీఁద కుద్దాము గ్రామమునకువచ్చు ఆదాయము రెండువందల మురల ధాన్యమును, ఎనిమిదిమాడలును. మురయననేమి ? ఈ మురయను పదము మొదట భూమికిని, పిదప ధాన్యమునకును గూడ నుపయోగింపఁబడుటచేత, నిది కేసరి పాటిపుట్టి, కేసరిపాటి తూమువలెనే భూమికొలతకును ధాన్యపు కొలతకునుగూడ నుపయోగించు నొకవిధమైన 'కొలమాన' మని మనము నిశ్చయింపవచ్చును. ఈ 'ముర' అనుపదము 'మురయ', 'మురక' అనురూపములను గానవచ్చుచున్నది. వైశ్యులకగ్రహారముచేసి యొసంగిన మధుకామార్ణవుఁడు తన దానశాసనమును [1] వ్రాసిన లేఖకునికి ౪౦ మురల భూమి నిచ్చినట్లుకలదు ('లేఖకస్యభూమి మురయ ౪౦; సత్రస్యభూమి మురయ శతద్వయమ్ ౨౦౦). ఇట్లే దేవేంద్రవర్మసూనుఁడైన సత్యవర్మయొక్క శ్రీకాకుళము శాసనమునను [2] 'మురయ' పదము కానవచ్చుచున్నది. అచ్చటఁగూడ నిది 'కొలమాన...ు'ను తెలియఁజేయు పదముగనే కాన్పించుచున్నది. 'మురక' రూపముతో నిది మనవజ్రహస్తుని మఱియొక శాసనమునఁ [3] గన్పట్టుచున్నది (ధాన్యము రకశతద్వయో. త్పత్త్యా భూమిర్దత్తా). కాని యిన్ని శాసనములలో 'మురయ','ముర','మురక'పదములువచ్చినను అవియొక నిర్ణీతమైన 'కొలమానము'ను దెలియఁజేయునవని తెలిసినను అది యిప్పటి పుట్ల కొలతలో నెంతకు సమానమో తెలియరాదు.

ఈజలుమ్మూరు, కుద్దాము గ్రామములున్న ప్రదేశమే కోలువర్తని విషయము. కోలమనఁగా వరాహమునకుఁ బేరుండుటవలన, శ్రీయుతులు రావుసాహేబు హెచ్. కృష్ణశాస్త్రిగారు చెప్పినట్లు [4], కోలువర్తనీ లేక కోలవర్తనీ విషయమనఁగా వరాహవర్తని విషయము కావచ్చును. వరాహవర్తని విషయము గాంగవంశజుల చాలశాసనములలోఁ బేర్కొనంబడినది [5]. ఈ మూఁడవవజ్రహస్తుని నడగాంశాసనమునఁ గూడ కోలువర్తనీ విషయము పేర్కొనంబడినది. కాని యావిషయముననున్నట్లు చెప్పఁబడిన 'నుగిల గ్రామము' గుర్తింప నసాధ్యమైనది. అదియటుండ మన శాసనమునం జెప్పఁబడిన 'జలమ్మూరు' వజ్రహస్తునికిఁ బూర్వము కళింగమును బరిపాలించిన గాంగవంశజుల కాలమున నొక విషయము (అనఁగా నిప్పటి యొకమండలము—జిల్లా వంటిది)గ నుండినట్లు తెలియుచున్నది. శ్వేతకము రాజధానిగా కళింగమును పాలిం

1. Ep. Coll. Cp. No 5 of 1918-19. 2. Ind. Ant. Vol XIV. p 10. 3. Ep. Ind. Vol. IX. p 94.
4. Ep. I d. Vol IV. p 185, Note 5. 5. Ep. Ind. Vol III, p 127, Ind. Ant. Vol. XIII. p 275. Ind. Vol. XIII. p 120. Ep. Ind. Vol. XIII; p 212. Ep. Ind. Vol. IX. p 94. 6. Ep. Ind. Vol. IV. p 183.

చిన ఇంద్ర వర్మ జలమ్బోరవిషయము [1] లోని అమెరసింగయను గ్రామముచు దానము చేసెను. ఈ జలమ్బోర గ్రామమును, మన శాసనమునందలి జలమూర్వారు గ్రామమును ఒక్కటియే యనియు, ఈ జలమూర్వారు(ఇప్పటి జలుమూరు)ను బట్టియే జలమ్బోరవిషయ మను పేరు వచ్చినదనియు నానమ్మకము. కాని యిప్పు డు అమెరసింగగ్రామమును గుర్తించుట కష్టసాధ్యము. ఆ పేరుగల గ్రామ మిప్పుడు కానరాదు.

ఇఁక గాంగవంశజులకు రాజధానియైన కళింగనగర మేది ? గాంగవంశజులకు ఈ వజ్ర హస్తుని కాలమున రాజధానీనగర మొకప్పు డొకటియు, మఱియొకప్పు డొకటియు నుండి నట్లు శాసనముల ననుసరించి తెలియుచున్నది. మూఁడవ వజ్రహస్తుని మొదటిరాజధాని దంతిపురము; రెండవరాజధాని కళింగనగరము. గాంగ వంశజులకుఁ జాల పూర్వకాలము నుండియు వచ్చురాజధానులలో కళింగనర మొకటి : ఇదికడు ప్రసిద్ధమైనది. రఘువంశమున కాళిదాసమహాకవిచేతఁగూడ

శ్లో. యః మాహ్నేన పృస్తాని పశ్చిమృష్టే
మహ్నిస్వనిత్యాజితయామతూర్యః;
ప్రాసాదవాతాయనదృశ్యవీచిః
ప్రబోధయ త్యర్ణవఏవ సుప్తమ్.

అనికీర్తింపఁబడినది. కళింగ నగరమును గాంగవంశజుల శాసనములుకూడ నీ విధ మున నే వర్ణించుచున్నవి. మహారాజయిన ఇంద్రవర్మయొక్క- శ్రీకాకుళము ...మున [2] కళింగ నగరము ఈవిధమున వ...ర్ణింప బడినది.

"స్వస్తిజలధిజలతరంగకరపల్లవాళింగిత సకలకళింగావనీకుల తిలకాయమానాద్విజయకళింగనగరాత్ ..."

అందువలన నీనగరము సముద్రతీరస్థ మనుట స్పష్టము. శ్రీకాకుళముతాలూ కాలో శేవుపట్టణమగు కళింగనగర మొకటి కలదు. గాంగవంశజుల రాజధానియైన కళింగనగరము ఇది యగునా కాదా యను విషయమున చర్చ చాలకాలమునుండి జరుగు చున్నది. పర్లాకిమిడి తాలూకాలోని ముఖలింగమే కళింగనగరమని శ్రీయుత రావు సాహేబు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారు వ్రాసియున్నారు.[3] శ్రీకాకుళము తాలూకాలోని కళింగనగరమే అసలు కళింగనగరమని శ్రీయుత గాది నరిసింగరావు పంతులు (బి. యే) గారు విజయనగరము మహారాజావారి కళాశాలపత్రిక కొకవ్యాసము వ్రాసియున్నారు[4]. శ్రీ నరసింగరావు పంతులుగారు రఘువంశము, దశకుమారచరిత్రము లందలి కళింగవర్ణనము లనుబట్టి యిప్పటికళింగ నగరమే అసలు కళింగనగరమని వ్రాయుచుఁ దమవాదమునకు బలము నిచ్చుచున్నదని వేములవాడ భీమకవి విరచిత మనఁబడు నొక సీసపద్యము (చాటువు) నుదాహరించి యున్నారు. కాని ఆపద్యము భీమకవిదాయని సంశయింప...

1. Epi. Coll. Cp. No. 9 of 1917-18.
2. Ind. Ant. Vol. XIII. p 122. దీనిని శ్రీయుత జి. రామదాసు పంతులుగా రిదివఱకే చూచియున్నా...
3. Ep. Ind. Vol IV, p 183.
4. Vol I. p 59.

యున్నది. ఏలయన ఆపద్యముతోఁ బాటు కళింగనగర వైభవము నభివర్ణించుచు మఱి కొన్ని పద్యములుకూడఁ గలవు: చక్కని శైలిఁ గలిగి చదువుట కింపుగ నుంటచేత వాని నిట పొందుపఱుచుచున్నాను.

సీ. యోజనద్వయవిశాలోన్నతిఁ జెలువొంది
    పట్టణంబునకు శోభావిభూతి
హాటకరత్నకవాటానుశోభమై
    కూటమించెను కిందుకోటపుపీఠ
నాటకాక్కగల్ల చెన్నగశివానందమై
    నిత్యోత్సవక్రీడ నెమ్మిఁదనరె
వంశధారానదీవారాశిసంయుతి
    సాగరసంగవిస్రంభి మమరెఁ
గజేందిరాయకళింగ (గంగ) భూకాంతునకును
రంగమై నవలక్షకళింగ యనఁగ
శృంగశద్వీపమనఁగఁ బ్రసిద్ధిమించి
నానెమరొప్పె కళింగపట్నంబు ధాత్రి.

సీ. తారాపథోత్తుంగ తీరవిహారాభి
    వారాశి గంభీర వారితంబు,
లీలారసానేక బాలావనోత్కర
    కేళానిరంతరాలోలనంబు,
నానా విచిత్రితోద్యానసునామోద
    గానామృతోత్సవమానితంబు
స్వాంతవినోదనితాంతాభిరాజహృ
    దంతానుమోద సభాంతరంబు,
ధీర (?) కీరమయూరశిలోరసార్ధ
శారికారావకేళికలోజ్జ్వలదంబ
నింబజంబీరవననికురుంబములను
డంబమరొప్పె కళింగపట్నంబుధాత్రి.

సీ. ఏలపిలమత్తేభములబారు లొకచోట
    మదురతరతురగంబు లొక్కచోట
బంగారుజలతారుపల్లకు లొకచోటఁ
    జక్కనియందలా లొక్కచోట
శ్వేతసచ్ఛత్రసంగారావ మొకచోట
    నొప్పైనవ రథము లొక్కచోట
కర్పూరకస్తూరికాగంధ మొకచోట
    చొక్కంపుశ్రీగంధ మొక్కచోట
ఉక్కు (విసులు?)గల రాజకామిను లొక్కచోట
(సరసు?) విద్యలవారలు నొక్కచోటఁ
గలిగి తండోపతండమై ఘనతమించి
నయముతోడ కళింగపట్నంబు వెలసె.

సీ. రంగత్తురంగసారంగవాణిజ్యత
    రంగమైవెలయు ఫరంగిగములు
కుంపనంబులనొప్పి కోట్లకుపడగలు
    పొందుగానిడిన వళందుజనులు
వారణానేకసద్వృత్తకసూక్తిచే
    వాసిమించిన యింగిరీసుచయము
అమలముక్తాప్రవాళాది నానారత్న
    రుచిరకాజీమమరుంగు ఘనములు (?)
బహువిచిత్రాంబరానేకపంచలోహ
హారకస్తూరిగంధసారాభ్రమహిత
జాతిఫలములచేత హజారమమర
నానెమరొప్పె కళింగపట్నంబుధాత్రి. *

వీటిలోని కడపటిపద్యమున ఫరంగిగములు, వలందువారు, ఇంగిరీసులు మొదలగువారు పేర్కొనంబడుటచేత నీ పద్యములు వేములవాడ భీమకవి విరచితములా యని శంకింపవలసియున్నది. విదేశీయులైనబుడతకీచులును, వళందులును, ఇంగిరీసులును క్రీ. శ. పదునేడు, పదునెనిమిదవ శతాబ్దులలో వీరివిగా వర్తకముచేసిననాటి కళింగనగర మీ పద్యములలో నభివర్ణితమైనది. కవి యిందు

* ఈపద్యములను కడచిన జ్యేష్ఠమాససంచికను కళింగము: కళింగపట్నము అను విషయమునుగూర్చి వ్రాసినవ్యాసమున శ్రీయుత బుఱ్ఱా శేషగిరిరావుపంతులుగా రుదాహరించియున్నారు. ఇవి అచ్చయిన పిదప నేను వారివ్యాసముచూచుట తటస్థించినది.

కళింగనగరముయొక్క ప్రాచీన చారిత్రమును గూడ వర్ణించియున్నాఁడు. పద్యములు వేములవాడ భీమకవివి కాకపోయినను అప్పటికి ప్రజలకు ఆ కళింగనగరమునుగుఱించి తెలిసిన చారిత్రమును మనకుఁ దెలుపుచున్నవి.

అది యటుండ క్రీ. శ. ౧౫౧౦ - ౧౨ ప్రాంతముల కళింగనగరమునుగూర్చి వ్రాయఁబడిన కైఫీయతులో నిట్లు కలదు.

'ఈ రాయకళింగగంగ అధికారం జరిగిన తరువాత కొన్ని దినములకు సముద్రముపొంగి కళింగపట్నం సముద్రగామి అయినందున కోటహూడా సముద్రగామి అయినది. యిప్పుడు సముద్రములో ౨-3 నిలువుల లోతున కోటయుండరవున్న చదురురాళ్లు ఘుడలకు తగులుతవని వాడలునడిచే పల్లెవాండ్లు చెప్పినారు. సదరు రాయకళింగగంగుతరుణమందు కళింగపట్నం సముద్రగామి అయిపోయిన తరువాతను పట్నం జేచిరాకు అయి వాడరేవుమాత్రం సాగుతూవుండెను'[1]

ఇఁక ముఖలింగమునకు కైఫీయతులలో నిట్టిగాధ లేవియు వ్రాయఁబడలేదు. అది యటుండ ముఖలింగమునకు కలింగావనీనగరము[2], కలింగదేశనగరము[3], (కలింగావనియందలి నగరము) అనుపేర్లేకాక త్రికలింగావనీ నగరము[4], (త్రికలింగావనియందలి నగరము) అనియు, గోకర్ణ[5]మనియుఁగూడఁ బేళ్లు ఉన్నట్లు అచ్చటి శాసనములవలన స్పష్టముగుచున్నది. అందువలన ముఖలింగమునకు ఎప్పుడును కలింగనగరమను పేరు రూఢముగ నుండలేదేమోయని నా సంశయము. ఈ కారణములవలన నిప్పటి కలింగనగరమే గాంగవంశజుల రాజధానియైన కలింగనగరమని నా యూహ. అయినను ముఖలింగము శాసనములు అచ్చుపడువఱకు నీవిషయమిదమిత్థమని నిర్ణయింపవలనుపడదు.

కాలనిర్ణయము

అనంతవర్మాభిధానుండగు వజ్రహస్తదేవుఁడు మల్లపశ్రేష్ఠికి కుద్ధమాఖ్య గ్రామమును శాలివాహనశకము కర (౨) వసు(౮) నిధి (౯) అనువానిచే సంకేతమగు ౯౮౨ వ సంవత్సరమున కార్తికమాస ప్రథమపక్ష తృతీయా సోమవారమున దాన మొసంగెను. కార్తికశుక్లపక్ష తృతీయనాఁడు ఆలోచనగౌరీవ్రతమను నొక శైవవ్రతము చెప్పఁబడియున్నది. వజ్రహస్తదేవుఁడు పరమమాహేశ్వరుఁడని వర్ణింపఁబడిన పరమశైవుఁడు. అదిగాక కార్తికమాసము శైవుల కత్యంత ప్రీతి. అందువలన కార్తికమాస శుక్లపక్ష తృతీయనాఁడు ఆలోచనగౌరీవ్రతసందర్భమున మహారాజైన వజ్రహస్తుఁ డీదానమును జేసియుండును. ఈపైనిచెప్పిన శకవర్షము వర్తమానాబ్దమా, గతాబ్దమా? వర్తమానాబ్దమనుకొనిన తిథి, వారములు సరిపోవుటలేదు; గతాబ్దమనుకొనినసవి సరిగాసరిపోవుచున్నవి. గతాబ్దమనుకొనినచో సోమవారమునాఁడు ద్వితీయ తిథి సూర్యోదయానంతరము 33 గడియలతో నంతమై తృతీయతిథి వచ్చుచున్నది అనఁగా సోమవారము పగలు ౧౦-౧ ని౧౫ లకు తృతీయవచ్చుచున్నది. అందువలన పై

1. Loc, Rec, Vol, IX p 366,
2. Ep, Coll, No, 169 of 1896 (శకము 1055)
3. Ep. Coll. No. 228 of 1896 (శకము 1053)
4. ,, ,, No, 230 of 1896 (శకము 1052)
5. ,, ,, No, 237 of 1896 (శకము 1013)

నుడివిన శకవర్షము గతాబ్దమనుట నిశ్చయము. దీనికి సరియైన ఇంగ్లీషు తేది క్రీ. శ. ౧౦౫౯ అక్టోబరు నెల ౧౧ అగుచున్నది. *

ఈశాసనమున మఱియొక పుణ్యకాలము కలదు. ఉత్తరాయణ పుణ్యకాలమున మఱల మల్లపశ్రేష్ఠి యాగ్రామమునఁ దనకుఁ గొంత మిగుల్చుకొని తక్కినది కుద్దామను పేరన గ్రహారముచేసి ముప్పదిమంది బ్రాహ్మణులకు దానముచేసెను: అనఁగా కార్తికమాస ప్రథమ పక్ష తృతీయకుఁ దరువాత వచ్చిన యుత్తరాయణ పుణ్యకాలము: అనఁగా నిది క్రీ. శ. ౧౦౫౯వ సంవత్సరము డిసెంబరు ౨౪వ తేది శనివారమగుచున్నది.

ఇదిగాక వజ్రహస్తుని యితరశాసనములందునలెనే యీ శాసనమునఁ గూడ ఆతని పట్టాభిషేకదినము తెలుపఁబడినది. శాలివాహన శకము (వియత్ ౦; ఋతు ౬; నిధి ౯) ౯౬౦-వ సంవత్సరమున సూర్యుఁడు వృషభమున నుండఁగా, చంద్రుఁడు రోహిణితో ధనుర్లగ్నమున నుండఁగా, శుక్లపక్ష తృతీయా ఆదివారమున అనఁగా దీనికి సరియైన ఇంగ్లీషు తేది క్రీ. శ. ౧౦౩౮-వ సంవత్సరము మే నెల 3-వ తేది ఆదివారము రాత్రి గం ౮ ని ౨౮ లకు వజ్రహస్తునికి పట్టాభిషేకము జరిగెను.

అందువలన మన యీశాసనము వజ్రహస్తుని ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరము ౨౨ లోనిది.

వజ్రహస్తుని యితరశాసనములలోని వృత్తాంతము.

ఈ వజ్రహస్తుని రాజ్యాభిషేక కాలము మనకుఁ దెలియును. ఇతనితరువాత కళింగమును పరిపాలించి నట్టియు ఇతని కుమారుఁడైనట్టియు దేవేంద్ర వర్మరాజరాజదేవుఁడు శకవర్షములు ౯౯౨-లో పట్టాభిషిక్తుఁడైనట్లు ఆతని శాసనమొకటి[1] తెలుపుచున్నది. అందువలన మనమూఁడవ వజ్రహస్తుఁడు శకవర్షములు ౯౬౦ మొదలు ౯౯౨ వఱకుఁ బరిపాలించినట్లు మనము నిశ్చయింపవచ్చును. ఈ వజ్రహస్తుని తల్లి వైదుంబవంశములోని వినయమహాదేవి యని మనకుఁ దెలియును. ఇతనిభార్య అనంగ మహాదేవి[2]. ముఖలింగమునందలి ముఖలింగేశ్వర దేవాలయములోని యొకశాసనము[3] ఈ మూఁడవ వజ్రహస్తుని రాణిచేసిన ధర్మమును దెలుపుచున్నది. అందామె హైహాయ వంశజయని తెలుపఁబడినది. అందువలన నీయనంగ మహాదేవి హైహాయవంశజయని తెలుపఁబడిన ఆరాణి కాదుకదా అని సంశయింప వలసి వచ్చుచున్నది. ఆ శాసనము శకవర్షము ౯౯౦ లోనిది. ఈ వజ్రహస్తుని యొక శాసనమున[4] నిజముగా దాత యొక 'రాణక శ్రీ ధర్మఖేడి' అనువాఁడు. ఇతఁడు పరమమాహేశ్వర పంచవిషయాధిపతి మహామండలేశ్వర 'రాణక శ్రీ భామఖేడి' కొడుకు. ఈతఁడు కదంబవంశజుఁడు. వజ్రహస్తుని పర్లాకిమిడి తామ్రశాసనమున[5] నింకొక 'ఖేడి' కనఁ

* ఇందలి తేదులు దివాన్ బహద్దరు శ్రీయుత స్వామికన్నుపిళ్లెగారి జంత్రి (Ephemeris) ననుసరించి, దాని సాయమున సరిచూడఁబడినవి.

1. Ep, Coll. Cp. No 4 of 1918-19. 2. Ibid. 3. Ep. Coll. No 248 of 1896.
4. Ep. Coll. Cp. No 12 of 1917-18. 5. Ep. Ind. Vol III. p 222.

బడుచున్నాఁడు. అతనిపేరు ఉగ్రఖేడి: కాని యీ వజ్రహస్తుఁడును మన మూఁడవ వజ్రహస్తుఁడు నొక్కరా యను విషయము విచారణీయము. ఉగ్రఖేడి కూడ 'కదంబామలకుల తిలకుఁ'డని వర్ణింపఁబడెను. దేవేంద్రవర్మ విశాఖపట్టణము తామ్రశాసనమున[1] ధర్మఖేడియొకఁడు పేర్కొనంబడి యున్నాఁడు. ఇతఁడు కదంబామలకులతిలకుః డని వర్ణింపఁబడియుండలేదు కాని దేవేంద్రవర్మకు మేనమామయని చెప్పఁబడియున్నాఁడు. ఇట్లే కదంబ వంశజుఁడని తెలుపఁబడని 'మహాసామంత నాగఖేడి' యొకఁడు ఇంద్రవర్మ విషమగిరి శాసనమునఁ[2] బేర్కొనంబడి యున్నాఁడు. ఈ యుదాహరణము లన్నిటిని బట్టిచూడఁగా 'ఖేడి' పద మంతమందుఁ గల వారలు, కదంబ వంశజులైనవారలు ఈకళింగ గాంగుల క్రింద అధికారులుగను, సామంతులుగనుఉండుటయేగాక, రాజకుటుంబమువారితోఁ గొన్నికొన్ని యెడల సంబంధబాంధవ్యములు కూడ నెఱపినట్లు తెలియఁగలదు. గాంగులకు, కదంబులతోఁడనేగాక వైదుంబులతోను హైహయులతోఁడ గూడ సంబంధ బాంధవ్యము లున్నవనుట స్పష్టము. ఈ బాంధవ్యము వైదుంబులతోఁ సివజ్రహస్తుని తండ్రియైన కామార్ణవుని కాలమునను, హైహయులతోఁ సీవజ్రహస్తుని కాలమునను గలిసి నట్లూహింపనగును. ఈ వజ్రహస్తుని శాసనముల ననుసరించి గనే వైదుంబులతోఁ సంబంధము చేసినవా రింకొకరు గలరు. ఈ మూఁడవ వజ్రహస్తుని యొక్క తామ్ర శాసనమున[3] 'మానాదిత్యచోట్ట' అను నొకనికి ౩౫ గ్రామములతోఁ నున్న 'గారసత్తివిషయము' దానముచేయఁబడినట్లు తెలుపఁబడినది. అందు ఈ మానాదిత్యచోట్టఁడు చోట్ట చోడప రాజు మనుమఁడనియుఁ జెప్పంబడినది. ఈ మూఁడవ వజ్రహస్తునికి అయితనాఖ్యుని కుమారుఁడైన శ్రీకంఠనాయకునికిని, అతని భార్య వేదవికి జనియించిన పాంగుసా(సో)మయ అనునతఁడు అల్లుఁడనియు, అతఁడు వజ్రహస్తుని దండనాయకుఁడనియుఁ[4] దెలియుచున్నది.

ఈ వజ్రహస్తుని యితర శాసనములు.[5]


1. Ep Ind. XI p 147.
2. Ep. Ind. Vol IV, p 183
3. Ep. Ind Vol IX, p 94
4. Ep. coll cp nc 3 of 1918-19
5. Ep. coll cp no 12 of 1917-18.
6. Ep. coll no 248 of 1896
7. Ep. coll no 249 of 1896[6]
8. Ep. coll no 257 of 1896

---

1. Ind. Ant. vol xviii p 145.
2. Ep. coll cp. no. 9 of 1917-18
3. Ep. coll. cp. no 16 of 1908-09.
4. Ep. Ind Vol IV p. 183.
5. కొన్ని సెంటుఁ శాసనశాఖవారిచే సంపాదితములైనట్టియు, ఇంకను ప్రకటింపఁబడనట్టియు శాసనములు.
6. ఇందు విజయరాజ్యసంవత్సరము తప్పుగనున్నట్లు తోఁచును.

మూలము[1]

మొదటి రేకు: రెండవ పెడ



[ ] ఈ బ్రాకెట్టులో నుంచిన యక్షరములు మూలములో సందేహముగ నుండునవి

[*] ఇట్టి గుర్తుగల బ్రాకెట్టులో వ్రాయబడిన యక్షరములు శాసనములో లేక యుప్పు దుంచబడినవి


( ) బ్రాకెట్టులో నున్నవి మూలమున అధికమై త్రోసివేయవలసిన యక్షరములు

1. ఓం[2] స్వస్తి శ్రీమతా మఖిలభువనవినుతనయవినయదయాదానదాక్షిణ్యస
2. త్యశౌచ శౌర్య్య[3]ధైర్య్యాది[4]గుణరత్నపవిత్రకాణా మాత్రేయగోత్రాణామ్ వి
3. మలవిచారాచార పుణ్యశలిలప్రక్షాలిత[5] కలికాలకల్మషమ
4. షీణామ్ మహామహేన్ద్రాచల శిఖర ప్రతిష్ఠితస్య సచరాచరగురో
5. ః సకలభువన నిర్మ్మాణైకసూత్రధారస్యశశా[6]ఙ్కచూడామణే
6. ర్భ్భగవతో గోకర్ణ్ణ స్వామినః ప్రసా[7]దానమాసాదితైకశఙ్ఖభే
7. రీపఞ్చమహాశబ్ద[8] ధవలచ్ఛత్ర హేమచామరవర వృషభలాఞ్ఛనసము
8. జ్వ[9]లసమస్త సామ్రాజ్యమహిమ్నామనేకసమరసఙ్ఘట్టనము

---

1. నావద్దనున్న రేకుల ననుసరించి
2. ఇదియొక గుర్తువలనఁ జూపఁబడినది
3. ఇచ్చట లేఖకుఁడు ముందు 'ర్య్యా' వ్రాసి కొట్టివేసి పిదప 'య్యా' చేసినాఁడు
4. ఇచట లేఖకుఁడు ముందు 'హి' వ్రాసి పిదప దానిని 'ది'గా దిద్దినాఁడు
5. '°సలిలప్రక్షాళిత°' అని చదువవలెను
6. '°శశాఙ్క°' అని చదువవలెను
7. '°ప్రసాద°' అని చదువవలెను
8. '°మహాశబ్ద°' అని
9. '°సముజ్జ్వల°' అని

రెండవరేకు: మొదటిపేజ



9. పల[10]ధ్వ విజయలక్ష్మ్యా[11]సమాలిఙ్గితోత్తుంగభుజదణ్డమణ్డితానామ్

10. త్రికలిఙ్గమహీభుజాం గఙ్గానామన్వయ మలఙ్కరిష్ణో ర్విష్ణోరివ

11. విక్రమాక్రాన్తధరామణ్డలస్య గుణమహార్ణ్ణవ మహారాజస్య పుత్ర॥౧॥[12]పూ

12. ర్వ్వేషామ్ భూపతిభిర్వ్విభజ్యవ[13]సుధాయాః పఞ్చభిః పఞ్చధా [।*] భుక్తాభూరిపరా

13. క్రమోభుజ[14]వలాత్తా[15]మేక ఏవన్వయమ్ [।*] ఏకీకృత్యవిజిత్యస[16]త్రునివహా

14. న్ శ్రీవజ్రహస్తశ్చతు[।*]శ్చత్వారిమ్[17]శతమత్యుదారచరితః సర్వ్వామరక్షీత్సమా

15. ॥ [౧॥*] తస్యతనయో గుణ్డమరాజా[18] వర్షత్రయమపాలయత మహీమ్॥ తద

నుజః కా

16. మార్ణ్ణవదేవః పఞ్చత్రింశత మబ్ద[19]కాః॥ తస్యానుజో వినయాదిత్య [ః*]సమా

10. ‘°పలబ్ధ°’ అని

11. ‘లక్ష్మీసమాలిఙ్గితోత్తుంగ°’ అని

12. శార్దూల వృత్తము

13. లేఖకుఁడు మొదట ‘°వాసుధా°’ అని వ్రాసి పిదప ‘వసుధా°’ గ దిద్దినాఁడు

14. ‘°భుజబలా°’ అని

15. లేఖకుఁడు మొదట ‘°త్తామిక’ అని వ్రాసి పిదప ‘°త్తామేక°’ అని దిద్దినాఁడు

16. ‘°శత్రునివహా°’ అని

17. ‘°చత్వారింశత°’ అని

18. ‘°రాజో°’ అని

19. ‘°మబ్దకాః’ అని

రెండవ రేకు : రెండవ పెడ



17. స్వస్తి[॥*]॥[20] తతః కామార్ణ్ణవాజ్జాతో జ[21]గతీకల్పభూరుహః। యో రాజద్రాజిత(ః)చ్ఛా-
18. యో వజ్రహస్తోవనీపతిః॥ [2*॥][22] ప్రశ్చ్యోతన్మదగన్ధలుబ్ధ[23]మధుప వ్యాలీఢగణ్డస్థ-
19. లా[।*]న(౨)ర్థి[24]భ్యః సమదాత్సహస్రమ[25]తులో యస్త్యాగినామగ్రణీ[ః।*] స
(ః) శ్రీమాననియఙ్క-
20. భీమన్నృపతిర్గ్గఙ్గాన్వ[26]యోత్తంశ[27]కః [।*] పఞ్చత్రింశతమ[28]బ్దకాన్స
21. మభునక్పృథ్వీమ్ స్తుతః పార్థివైః॥ [3॥*][29] తదగ్రసూనుః సురరాజసూ[30]నునా
22. [స*] మస్సమస్తాం స[31]మితారి మం[32]డలః [।*] స్మపాతి కామార్ణ్ణవ భూ[33]ప
తిర్భ్భువం సమృద్ధి
23. మాసర్ద్ధసమాం సము[34]జ్వలః॥ [4॥*][35] తదనుతదనుజన్మా[36] చిత్తజన్మసమానో
[।*] గుణ
24. నిధిరనవద్యోగుణ్డమాఖ్యో మహీశ[37]ః [।*] సకలమిద మరక్ష[38] త్రీణివర్షా

20. శ్లోకము 21. లేఖకుఁడు మొదట '°జగతీ°' వ్రాసి పిదప '°జగతీ°' గ దిద్దినాఁడు 22. శార్దూల వృత్తము 23. '°లుబ్ధం°' అని 24. లేఖకుఁడు మొదట '°న్నర్థినస్యః' అని వ్రాసి పిదప దానిని '°న్నర్థిభ్యః' గ దిద్దినాఁడు 25. లేఖకుఁడు ముందు '°మతులో°' లోని 'మ' అనునక్షరమును గొంచె ఖండముఖండము 'స' గా వ్రాసి పిదప దానిని 'మ' గ దిద్దినాఁడు 26. లేఖకుఁడు ముందు '°గంగాన్వ్వయో°' అని వ్రాసి పిదప దానిని '°గంగాన్వయో°' గ దిద్దినాఁడు 27. '°యోత్తంసకః' అని 28. '°మబ్దకాన్' అని 29. ఉపజాతి 30. లేఖకుఁడు ముందు 'సునునా' వ్రాసి పిదప దానిని 'సూనునా' గ దిద్దినాఁడు 31. '°శమితారి°' అని 32. లేఖకుఁడు ముందు '°మణ్డలః' వ్రాసి అవస్థపడి తుడిచి దానిని '°మణ్డలః' చేసినాఁడు 33. లేఖకుఁడు ముందు 'భుపతి' వ్రాసి దానిని 'భూపతి' గా దిద్దెను 34. '°సముజ్జ్వలః' అని. 35. మాలిని. 36. '°తదనుజన్మా°' అని 37. 'మహీశః' అని 38. లేఖకుఁడు ముందు '°రక్షీత్రీణి°' అని వ్రాసి పిదప '°రక్షత్రీణి°' గా దిద్దినాఁడు. '°రక్షత్త్రీణి°' అని చదువవలెను

మూఁడవ రేకు: మొదటి పిడ



25. జేధాత్రీ [।*] వలయమలఘు తేజో నిర్జితారాతిచక్రః ॥[౫॥*][39]తతో ద్వైమా
తురస్తస్యమ

26. ధుకామార్ణవో నృపః। (1)అవతిస్మావనీమేతాముద్వానేకా[40]ర్ణవింశతిం॥౦॥[౬॥*]

27. [41] అథవజ్రహస్తనృపతిరగ్రసుతాదఖిలగుణిజనాగ్ర [గ*]ణ్యా [ః*] కామార్ణ
వాత్పృథివీన్ద్రి

28. ప్రగీయమానానదాతశుభకీర్త్తేః[42] [॥౭॥*][43] శ్రియ ఇవ వైదుమ్బా[44]న్వయపయఃప

29. యోనిధిసముద్భవాయాశ్చయః సమజనివినయమహాదేవ్యాః శ్రీవజ్రహస్త

30. ఇతితనయః॥ [౮*] [45]వియదృతునిధి సంఖ్యాం యాతిశాకాబ్ద[46] సఙ్ఘే[।*]ది


31. నకృతినృపభస్థే రోహిణీభేసులగ్నే [।*] ధనుషి చ సిత పక్షే సూర్యవారే తృ

32. తీయా(మ్) [।*] యు జిసకలధరిత్రీమ్ రక్షితుమ్ యోభిషిక్తః॥ [౯*][47]న్యాయేన
యత్రసమమా

33. చరితుం త్రివర్గమార్గేణ రక్షతి మహీమ్ మహితప్రతాపే [।*]నివ్యాధ

39. శ్లోకము
40. 'ºనేకాన్న వింశతిº' అని 41.' ఆర్యాగీతి
42. లేఖకుఁడు ముందు 'కీర్త్తేః' అని వ్రాసి పిదప దానిని 'ºకీర్త్తేః' అని దిద్దినాఁడు. 43.' ఆర్యాగీతి
44. 'ºవైదుమ్బాన్వయº' అని
45. మాలిని
46. 'శాకాబ్దº' అని
47. 'వసంత తిలకము.' 'న్యాయ్యేన' అని

మూఁడవ రేకు: రెండవ పెడ



34. యశ్చ నిరఘాశ్చ నిరాపదశ్చ శశ్వత్ప్రజా భువి భవన్తి విభాతి వ [48]త్ర్యః॥ [౧౦*] [49]వ్యాప్తేగఙ్గ

35. కులోత్తమస్య యశస[50] దిక్చక్రవాలేశశి [।*] ప్రద్యోతామలినేన యస్య భువన ప్రహ్లాద[51]

36. సమ్పాదినా [।*] సై[52]న్దూరై రతిసాన్ద్రపఙ్క-పటలై [ః*] కుమ్భస్థలీ పట్టకే [।*] శ్యా[53]లిమ్పన్తి పున[ః*]

37. పునశ్చహరితా మాధోరణావారణాః॥[౧౧*॥][54]అనురాగేణ గుణినో యస్య వ

38. క్త్రే ముఖా[55]బ్జయోః। ఆ[56]శీనే శ్రీసరస్వత్యా వనుకూలే విరాజత [ః*]॥౦। [౧౨*]క

39. లిఙ్గన [గ*]రా త్పరమ మాహే[57]శ్వర పరమభట్టారక మహారాజాధిరాజ త్రి

40. కలిఙ్గాధిపతి శ్రీమదన న్తవర్మ్మా వజ్రహస్తదేవః కుశలీ సమస్తామాత్య


41 ప్రముఖజనపదా న్సమాహూయ సమాజ్ఞాపయతి విదితమస్తు భవతామ్॥

42. కోలువ ర్త్తనవిషయే॥ కుద్దమాఖ్యగ్రామః సీమావచ్ఛిన్నః సజ.

---

48. '°మర్త్యః' అని
49. శార్దూలము
50. 'యశసా' అని
51. లేఖకుఁడు మొదట '°ప్రహ్లాదా°' అని వ్రాసి దానిని 'ప్రహ్లాద°' అని దిద్దినాఁడు
52. 'సిన్దూరై' అని
53. '°ప్యాలిమ్పన్తి' అని
54. శ్లోకము
55. '°ముఖాబ్జయోః' అని
56. 'ఆసీనే' అని
57. లేఖకుఁడు ముందు 'మాహిశ్వర' వ్రాసి పిదప దానిని 'మాహేశ్వర' గా దిద్దినాఁడు

నాలుగవ రేకు: మొదటి పుట



43. లస్థలః సర్వ్వపీడా వివర్జ్జితమాచ[58]న్ద్రార్క్క క్షితి సమకాలం యావన్మా
తాపిత్రో

44. రాత్మనః పుణ్యయశోభివృద్ధయే। శరవసునిధి శాకాన్దే[59]। కార్త్తికమాస ప్రథ

45. మపక్షే తృతీయాం[60] సో[61]వరే। దత్తగోత్రస్య వైస్య[62] కులోద్భవః। మాధ
వాఖ్యః

56. తస్యపుత్రః సోమనస్రే[63]ష్ఠః। తస్యభార్య్యార్ రయుపా। తయోర్జ్జాతాయ

47. మల్లపస్రే[64]ష్ఠాయ ఉదకపూర్వ్వకం తామ్ర్వా[65] శాసనం కృత్వా ప్రదత్త[66]
మస్మాభి

48. ర్భ్భావిభి ర్భ్భూమిపాలై ర్మ్మనునో[క్త*] ధర్మ్మ[67] గౌరవాత్పరిపాల[68]
నీయమి[69]


49. తి। రాజతః[70] శాసనం లబ్ధ్వా[71] పు[72]నరయంగ్రామః। గృహస్థానముద్యాన

50. స్థానంచ। స[73]తమురాధానోత్య[74] త్పన్న భూమిశ్చ[75] స్వస్య శేషయిత్వా। జల

---

58. లేఖకుడు ముందు 'మా' వంటి యక్షరమేదో వ్రాసి పిదప దానిని 'న' గా దిద్దినాడు 59. 'శాకాబ్దే' అని 60. '°తృతీయా°' అనిగాని లేక '°తృతీయాయాం°' అనిగాని చదువవలెను. 61. '°సోమవారే' అని 62. 'వైశ్య' అని 63. '°శ్రేష్ఠః' అని 64. '°శ్రేష్ఠాయ' అని 65. తామ్రశాసనం' అని 66. 'ప్రదత్తోస్మాభి°' అని 67. 'ధర్మగౌరవా°' అని 68. లేఖకుడు ముందు 'పాలా°' అనివ్రాసి పిదప '°పాల°'గా దిద్దినాడు. 69. '°పాలనీయ ఇతి' అని 70. 'రాజ్ఞః' అని 71. 'లబ్ధ్వా' అని 72. లేఖకుడు ముందు 'పూ' వ్రాసి పిదప దానిని 'పు'గ దిద్దినాడు. 73. 'శత' అని 74. లేఖకుడు ముందు 'ధానోత్త త్పన్న°' అనివ్రాసి దానిని మరల 'ధానోత్యత్పన్న°' అని దిద్దినాడు. 75. లేఖకుడు ముందు 'స్వస్య' అని వ్రాసి పిదప దానిని 'స్వస్య'గా దిద్దినాడు.

నాలుగవరేకు: రెండవపిడ



51. మూ్వరాఖ్య గ్రామనివాసీ। వభ్య[76]సాశ్చ ఉపమన్యగోత్రస్య। ద్విజోత్తమః। పి
52. ల్లి స[77]మ్మర్ణః। తస్యపుత్రః శరంటమనాయకః। తస్యభార్యా రేకపా। తయో
53. ర్జాతేన। మాపయనాయకేనసహ త్రిన[78]తిభ్యః। బ్రా[79]హ్మణేభ్యః అగ్రహా
54. రంకృత్వా ఉత్తరాయణ నిమిత్తో। మల్లయ స్రే[80]ష్ఠేన ధారా పూర్వ్వ
55. కం। కుద్దాఖ్యగ్రామం ప్రద[81]త్తమితి। అస్యగ్రామస్య ఉత్పన్న
56. కరైః రాజ్ఞా(ం)దే[82]యమ్ సతమురు[83] ధాన్యైర్ రక్తమాడైశ్చ॥



రాగికడియము




రాజముద్రిక

76. ఈపదమునకు అర్థము బోధపడుటలేదు. 77. 'శర్మణః' అని 78. 'త్రింశతి' అని 79. 'బ్రాహ్మణేభ్యః' అని 80. 'శ్రేష్ఠేన' అని. లేఖకుడు ముందు 'స్రేష్ఠిన' అని వ్రాసి, పిదప దానిని 'స్రేష్ఠేన' అని దిద్దినాడు. 81. 'ప్రదత్తమితి' అని 82. లేఖకుడు ముందు 'దియం' అనివ్రాసి దానిని పిదప 'దేయం' అని దిద్దెను. 83. 'శతమురు' అని

ఆంధ్ర చిత్రకారులు

లలితకళలలో సర్వమానవహృదయములను రంజింపఁజేసి రసానుభవమును, తాదాత్మ్యభావమును గలిగించునది చిత్రకళయే. ప్రాచీనకాలమునుండియు దేశకాలజాత్యాచారభేదములచేఁ గొన్నిమార్పులఁ జెందుచు వచ్చినను జిత్రకళ స్వాతిశయమును గోల్పోవక నూతనమార్గముల వెలయుచుండుట నిర్వివాదాంశము. ప్రాచీనబౌద్ధకాల (అజంతా) చిత్రములకును, మధ్యకాలపు రాజపుత్రి మొగలు చిత్రములకును, ఈనాటి ప్రాచ్య పాశ్చాత్య చిత్రములకునుగల తారతమ్యమీవిషయమును దేటపఱచుచున్నది. కాని క్రమముగ భారతీయ చిత్రములయందు భావప్రధానములై రసానందానుభవమును గలిగించునవి మృగ్యములయ్యెను. పాశ్చాత్య చిత్రలేఖన విధానసాంకర్యమే దీనికిఁ గారణము. ఇటీవల వంగదేశచిత్రకారులచే లిఖింపఁబడిన చిత్తరువులు కొన్ని యీలోటును దీర్పఁదగినవిగ నున్నవి. చిత్రకళాపరిజ్ఞానమంతగా నభివృద్ధిగాంచకుండిన యాంధ్రదేశమునఁగూడ భావప్రధానచిత్రములను జిత్రింపఁగల చిత్రకారులు కొందఱిప్పుడిప్పుడు ప్రసిద్ధికెక్కుచున్నారు. ఇది యాంధ్రమాతకభ్యుదయసూచకము. మఱియు నీచిత్రకళయొక్కయభివృద్ధికిఁ జిత్రకళాశాలలు, జిత్రకళాప్రదర్శనములు విశేషములుగఁ దోడ్పడుచున్నవి. అట్టి వాంధ్రదేశమునఁ గొన్నియే కలవు. వానిలో రాజమహేంద్రవరమునందలి చిత్రకళాశాలయు, బందరు జాతీయకళాశాలలోని చిత్రకళాశాఖయుఁ బేర్కొనఁదగినవి. ఈ రెండును యథాశక్తిని జిత్రకారుల నాంధ్రమాత కర్పించుచున్నవి. ఇంకను ఇట్టివెన్నియో యుండినఁగాని భారతీయ చిత్రకళ సత్వరాభివృద్ధిని గాంచనేరదు. ఆంధ్రచిత్రకళకుఁ బ్రత్యేకవ్యక్తిత్వమును గలుగఁజాలదు. కావున సంపన్నులును ఉదారాశయులును నగు నాంధ్రమహాజనులీవిషయమున నధికముగ శ్రద్ధను వహించి చిత్రకళాభివృద్ధికిఁ దోడ్పడవలసియున్నారు.

ప్రస్తుత మాంధ్రదేశమున నెన్నికగాంచిన చిత్రకారులలో (1) శ్రీయుత దామెర్ల రామారావుగారు సుప్రసిద్ధులు. వీరివయస్సు 27 సంవత్సరములు. వీరిచిత్రము లించుక పాశ్చాత్య లేఖనవిధానసాంకర్యము గలిగియున్నను భావగర్భితములై భారతచిత్రకళను జక్కఁగాఁ బోషింపఁజాలినవై యున్నవి. వీరి చిత్రములలో నాకారచిత్రము లుత్తమస్థానము నలంకరించుచున్నవి. భావగర్భితములై జీవకళను వెలిపుచ్చుచున్నవి. హైందవసాంప్రదాయానుసారముగ నలంకారలక్షణ



3౯ వ అఖిల భారత జాతీయమహాసభా స్వచ్ఛంద సేవా యువతీబృందము - బెల్గాము

ఆంధ్ర చిత్రకారులు



శ్రీయుత దామెర్ల రామారావుగారు
రాజమహేంద్రవరము



చామకూర భాష్యకార్లు రావుగారు
రాజమహేంద్రవరము



వరదా వెంకటరత్నం గారు
రాజమహేంద్రవరము

ములను గ్రహించి తమచిత్రములయందుఁ బొందుపఱుచుటయందు వీరికి సామర్థ్యము మెండు. వీరిచిత్రములలో నధికముగ స్వకపోలకల్పితము లగు పోకడలే కాన్పించుచుండును. వీరిచిత్రములు భారతదేశమున జరిగిన వివిధ కళా ప్రదర్శనములయం దనేకబహుమానములఁబడసినవి. వెంబ్లీ ప్రదర్శనమునను బహూకరింపఁబడినవి. వెంబ్లీ ప్రదర్శనమునకుఁ బంపినవానిలో నొకదానిని కనేడియన్ జాతీయప్రదర్శనమువారు గైకొనిరి. ఎల్లవిషయములను స్వాతిశయమును బ్రకటించుకొను పాశ్చాత్త్యులు వీరిచిత్రములయెడఁ జూపిన గౌరవభావమే వీరి నేర్పును జాటుచున్నది.

(1) కృష్ణలీల, (2) రాణి యలంకరించుకొనుట, (3) కాఠియవార్ గొల్లపడుచు, (4) సిద్ధార్థరాగోదయము, (5) కార్తికపూర్ణిమ (4,5 చిత్రములు వెంబ్లీయందుఁ బ్రదర్శింపఁబడినవి), (6) నందిపూజ, (7) పుష్పాలంకారము, (8) అజంతావిహారము, (9) అజంతాగుహాలు, (10) ఎల్లోరా గుహాలు, (11) భారతి (భారతిసంపుటము ౨ సంచిక ౧ అట్టపైచిత్రము) మొదలయినవి వీరియుత్తమ చిత్రములలోఁ గొన్ని.

(2) శ్రీయుత చేమకూర భాష్యకార్లు రావుగారు. వీరి వయస్సు 29 సంవత్సరములు. వీరు రూపచిత్రరచనమునఁ గడునిపుణులు. వీరి చిత్రములు స్వదేశవిదేశములయందుఁ బేరెన్నిక గాంచినవి. వెంబ్లీ ప్రదర్శనమునకుఁ బంపిన రెండు చిత్రములలో నొకదానిని కనేడియను జాతీయవస్తుప్రదర్శన సంఘమువారు గైకొనిరి. వీరిచిత్రములలో (1) లోకమాన్య తిలకుగారిరూపచిత్రము, (2) మహాత్మా గాంధిగారి రూపచిత్రము, (3) భగవదన్వేషణము (గోపికలు - వెంబ్లీలో ప్రదర్శింపఁబడినది), (4) సనారీశ్వరుఁడు, (5) శకుంతలాదుష్యంతుల పునస్సమావేశము, (6) అనంతునియందు లీనము మొదలయినవి ప్రశస్తములయినవి.

3. శ్రీయుత వరదా వెంకటరత్నము గారు. వీరిచిత్రవిద్యానైపుణ్యము పరంపరాగతమైనది. ఏకరూపచిత్రరచనమునందు వీరు మిగుల సమర్థులు. చెన్నపురి చిత్రకళా ప్రదర్శనములలో వీరిచిత్రములు పెక్కులు బహుమతులఁగాంచినవి. ఒకచిత్రము వెంబ్లీ ప్రదర్శనమునకును బంపబడెను. (1) విష్ణువు, (2) నటరాజు (వెంబ్లీలో ప్రదర్శింపఁబడినది), (3) వారణాసిరాజు, (4) కైలాసనాథశివ మొదలయినవి వీరిచిత్రములలోఁ బేరుగాంచినవి.

ఈముగ్గురియొక్క రూపచిత్రము లీ సంచికయందుఁగలవు. ఈఛాయాచిత్రములను కాంగ్రెసు పత్రికానిర్వాహకులు శ్రీయుత మద్దూరి అన్నపూర్ణయ్యగారు భారతియందుఁ బ్రకటనార్థము దయతోఁబంపిరి.



బారిష్టరు పార్వతీశం

ప్రథమభాగము

గ్రంథకర్త: శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రీగారు, సాహితీసమితి, తెనాలి. క్రౌను పే. 166, ఫదర్వైటుకాగితం. పుస్తకం క్రొత్తతోవతొక్కి- అందంగా కనిపిస్తుంది.

వెల రు. 1-4-0.

ఆంధ్రవాఙ్మయంలో సామాన్యంగా వాడుకమాటల్లో క్రొత్తభావాలను, క్రొత్తపోకళ్లను నింపుతూ, పాటలూ, పదాలూ, పద్యాలూ, కథలూ, గుంపులుగుంపులుగా పుట్టుతూ ఉండడమూ, వాటిని వ్రాసేవారు సాహితీసమితి సభ్యులే అయిఉండడమూ దాదాపు ఆంధ్రలోకమంతా ఎరిగినవిషయమే. వాటిలో సరసాలు, విరసాలు, ఎన్నోరకాలు. అవి గ్రహించేవారి రుచినిబట్టి ఏర్పడుతూ ఉంటవి.

ఈగ్రంథకర్తగారు సాహితీసమితి సభ్యులూ, సరసులూ. వారీగ్రంథాన్ని చదివేవాళ్లకు నవ్వు పుట్టాలని హాస్యరసంతో గుచ్చెత్తి వ్రాసారు. కథానాయకుడు పార్వతీశం కుర్రవాడు అయిదోఫారందాకా చదివాడు. బారిష్టరు అయి దేశానికి యేదో యేదో చేయాలని యింగ్లాండు ప్రయాణం కట్టాడు. మొగల్తుర్రు పార్వతీశం మదరాసు, కొలంబో, మార్సెల్సులమీదుగా ఫోక్స్టన్ చేరాడు-అనగా ఇంగ్లాండులో అడుగు పెట్టాడన్న మాటే. ఇక్కడితో యీభాగం అంతరిస్తుంది.

శ్రీ వీరేశలింగం పంతులుగారి ప్రహసనాల్లోకంటే, శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహరావుగారి హాస్యగ్రంథాల్లోకంటె యీగ్రంథంలో హాస్యరసం పొంగి పొరలి చదివేవాళ్లను ముంచేస్తుందా అన్నసందేహం బాధిస్తుంది. ఎంచేతంటే, అయిదోఫారందాకా చదువుకొన్న పార్వతీశం నిడదవోల్లో రైలెక్కేటప్పుడూ, రైళ్లలో, మదరాసు హోటల్లో, ట్రాము ఎక్కేటప్పుడూ, స్టీమరు ఎక్కేటప్పుడూ, స్టీమరులోపలా, ఇంకా ఎన్నిచోట్లనో, చేసిన వెఱ్ఱిచేష్టలూ, చెప్పిన వెఱ్ఱిమాటలూ స్వభావసహజంగా ఉంటవా అని. అయితే పైవారిగ్రంథాల్లోకంటె దీన్లో ఒక విశేషం. ఏంటంటారా - వాడుకమాటల్లో వ్రాయడం. అంచేతనే విమర్శనంకూడా వాడుకమాటల్లోనే చేయడం. మొదటనే చెప్పేను కాదూ రుచినిబట్టి తేలాలని యిదంతా. అంచేత యీగ్రంథాన్ని అందఱూ చదివి రసం చవి యిలాటిదని నిశ్చయించాలి.

ఇంకాపార్వతీశంగారు బారిష్టరు అయి చేసే దేశసేవల్లో తెలివి తేటలు తెలిపి నవ్వించాలని గ్రంథకర్తగారిని కోర్తాం.

గ. సు.

సాభిప్రాయ విశేషములు

శ్లో. భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవం విధోర్జున!
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప!

భారత దేశసమస్య లపూర్వములై మహో మహులనుసయితము సంభ్రమపరవశులను జేయుచున్నవి. పరదేశీయుల దురభిమాన దౌర్జన్యములు స్వదేశీయుల దైన్య దౌర్బల్యములు పరమానర్థములకు మూలములైనవి. సర్వమును విలయావస్థనాశ్రయించుచున్నవి. పునర్నిర్మాణమునకు విలయ మాధారమైనను వర్తమాన పరిస్థితులు విషాదమును గలుగ జేయుచున్నవి. భావము లతివేగమునను పరువిడుచున్నను కార్యములు మందగమనమును జేయుచున్నవి. తెల్లవారికిని భారతీయులకును, మహమ్మదీయులకును హిందువులకును, బ్రాహ్మణేతరులకును బ్రాహ్మణులకును, నిమ్నజాతులకును నున్నతజాతులకును ప్రతిఘటనము ప్రబలుచున్నది. రాజకీయ సాంఘికార్థిక రంగములందు సంరంభము ప్రబలుచున్నది. కార్యభార మహత్వము విషాదమును గలుగ జేయుచున్నది. విషాదదశయందు చేయవలసినది తోచక నిస్పృహాయును నిరాశయును గలుగుచున్నవి. ధర్మనిర్వహణ మార్గము గనుపడకున్నది. వివిధ రంగములందును పరార్థ ప్రయోజన మంతర్థానమై స్వార్థప్రయోజనము ప్రత్యక్షమగుచున్నది. పాలకజాతి నిరంకుశాధికారమునకు సహజమైనదురహంకారమును బూని దుశ్శాసనప్రయోగమునకు గడంగినది. వంగరాష్ట్రమునందు లిట్టను ప్రభువర్గము ప్రయోగించినదుశ్శాసనమును వంగరాష్ట్ర శాసనసభ నిరాకరించినను నిరంకుశవర్గము దుశ్శాసనమును ధర్మశాసనమును జేసినది. నిర్బంధితులు విమోచనసాధనము లేకను నిర్బంధదుఃఖమున ననుభవించుచున్నారు. వివిధపత్రములవారును దుశ్శాసనము నేకగ్రీవముగ ఖండించినను నిరంకుశవర్గము నిర్లక్ష్యము చేయుచున్నది. సామ్రాజ్యశాసనసభయందు దుశ్శాసనమునకు సంబంధించిన ప్రస్తావములను ప్రశ్నలను నిరంకుశాధికారవర్గమునకు శిఖరమైన రీడింగుప్రభువు నిరాకరించి నిరంకుశాభిమానమును విశదముచేసెను. గ్రేటుబ్రిటనునందు ప్రధాన న్యాయాధికారియైన రీడింగుప్రభువు భారతభూమియందు గవర్నరు జనరలు సింహాసనము నెక్కినతోడనే నూతనమైన రూపభావములను దాల్చుట విచిత్రముగ గనుపడును.

ఈపరివర్తనమునకు స్థానప్రభావము మూలముగ నున్నది. నిరంకుశావరణ ప్రవేశము భ్రమరకీటన్యాయమురీతిని నిరంకుశస్వరూపమును గలుగజేయుచున్నది. భారతీయులకు ప్రతిఘటనసామర్థ్యము లేనపుడు నిరంకుశాధికారదుఃఖము ననుభవనీయమగుచున్నది. గవర్నరుజనరలు సింహాసనమునందు మింటో ప్రభువు కూర్చున్నను, రీడింగు ప్రభువు కూర్చున్నను, భారతమంత్రి పదవియందు పీలు ప్రభువున్నను, ఓలివియరు ప్రభువున్నను, బర్కెనుహెడు ప్రభువున్నను, బ్రిటీషు ప్రభువర్గము లేబరుపక్షమైనను, లిబరలుపక్షమైనను, కన్సర్వేటివుపక్షమైనను, స్థానబల మలంఘనీయమై భారతరాజ్యాంగస్వరూప మేకరూపభావములను దాల్చుచున్న విధమును నిత్యానుభవము విశదముచేయుచున్నది. మాన్టేగుగారి యనుసామోపాయమును బోధించినను, సర్ మైకేలు ఓడ్వాయరు దండోపాయమును బోధించినను, దృక్కోణమునందు మాత్రము భేదము గనుపడదు. బ్రిటిషురాజనీతిజ్ఞుల ప్రగల్భములైన ప్రకటనములు నేతిబీరకాయలనియు, నిరంకుశవర్గ నిరీక్షణము స్వజాతియందును స్వదేశమునందును స్వసామ్రాజ్యమునందును లగ్నమగుచుండుననియు చిరకాలానుభవము విశదము చేసినది. భారతభూమికి తరణోపాయము పరహస్తములనుండి గలుగదనియును స్వహస్తములనుండిగలుగవలయుననియును బాగుగ దెలిసినది. భారతీయుల విభేదములు దైన్య దౌర్బల్యములకు మూలములై తరణోపాయమునకు ప్రతిబంధకములుగనున్నవి. గాంధిమహాత్ముడు భారతీయుల అంతర్విభేదముల నంతరింపజేయుటకును సంయోగయోగాభ్యాసమును సాధ్యము చేయుటకును చేయుచున్న మహా ప్రయత్నములు సఫలముగాకుండుట పురాకృతకర్మఫలముగ నున్నది. భారతీయుల సకల ప్రయత్నములందును పురాకృత కర్మ ఫలము ప్రత్యక్షమగుచు విజయసాధనము దురారాధ్యమగుచున్నది. గాంధిమహాత్ము డహర్నిశము సంయోగకార్యాచరణమునకు జేయుచున్న ప్రయత్నములు ప్రజా విశ్వాసమునకు పాత్రములయ్యును నిరాదరణమును బడయుట సంతాపమునుగలుగజేయుచున్నది. డిల్లీయందు గూడిన వివిధపక్షసభకును నీగతియే కలిగినట్లు తోచుచున్నది.


* * * *

వివిధపక్ష సభ

డిల్లీయందు గూడిన వివిధపక్ష సభకు ప్రయోజనము గలుగదనువిషయ మారంభమునందే తెలిసియున్నను సభా నిర్వాహకులు చూపిన మహానుభావము విషాదమును గలుగజేయుచున్నది. గతమాసాంతమునందు వివిధపక్షనాయకుల సభ డిల్లీయందు గూడినది. వివిధపక్షములవారును స్వపక్ష ప్రయోజనములను సువ్యక్తముచేసిరి. మహమ్మదీయులు వారిపక్షవాదమును బూనిరి. జిన్నాగా రత్యద్భుతముగను మహమ్మదీయ పక్షవాదమును సమర్థించిరి. హిందువులు మహమ్మదీయుల కాంక్షలను సఫలము చేయనియెడలను ప్రభుత్వము సఫలముచేయుటకు సిద్ధముగనున్నదని జిన్నాగారు బెదరించిరి. ఇంగ్లాండునందు

విన్సెంటుగారును మహమ్మదీయులు ప్రభుత్వాదరణమును గోరుచున్నారని తెలియజేసిరి. మహమ్మదీయులు వివిధరాష్ట్రములందును చేయుచున్న ప్రయత్నము లీవాసనని విశదముచేయుచున్నవి. వంగ పాంచాలరాష్ట్రములందు సమావేశమైన మహమ్మదీయసభ లీధోరణిని విశదము చేయుచున్నవి. మహమ్మదీయులదృష్టి యుద్యోగములమీదను పదవులమీదను ప్రసరించుచున్న విధమును మహమ్మదీయాభిప్రాయము విశదముచేయుచున్నది. మహమ్మదీయాశా విజృంభణము హిందువుల డెందములందు సందియములను గలుగజేసినది. మదనమోహన మాలవ్య, లజపతిరాయి, శ్రీనివాసయ్యంగారు మొదలగు నాయకులు హిందూపక్షవాదమును బలపరచిరి. మహమ్మదీయు లధికస్థానములను ప్రత్యేక ప్రాతినిధ్యముఖమునను బడయగోరుచున్నారు. హిందువు లధికస్థానముల నంగీకరించినను, ప్రత్యేకనియోజకవర్గమును నిరాకరించుచుమిశ్రమనియోజకవర్గమును గోరుచున్నారు. లిబరలుపక్షమువారు కాంగ్రెసువిధానమును నూలునపుకొనుట లక్ష్యమును మార్చగోరుచున్నారు. బెజంటమ్మగారు స్వరాజ్యవిధానమును నిర్ధారణచేయ గోరుచున్నారు. రామస్వామి మొదలియారుగారు బ్రాహ్మణేతరప్రయోజనములను నిర్ణయింపగోరుచున్నారు. ఈ సంకీర్ణ ప్రయోజనముల నుండి పరమార్థప్రయోజనము బయల్పడుట దుస్తరమైనను గాంధిమహాత్ముడు యథావిధిగను ధర్మనిర్వాహణమును జేయుచూనుట మహాత్మునివిశాల హృదయమును వ్యక్తముచేయుచున్నది. గతవారపు యంగుఇండియాపత్రికయందు హిందూమహమ్మదీయ సమస్యవిషయమై మహాత్ముడాంగ్లేయులకు దెలిపిన భావమే దేశమోక్షమునకు పరమసాధనముగ నుండగలదని వివిధపక్షములవారును గ్రహింపవలయును. "లౌకిక ప్రయోజనములం దధిక సంఖ్యాకులైన హిందువులు మహమ్మదీయులకు త్యాగమును జూపవలయును. ముఖ్యముగను దేశసేవా పరాయణులు రాజకీయ పదవులకు నిరపేక్షా భావమును జూపవలసి యుందురు. దౌర్జన్యమును ప్రతిఘటించుటకుగల శక్తివలన స్వరాజ్యము సిద్ధించునుగాని కొందరధికార పదవులను బడయుటవలనను స్వరాజ్యము సిద్ధించదు. ప్రజాసామాన్యమున కధికార నియంత్రణము నందును పరిపాలనమునందును గల శక్తిస్వభావమును వృద్ధిచేయుటయే స్వరాజ్యసిద్ధికి సాధనము." మహాత్ముని భావములను గ్రహించినవారలకు స్వరాజ్యసాధనము ప్రత్యక్షము గాకపోయినను మనోగతంబగుచున్నది. ఆత్మ విశ్వాసమును పరస్పర విశ్వాసమును స్వరాజ్యప్రాప్తికి సాధనంబులైనను వివిదపక్షములవారును నుద్యోగములకును పదవులకును పెనగులాడుచున్న విధమును వివిధపక్షముల సమావేశవ్యవహారములు విశదము చేసినవి. పరిపాలనమునం దధికారాశ్రయమున కవకాశములుగలవు గాని స్వతంత్ర రాజకీయవ్యవహారముల కవకాశములు లేవని నిత్యానుభవము విశదముచేయుచున్నను నధికారసమ్మోహముపరమానర్థములకు మూలమగుచున్నది. దేశసేవకులదృష్టి యధికార సమ్మోహమును

వదిలి యనన్యమైన దేశసేవయందు లగ్నమగుటకు భారతజాతి విశ్వప్రయత్నముచేయవలసియున్నది. ఈసాధన మెంతస్వల్పమైనను ప్రజాలక్ష్యమును బడయుటకు దేశాభిమానులు పాటుపడునపుడు స్వరాజ్యాగమనము సాధ్యముగా గలదు. పండిత మోతిలాలు నెహ్రూగారు తెలిపినట్లు బెజంటమ్మగారి యుపసంఘము ఫిబ్రవరి మాసాంతమునకు స్వరాజ్యవిధానమును సిద్ధముచేసినను ఢిల్లీ సమావేశమునకు ప్రధానాశయమైన వివిధ పక్షముల సంయోగము కాంగ్రెసువేదికయందు సమకూడునని నమ్ముటకు సూచనలు గనుపింపవు. ఈ విషమదశయందు ఖద్దరు లక్ష్యము సయితము వెనుకకుబడుటయును కాంగ్రెసు పూర్వస్థితిని దాల్చుటయును సంభవముగ గనుపడుచున్నది. రెండుమూడు మాసములందు ఐకీయపరిస్థితులందేమి మార్పులు జరుగనున్నదియును దురూహ్యముగ నున్నది. దేశపరిస్థితులెట్లున్నను ఖద్దరు ప్రచారమునైనను జేసి స్వరాజ్యానుతాపమును స్వరాజ్యార్హతను వ్యక్తముచేయుట భారతీయులకు పరమధర్మముగనున్నది. లోకోత్తరపురుషుడైన గాంధిమహాత్ముని నాయకత్వము ఖద్దరు విధానముమీద నాధారపడియున్న విషయమునైనను ప్రజలును నాయకులును గ్రహించి స్వధర్మనిర్వహణమును జేయుట భావ్యముగనున్నది. శ్రీకృష్ణభగవానుడు విషాదయోగపరవశుడైనవిజయున కుపదేశించినకర్మయోగమార్గమునె గాంధిమహాత్ముడు విషాదపరవశులైన భారతీయుల కుపదేశించుచున్నాడు. "అకర్మణులకు శరీరయాత్రసయితము బాగుగ జరుగదు" అని శ్రీకృష్ణభగవానుడు గీతాశాస్త్రమునందు బోధించిన ధర్మము ప్రత్యక్షముగ గనుపడుచున్నది. శ్రీమతి బెజంటమ్మగారు భారతదేశము నిశ్చేష్టతను వహించిన విధమును వారి వ్యాసావళియందు విశదము చేసినది. నిశ్చేష్టతనుబోగొట్టి స్వరాజ్యనాదమును దిగంతరాళమునందును గృహాంతరాళమునందును నింపుటకు ఖద్దరుముఖ్యసాధనముగనున్నది. ముప్పదికోట్లప్రజలు త్రికరణశుద్ధిగను ఖద్దరు నారాధించునపుడు స్వరాజ్యము స్వాయముగ రాగలదను మహాత్ముని విశ్వాసమును భారతీయులును నారాధించి మహాత్ముని సంకల్పమును సఫలముచేసి స్వరాజ్య సందర్శనమును జేయుదురుగాత!



Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No. 7 Thumbu Chetty Street. G. T. Madras